మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th Every Month
Date of Publication: 25.9.2026
Posting at BPC IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001



ప్రియమైన రవికి..

# మిసిమి

చింతనాత్మక సారస్వతం




మాసపత్రిక, అక్టోబర్, 2026 ₹60/-

ISSN 2454-4329



ఒక్క చూపే చాలు



.పెక్కు నందన వనాలు..

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 37** **సంచిక 10**

**అక్టోబరు - 2026**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

---

Published by

**BAPANNA ALAPATI**

**Plot # 196, Road No. 13,**
**Jubilee Hills,**
**Hyderabad - 500 033.**

---

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**

---

**చందా వివరాలు:**

రూ. 720/- (సంవత్సర చందా),
రూ. 1,440/- (రెండు సంవత్సరాలకు),
రూ. 2,160/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi

---

LIBRARY OF CONGRESS
**LCCN 91-903060**

**PEER REVIEWED**

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
**ISSN 2454-4329**

---

**misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com**

**www.misimimonthly.com**

YouTube **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

## మిసిమి

### అక్టోబరు నెల సూచికలు...


**మిసిమి** డైరి : ఆటో బ్యాంకింగ్ ... 3

అసమాన నాటక శిల్పి–**భాసుడు** : ఆచార్య పి. ఆర్. హరినాథ్ ... 5

జీవన మకరందం : అశ్వినీకుమార్ ... 12

శతవసంత **భారతి** : డా. గోపరాజు నారాయణరావు ... 13

ఐదు దశాబ్దాల ఏకాంతవాసి–**అన్నపూర్ణాదేవి** : శ్రీనివాస్ ... 22

జి.ఆర్. కృష్ణ గోగినేని గారితో : **మిసిమి** ... 27

సువర్ణ పథం : యన్. విజయరాఘవ రెడ్డి... 40

గాంధీ – చాప్లిన్ సమావేశం : డా. అవధానం రఘుకుమార్ ... 43

ట్రాన్సినిస్ట్రియా : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 50

న్యూయింగ్‌టన్ పాఠశాల : డా. సగిలి సుధారాణి ... 58

**రాజ్‌మోహన్ భార్య** : ఆచార్య వై. పార్థసారథి ... 63

ప్రజాకళలు–ప్రగతివాదులు : టి. రమణయ్య ... 69

ఉత్తమ కళాశాల అధ్యాపకులు ఏమి చేస్తారు? : ఆచార్య వి.యస్. ప్రసాద్ ... 77




చాప్లిన్ – గాంధీ



అన్నపూర్ణాదేవి

### అట్టమీది బొమ్మలు




దివి నుండి భువికి



ఒక్క చూపే చాలు



పెక్కు నందన వనాలు



ప్రియమైన రవికె

# ఆటో బ్యాంకింగ్

**వా**రం నుంచి రెనాల్ట్ పక్కన పెట్టి మెట్రోకే వస్తున్నా. పది కిలోమీటర్లు గంటన్నర పైగానే పడుతోంది–పాకుడు దేకుడుగా ఉంది ట్రాఫిక్ – హైటెక్ మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌కు నాలుగు స్టేషన్లు – పది నిమిషాల లోపే – అందుకే రూట్ మార్చాను – అందుకే ఆటో కథలు – క్యాబ్ కథలు దొరుకుతున్నాయి – ఈరోజు సి.ఆర్. ఫౌండేషన్ గేట్ దగ్గర నిలబడి బుక్ చేస్తే, రాపిడో ఆటో డ్రైవర్ రామావత్ వచ్చేశాడు. అలవాటు ప్రకారం విష్ చేశాను – చాలా హుషారుగా ఉన్నాడు – అరకిలోమీటరు జామ్ ట్రాఫిక్, ఫ్లై ఓవర్ డైవర్షన్ తరువాత రోడ్ విశాలంగా కనిపించింది – ఆటో ఆగమేఘాలమీద నలుని రథంలాగా వెళుతోంది – ఏమి రామా! ఇంత హుషారుగా ఉన్నావు – సార్, నా రక్తం చిందులేస్తోంది సార్ అని నవ్వాడు. అతన్ని నేనేమి నిరుత్సాహపరచలేదు. భుజంమీద తట్టి వండర్‌ఫుల్ కానియ్యి అన్నాను, నావంక చూసి నవ్వాడు. మొన్నటి వరకు కె.సి.ఆర్ సేవ చేశాను – ఇప్పుడు రేవంత్‌సార్ సేవ చేస్తున్నాను. ఇది నాకంతగా అర్థం కాలేదు – చదువు ఎంతవరకు? డిగ్రీ అయ్యింది సార్, ఉద్యోగం రాలేదు – అరే! ఎందుకు ఉద్యోగం బానిసలాగా! దీంట్లో ఎంత సంపాదిస్తున్నావు – అంతే! నాకు అతని అకౌంట్ చూపించాడు – హైటెక్ మెట్రో రాగానే అతని ఫేర్ కంటే యాభై ఎక్కువే ఇచ్చాను – సార్! మీకు రేవంత్ సార్ తెలిసే ఉంటుంది – ఇందిరమ్మ ఇల్లు ఇప్పించండి అన్నాడు నవ్వుతూనే.






రామావత్

– – – –

మధ్యాహ్నం రోడ్ నెం. 36, కోటక్‌కి వచ్చాను. బ్యాంక్ నుంచి బయటకు రాగానే నా పక్కన ఒక ఆటో ఆగింది – ఎక్కండి సార్! మీరు నడవకూడదు, చినుకులు పడుతున్నాయి అన్నాడు. లావుగా, నిండుగా ఉన్నాడు. దగ్గరే నడుస్తానులే అంటే! సార్! రండిసార్ దింపుతాను అన్నాడు. అయిదు వందలు, వంద నోట్లు తీసి, సార్! అయిదు వందల నోటు ఇమ్మన్నాడు. పర్సులో ఉన్నట్లు గుర్తు, తీసి నోటు ఇచ్చాను. అయిదు వందలు ఇచ్చి, రండి సార్ దింపుతాను అన్నాడు మళ్లీ. నడవకపోతే నీలాగా అయిపోతాను అన్నా నవ్వుతూ – మీరు భలేవారు సార్ అంటూ వెళ్లిపోయాడు. మనుషులు మాట్లాడితేనే మనసులు బయట పడతాయి.

– – – –

ప్రకాష్ జార్జియాలో ఉన్నానని సందేశం పెట్టాడు. జార్జియా, అట్లాంటానా? నావాళ్లున్నారు అక్కడ అన్నాను. కాదు జార్జియా సెంట్రల్ ఏసియా అన్నాడు – అది నా ప్రదేశం కాదులే ఎంజాయ్ అని ముగించాను. ఇప్పుడు మ్యాప్‌లో చూడాలి అదెక్కడుందో? అన్నట్లు **చిరునామా – భూమండలం** చదివి చాలామంది ఫోన్ చేశారు. డాక్టర్ శేషగిరికి ధన్యవాదాలు. తెలుగు చేసిన విజయరాఘవకి కూడా అభినందనలు చెప్పాలి.

ఎప్పుడు కాబ్ కథలేనా? ఇంకేమీ లేవా అన్నట్టు కార్యదర్శి గారు క్వశ్చన్ మార్క్ ముఖం పెట్టింది – అందుకే ఈ అనుభవం చెప్పాలి! మొబైల్ బాంకింగ్ మనల్ని కింగ్‌లాగా చేసింది. బ్యాంక్ బ్రాంచ్‌కి వెళ్లడం– చెక్కులు ఇవ్వడం (సంతకం తేడా వుందని, ఎక్కడో దిద్దారని, అంకెలు సరిగా వేయలేదని, తేదీ సరిగా లేదని – ఇలా ఎన్నో కారణాలతో తిప్పి పంపి – చార్జీలు వందల్లో వసూలు చేస్తారు)–ఎటిఎమ్‌ల అవసరం తగ్గడం– ఇక్కడ కూడా పనిచేయటం లేదు, కాష్ లేదు, అని బోర్డులు వేళాడుతుంటాయి – ఇవన్నీ గతంలోకి వెళ్లిపోయినట్లే – చేతిలో మొబైల్ బాంకింగ్‌తో అన్ని ఆర్థిక లావాదేవీలు చేస్తున్నాము – ఈ మధ్యలో నా స్నేహితుడు మూడున్నర లక్షలు పోగొట్టుకున్నాడు – మొబైల్ మోసంతో – పోలీస్ కంప్లెయింట్ ఇవ్వటానికి వెళ్లి – తర్వాత నాతో అన్నాడు 'అశ్వినీ అక్కడికి వచ్చిన అందరి కంటే మనదే తక్కువ మొత్తం!' అని ఊరట చెందాడు! – ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే మొన్న మొబైల్ మెసేజ్‌లో కొన్ని డెబిట్‌లు వచ్చాయి – ఎరుపురంగులో – ఏమిటి అని చూశాను. మీ డెబిట్ కార్డు సంవత్సర చార్జీ, మీ మినిమమ్ బాలెన్స్ – ఇలా నెలకి రెండుసార్లు కనిపించాయి. కస్టమర్ కేర్ – ఇదొక సైబర్ నరకం – చివరికి అమ్మణ్ణి పట్టుకుని జాడిస్తే – మీ దగ్గర్లోని బ్రాంచ్‌ని దర్శించండి – మీ టికెట్ నంబరు ఇది – హావ్ ఎ నైస్ డే అంది–

అసలు కథ ఇక్కడ నుంచే చెప్పాలి – రోడ్ నెంబరు 13 నుంచి 36 దగ్గరే – అందరూ లంచ్‌టైమ్‌లో లంచ్ చేస్తారు – ఈ సమయంలో కాలరీస్ బర్న్ చేయవచ్చు అనుకుంటూ – బ్రాంచ్‌కి వెళ్లాను. చిన్నదే – 'తెలుగు రాయుడు' అనే మిత్రుడు ఇక్కడ పనిచేసినపుడు ఈ ఎకౌంటు తెరిపించి ఇచ్చాడు – నేనెపుడు రానేలేదు – ఇప్పుడు మొదటిసారి – అక్కడ అంతా చిన్నారులే వున్నారు. వాళ్లకి ఏమీ తెలియదని తెలుసుకోవటానికి ఎక్కువ సమయం పట్టదు – మీ మేల్ మేనేజరుని పిలుస్తారా? అని కూర్చున్నాను – రెండు కుర్చీలే వున్నాయి– అప్పుడు 'అరవింద్' వచ్చారు – సార్ – మీ సమస్య రెండురోజుల్లో పరిష్కరిస్తారు – ఇప్పుడు సిస్టిమ్స్ అప్‌డేట్ అవుతున్నాయి – అప్పుడు – అరవింద్ గారూ – మీకు తెలుసా? మీ బాంకింగ్ యాప్ డెఫిషియన్సీ? రిజర్వ్‌బ్యాంక్ మిమ్మల్ని కోట్లలో పీనలైజ్ చేసింది? మీరు ఎవరి డబ్బు కట్టారు? – అరవింద్ ఓర్పుమంతుడు – ఎల్లుండి రండి సార్ – అన్నాడు. ఆ ఎల్లుండి నిన్న వచ్చింది – మధ్యలో మరోసారి ఫోన్ చేసి వెళ్లాను – అపుడు ఒక వింత జరిగింది – ఇద్దరు బ్లాంక్ చిన్నారుల తర్వాత మరో బ్రైట్ ఫేస్ నావంక చూసి– అశ్వినిగారు – సోమవారం నా దగ్గరకే రండి – అంది – నేను అంతగా పట్టించుకోకుండా – వచ్చేశాను. నిన్న సోమవారం కదా – ఆంజనేయరెడ్డి గారిని చూసి – అటే రోడ్ నెంబరు 36కి వెళ్ళాను – బ్రైట్ ఫేస్– కాష్, ఎటిఎమ్‌లో పెట్టే పనిలో వుంది – సార్ పదినిమిషాలే అన్నట్లు సైగ చేసింది. ఈలోపు ప్రొద్దుట్నుంచి మెసేజ్‌లు చూడలేదు – ఆ పనిలో వున్నాను – కాసేపట్లో అరవింద్ వచ్చి గుడ్‌మార్నింగ్ సార్ – అని నవ్వాడు – అలాగే అన్నట్లు చూశాను –

రండిసార్ అని పిలిచింది బ్రైట్ ఫేస్ – మీకు రేపు మూడింటికి క్రెడిట్ వచ్చేస్తుంది – అని చెప్పింది – అరవింద్ వచ్చి మీ సమస్య పరిష్కారం అయిందా సార్ అంటే– అరవింద్ గారూ – సమస్య మీదే – పరిష్కారం మీదే – నేను నిమిత్తమాత్రుణ్ణి! అనగానే ఇద్దరూ – గట్టిగా నవ్వారు – బ్రాంచ్‌లో వున్నవాళ్ల మత్తు వదిలినట్లుంది – అందరూ మమ్మల్నే చూస్తున్నారు. బ్రైట్‌ఫేస్ మీకేమి కావాలన్నా నాకు ఫోన్ చేయండి అంది. నా ఫోన్ అకౌంట్‌లో వుంది. ఒకసారి ఫోన్ చేయండి అన్నాను ఫోన్ అక్కడ పెట్టి. ఫోన్ చేసింది. అప్పుడు ఆ బ్రైట్‌ఫేస్ పేరు – నాగజ్యోతి అని చూసి – అందుకే బ్రైట్‌గా వున్నారు అన్నాను. సార్ మాది మీ వూరే అంది – ఇది తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు – మొబైల్ యాప్ అపడేట్ చేయాలి అని ఫోన్‌లో అన్నీ చేసి ఇచ్చింది – ఎకౌంట్ ఉంచండి సార్! ఏ సమస్య అయినా నాకు ఫోన్ చేయండి – చాలా సంతోషం – చాలా హాపీగా వున్నావు – మీ నాన్నగారు ఎక్కడుంటారు? నాన్న నాతోనే వుంటారు. అమ్మ ఊళ్లో వుంది – చాలా మంచిదానివి – పేరెంట్స్‌తో వుండడం ఇప్పుడు అరుదైపోతున్నది కదా – గోరువెచ్చ నీళ్లు తెప్పించి ఇచ్చింది. ఇలాంటి సమస్యలే మనల్ని కలుపుతాయి – అవునా సార్? అంది నవ్వుతూ – ఎప్పుడూ సంతోషంగా వుండు ఇలాగే నవ్వుతూ – ఒకసారి మా ఆఫీసుకి రండి – మీరు – అరవింద్ – దగ్గరే అన్నాను – డోర్ వరకు వచ్చి తెరిచి పంపించింది జ్యోతి.

# అసమాన నాటక శిల్పి భాసుడు



భాసుడు

– పి.ఆర్. హరినాథ్

**భా**రతీయ నాటక సంప్రదాయాన్ని అసమాన ప్రతిభా సమన్వితంగా భాసమానం చేసిన మహాకవి భాసుడు. దాదాపు క్రీ.శ.1909–10 దాకా భాసుడిని గురించి వారూ వీరూ చెప్పిన సమాచారం తప్ప ఆయన రచనలు దొరకలేదు. సంస్కృత సాహిత్యచరిత్రను మలుపు తిప్పిన ఒక సంఘటన ఆ సంవత్సరాల్లో జరిగింది. మహామహోపాధ్యాయ శ్రీ టి. గణపతి శాస్త్రి గారు కేరళలోని తిరువాంకూరు సంస్థానానికి సంబంధించిన దక్షిణ ప్రాంతంలో గ్రంథ సంగ్రహణ కోసం పర్యటిస్తూ ఉన్నారు. అలాంటి సమయంలో కన్యాకుమారికి ఇంచుమించుగా ఇరవై మైళ్ల దూరంలో ఉన్న పద్మనాభపురానికి వెళ్లారు. ఆ ఊరికి దగ్గరలోనే మణిలిక్కర మఠం ఉంది. అక్కడకు వెళ్లారు. అక్కడ మలయాళ లిపిలో ఉన్న నాటకాలు పది దొరికాయి. వాటి ప్రాచీనతను పరిశీలించాక అవి భాసుడివని గుర్తించారు. అవి దాదాపుగా 300 ఏళ్ల నాటి హస్తలిఖిత ప్రతులు. ఆ తర్వాత కూడా గణపతి శాస్త్రి గారి అన్వేషణ కొనసాగింది. త్రివేంద్రం రాజభవన గ్రంథాలయంలో మరో రెండు నాటకాలను కనుగొన్నారు. అలాగే మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ గ్రంథాలయంలో కూడా మరి కొన్ని దొరికాయి. దొరికిన ప్రతులన్నీ మలయాళ లిపిలోనే ఉన్నాయి. వీటిలో 13 నాటకాలను గణపతి శాస్త్రి గారు 'త్రయోదశ త్రివేంద్ర నాటకాని' అనే పేరుతో 1912–13 ప్రాంతంలో త్రివేంద్రం నుంచి ప్రచురించారు. అవి: **దూతవాక్యం, దూతఘటోత్కచం, మధ్యమవ్యాయోగం, పంచరాత్రం, కర్ణభారం, ఊరుభంగం, యజ్ఞఫలం** (మహాభారత ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని వచ్చినవి), **ప్రతిమ, అభిషేకం** (రామాయణం ఆధారం), **బాల చరితం** (భాగవతం ఆధారం), **ప్రతిజ్ఞా యౌగంధరాయణం, స్వప్న వాసవదత్త, చారుదత్తం, అవిమారకం** (ఇతర ఇతివృత్తాలతో వచ్చినవి).

ఆ తరువాత ప్రపంచానికి ఈ నాటక సాహిత్యం గురించి తెలిసింది. దేశ విదేశాలలో ఉన్న సంస్కృత పండితులు ఎందరో మురిసిపోయారు. కొంతమంది అవి భాసుడి రచనలు కావని విభేదించారు. ఎన్నో చర్చలు జరిగిన తర్వాత చివరకు ఇవి భాసుని నాటకాలే అని అంగీకరించారు. సంస్కృత నాటక చరిత్రలో ఇది ఒక పెద్ద మలుపు, ఒక కుదుపు కూడా. అప్పటిదాకా తెలియని భాసనాటక చక్రం ప్రపంచానికి దొరికింది. భాసుడికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఆయన నాటకాలన్నీ **'నాంద్యంతే తతః ప్రవిశతి సూత్రధారః'** అని మొదలవుతాయి. ప్రస్తావనను స్థాపన అని అంటాడు. నాటక కర్త పేరును ఆరంభంలో ఎక్కడా చెప్పడు. అంచేత భాసుని గురించి మాట్లాడటం అంటే ప్రాచీన భారతీయ నాటక ప్రాభవం గురించి మాట్లాడడమే అవుతుంది.

వాల్మీకి, వ్యాసుడు సృష్టించిన సాహిత్యసాగరంలో ఎన్నో రత్నమాణిక్యాలున్నాయి. అవి ఎందరో మహాకవుల కల్పనా లోకాలకు మూల సామగ్రినిచ్చాయి. రామాయణ భారతాల కథలు కొన్ని శతాబ్దాలపాటు కవుల ఊహల్లో ప్రతిధ్వనించాయి. భాసుడు కూడా ఈ కథలను చెప్పాడు. తక్కిన వారికంటే తాను ఎలా వేరుగా ఆలోచిస్తాడో ఇక్కడే మనకు అవగతమవుతుంది. ఇతిహాసాల ఉజ్జ్వల కాంతిలో

ఆయన మానవీయ స్పందనలను గుర్తించాడు. ఆ కథలను నాటకాంశాలుగా స్వీకరించినా అందులోని పాత్రల గుండె చప్పుడును పట్టుకున్నాడు.

కాళిదాసు లాంటి మహాప్రతిభా సంపన్నుడు కూడా భాస నాటక కళా వైశారద్యానికి జేజేలు పలికాడు. **మాళవికాగ్నిమిత్రం** నాటక ఆరంభంలో సూత్రధారుడి నోట భాసుడి పట్ల తన గౌరవాన్ని ప్రకటించాడు. 'ఈ రోజు కాళిదాస రచిత నాటకాన్ని ప్రయోగించబోతున్నాం' అని సూత్రధారుడన్నప్పుడు, పక్కన ఉన్న నటుడు అన్నాడు– **'ప్రథిత యశసాం భాస సౌమిల్ల కవిపుత్రాదీనాం ప్రబంధాన్ అతిక్రమ్య వర్తమాన కవేః కాళిదాసస్య క్రియాయాం కథం బహుమానః'–** (మహా ప్రసిద్ధులైన భాసుడు మొదలైన వారుండగా ఇప్పుడిప్పుడే రచిస్తున్న కాళిదాసు నాటకాన్ని ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారు') అనడంలో ఆనాటికే నాటక లోకాన్ని ప్రభావితం చేసిన భాసుని ప్రతిభ కనిపిస్తుంది.

నాటకాలలో సజీవమైన పాత్రచిత్రణను, పదునైన సంభాషణలను, వేగవంతమైన కథనశైలిని భాసుడు ప్రదర్శించాడు. తెలిసిన కథల్లో నుంచి తెలియని కోణాన్ని తెలిపాడు. తన స్వతంత్ర ప్రతిభతో కథలలో మార్పులు చేశాడు; కొత్త సన్నివేశాలను సృష్టించాడు; పాత్రల మనస్తత్వాలకు అనుగుణంగా సంఘటనలను మలిచాడు. ఆ నాటకాలను చదువుతున్నప్పుడు కథ పరిచితమే అయినప్పటికీ, ఒక కొత్త అనుభవంగా అనిపిస్తుంది. ఆ కల్పనలో స్వేచ్ఛ ఉంది; దానికి తర్కబద్ధత కూడా ఉంది. సన్నివేశాన్ని సవరించినా అది సహజంగా అనిపించేలా చేస్తాడు.

వాల్మీకి రామాయణంలోని కైకేయి సవతి మాత్సర్యంతో కనిపిస్తుంది. ఆ పాత్రను మరో దృష్టితో చూద్దాం అనుకున్నాడు భాసుడు. రామునికి వనవాసాన్ని కోరడంలో ఆమె దౌష్ట్యం లేదనీ, మరో ఆలోచన ఉండవచ్చుననీ భాసుడి ఆలోచన. మునిశాపం ప్రకారం దశరథుడికి పుత్ర వియోగం ఉంది. అదే జరిగితే రామునికి ఏమవుతుందో అని కైకేయి భయం. శాపానికి క్షతి కలుగకుండా తానే ఒక తాత్కాలిక వియోగాన్ని కల్పిస్తేనో–అనుకుంది. కొద్దికాలం ఎడబాటును కలిగిస్తే మునిశాపమూ నెరవేరినట్లవుతుంది, రాముడికీ, దశరథుడికీ కూడా క్షేమకరంగా ఉంటుంది. అందుకని ఆమె రామునికి వనవాసాన్ని కోరింది. మరి పధ్నాలుగేళ్లు ఎందుకు కోరింది? అది పొరబాటు. ఆమె అడుగదలచినది పధ్నాలుగు రోజులు. కంగారులో, అభిషేకం హడావిడిలో పధ్నాలుగేళ్లు అంది. అది ఇంతటి విపత్తుకు కారణమవుతుందని ఆమె ఊహించలేదు. ఈ విషయాన్ని కైకేయి స్వయంగా భరతునికి స్పష్టం చేసింది. ఆమెను అపార్థం చేసుకున్నందుకు భరతుడు విచారించాడు. ఆమె పాదాలపైబడ్డాడు. కైకేయిలోని దార్శనికతను భరత ముఖంగా ప్రకటించి ప్రశంసించాడు కవి.

అలాగే వనవాసంలో ఉన్నపుడు కూడా బంగారు జింక ఉదంతాన్ని భాసుడు మార్చాడు. వాల్మీకం ప్రకారం మారీచుడు బంగారుజింకలా రావడం, రాముడు జింకను తరుముతూ వెళ్లడం, ఆ తర్వాత మారీచుడి ఆర్తనాదాన్ని రాముడి గొంతుగా భ్రమించి లక్ష్మణుడిని సీత వెళ్లమనడం, లక్ష్మణుని నిందించడం, ఆ సమయంలో రావణుడు సీతాపహరణం చేయడం తెలిసిన విషయమే. కానీ భాసుడు ఈ సందర్భంలో భిన్న చిత్రణ చేశాడు. ఆయన చిత్రణ ప్రకారం–పర్ణశాలలో రాముడు సీత ఇద్దరే ఉన్నారు. ఇప్పుడు రావణాసురుడు సన్యాసి వేషంలో ప్రవేశించాడు. శ్రీరాముడు రావణాసురుడితో మాట్లాడాడు. ఆ సమయంలో పితృదేవతలను సంతృప్త పరిచే విషయమై ప్రస్తావన వచ్చింది. హిమాయాలలో ఒక బంగారు జింక ఉందనీ, అది గంగా జలాల సేవనంతో పవిత్రమైనదని అలాంటి దాన్ని తెచ్చి వండి పెడితే పితృదేవతలు సంతోషిస్తారని రావణుడు అంటాడు అది ఎక్కడ దొరుకుతుందిలే. వదిలేసేయ్' అని నిరుత్సాహ పరిచినట్లు మాట్లాడి రాముడిని పురిగొల్పుతాడు . 'అలాంటి జింకను ఎలాగైనా సాధించి తేవాలి'– అనే ఆలోచనను రాముని మనసులో రేకెత్తిస్తాడు. ఆ ఆలోచనకు అనుసంధానంగా మారీచుడు మాయా హరిణం వేషం ధరించి అక్కడ కనపడతాడు. రాముడు లక్ష్మణుని పిలుస్తాడు. 'తీర్థ యాత్ర నుంచి తిరిగి వస్తున్న మునికులపతిని ఎదుర్కొని ఆహ్వానించడానికి మీరేగా బయటకు పంపారు' అని సీత అంటుంది. అనివార్యమైన ఈ పరిస్థితిలో రాముడే స్వయంగా జింక వెంటబడి పోతాడు. ఆ తర్వాత

రావణాసురుడు నిజ రూపంలో సీతకు కనబడి ఆమెను అపహరించాడు. ఇది మార్పు. జనకుడి వంటి వేదాంతికి కూతురైన స్త్రీ మరదితో పరుషంగా మాట్లాడడం, నిందారోపణలు చేయడం భాసుడికి ఇష్టం లేదు. అతని సన్నివేశ కల్పనలో ఆమె లక్ష్మణుడిని తిట్టే దృశ్యమే లేదు.

అలాగే **ప్రతిమా** నాటకంలో ఒక సన్నివేశం ప్రేక్షణీయంగా ఉంటుంది. అంతఃపురంలో ఒక పరిచారిక చిలిపి దొంగతనం చేసింది. నాటకశాలలో 'రేవ' అనే స్త్రీని ఆటపట్టించాలని ఆ పరిచారిక అక్కడ ఉన్న నారచీరను దొంగిలించింది. దానిని దాచి పెట్టబోతోంటే సీత గమనించింది. ఆ చీరను చూసి ఆమె ముచ్చట పడింది. 'ఒక్కసారి నాకు ఇవ్వవే' అని తాను తీసుకొని ధరించింది. నేపథ్యంలో పట్టాభిషేకం ఆగిపోయింది. ఆ సమయంలో రాముడు సీత వద్దకు వచ్చాడు. ఆమె నారచీరను కట్టుకొని ఉండడం చూసి 'ఏమిటిది తాపసి వయ్యావా' అంటాడు. ఆ మాట ప్రేక్షకులను ఉలిక్కిపడేలా చేస్తుంది. సీతకు ఆ నారచీర బాగా నచ్చింది. 'ఎంత బాగుంది' అని మెచ్చుకుంది. ఆ విషయం తెలిసి రేవమ్మ 'ఆ పాత చీర ఎందుకు మంచి చీర పంపుతాను' అని మంచి నారచీరలను పంపుతుంది. ఆ చీరలు వచ్చే సమయానికి రాముడు అక్కడే ఉన్నాడు. పరిచారిక ఆ చీరలను తీసుకొని వచ్చి 'రేవమ్మ నీకు పంపింది' అని సీతకు ఇచ్చింది. రాముడు 'సరిగ్గా సమయానికి తెచ్చావు అని నాకు ఇవ్వు నేనూ ధరిస్తాను' అని తాను ధరించాడు. ఈ దృశ్య కల్పనలో భాసుడు సాధించిన ప్రయోజనం ఒకటి ఉంది. నారచీరలను కైకేయి తెచ్చి ఇవ్వలేదు. అనూహ్యంగా వేరే ఎవరి ద్వారానో నారచీరలు సీతారాములకు చేరాయి. కైకేయికి అపకీర్తి తప్పింది. దీనితో కైక పాత్రలో దౌష్ట్యం కనిపించదు.

పది మాటలు చెప్పాల్సిన చోట భాసుడు ఒక చిన్న మాటతో మొత్తం విషయాన్ని చెప్పే సందర్భాలు చాలా ఉన్నాయి. సన్నివేశంలో సంక్షిప్తత ఉంటుంది. ఒక ఉదాహరణ–భరతుడు అయోధ్యకు వస్తున్నాడు. నిజానికి దశరథుడు అప్పటికి గతించాడు. తండ్రి మరణించిన విషయం భరతుడికి తెలియదు. ఆ విషయాన్ని సూటిగా చెబితే భరతుడు తట్టుకోలేడు. తండ్రికి ఆరోగ్యం బాగలేదు అని చెప్పారు. దశరథుడికి అనారోగ్యంగా ఉందనే వేదనలో భరతుడు ఉన్నాడు. రథసారథికి మహారాజ మరణం గురించి తెలుసు. అయితే తాను చెప్పలేదు. ఆ వార్తను చెబితే దానితో పాటు అనుబంధంగా ఉన్న కైకేయి వరం గురించి, రాముడి వనవాసం గురించి కూడా చెప్పాలి. వీటిని విని భరతుడు తట్టుకోలేడు. అలాగని సారథి చెప్పకుండా ఉండలేడు. ఈ సంఘర్షణ అక్కడ చిత్రించ బడింది. ఒక్క శ్లోకంలో ఇద్దరి మానసిక స్థితిని సంక్షిప్తంగా చెప్పాడు భాసుడు.

**భరతుడు :**

**సూత, చిరం మాతుల పరిచయాదవిజ్ఞాతవృత్తాంతోస్మి. శ్రుతం మయా దృఢమకల్య శరీరో మహారాజ ఇతి. తదుచ్యతాం-పితుర్మే కో వ్యాధిః** (చాలాకాలంగా మేనమామ గారింట్లో ఉన్నాను. అంచేత ఇక్కడి వార్తలేవీ తెలియవు. మహారాజు గారికి ఆరోగ్యం బాగాలేదని విన్నాను. నాన్న గారికి ఏమైంది?)

**సూతుడు : హృదయపరితాపః ఖలు మహాన్** (హృదయ పరితాపం)

**భ.** **కిమాహుస్తం వైద్యాః** (వైద్యులు ఏమంటున్నారు?)

**సూ.** **న ఖలు భిషజస్తత్ర నిపుణాః** (అక్కడ అంత నిపుణులు లేరు)

**భ.** **కిమాహారం భుంక్తే శయనమపి** (ఏమైనా తింటున్నారా, పడుకుంటున్నారా?)

**సూ.** **భూమౌ నిరశనః** (నేల మీదే. ఆహారం లేదు)

**భ.** **కిమాశాస్యాద్** (ఏమి దిక్కు? )

**సూ.** **దైవం** (దైవమే)

భ. **స్ఫురతి హృదయం వాహయ రథం** (మనసుకు తొందరగా ఉంది. రథం పోనీ) (ప్రతిమ 3-1)

ఈ సంభాషణ ఒక శ్లోకం. సూతుడు దశరథ మరణం గురించి చెప్తున్నాడు. ఆ విషయం ప్రేక్షకులకు తెలుస్తుంది. కానీ భరతుడికి అది వేరే విధంగా అర్థం అవుతుంది. ఉద్విగ్న మనస్కుడైన మనిషి మాటలు చాలా పొడిపొడిగా ఉంటాయి. ఇక్కడ సూతుడు దశరథ మరణం తోనూ, భరతుడు దశరథుడి అనారోగ్య వార్తతోనూ చిత్తం చెదిరి ఉన్నారు. అందుకని మాటలు చాలా సంక్షిప్తంగా ఉన్నాయి. సంభాషణలో పాత్ర మనస్సు కూడా మిళితమై ఉంటుందన్న సూక్ష్మ దృష్టి భాసుడిలో కనిపిస్తుంది.

భరతుడితో దశరథ మరణాన్ని గురించి ఎలా చెప్పాలి? ఆ వార్త అతనికి దుర్భరం అని అందరికీ తెలుసు. ఇలాంటి సమయంలో ఎవరూ చెప్పకుండానే అతడికి తెలిసే ఒక దృశ్యాన్ని భాసుడు కల్పించాడు. భరతుడు అయోధ్యలోకి ప్రవేశించే ఘడియల్లో శుభ నక్షత్రం రావాలని అందుచేత ఊరి బయటే ఆగమని వర్తమానం వస్తుంది. 'కృత్తికా నక్షత్రం ఇంకా ఒక ఘడియ సేపు ఉంది. ఇది దాటి రోహిణీ నక్షత్రం వచ్చిన తరువాతనే నగర ప్రవేశం చేయవచ్చు'– అని ఉపాధ్యాయుల వారు చెప్పి పంపారు. భరతుడు ఊరి బయట ఆగాడు. ఇక్కడ విశ్రాంతి తీసుకుంటాను అనుకున్నాడు. అక్కడ ఆలయంలో కొన్ని ప్రతిమలు ఉన్నాయి. సమయం దొరకడంతో అతడు ఆ ప్రతిమలను చూశాడు. నిజానికి అవన్నీ ఇక్ష్వాకు వంశానికి చెందిన మహారాజుల ప్రతిమలు. ఆ విషయం అక్కడ ఉన్న ఒక పూజారి మూలంగా మాటల్లో బయట పడుతుంది. అంతేకాదు, అక్కడ ఉన్నవన్నీ మరణించిన మహారాజుల ప్రతిమలు అని తెలుస్తుంది. ఇలా ప్రతిమలను చూడడానికి వచ్చిన వ్యక్తి భరతుడు అని పూజారికి తెలియదు. ఒక్కొక్క ప్రతిమకు భరతుడు నమస్కారం చేసుకుంటూ వస్తాడు. అందరి గురించి అడిగిన భరతుడు ఒక ప్రతిమను చూసి ఏమీ అడగడు. 'స్త్రీ శుల్కం కోసం భూమిని, ప్రాణాన్ని పోగొట్టుకున్న ఈ రాజు గురించి అడగవేమీ' అని పూజారి దశరథుని ప్రతిమ గురించి అంటాడు. తండ్రి గతించిన సంగతి, దానికి కారణం రెండూ ఆ విధంగా అర్థమై 'తండ్రీ' అని దుఃఖంతో భరతుడు కుప్పకూలిపోతాడు.

**'స్వప్నవాసవదత్త'** భాసుడి నాటక ప్రతిభకు మరో అపూర్వమైన ఉదాహరణ. ఈ నాటక రచనలో భాసుడి నిపుణత అసదృశమైనది. ఈ నాటకం కేవలం ఒక ప్రేమ కథ కాదు. రాజనీతి ముందు ప్రణయం తలవంచిన అద్భుత గాథ. **'స్వప్నవాసవదత్త'** భాసుని శిఖరాయమాన రచన. ప్రపంచంలో ఉన్న ప్రతి నాటక ప్రేమికుడు **స్వప్న వాసవదత్త**ను కలవరించాడు. వ్యక్తి సౌఖ్యం కంటే రాజ్యక్షేమం ముఖ్యం అని ఈ కథ స్పష్టం చేస్తుంది. ఈ నాటకంలో మూడు ప్రధాన పాత్రలున్నాయి. ఆ పాత్రల మానసిక సంఘర్షణ కూడా ఉంది. ఉదయనుడు, వాసవదత్త, పద్మావతి – ఈ మూడు పాత్రలను సమన్వయపరచడంలో భాసుడు సఫలుడైనాడు.

కథను స్థూలంగా చెప్పుకుంటే, వత్సరాజు ఉదయనుడు. ఆయన భార్య వాసవదత్త . ఇద్దరికీ ఒకరంటే మరొకరికి ప్రాణం. ఇలా ఉండగా, ఉదయనుడి రాజ్యానికి శత్రువుల నుంచి ప్రమాదం పొంచివుంది. రాజ్యం సురక్షితం కావాలంటే పక్కన ఉన్న మగధతో సంబంధం ఉండాలి. అలా బలపరచడానికి మగధ రాజకుమారి పద్మావతితో ఉదయనుడికి వివాహం జరిపిస్తే మంచిదని మంత్రి యౌగంధరాయణుడు ఆలోచిస్తాడు. రాజ్యక్షేమం కోసం పద్మావతిని రాజు వివాహం చేసుకోవాలి. కానీ వాసవదత్త మీద ఉన్న ప్రేమ కారణంగా మరో స్త్రీ గురించి రాజు ఆలోచించడు. ఎలాగైనా వాసవదత్తతో వియోగం కలిగించి యౌగంధరాయణుడు మరో మనువుకు మార్గం వేయాలనుకున్నాడు. దీనికి ఒక తెలివైన ఎత్తుగడ వేశాడు.

రాజు లేని సమయం చూసుకొని మంత్రి యౌగంధరాయణుడు ఒక అగ్ని ప్రమాదాన్ని సృష్టించాడు. అందులో వాసవదత్తతో పాటూ తాను కూడా మరణించినట్టుగా పుకారు పుట్టించాడు. వాసవదత్త మరణించిందని మహారాజు దిగులు పడ్డాడు. కుమిలిపోయాడు. ఆ తరువాత రాజు పద్మావతి దేవిని వివాహం చేసుకున్నాడు. ఈ సమయంలో యౌగంధరాయణుడు చాలా తెలివిగా వాసవదత్తను పద్మావతి దేవి నగరానికి చేర్చాడు. వాసవదత్తను 'అవంతిక' అని పరిచయం చేసి, ఆమె తన చెల్లెలు అనీ, దురదృష్టవశాత్తు భర్తకు దూరంగా ఉండవలసి వచ్చిందనీ, తాను తిరిగి వచ్చేదాకా జాగ్రత్తగా పద్మావతి దగ్గరే ఉండాలనీ ఆశించి, అక్కడ ఆమెను వదిలిపెట్టి వెళ్ళాడు. ఇప్పుడు పద్మావతి చెంతనే వాసవదత్త ఉంది. కానీ ఆమె ఎవరు అన్నది తెలియదు. ఇలాంటి సందర్భంలో ఒకసారి మహారాజు అక్కడికి వస్తున్న విషయం వాసవదత్తకు తెలిసింది. ఆమె మహారాజుకు కనపడకుండా జాగ్రత్త పడింది. కథ ఇలాగ మలుపులు తిరుగుతున్నప్పుడు ఒకానొక సందర్భంలో పద్మావతి దేవికి శిరోవేదన దుర్భరంగా ఉందని, ఆమె సముద్ర గృహంలో విశ్రాంతి తీసుకుంటూ ఉందని చెలికత్తెలు మాట్లాడుకుంటారు. అలా విశ్రాంతి తీసుకుంటున్న

పద్మావతికి ఉపశమనం కలిగించడానికి వాసవదత్తను అక్కడికి పంపుతున్నారు అని కూడా తెలుస్తుంది. వాసవదత్త వెళ్లి ఆమెకు ఉపచారాలు చేసి నాలుగు మంచి కథలు చెబుతుంది అని పరిచారికలు అంటారు.

ఆ నేపథ్యంలో పద్మావతీ దేవి శిరోవేదనతో ఉందని తెలిసి పరామర్శ చేయడానికి మహారాజు అక్కడికి వస్తున్నాడు. రాజు సముద్ర గృహానికి చేరేసరికి పద్మావతి ఇంకా రాలేదు. ఆమె పడుకోవలసిన తల్పం ఖాళీగా ఉంది. మహారాజు ఆమె వచ్చేలోగా కాస్త విశ్రమిస్తాను నిద్ర వస్తోంది అని రాజు పడుకున్నాడు. రాజు గారి మిత్రుడు వసంతకుడు ఏదో కథ చెప్పబోతూ మహారాజు నిద్రపోయాడని తాను మెల్లగా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

అలా మహారాజు మంచంపైన నిద్రపోతున్న సమయంలో అక్కడ పద్మావతి ఉన్నదనే భావంతో వాసవదత్త వచ్చింది. దీపపు గుడ్డి వెలుగులో తల్పంపై పడుకున్న మహారాజును పద్మావతిగా ఆమె భ్రమించింది. పక్కనే నిలబడి మాట్లాడబోయింది. అప్పటికి మహారాజు నిద్రలోనే ఉన్నాడు. నిద్రలో తల్పంలో ఒక వైపు ఖాళీ ఉంది. దానిని వాసవదత్త వేరే విధంగా అర్థం చేసుకుంది. ఆ ఖాళీ స్థలంలో తనను పడుకొమ్మని పద్మావతీ దేవి సూచన చేస్తోంది అని తలచింది. ఆ ఉద్దేశంతో వాసవదత్త ఆ పడుకున్న వ్యక్తి పక్కన పడుకుంది. రాజు కల గంటూ 'వాసవ దత్తా' అన్నాడు. అది కలవరింత. ఆమె ఉలిక్కిపడి లేచింది. ఇక్కడ ఉన్నది పద్మావతి కాదు మహారాజు అని తెలియగానే ఆమెకు భయమైంది. తన అజ్ఞాతవాసం బయటపడకూడదు. మనసు కుదుట పరచుకుంది. మహారాజు మాటలకు తాను కూడా స్పందించింది. ఆయన నిద్రలోనే కలవరిస్తున్నాడు. ఆమె నిజంగానే మాట్లాడుతోంది. కాసేపటికి మహారాజు లేచి వాసవదత్తా నీవు ఎక్కడ– అంటూ లేచాడు. మెలకువ వచ్చింది. ఈ లోపల ఆమె అక్కడి నుంచి జారుకుంది. వసంతకుడు ప్రవేశించాడు. 'నేను వాసవదత్తను చూశాను. ఆమె గొంతు విన్నాను. ఆమె కళ్ళకు కాటుక పెట్టుకోలేదు. జుట్టుకు అలంకరణ చేసుకోలేదు. ప్రోషిత భర్తృకలాగా ఉంది. ఆమెను నిజంగా చూశాను' అన్నాడు, మహారాజు. కలగంటున్నారు. ఇంకా ఎక్కడి వాసవదత్త ప్రభూ. మీ భ్రమ అని విదూషకుడు అన్నాడు. నాటకంలో ఈ దృశ్యంలో నాయిక తానే స్వయంగా రాజు పరిస్థితిని చూడగలిగింది. ఆయనకు తనపై ప్రేమ తగ్గలేదని స్పష్టమైంది. కల కన్నానా లేక నిజమా అనే సందిగ్ధంలో రాజు ఉన్నాడు. ఆమె ఇంకా బ్రతికి ఉందనే ఆశ మనసులో మిగిలింది. దాగుడుమూతల లాంటి ఈ మధుర విరహ సన్నివేశంలో ప్రేక్షకులకు ఒక అపూర్వమైన ప్రణయానుభూతి కలుగుతుంది.

ఇదొక ముక్కోణపు ప్రేమ కథ. వత్సరాజు, వాసవదత్త, పద్మావతి–ఈ ముగ్గురి ప్రణయగాథ సహృదయ ప్రేక్షకులను సమ్మోహపరుస్తుంది. మహారాజుకు వాసవదత్త పైన ప్రేమ తగ్గలేదు. వాసవదత్తకు పద్మావతిపై ఈర్ష్య లేదు. వాసవదత్త పైన పద్మావతికి ఆదరం తగ్గలేదు. కవి మూడు పాత్రల మనస్తత్వాలను స్పష్టంగా చిత్రించాడు. సముద్ర గృహ దృశ్యం ఒక అద్భుత చిత్రణ. వాసవదత్త నాటకంలో ఇలాంటి అనేక అపురూప దృశ్యమాలికలు పరిమళిస్తాయి, పరవశింపజేస్తాయి.

పాత్రలను చిత్రిస్తున్నప్పుడు వాటిని కేవలం ఒక మూసపాత్రలుగా భావించడం భాసుడిలో కనిపించదు. నాయకుడైనా, ప్రతి నాయకుడైనా ఎవరైనా సరే వారిలో మానవ లక్షణాలను గుర్తిస్తాడు. ఆ పాత్ర పౌరాణికమైనా, చారిత్రకమైనా, ఐతిహాసికమైనా–ఏదైనా సరే దాన్ని మానవీకరిస్తాడు. దీనికి ఉదాహరణలు ఆయన రాసిన రచనలన్నింటా కనిపిస్తాయి. *ఊరుభంగం* నాటకంలో గదాయుద్ధంలో దుర్యోధనుడు భీముని చేతిలో హతుడు కావడం ఇతివృత్తం. అందులో ఒక దృశ్యంలో దుర్యోధనుని తొడలు విరిగిపోయాయి. ఆ సమయంలో అతడిని వెతుక్కుంటూ ధృతరాష్ట్రుడు, గాంధారి వస్తారు. ధృతరాష్ట్రుని పంచె అంచు పట్టుకుని, 'తాతా నేనూ వస్తాను. నాన్నను చూడాలి' అని దుర్యోధనుని కొడుకు దుర్జయుడు వస్తాడు. అప్పటికి తొడలు విరిగి దుర్యోధనుడు మృత్యుముఖంలో ఉన్నాడు. పసివాడైన దుర్జయుడు సమీపించి 'నాన్నా నీ తొడ మీద కూచోవాలని వచ్చాను' అంటాడు. ఇన్ని దినాలు తన ప్రియతముడైన కుమారుడిని గారాబంగా కూర్చోబెట్టుకున్న తొడలు విరిగి పోయాయి. అతి దుఃఖభరితుడై దుర్యోధనుడు కుమిలిపోతాడు.

ఆ సందర్భంలో కొడుకుతో దుర్యోధనుని మాటలు కంట తడి పెట్టిస్తాయి. అతనిలో కలిగిన అంతర్మధనం అసాధారణ రీతిలో ఆవిష్కృతమైంది. అతడు మరణానికి ముందు కొడుకుతో మంచి మాటలు చెప్తాడు. మహాభారతంలో దుర్యోధనుడు దుష్టపాత్ర కావచ్చు. భాసుడు ఆ పాత్రను ఏమీ సమర్థించడం లేదు. కానీ ఆ పాత్రలో కూడా ఒక మానవీయ కోణం ఉందన్న విషయాన్ని గుర్తిస్తాడు.. ఇదొక విషాదాంత నాటకం. ఇలాంటి నాటకాల ప్రదర్శనలో మరణం లాంటివి రంగస్థలం పైన ప్రదర్శించకూడదు. ఆ కాలానికి ఆ సంప్రదాయం ఎలా ఉందో కానీ నియమాలను ఉల్లంఘించగలిగే ధైర్యం కూడా కవిలో కనిపిస్తుంది. నాటక కథకు అవసరమైనప్పుడు రంగస్థలాన్ని దానికి అనువుగా మలచుకోవడం, ఆ రసావిష్కరణకు అవసరమైన దృశ్యాన్ని స్వేచ్ఛగా కల్పించడంలో ఏమాత్రం వెనుదీయకపోవడం భాసుడిలో చాలా చోట్ల కనిపిస్తుంది.

భాసుడి పాత్రచిత్రణలో మరో విశేషం, ఆయన పాత్రలను కేవలం మంచివాళ్లు, చెడ్డవాళ్లు అనే రెండు వర్గాలుగా చూడడు. మానవీయ స్పందనలు ఉన్న వారిగా చూస్తాడు. పాత్రలు రక్త మాంసాలతో కనిపిస్తాయి. **అభిషేకం** నాటకంలో రావణుడు కూడా సౌజన్యంతో మాట్లాడతాడు. *ఊరుభంగం* నాటకంలో దుర్యోధనుడు మనకు పరిచితమైన ప్రతినాయకుడిగా మాత్రమే కనిపించడు. యుద్ధంలో ఓడిపోయి, తొడలు విరిగి, మరణాన్ని ఆహ్వానిస్తున్న సమయంలో అతనిలోని సంస్కారం, ఆత్మగౌరవం, మానవత్వం బయటపడతాయి. పాత్రలను చిత్రించడంలోనూ, ఆ చిత్రణ ద్వారా ప్రేక్షకుడిని ఒప్పించడం లోనూ భాసుడి తర్కం మనోహరంగా ఉంటుంది. అతని పాత్రల ప్రవర్తనలలో మానవ స్వభావంలోని విభిన్న పార్శ్వాలు రంగుల నీడలై కనిపిస్తాయి. మహాభారతంలో కొన్ని సంక్లిష్ట పాత్రలు ఉన్నాయి. వాటిలో కర్ణుడు ఒకడు. అతడి మానసిక చిత్రణం కర్ణభారంలో కనిపిస్తుంది. ఆ పాత్ర పట్ల సానుభూతి కలుగుతుంది. కర్ణుడికి ఉన్న బలం ఏదో బలహీనత కూడా అదే. దానగుణం అతని బలం. ఎవరేమి అడిగినా 'కాదు, లేదు' అనకపోవడం అతని బలహీనత. వీరుడిగా నిలబడడం, స్నేహానికి విలువ ఇవ్వడం ఇటువంటివి ఆయనకున్న లక్షణాలు. ఆ నిబద్ధతతోనే అతను దుర్యోధనుడిని అంటిపెట్టుకొని ఉన్నాడు. అడిగినది ఏదైనా ఇచ్చేయడం–అనే దాన గుణం కారణంగా కర్ణుడు తన సహజ కవచకుండలాలను దానం చేశాడు. దానికి ప్రతిగా శక్తిని పొందాడు. ఆయన సుగుణం వెనుక ఆయనకు ఆపద కూడా దాగి ఉంది–వెలుగునిచ్చే ప్రమిదకు అడుగున చీకటి దాగి ఉన్నట్లు.

భాసుడి కవితా ప్రతిభ కూడా ఆయన నాటక రచనా ప్రతిభకు ఏమాత్రం తీసిపోదు. సంభాషణలలో చాతుర్యం ఒకవైపు, సంక్షిప్తతా సౌందర్యం మరో వైపు కనిపిస్తాయి. ఉదయనుడి గురించి వాసవదత్త అడిగే సందర్భంలో చెలికత్తెతో సంభాషణ ఒక ఉదాహరణ.

**వాసవదత్త : "హలా! భణ భణ–కిం దర్శనీయః?"**–(చెలీ! చెప్పు, చెప్పు, ఆయన అందంగా ఉంటాడా?)

**చెలికత్తె : "శక్యం భణితం–శరచాపహీనః కామదేవ ఇతి."**– (చేతిలో శరచాపం లేని మన్మథుడు అని చెప్పవచ్చు.)

చిన్న మాటలో–"శరచాపహీనుడైన మన్మథుడు" అనే అభివ్యక్తితో నాయకుని సౌందర్యాన్ని కవి సున్నితంగా వ్యక్తం చేశాడు. ఇలాంటిదే ప్రతిమా నాటకంలో ఒక సంభాషణ:

**చేటి : భట్టిని ఏవం మయా శ్రుతం –భర్తృదారకమభిషించ మహారాజో వనం గమిష్యతీతి**

(అమ్మా యువరాజుకు పట్టాభిషేకం చేశాక మహారాజు వనాలకు వెళ్తారని విన్నాను.)

**సీత : యద్యేవం నా తదభిషేకోదకం ముఖోదకం నామ**

(అలాగైతే ఇది పట్టాభిషేక జలం కాదు. కన్నీళ్లతో నిండిన ముఖం కడుక్కోవడానికి నీళ్లు)

రెండూ జలమే. వాటిని అభిషేకానికి ఉపయోగిస్తే పవిత్రజలం. అలాంటి వేడుక తర్వాత ఆ మహారాజు అడవికి వెళ్తారంటే ఆ దుఃఖం దుర్భరం అవుతుంది. ఆ నీటి ఉపయోగమేముంటుంది–కన్నీళ్లతో తడిసిన మోహాన్ని ప్రక్షాళితం చేసుకోవడానికి కాక?

మరో వర్ణనలో ఒక చిత్రకారుడిలాగా భావిస్తాడు కవి. సాయంత్ర వేళ ఆకాశంలో రంగుల విన్యాసాలు రమణీయంగా ఉంటాయి. విశాలపటం మీద కనిపించని చిత్రకారుడెవరో రంగులు అద్దుతూన్నట్లున్నట్లుంది. భాసుడు అంటున్నాడు :

**పూర్వాతు కాష్ఠా తిమిరానులిప్తా సంధ్యారుణా భాతి చ పశ్చిమాశా**
**ద్విధా విభక్తాంతరమంతరిక్షం యథార్ధ నారీశ్వర రూప శోభాం (అవిమారకం)**

తూర్పుదిక్కు ఆకాశం నలుపెక్కి ఉంది. పడమటి వైపు ఆకాశం అప్పుడే అస్తమించిన సూర్యుడి వల్ల ఎరుపెక్కి ఉంది. అంతరిక్షం ఇలాగ రెండుగా విభక్తమై కనిపిస్తూంది. అటు నీలిమ ఇటు లోహితం ఇది అర్ధనారీశ్వర శోభతో ఎంతో అందంగా ఉంది అన్నాడు. నీల లోహిత రూపమైన శివస్వరూపం గురించి సంధ్యా వర్ణనలో మేళవించి చెప్పాడు. తూర్పు వైపు నీలి వన్నె పడమటి వైపు లోహిత వర్ణం రెండు కలిసి అలా కనిపిస్తూ అర్ధనారీశ్వర తత్వాన్ని చూపుతూ ఉన్నాయి.

భాసుడు కేవలం కథ చెప్పే నాటకకర్త కాదు. ఒక కవి, నాటక శిల్పి, మనస్తత్వ పరిశీలకుడు, రంగస్థల స్వభావం గురించి స్పష్టంగా తెలిసిన కళాకారుడు, ప్రయోక్త-అన్నీ కలిసిన అపూర్వ సంగమం ఆయన. ఇతిహాసాల నుంచి కథను తీసుకున్నా గుడ్డిగా అనుకరించడు. దానిలో తన ఉపజ్ఞతో కొత్త కల్పనలను ప్రవేశపెడతాడు. వాటిని తర్కబద్ధంగా రూపొందిస్తాడు. పాత్రల స్వభావానికి అనుగుణంగా సంఘటనలను మార్చుకుంటాడు. సంభాషణలను పదునుగా, సంక్షిప్తంగా ఉంచుతాడు. ప్రేక్షకుడికి కళ్లను తిప్పి పక్కకు చూసే అవకాశం ఇవ్వకుండా ఒక దృశ్యం తరువాత మరొక దృశ్యాన్ని ఆవిష్కరిస్తూ ఉత్కంఠను పెంచుతాడు. భాసుడి నాటకాలను చదువుతున్నప్పుడు "కథ సాగుతోంది" అనే అనుభూతి కంటే "సన్నివేశం మన కళ్లముందే జరుగుతూంది" అనే అనుభూతి ఎక్కువగా కలుగుతుంది. భాసుడు కథను చెప్పడు-దానిని దృశ్యంగా నిలబెడతాడు. పాత్రలను పరిచయం చేయడు-వాటి ప్రవర్తన ద్వారా మనకు పరిచయం చేస్తాడు. భావాన్ని వివరించడు-ఒక చిన్న మాటతో మనలో ఆ భావాన్ని పుట్టిస్తాడు. నాటక సౌందర్యంలో మరిగించి, కమనీయ సన్నివేశాలతో కరిగించి, ప్రదర్శనకూ-ప్రేక్షకులకూ మధ్య తెరలు తొలగించి అద్వైతానుభూతిని కలిగిస్తాడు.

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,**
**తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్,**
**మైసూర్, ఫోన్ : 948 044 3108**

## శేషయ్యంగార్

**శ్రీరంగనాథుడు మెచ్చిన శేషయ్యంగార్ కృతులు:** శేషయ్యంగారు గొప్ప వైష్ణవ భక్తుడు, సంగీత, సంస్కృతములందు మంచి ప్రజ్ఞ కలవాడు. ఈయన అయోధ్య నుండి శ్రీరంగానికి వచ్చి స్థిరపడ్డారు. కొంతకాలం శ్రీ స్వాతి తిరువాళ్ మహారాజావారి ఆస్థాన విద్వాంసులుగా కూడా ఉన్నారు. కృతి రచనలో కొన్ని మార్గదర్శకాలను ఏర్పరచడం వల్ల వీరు 'మార్గదర్శి శేషయ్యగారు'గా ప్రఖ్యాతి పొందారు. 'కోసల' ముద్రతో రచనలు చేశారు.

వీరు తాను రచించిన కృతులనన్నింటినీ ఒక పుస్తక రూపములో వ్రాసి, శ్రీరంగనాథుని పాదముల వద్ద సమర్పించవలసినదిగా అక్కడి అర్చకులను కోరారట. మరునాడు ఉదయం రంగనాథుని ఆలయానికి వెళ్ళి పుస్తకము తీసి చూడగా, ఆ పుస్తకంలో 60 కృతులు మాత్రమే తేజోరూపముతో ఉండి, మిగిలిన కృతులు స్వరూపములు తెలియకుండా చెదలు పట్టిపోయాయట. ఆ భగవంతుడొప్పుకున్న అరువది కృతులే ప్రచారములో ఉన్నవి.

– – – –

## సీతారామయ్య

**తోడిరాగం తాకట్టు పెట్టిన విద్వాంసుడు :** తంజావూరుని పాలించిన శరభోజి మహారాజు ఆస్థాన గాయకుడిగా ప్రాభవం పొందిన మహా విద్వాంసుడు శ్రీ సీతారామయ్య. ఈయన వాగ్గేయకారుడు కూడా. తోడి రాగం పాడటంలో దిట్ట. అందుకే వీరికి 'తోడి సీతారామయ్య' అని కూడా పేరు. వీరి సొమ్మైన తోడి రాగం తాకట్టు పెట్టి డబ్బు తీసుకునేవారట. వీరిచే తోడి రాగం పాడించుకొని సన్మానము చేసేవారట. ఆ కాలంలో వారి పాండిత్యమే వారి ఐశ్వర్యము అన్న విషయం మనకు బోధపడుతుంది.

***(ప్రణవం - జనవరి 2011)***

# జీవన మకరందం



- ❖ జీవితం మారుతూ వుండాలి. ఝరిలాగా ప్రవహిస్తూ వుండాలి.
- ❖ అనిర్దుష్టమైన గమనంలో గొప్ప సాహసం వుంటుంది.
- ❖ సాధారణ జీవితం మీద మోజు-సామాన్య వ్యవహారాలపై ఎక్కువ సమయం వెచ్చించకూడదు!
- ❖ ప్రేమ ఒక దివ్య ప్రసాదం-జ్ఞానానుపానం! మోకాళ్లపై వంగి స్వీకరించాలి!
- ❖ మనం ప్రేమలో-ఆశ్చర్యంలో జీవించాలి-ప్రేమకోసం-మెప్పుకోసం కాదు!
- ❖ ప్రపంచంలోని పాపాలన్నీ బుద్ధిజనితమే సుమా!
- ❖ నాగరకత మనిషి బ్రతుకును, వ్యక్తిత్వాన్ని మోయలేని బరువు చేసింది!



- ❖ కళాకారుడు తనను తాను రక్షించుకునే వ్యాపకంలోనే సంగీతం-శిల్పాలు-చిత్రాలు ఉద్భవిస్తాయి. సాహిత్యం కూడా!
- ❖ జీవితాన్ని ఏ ఒక్క సిద్ధాంతానికో-నైతిక చట్రంలోనో బంధించి నాశనం చేసుకోకూడదు.
- ❖ కార్యాలు-క్రతువులు మనిషి కోసం-వాటికోసం మనిషి కాదు!
- ❖ పరోపకారాలు-డాంబికమైన ధార్మిక సంస్థలు- మధ్యతరగతి మనుషులను ప్రలోభపెట్టి ప్రభావితం చేస్తాయి.
- ❖ స్వేచ్ఛగా-పూలగుత్తులతో, వెన్నెల వెలుగులో నీవు సంతోషంగా ఉండవచ్చు!
- ❖ ఈ ప్రపంచంలో సౌందర్యమే కాదు-దుఃఖం కూడా కావలసినంత ఉంది!
- ❖ వసంతమంతా ఒక్కమొగ్గలో దాగి వుంటుంది! సంగీతమంతా కోయిల గొంతులో గమకాలు పోతుంటుంది!
- ❖ ఈ సమాజంలో నీవు ఎవ్వరినుంచి రక్షణ కోరుతున్నావో-వారికే కట్టుబడి వుండాలి!
- ❖ ప్రకృతిలో నీకు సాంత్వన లభిస్తుంది. వర్షపు జల్లులు-వెన్నెల వెలుగులు అందరిమీద ఒకేలాగ పడుతుంటాయి!!
- ❖ ప్రేమ-విషాదాల నుంచే సాహిత్యం-కళలు జనిస్తాయి. సర్వ సారస్వతానికి మూలం మనిషిలో విషాదమే!
- ❖ మనలో తృష్ణ-అనంతమైనది-కాని అనుభవం చాలా పరిమితం!

# శత వసంత భారతి

– గోపరాజు నారాయణరావు

**భారతి** మాసపత్రిక జననం, ప్రస్థానం, మరణం తెలుగు సాహిత్య చరిత్రకే కాదు, భారత పత్రికారంగ చరిత్రలోనే విశేషం. కథక చక్రవర్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మాటలలో, 'ఆ వారపత్రికను పోలేది తెనుగులో మరొకటి లేదు. ఆ దినపత్రికను పోలేదన్నీ తెనుగులో మరొకటి లేదు. ఆ మాసపత్రికను పోలేది కూడా తెనుగులో మరొకటి లేనేలేదు.' ఏ పత్రికలవి? **ఆంధ్రపత్రిక** వారపత్రిక (1908), **ఆంధ్రపత్రిక** దినపత్రిక (1914)లను అందించిన కాశీనాథుని నాగేశ్వరరావుగారే నెలకొల్పిన **భారతి** మాసపత్రిక. వందేళ్ల క్రితం పుట్టిన ఈ **భారతి** అంటే వేయేళ్ల తెలుగు సాహిత్య చరిత్రతో కరచాలనం. ఆధునిక ప్రపంచ సామాజిక, రాజకీయ, సాహిత్య రంగ పరిణామాలతో పరిచయం కూడా.




మొదటి సంచిక

**భారతి** తొలి సంచిక జనవరి, 1924న (రుధిరోద్గారి పుష్యమాసం) వెలువడింది. 'ఇంతకంటే రెండేండ్ల ముందే (1922) **భారతి** వెలువడి ఉండవలసింది. కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావుకు మాసపత్రిక బాధ్యత (సంపాదకత్వం) అప్పగించాలని నాగేశ్వరరావు అనుకొన్నారు. కానీ దురదృష్టవశాత్తు లక్ష్మణరావు అనారోగ్యంతో జూలై, 1923లో మరణించారు (ఆంధ్రజాతి అక్షరసంపద, తెలుగు పత్రికలు, పొత్తూరి వెంకటేశ్వరావు). దానితో రెండేళ్ల జాప్యంతో **భారతి** వెలుగు చూసింది. గన్నవరపు సుబ్బరామయ్యను సంపాదకునిగా నియమించారు. కాశీనాథుని నాగేశ్వరరావు, సుబ్బరామయ్య, మల్లంపల్లి సోమశేఖరశర్మ పేర్లు కూడా సంపాదక మండలిలో కనిపిస్తాయి. **శివలెంక శంభుప్రసాద్, శివలెంక రాధాకృష్ణ** తరువాతి కాలాలలో సంపాదకత్వం వహించారు. సంప్రదాయవాదులు, పద్యకవులు, వచనకవులు, దిగంబర కవులు, విప్లవకవులు, ప్రముఖ చరిత్రకారులు, సాంకేతిక నిపుణులు 'భారతి'కి వ్యాసాలు రాసినవారే. అదొక కలాల కల్హారం. తెలుగు రచయితల తారామండలం. వర్తమాన రచయితల సందోహం. విశ్వ సాహిత్య వీధుల వీక్షణం. గ్రాంథికం, వ్యావహారిక భాష పక్కపక్కనే నిలిచిన వేదిక.

దాదాపు ఆరున్నర దశాబ్దాల పాటు వెలువడిన **భారతి** 1984లో వజ్రోత్సవం జరుపుకుని, 1991లో నిలిచిపోయింది. ఇందులో సాహిత్యం, విమర్శలదే అగ్రతాంబూలం. అలా అని **భారతి** కేవలం సాహిత్య పత్రిక కాదు. తెలుగు సాహిత్యం, సాహిత్య విమర్శతో పాటు, భాష, వ్యాకరణం, ఛందస్సు, కథ, నవల, నాటకం, అనువాద సాహిత్యం, వ్యవసాయం, చరిత్ర, పురావస్తు శాస్త్రం, శిల్పం, మత, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల విశ్లేషణలకు ఆలవాలమైంది. భారత జాతీయ కాంగ్రెస్ సభల విశేషాలను తన వంతుగాను నివేదించింది. తెలుగు పత్రికే అయినా సంస్కృత సాహిత్య అవసరాన్ని విస్మరించలేదు. గానకళ, చిత్రలేఖనం వంటి లలితకళల వ్యాప్తికి ఘనమైన సేవలు అందించింది. అటు పురాతన సాహిత్య చర్చకీ, ఇటు ఆధునిక సాహిత్య పరిచయానికీ కూడా సమస్థానం కల్పించింది. సంప్రదాయానికీ, తిరుగుబాటుకూ కూడా వేదికయింది. పద్యానికీ, వచన కవితకీ సమాన గౌరవం ఇచ్చింది. **'కలగూరగంప'** పేరుతో అరపేజీ వ్యాసం నుంచి రెండు పేజీల వ్యాసం వరకు లోతైన చర్చలను అందించింది. గ్రంథ విమర్శలు శీర్షిక చిరస్మరణీయమైనది. మొదట కొన్ని నెలలు తప్ప, మిగిలిన కాలమంతా కొన్ని వందల పుస్తకాలను **భారతి** సమీక్షించింది. సమీక్షకులంతా

లబ్ధప్రతిష్ఠులే. ఈ విభాగ పరిచయమే ఒక విస్తృత సిద్ధాంత వ్యాసం కాగలదు. ఇంకా, జాతీయ, అంతర్జాతీయ విశేషాలు, అపురూప ఛాయాచిత్రాలను తెలుగువారికి అందించింది. 186 పేజీల తొలి సంచికలో వ్యాసాలు, కవిత్వం, విమర్శ వంటి 42 అంశాలు, ఐదు వర్ణచిత్రాలు సహా 16 ఫోటోలు కనిపిస్తాయి. కొన్ని సంచికలు 200 పేజీలతో కూడా వెలువడినాయి. ఆ పేజీలు క్రమంగా 70కి పరిమితం కావడం కూడా వాస్తవమే.

**ఆవిర్భావ నేపథ్యం : భారతి** సాహిత్య సేవ, రచనల ప్రామాణికతల గురించి కాలమే తీర్పు ఇచ్చింది. దశాబ్దాల పాటు మనకు అందిన ఆ సేవల మీద ఒక వ్యాసం అంటే సింహావలోకనం మాత్రమే. దానికి ఉపక్రమించే ముందు ఒక్క విషయం గమనించాలి. భారతావనిలో వెల్లివిరిసిన పునరుజ్జీవనోద్యమ చైతన్యంతో జాతీయ భావాలూ, స్వాతంత్ర్యకాంక్ష సంగమిస్తున్న వేళ **భారతి** ఆవిర్భవించింది. పోతనామాత్యుని 'కాటుక కంటినీరు..' పద్యంతో, వివరణతో తొలి సంచిక **స్వవిషయము** (సంపాదకీయం) అందించడం ఒక ఆశయాన్ని సంకేతించేదే. అందులో ఇలా అన్నారు, 'సకల విధములను స్వాతంత్ర్యము కోల్పోయినపుడు పరాధీన స్థితియందున్న **భారతి**ని... ఉద్ధరించి శుభస్థితిని గల్పింపవలయునను సంకల్పము భారతీయుల హృదయమునందు కలిగినది. ఆ యభిలాషను సఫలము చేయుటకు పత్రికలను ప్రచురించుచున్నారు. గ్రంథాలు వ్రాయుచున్నారు...' ఎందుకు అంటే, 'మానవులకు భావదాస్య విమోచనము గలుగకను బాహ్యదాస్య విమోచనము గలుగజాలదు'. ఆత్మవికాసానికి సాధనాలైన భాష, భావం, కళలు, శాస్త్రం, సాంప్రదాయాచారాలు కాంతి కళలు లేక జీవన ప్రవాహం సంకుచితమైపోయిందని ఈ సంపాదకీయం ఘోషించింది. దేశానికి పునర్ వైభవం అన్న మాటను ప్రస్తావించకుండా, పునరుజ్జీవనోద్యమ నేపథ్యం చెప్పి, తరువాత దేశవాసులతో పాటు తెలుగువారు కూడా ఆ ఉద్యమ స్ఫూర్తిని ఔదల దాల్చడానికి సిద్ధంగా ఉన్నారని **భారతి** భావించింది. ఈ సంపాదకీయంలో కనిపించే ఇంకొక ఘనమైన వ్యక్తీకరణను చెప్పుకుని ఈ ప్రస్తావనను ముగించవచ్చు. 'ఇదంతా (పునరుజ్జీవనోద్యమ చైతన్యం) గతాన్ని కీర్తించడానికి కాదు, కేవలం ఆత్మ సందర్శనాభిలాష' అన్నారు. సంస్కృత మహాకవులు, ఇతర భారతీయ భాషల రచయితలు, విశ్వసాహిత్యంలోని సృజనకారులను తెలుగువారికి పరిచయం చేసే పని **భారతి** ఒక శతాబ్దం క్రితమే ఆరంభించి కొన్ని దశాబ్దాల పాటు నిర్వహించింది. అందుకే వేయేళ్ల తెలుగు సాహిత్య మలుపులను స్పృశిస్తూ ఆ పత్రిక సాగించిన ప్రయాణం వందేళ్ల సందర్భంగా నిశ్చయంగా స్మరణీయమైనది.



కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

**తొలి సంచిక :** ఆశయానికీ, ఆ ఆశయం కాస్త కూడా సడలకుండా పత్రిక సాగడానికీ ఒక కొండగుర్తుగా నిలిచేదే తొలి సంచిక. మంగిపూడి వేంకటశర్మ 'గాంధీ శతకము' తొట్ట తొలి రచన. 'స్వవిషయము' పేరుతో రాసిన సంపాదకీయం కూడా తరువాతే కనిపిస్తుంది. అప్పుడు ప్రారంభించిన శీర్షికలు 1990లలో చివరి సంచిక వరకు కూడా కొనసాగాయి. అందుకే తొలి సంచిక మీద విహంగ వీక్షణం చేసి, మిగిలిన సంచికల మీద సింహావలోకనం చేయడం అవసరం.

'శివకవులు' (వేటూరి ప్రభాకరశాస్త్రి), 'పారిజాతాపహరణము – పాత్ర పోషణము' (ఆంధ్ర శేషగిరిరావు) – సాహిత్య విమర్శ. 'ఆంధ్ర వాఙ్మయమున ఆంగ్ల సారస్వత ప్రోద్బలము' (దేవులపల్లి అప్పల నరసింహం)– తులనాత్మక అధ్యయనం. 'ప్రాచీనాంధ్రులెవ్వరు? ఆర్యులు కారా?' (చిలుకూరి వీరభద్రరావు)–చరిత్ర, 'కన్నీరు' (దేవులపల్లి కృష్ణశాస్త్రి)–పద్య కవిత్వం. 'భారత నీతి' (వింజమూరి రంగాచార్యులు)–రాజనీతిశాస్త్రం, 'బ్రహ్మాండ పురాణం' (జనమంచి శేషాద్రిశర్మ)–పురాతన



శివలెంక శంభుప్రసాద్

సాహిత్యం. 'భాషా విషయము' (పారనంది రామశాస్త్రి)–భాష. 'భారవి' (చిలకమర్తి లక్ష్మీనరసింహం), రఘువంశ నామౌచిత్యము (కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రి, ఈ వ్యాసంలో మల్లినాథ సూరి సహ రఘువంశం మీద వ్యాఖ్యానాలు రాసినవారి 30 పేర్లు ఇచ్చారు)–సంస్కృత సాహిత్యం. 'ఖురాన్' (ఉమర్ అలీషా)–మతం. 'గుణగ విజయాదిత్యుని సాతలూరు తామ్ర శాసనము' (కొమర్రాజు లక్ష్మణరావు)–పురావస్తు శాస్త్రం. 'వ్యవసాయ చరిత్ర' (పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యం)–విజ్ఞానశాస్త్రం. 'ప్రథమ సాంధికుడు' (ఇది నాటిక. మూలం లియో టాల్‌స్టాయ్, అను: వేలూరి శివరామశాస్త్రి)–అనువాదం/విశ్వసాహిత్యం. (సంసారి (రైతు), పాలేరు (భూతం) ప్రధాన పాత్రలు. చాలినంత పండింది కాబట్టి రైతు ఒద్దికగా ఉన్నాడు, కాస్త ఎక్కువ పంట పండితే అతడిలో పశు ప్రవృత్తి కనిపిస్తుంది అని రుజువు చేయడానికి ఒక భూతం చేసిన శపథమే ఇతివృత్తం). 186 పేజీలతో, ఈ వ్యాసాలతో, సరస్వతి రంగుల ముఖచిత్రంతో తొలి సంచిక వెలువడింది. ఈ వ్యాసాలలో కొన్ని రెండు నుంచి ఆరువారాలు ధారావాహికంగా కొనసాగాయి.

**సాహిత్య విమర్శ : భారతి** ప్రధాన ధ్యేయమే సాహిత్య విమర్శ. పురాణాలు, కావ్యాలు, ఆధునిక కవిత్వం, నాటక విమర్శ వరకు అన్నీ ఇందులో చోటు దక్కించుకున్నాయి. ఇక్కడ ఇస్తున్నవి ఆయా సంచికలలో ప్రచురించిన విమర్శన వ్యాసాలలో మచ్చుకు కొన్ని మాత్రమేనని వేరే చెప్పనక్కరలేదు. ఇవన్నీ తెలుగు సాహిత్య విమర్శ పరిణామాన్ని సూచిస్తాయి.

'వాఙ్మయ పరిణామము' (వేటూరి ప్రభాకరశాస్త్రి), 'నన్నయ యతులు' (చిలుకూరి నారాయణరావు), 'నన్నయకు బూర్వమాంధ్ర వాఙ్మయము' (కోరాడ రామకృష్ణయ్య), 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' (భోగరాజు నారాయణమూర్తి, ఈయన విజయనగరం ఆస్థానకవి, దాదాపు ఏడువారాల పాటు ప్రచురించారు), 'ఆంధ్ర ముద్రారాక్షస విమర్శనము' (వేదము వేంకటరాయశాస్త్రి), 'శతక కవుల చరిత్రము' (వంగూరి సుబ్బారావు), 'జొన్నకర్ర ప్రశ్న' (తాపీ ధర్మారావు), 'లక్షణ గ్రంథ విశేషములు' (దువ్వూరి వేంకటరమణశాస్త్రి), 'ద్రవిడ వాఙ్మయము– ఆంధ్రులు' (అ. రంగస్వామి సరస్వతి), 'పాల్కురి సోమనాథుని గురు ప్రశంస', 'సమగ్ర ఆంధ్ర సాహిత్యము', 'యక్షగాన కవులు' (నిడుదవోలు వేంకటరావు), 'ముక్కు తిమ్మనార్యుడు' (మండలేముల వేంకటశాస్త్రి), 'ద్రౌపది' (పులగుర్తి లక్ష్మీనరసమాంబ), 'పోతన' (నోరి నరసింహశాస్త్రి), 'సాహితీ సుగతుని స్వగతం', జాషువా కవిత (తిరుమల రామచంద్ర), 'ప్రాచీన సాహిత్యము–విమర్శ' (నాగళ్ల గురుప్రసాదరావు), 'ఇతివృత్త నిర్వహణము–ఆంధ్ర కవుల అలసత్వము' (వసంతరావు రామకృష్ణారావు, మనుచరిత్ర ఆధారంగా విశ్లేషణ), 'ప్రపంచ సాహిత్యంలో యువతరం తిరుగుబాటు' (నిఖిలేశ్వర్), 'గోపీచంద్' (ఆర్‌ఎస్ సుదర్శనం), 'సాహిత్య జగత్తు' (కాళూరి హనుమంతరావు, కవిత్వం అంటే ఏమిటి అన్న ప్రశ్నతో సంస్కృత, పాశ్చాత్య లాక్షణికుల నిర్వచనాలతో సాగిన వ్యాసం), 'ఆంధ్ర మహాసావిత్రి ఒక సమీక్ష' (గుంటూరు శేషేంద్రశర్మ), 'కథకుడు, కవి బాలగంగాధర తిలక' (నివాళి, బుచ్చిబాబు), 'కన్యాశుల్కం నాటకంలో కాలిక, స్థానిక విశేషాలు' (కె.వి.రమణారెడ్డి),'పూర్ణమ్మ కథలో గురజాడ వారి కవితా శిల్ప వైభవము' (వి.వి రామశర్మ), 'బుచ్చిబాబు', 'కొడవటిగంటి నవలాలోకం' (రామమోహనరాయ్), 'భారతీయ రసతత్త్వం' (కొండపర్తి శేషగిరిరావు), 'సాహిత్యంలో రాజకీయాలు' (సంశోధక్), 'మినీ కవిత' (రావి రంగారావు), 'భావోద్యమాలు–వర్గతత్త్వం–ఒక సమాధానం' (ముదిగొండ వీరభద్రయ్య), 'కావ్యానందం అంటే ఏమిటి?' (పాటి దశరథరెడ్డి), 'నీడలు' లేని శ్రీశ్రీ' (శ్రీవాసవ్య),



శివలెంక రాధాకృష్ణ

'మహాప్రస్థానము', 'ఊర్వశి–ప్రవాసము', 'సౌందరనందము విమర్శనము సింహావలోకనము' (పొట్లపల్లి సీతారామారావు), 'ఏకవీర' (విమర్శ, టేకుమళ్ల కామేశ్వరరావు, విశ్వనాథ వారి ఆ నవల ఈ పత్రికలోనే ధారావాహికంగా వెలువడింది), 'మృతకవులకు లేఖలు' (మనుచరిత్ర మీద వాదప్రతివాదాలను ఈ పేరుతో క్రోడీకరించారు. ఇది ధారావాహిక), 'తెలుగు నవల 50 నుంచి 65 వరకు' (ఆర్‌ఎస్ సుదర్శనం), 'ఈనాటి సాహిత్యంలో స్థితిగతులు' (టిఎల్ కాంతారావు).

**భాష** : తెలుగు భాష ఎడల విశేష గౌరవం కలిగిన **భారతి**లో రెండవ ప్రాధాన్యం భాషా విషయాలకే కనిపిస్తుంది. ఈ అంశం మీద కూడా ఎందరో మహానుభావాలు వ్యాసాలు వెలువరించారు. కొన్ని ఉదాహరణలు:

'వ్యావహారిక భాషా బహిష్కార నిరసనము' (గిడుగు వేంకటరామమూర్తి), 'ఛందశ్శాస్త్రము' (పారనంది రామశాస్త్రి), 'ఛందశ్శాస్త్ర విమర్శనము' (వాసా సూర్యనారాయణశాస్త్రి), 'భాషా కుటుంబములు' (కోరాడ రామకృష్ణయ్య), 'గంజాము మండలమందాంధ్ర భాష' (డివన్ శర్మ), 'తెలుగు మాండలికాలు కరీంనగర్ జిల్లా' (ఖండవల్లి లక్ష్మీరంజనం), 'తెలుగు మాటల తీరుతెన్నులు' (గరిమెళ్ల సోమన్న, పరాయి భాషల నుంచి వచ్చిన నౌకరు, పేక, దమ్మిడి వంటి మాటల మీద చర్చ), 'ఆంధ్రమున కొన్ని అన్య భాషా పదములు' (కొమాండూరి శఠకోపాచార్యులు), 'ఆధునిక భాషాశాస్త్రం–వికాసం, పరిణామం' (డా. పిఎస్ సుబ్రహ్మణ్యం) 'అరవ భాష యొక్క యుత్పత్తి' (టేకుమళ్ల రాజగోపాలరావు), 'మాటల దాంపత్యము', 'జానపద భాష' (నాయని కృష్ణకుమారి), 'తెలుగులో బహువచన రూప నిష్పత్తి', 'వచనపద్యం ఛందో విభాగం కాదు' (చేకూరి రామారావు), 'అద్భుత రసము' (పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి), 'ప్రాచీన కవుల ప్రయోగ విశేషములు' (దీపాల పిచ్చయ్య శాస్త్రి), 'ఆంధ్రకవులు–దేశ స్వాతంత్ర్యము' (దివాకర్ల వేంకటావధాని), 'బాల వ్యాకరణ ఘంటాపథ వ్యాఖ్యానము' (శలాక రఘునాథశర్మ), 'భాష–వ్యాకరణము'(బొడ్డుపల్లి పురుషోత్తము), 'అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు, భాషా శైలి' (తంగిరాల వేంకట సుబ్బారావు).

**పద్య కవిత్వం** : పద్యం రాజ్యమేలుతున్న కాలంలో ఆవిర్భవించిన **భారతి** సహజంగానే ఆ ప్రక్రియను విశేషంగా గౌరవించింది. కొన్ని ఉదాహరణలు.

'ముసలితనపు అనుభవం' (చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి), 'తుఖారాం సాధు' (జి. జాషువా), 'కుపిత చాలనము', 'గౌతమీపుత్ర శాతకర్ణి' (విశ్వనాథ సత్యనారాయణ), 'పండిత ప్రతిజ్ఞ' దువ్వూరి రామిరెడ్డి; 'ఘోర పతనం' (వేదుల సత్యనారాయణ శాస్త్రి, ఘోర దాస్యాంబునిధిని మునిగితిని గానబడకుండా మునిగిపోతిని' అని 1924లో ఈ కవి వాపోయాడు), 'కాలకవచం' (విద్వాన్ విశ్వం), 'బాలాబ్దము' (తుమ్మల సీతారామమూర్తి), 'హంపీ క్షేత్రము' (కొడాలి వెంకటసుబ్బారావు, కామరాజుగడ్డ శివయోగానందనరావు), 'శివాజీ' (తెన్నేటిసూరి, అఫ్జల్‌ఖాన్ వధ), 'నీరాజనం' (ఉత్పల సత్యనారాయణాచార్య).

**వచన కవిత్వం** : మొదటి దశాబ్దాలలో పద్యమే రాజ్యమేలినా వచన కవిత్వం తన ఉనికిని చాటుకోవడం మెల్లగా ఆరంభించింది. కానీ 60ల తరువాత వచన కవిత పద్యాన్ని అధిగమించడం గమనించవచ్చు. ఇదే **భారతి**లోను ప్రతిబింబించింది. పద్యకవులు కూడా వచన కవిత్వం చెప్పారు. పాట కూడా అంతే. మొదట తగిన స్థానం పొందింది.

'ఆర్తగీతము', 'ఆ రోజులు', 'నెహ్రూ','న్యూసిలబస్', 'స్వయంవర' (బాలగంగాధర తిలక్), 'కర్తవ్యము' 'పునర్నవమ' (దాశరథి), 'కన్నీళ్ళొచ్చేయి' (బీనాదేవి), 'కాలం' (వరవరరావు), 'నేనొంటరినై', 'పాపం నీ అడ్రస్ దొరకడం లేదు' (భైరవయ్య), 'దిగంబరతరం', 'ఒక

మహత్తరమైన మార్పు కోసం' (నిఖిలేశ్వర్), 'రాలిపోయిన కిరణం', 'వయొనాయ్' (వేగుంట), 'రా!' (చెరబండరాజు), 'శేషస్పర్శ' (ఇస్మాయిల్), 'వెల్తురు-సంగీతం' (కె.శివారెడ్డి), 'శబ్దముద్ర' (ముదిగొండ శివప్రసాద్), 'పూల కబేళాలో డిసెంబర్ గులాబీలు' (జ్వాలాముఖి), 'శూన్యమైన వేణువు' 'మంటపూలు' (గుడిహాళం రఘునాథం), 'పరుగే నా బతుకు' (దేవీప్రియ), 'ఆవాహన', 'బాధ' (మినీ కవితలు, గాలి నాసరరెడ్డి).

**పాట :** ఏకాంత సుఖము (దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆకులో ఆకునై పాట), ప్రణయ కోపము (అడవి బాపిరాజు), అమ్మణ్ణి (చింతా దీక్షితులు), యెట్టి నా యెంకి' (నండూరి వేంకటసుబ్బారావు), 'ఏడు మాటలు' (తెన్నేటి విశ్వనాథం). ఇంకా, పిల్లల కోసం పలు గేయాలు ప్రచురించారు.

**కథ :** 1910 ప్రాంతంలో ఆరంభమైన తెలుగు కథ తరువాత సమున్నత శిఖరాలను చేరుకుంది. తెలుగు కథను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన, సుసంపన్నం చేసిన కథకులంతా **భారతి**కి రాసినవారే.

'మాణిక్యము' (రాయసం వేంకట శివుడు), 'షట్కర్మయుక్తా', 'కన్యాకాలే యత్నాద్వరితా' (శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి), 'పద్మాక్షి,' 'పిత్తల్ కా దర్వాజా' (వేలూరి శివరామశాస్త్రి), 'శ్రీరామా', 'జయసీతారామ', 'రామరాజు', 'ప్లీడరు పట్టు' (పానుగంటి లక్ష్మీనరసింహారావు), 'నల్లబిందె-దుక్కచెంబు' (భోగరాజు నారాయణమూర్తి), 'అడవిప్రేమ' (కవికొండల వేంకటరావు), 'చీకటిగదులు' (త్రిపుర), 'మనను' (పెద్దిభొట్ల సుబ్బరామయ్య), 'దయ్యముల కొంప' (శంకర దీక్షితులు), 'నా ఇంట్లో కూడా ప్రవేశించిందే!' (బందా కనకలింగేశ్వరరావు), 'నిరంతర త్రయం' (బుచ్చిబాబు), 'ప్రథమజ్వాల' (వింజమూరి పార్థసారథి), 'గడ్డిపువ్వు' (కానల నాగభూషణం), 'అశిక్ష-అవిద్య' (కాళీపట్నపు రామారావు), 'పట్టుతెరలు' (పురాణం సూర్యప్రకాశరావు), 'దివ్యౌషధం', 'ప్రజాపతి' (మధురాంతకం రాజారాం), 'తమస్సులో తపస్సులు' (మునిపల్లె రాజు), 'అవతలివైపు' (అక్కిరాజు రమాపతి రావు), 'పొగడపూలు' (పోరంకి దక్షిణామూర్తి), 'స్వార్థం-త్యాగం' (కొమ్మూరి వేణుగోపాలరావు), 'విజయం' (యల్లంశెట్టి సాయి), 'సన్నాటా' (ఐవిఎస్ అచ్యుతవల్లి).

**సంస్కృతం :** సంస్కృత భాషా రచనల అవసరాన్ని గుర్తించిన పత్రిక **భారతి**. ఎన్నో మహా కావ్యాల మీద, సుప్రసిద్ధుల విమర్శలు అందించింది.

'కాళిదాను కళామందిరము' (ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి), 'కాళీదాసుడు' (గంటిజోగి సోమయాజి), 'మనీషా పంచకం' (మూలం: ఆది శంకరుడు, విశ్లేషణ/టి. శివశంకర పిళ్లై), 'భర్తృహరి', 'పండితరాయలు', 'భల్లట శతకము' (చిలకమర్తి లక్ష్మీనరసింహం), 'సంస్కృత భాషలోని రామ నాటకములు' (మేడిచర్ల వేంకట రమణాచార్యులు), 'కాళిదాసు పుష్పములు' (కావ్యాలలో ప్రస్తావనకు వచ్చినవి, హెచ్ సుబ్బరాయ శాస్త్రి), 'మృచ్ఛకటికము' (కర్రి సాంబమూర్తి), 'దశకుమార చరిత్రము', 'కేయూరబాహు చరిత్ర' (నిడుదవోలు వేంకటరావు), 'సంస్కృత భాషలో రచన చేసిన ఆంధ్ర వాగ్గేయకారులు' (ఎంఎస్ఆర్ ప్రమీలాదేవి), 'సంస్కృత సారస్వతమున జంటకవులు' (ఈ. వేంకట వీర రాఘవాచార్యులు), 'దశకుమార చరిత్రము' (భాస్కర్), 'అభిజ్ఞాన శాకుంతలము' (అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రి), 'ముద్రారాక్షసము' (కో. వేం. కృష్ణమాచార్యులు), 'మల్లినాథ సూరి వ్యాఖ్యాన వైఖరి' (జటావల్లభుల పురుషోత్తము), 'భాసో హాసః కాళిదాసో విలాసః' (ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి), 'పండితరాయల వెటకారము' (మహీధర నళినీమోహన్).

**సంస్కృతం నుంచి అనువాదాలు :** సంస్కృత కావ్యాల మీద వ్యాఖ్యానాలను ప్రచురించడమే కాదు, గొప్ప రచనల అనువాదాలకు కూడా **భారతి** చోటు కల్పించింది.

'ప్రతిమా నాటకము' (మూలం : భాసుడు, అను: వేటూరి ప్రభాకరశాస్త్రి), 'యజ్ఞఫలము' (మూలం: భాసకవి, అను: బులుసు వేంకటేశ్వరులు), 'వేకువరాణి' (అజ్జాడాది భట్ట నారాయణదాసు, ఉషోదేవతను అభివర్ణించే రుగ్వేద మంత్రాలకు పద్య రూపం), 'మాండూక స్తుతి' (గిడుగు వేంకటసీతాపతి, రుగ్వేదంలో 7వ మండలం, 103వ సూక్తానికి అనువాదం).

**భారతీయ భాషలు :** తెలుగు వారి మీద ఇతర భాషల రచయితల ప్రభావం కొనసాగేందుకు **భారతి** తన వంతు కృషి అందించింది. భావ కవిత్వం మీద మాత్రమే కాదు, అభ్యుదయ రచనల మీద, విప్లవ రచనల మీద కూడా

ఇతర భాషల, విదేశీ సాహిత్యం ప్రభావం వాస్తవం. ఈ విధంగా తెలుగు రచయితలకీ, ఇతర భాషల ప్రతిభకీ మధ్య వారధిని నిర్మించే పనిని **భారతి** నిర్మాణాత్మకంగా చేసింది. కొన్ని ఉదాహరణలు: 'పుష్ప నాటకము' (మూలం బంకించంద్రుడు, అను: వేంకటపారతీశ్వర కవులు, ఇందులో వానచినుకు కథానాయకుడు), 'కాలరథము' (నాటిక, మూలం రవీంద్రనాథ్ టాగూర్, అను: కుందూరి ఈశ్వరదత్తు) 'గీతాంజలి' (టాగూర్, అను: బలివాడ రఘునాథరావు). 'గోవా జానపద గేయాలు' (వినాయక్ సదాశివ సుఖఠణ్కర్). 'తమిళంలో నవ కవిత' (టిఎస్ గిరిప్రకాశ్). తారాశంకర్ బెనర్జీ' (1967 జ్ఞానపీఠ్ గ్రహీత, ఏకే ఘోష్), 'ఇక కావలసినదేమి?' (కథ, మూలం ప్రేమ్‌చంద్, అను: మాడపాటి హనుమంతరావు), 'పిన్ని' (కథ, మూలం రవీంద్రనాథ్ టాగూర్, అను: మరుగంటి వెంకటకృష్ణయ్య), 'కామాయని' (కావ్యం, రచన జయశంకరప్రసాద్, విమర్శ కర్త రాజశేషగిరిరావు), 'మాస్తి దృష్టిలో రవీంద్రుడు' (నరేంద్ర ఇంటర్వ్యూ), 'నజురుల్ ఇస్లామ్' (వజీర్ రహ్మాన్), 'కళలు జాతీయ ప్రయోజనము' (మూలం అరవిందులు, అను: బొడ్డుపల్లి పురుషోత్తము), 'ఇందిర' (కథ, మాస్తి వేంకటేశ అయ్యంగార్ అను, మేమూరి రాధాకృష్ణమూర్తి), 'అక్బర్ ఇల్హాబాదీ' (ఉర్దూ కవి పరిచయం-సదాశివ), 'పాకీవాడు' (కన్నడ: కెవి పుట్టప్ప, అను: శంకరగంటి రంగాచార్యులు).

**తులనాత్మక అధ్యయనం :** ఆధునిక సాహిత్య ధోరణులలో తులనాత్మక అధ్యయనానికి చాలా ప్రాముఖ్యం వచ్చింది. ఆ విషయం **భారతి** సరిగా గుర్తించిందని చెప్పడానికి ఈ ఉదాహరణలు చాలు: 'కాళిదాసు-భవభూతి' (ఎ.వి. రత్నం), 'తెలుగు-హిందీ సాహిత్యములలో ఆధునిక యుగకర్తలు' (బయ్యా వెంకట సూర్యనారాయణ), 'తెలుగు-సంస్కృతము', 'తెలుగు-ప్రాకృతము' (నిడుదవోలు వేంకటరావు).

**విశ్వ సాహిత్యం :** ప్రపంచాన్ని చుట్టి వచ్చిన కొన్ని రచనల తెలుగు అనువాదాలకు **భారతి** అవకాశం కల్పించింది. ఇదొక అపురూప సేవ. కొన్ని ఉదాహరణలు:

'మధు కలశం' (ఉమర్‌ఖయ్యాం, అను: రాయప్రోలు సుబ్బారావు), ఉమర్‌ఖయ్యాం' (బసవరాజు అప్పారావు), 'ఇవాన్ ఇలియిచ్ మృతి' (మూలం లియో టాల్‌స్టాయ్, అను: పి. గణపతిశాస్త్రి), 'ఇరుగు పొరుగు' (మూలం టాల్‌స్టాయ్, అను : పాలకుర్తి ఆంజనేయులు),' 'రచయిత-అతని సమస్యలు' (యూజ్నే ఐనెస్కో), 'విభక్తవ్యక్తి జాన్ డోన్' (టీఎస్ ఇలియెట్ వెలుగులోకి తెచ్చిన కవి. వన్ వరల్డ్ అన్న పదాన్ని సృష్టించాడు), 'టిఎస్ ఇలియట్ కవితా శిల్పము' (యన్. రాధాకృష్ణమూర్తి), 'పేదలు' (మూలం ఎమిలీ వెర్హాయెర్న్, అను: శ్రీరంగం శ్రీనివాసరావు), 'షేక్స్పియర్-చైనా' (ఎరిక్ చౌ, 36 ఏళ్ల పాటు 37 నాటకాలను అనువదించుకున్న చైనీయులు, గ్రేట్ లీప్ ఫార్వార్డ్ కాలంలో ఆ మహాకవిని నిరాకరించిన తీరు), 'జాన్ స్టీన్‌బెక్' (1962 నోబెల్ గ్రహీత), 'ఇంగ్లీషులో రొమాంటిక్ కవులు' (కె.శ్రీరామ్), 'రూపుమాసిన వ్యక్తి' (మూలం హెజి వెల్స్, అనుకరణ: కూచిమంచి వెంకట రమణమ్మ), 'వైదిక సాహిత్యం-పాశ్చాత్య రచయితలు' (పిఎస్ ఆచార్య), 'మాయదారి చిత్రాలు' (కథ, జర్మన్ మూలం స్టీఫాన్ చ్వయిగ్, అను : డాక్టర్ వివన్ శర్మ. అపురూపమైన కథ. మహా యుద్ధాలలో కళ, కళాదృష్టి ఎలా ధ్వంసమవుతాయో చెబుతుంది. చ్వయిగ్ మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంతో చాలా రచనలు చేశారట. అందులో ఇదొకటి. రెంబ్రాంట్ వంటి విశ్వవిఖ్యాత చిత్రకారుడి అసలు చిత్రాలను ఎంతో వెచ్చించి సేకరించిన వ్యక్తి ఇందులో ప్రధాన పాత్ర. పురాతన కళాఖండాల వ్యాపారం చేసే ఒకరు ఆయన దగ్గరకు వస్తారు. అప్పుడు విస్తుపోయే నిజాలు వెలుగు చూస్తాయి. యుద్ధం కారణంగా ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఇంట్లోవాళ్లు ఆ అపురూప చిత్రాలను అమ్మి, వాటి స్థానంలో నకిలీవి ఉంచారు. వాటినే ఆ వ్యాపారికి చూపించి కళాత్మక విలువలను వివరిస్తాడు ఆ పెద్దాయన. అప్పటికి ఆ పెయింటింగ్‌ల సేకర్తకి చూపు పోయిందన్నదే కథకు మలుపు.), 'రచయిత కథ' (జేబీ ప్రీస్ట్లీ, లండన్ మ్యాగజైన్ సౌజన్యంతో).

**విజ్ఞానశాస్త్రం : భారతి**లో దర్శనమిచ్చిన వైవిధ్యానికి నిదర్శనంగా ఈ విభాగం నిలుస్తుంది. విజ్ఞానశాస్త్రాన్నీ, సాంకేతిక ఆవిష్కారాలనీ తెలుగు పాఠకులకు పరిచయం చేసిన తీరు స్వాగతించదగినది. వాటిలో కొన్ని : 'క్షాత్రకాల వ్యవసాయ చరిత్ర' (పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి), 'భూతత్వ శాస్త్రము' (పప్పు పార్వతీశం), 'నక్షత్రములు-జ్యేష్ఠ మాసము' (గొబ్బూరి వేంకటానందరాఘవరావు), 'ప్రాచీన

హైందవ గణితము' (దర్భా యజ్ఞేశ్వర సోమయాజి), 'పచ్చి ఎరువు అందునకు ఉపయోగించు సస్యములు' (ఒక కృషీవలుడు), దక్షిణ హిందూ దేశము-జలపాతములు (అక్కడ జరుగుతున్న విద్యుదుత్పత్తి విశేషాలు), 'వాయువార్తా పద్ధతి' (వైర్లెస్ టెలిగ్రాఫ్,కానూరి లక్ష్మణరావు), 'పావులూరి గణితం' (వేమూరి విశ్వనాథశర్మ), 'మనస్సులో మారుమూలలు' (బుచ్చిబాబు, మనో విశ్లేషణ మీద వ్యాసం), 'సప్తర్షి మండలము' (నడింపల్లి జగన్నాథరావు), 'ఆర్ష రసాయనశాస్త్రం' (హరి ఆదిశేషువు).

**పరిశ్రమలు :** పారిశ్రామిక పురోగతి నిరాశాజనకంగా ఉన్న కాలంలో **భారతి** కొన్ని పరిశ్రమల గురించి, వాటి బాగోగుల గురించి వ్యాసాలు ప్రచురించింది. ఉదాహరణ: భారతదేశ పరిశ్రమలు (పేరు లేదు), హిందూ దేశమందలి గోదు పరిశ్రమ (తోళ్లను శుద్ధి చేసే సమయంలో వచ్చే ఉప ఉత్పత్తి) (పేరు లేదు), హిందూ దేశమందలి కాగితపు పరిశ్రమ, దాని భావి పరిస్థితి (వివన్ చిన్నస్వామి), హిందూ దేశపు లక్క పరిశ్రమ (చిర్రావూరి రామసోమయాజులు).

**భారత జాతీయ కాంగ్రెస్ : భారతి** వ్యవస్థాపకుడు కాశీనాథుని నాగేశ్వరరావు భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడు. గాంధీజీ అనుచరుడు. కాబట్టి ఆ సంస్థ విశేషాలను ప్రచురించడం ఆయనకు తప్పనిసరి. 'రాటము-ఖద్దరు (పేరు లేదు), 'గాంధీవాదం, మహాత్ముని నిర్బంధ విమోచనము' (దామరాజు పుండరీకాక్షుడు, పద్యాలు). జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల గురించి ఫోటోలు సహా నివేదికలు ఇచ్చేవారు. కాకినాడ కాంగ్రెస్, బెల్గాం కాంగ్రెస్ ఇతర సమావేశాల వివరాలు కొన్ని సంచికలలో చూడవచ్చు.

**రాజకీయం :** ఆంధ్రపత్రిక దినపత్రిక, వారపత్రిక, ఉగాది సంచికలు జాతీయ అంతర్జాతీయ పరిణామాలను లోతుగానే విశ్లేషించేవి. **భారతి**లో కూడా రాజనీతిశాస్త్రానికి సంబంధించిన పలు విలువైన వ్యాసాలను ప్రచురించారు. స్వతంత్ర భారతావని రాజకీయ, సామాజిక విలువలను భారత జాతీయ కాంగ్రెస్ తన వార్షిక సమావేశాలలో చర్చిస్తున్న సమయంలో **భారతి** ఇలాంటి వ్యాసాలు ప్రచురించింది. వాటిలో కొన్ని : 'మన పూర్వులు రాసిన రాజనీతి గ్రంథములు', 'ఫెడరల్ విధానము' (మామిడిపూడి వెంకట రంగయ్య), '(బిటిష్) పార్లమెంట్ స్త్రీ సభ్యులు' (వ్యాసకర్త పేరు లేదు), 'లేబరు మంత్రి వర్గము' (ఆంధ్ర శేషగిరిరావు), 'స్వరాజ్యమననేమి?' (టి. శివశంకర పిళ్లై), 'పాశ్చాత్య ప్రపంచంలో మార్క్స్ దర్శనం' (సిడ్నీ హుక్), 'మిలోవాన్ జిలాస్‌తో గోష్ఠి (హెచ్.జె. స్టెహెల్, జిలాస్ యుగోస్లావియా ఉపాధ్యక్షునిగా పనిచేశాడు. తన కమ్యూనిస్టు పార్టీ మీద తిరుగుబాటు చేశాడు. రష్యా సహా, తూర్పు యూరప్‌లోని అన్ని కమ్యూనిస్టు దేశాలలోను మార్పులు తప్పవని, జర్మనీ సమస్య పరిష్కారమవుతుందని 1967లో చెప్పాడు), 'రిజర్వేషన్లు-ఒక పరిశీలన' (డా. కె. మురళీమనోహర్, బి. జనార్ధనరావు), 'ప్రపంచ రాజకీయ రంగము-హిందూదేశము' (నేత్రకంటి శ్రీనివాసకోనేటిరావు), 'నేటి రష్యా' (నార్ల వెంకటేశ్వరరావు), 'కాశ్మీరు సమస్య ప్రాధాన్యము' (పండితారాధ్యుల నాగేశ్వరరావు), 'తాష్కెంట్ ప్రకటన' (కౌండిన్య), 'రాష్ట్రపతి ఎన్నిక' (1969,పేరు లేదు), పశ్చిమ ఆఫ్రికాలో ఏకపక్ష రాజ్యాంగ సంక్షోభం (డబ్ల్యు. ఆర్థర్ లూవిన్), 'సెక్యులరిజం' (ఎంసి సెటల్వాడ్). 'భారత సంస్థానములు భావి సంస్కరణములు' (వడ్లమూడి సత్యనారాయణ) వ్యాసం దేశ సమగ్రతను 'భారతి' అర్థం చేసుకున్న తీరును ప్రతిబింబిస్తుంది.

**శాసనాలు :** సాహిత్యం, సాహిత్య విమర్శ తరువాత **భారతి** ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన అంశం శాసనాల విశ్లేషణ. మన చరిత్రను మనమే రాసుకోవాలన్న ఒక గొప్ప స్పృహతో వెలువరించిన వ్యాసాలు ఇవన్నీ. ఏ వ్యాసమైనా మూడు నాలుగు పేజీలకు తగ్గదు. అలాగే చరిత్రకు కూడా ఎంతో ప్రాధాన్యం కల్పించారు. 'కృష్ణరాయల గయ శాసనం' (నేలటూరి వేంకటరమణయ్య), 'దిమ్మగుడి శిలాశాసనం-విమర్శ' (ఘంటా జవహరలాలు), 'కాకతీయుల చరిత్రకు ఒక అమూల్య శాసనము' (పివి పరబ్రహ్మశాస్త్రి), 'ఇమ్మడి రాజాధిరాజు శాసనములు' (మైనేని కృష్ణకుమారి).

**చరిత్ర :** 'హిందూదేశ వర్తక వ్యాపారము', 'ఆంధ్ర మహాసామ్రాజ్యము' (మల్లంపల్లి సోమశేఖరశర్మ), 'కళింగమండలి ఆంధ్రులు' (బుర్రా శేషగిరిరావు), 'ఆంధ్రులు-శాతవాహన చరిత్ర' (వేపా రామేశం), 'అనార్కలి' (చిలకమర్తి లక్ష్మీనరసింహము), 'ప్రాచీనార్య స్త్రీలు భారతీయ నాగరికత యందు వారి స్థానము' (దిగవల్లి వేంకటశివరావు), 'మధ్యాంధ్రయుగములో భూమి

'సేద్యములు-పన్నులు' (కొల్లూరి సూర్యనారాయణ). ఇలాంటివి ఇంకా ఎన్నో ప్రచురించారు.

**జీవిత చరిత్ర :** స్వామి వివేకానంద (మేడేపల్లి వేంకట రమణాచార్యులు), అబ్దుల్ రజాక్ (భావరాజు వేంకట కృష్ణారావు, రజాక్ హంపీ విజయనగరం వచ్చిన పారశీక రాయబారి), ప్రొఫెసర్ సి.వి. రామన్ (దండా వెంకట సుబ్బారావు), ధర్మనిరతుడు కార్లయిలు (తణికెళ్ల వీరభద్రుడు), ఆర్కిమెడీస్ చరిత్రము (జివి రాఘవరావు), ఫ్రాయిడ్ చివరి రోజులు (టైమ్ సౌజన్యంతో), 'నాగేశ్వరరావు పంతులుగారు, తత్త్వవేత్త, గ్రంథకర్త' (నోరి నరసింహశాస్త్రి), 'డామ్ మొరేస్ (బ్రిటిష్ ఇండియా నాటి శ్వేతజాతి పత్రికా సంపాదకుడు, వ్యాసకర్త మరొక ప్రఖ్యాత పత్రికా రచయిత ఎస్. వెంకట్‌నారాయణ్) వంటి పలు వ్యాసాలు **భారతి** అందించింది.

**అర్థశాస్త్రం :** బ్రిటిష్ ఇండియాలో ఆర్థికాంశాలు ఎంతో ముఖ్యమైనప్పటికి వాటి గురించి చర్చ తక్కువగానే కనిపిస్తుంది. అది మేధావులకు పరిమితమన్న భావన బలంగా ఉన్న కాలంలో అలాంటి విషయాన్ని ఎంతో సరళంగా పాఠకులకు అందించిన ఘనత 'భారతి'కి ఉంది. ఉదా: 'మనకీ దారిద్ర్యమేల? భారతవర్ష ఆర్థిక చరిత్రము' దేశరాజు రామచంద్రరావు, సత్యసుబ్రహ్మణ్యం (గ్రంథస్వీకారంలో/ రమేశ్‌చంద్ర దత్తు, నౌరోజీ, డిగ్బీ, వాచా, గోఖలే, హిండ్మన్, మాలవ్యా, లజపతిరాయ్, లక్ష్మణరావుల పుస్తకాల ఆధారంగా రచించిన పుస్తకం. బ్రిటిష్ పాలనలో దేశం సంపద్వతంతం అయిందన్న వాదం దగాయేనంటుంది ఈ పుస్తకం), 'బ్రిటిష్ సామ్రాజ్య సభ హిందూ దేశపు ఆర్థిక స్వాతంత్ర్యము', 'హిందూ దేశము – రిజర్వు బ్యాంకు' (చా. వెం. హనుమంతరావు) వంటి పలు వ్యాసాలు భారతి ప్రత్యేకతను చాటుతాయి.

**చిత్రలేఖనం :** ఈ మాసపత్రికలో చిరకాలం కొనసాగిన శీర్షిక చిత్రలేఖనం. ఇది కూడా అపురూపమైన విషయమే. అలాగే శిల్పం, ఆలయ వాస్తుల గురించి కూడా లోతైన విశేషాలు అందించింది. ఉదా: మన చిత్రకళ (తలిశెట్టి రామారావు), ఆంధ్ర చిత్రకారులు (దామెర్ల రామారావు, చేమకూర భాష్యకార్లురావు, వరదా వెంకటరత్నం పరిచయం), మహాస్రష్ట రోరిచ్ (సంజీవదేవ్), అమెరికన్ చిత్ర రచన (పిఎల్ నరసింహమూర్తి). శిల్ప,వాస్తు శాస్త్రాలను చూస్తే: అజంతా గుహాలయములు (కొ. నరసింహాచారి), ప్రాచీన దేవాలయాలు-నిర్మాణ శైలి (బిఆర్ ప్రసాద్) వంటి వ్యాసాలు విశేష సంఖ్యలో కనిపిస్తాయి. గానకళకు ఇదే ప్రాధాన్యం కనిపిస్తుంది. ఉదాహరణకి: 'ముత్తుస్వామి దీక్షితులు' (సంధ్యావందనం శ్రీనివాసరావు), 'సంగీత కళానిధి డా. చిట్టిబాబు', 'వయొలిన్ విద్వాన్ పద్మశ్రీ లాల్‌గుడి జయరామన్' (పి.బి. శ్రీనివాస్), 'నారదుని సంగీత మకరందము' (యల్లాప్రగడ వెంకటనారాయణ శర్మ), 'సంగీత త్రిమూర్తులు' (వింజమూరి వరాహ నరసింహాచార్యులు) వ్యాసాలు.

**నాటకం :** నాటకాలను ప్రచురించడమే కాదు, నాటక సాహిత్య విశ్లేషణకు కూడా **భారతి** తగిన స్థానం కల్పించింది. ఆనాడు నాటకానికి ఉన్న ప్రాధాన్యాన్ని ఈ పత్రిక సరిగానే గుర్తించింది. రంగస్థలం పౌరాణికాలకు హారతి పడుతున్నా, సాంఘిక నాటకానికి కూడా 'భారతి' వెలుగు నిచ్చింది. ఉదా: హరిశ్చంద్ర (కాశీ సోమయాజుల సుందరరామమూర్తి), పాల్కురికి శివభక్తి (విశ్వనాథ), శ్రీనాథ కవిరాజీయము (శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి), నీలాల వంటి కళ్లు (పిలకా గణపతి), శబరి (చింతా దీక్షితులు), అనశ్వరం (మొక్కపాటి నరసింహశాస్త్రి), వచ్చేకాలం (రావిశాస్త్రి),ఆంధ్ర నాటక రంగస్థలముపై పాశ్చాత్యులయు, పార్శీలయు ప్రభావము (ఎస్. గంగప్ప), జానపద నాటక స్వరూపాలు (పులికంటి కృష్ణారెడ్డి), 'అతిథి' (ఆదివిష్ణు). ఇవన్నీ ఒకటైతే, ఒకే సంచికలో మూడు నాటకాలను ప్రచురించిన ఘనత కూడా 'భారతి'కి దక్కుతుంది. 103 పేజీల, మార్చి,1955 నాటి సంచికలో, 'విజేత' (ఎస్‌జికె ప్రతాపరావు రచన. అరిస్టాటిల్, అలెగ్జాండర్, పురుషోత్తముడు, సెల్యూకస్, సేవకుడు, రుక్సానా పాత్రలు), 'డబుల్ జీరో' (రచయిత కె.కేశవరావు. దీనికి విలియం సారోయాన్ రచన ఆధారం), 'చిన్నలు-పెద్దలు' (నాగభూషణ్ రాసిన ఈ ఏకాంకిక ఒకే గదిలో పాత విద్యార్థి, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు అనే మూడు పాత్రలతో సాగుతుంది) వీటిని వెలువరించారు.

**ఇతర ప్రత్యేకతలు :** ఇవేకాదు, బహుశా నాటి ఏ పత్రికలోను కనిపించిన కొన్ని శీర్షికలు **భారతి**లో దర్శనమిచ్చేవి. పేరు

పెట్టకపోయినా పర్యాటకం గురించి కొన్ని వ్యాసాలు ప్రచురించారు. కాకినాడ పురము, శ్రీశైల క్షేత్రము, న్యూయార్క్ పట్టణము (వడ్లకొండ నరసింహారావు) అందుకు సంబంధించిన వ్యాసాలే. 'జనాభా సమస్యలు' పేరుతో (అంగీరస్) 1966లో ఒక వ్యాసం ప్రచురించారు. 'అస్పృశ్యత' (గాదె నరసింహారావు) పేరుతో ప్రచురించిన వ్యాసం గాంధీజీ సిద్ధాంతం పట్ల, సామాజిక సంస్కరణల పట్ల **భారతి**కి ఉన్న గౌరవాన్ని సూచిస్తుంది. హిందూ ముస్లిం మతాల సిద్ధాంతాలను వివరిస్తూ కొన్ని వ్యాసాలు ప్రచురించడం కూడా **భారతి** ప్రత్యేకతే. ఉదా: 'ఇస్లాములోని ప్రార్థన' (చిలుకూరి నారాయణరావు), 'వైదిక వాఙ్మయము' (కనుపర్తి మార్కండేయ శర్మ), 'బౌద్ధమత సిద్ధాంతములు' (సునీతి శ్రమణుడు), 'సగుణ బ్రహ్మవిద్య' (వేలూరి శివరామశాస్త్రి).

రెండు మూడు తరాలకు చెందిన కవులు, విమర్శకులు, రచయితలు **భారతి**లో కనిపిస్తారు. కొత్తవారిని ప్రోత్సహించడంలోను **భారతి** పాత్ర మరువ లేనిది. భూషి కృష్ణదాను (సామాన్యుడు-కవిత) 'మానసపుత్రిక' కవిత రాసిన పొన్నపల్లి మైత్రీమాధుర్య, వంటి ఎన్నోపేర్లు అలా మెరిసి మయామవుతూ ఉంటాయి. అలాగే విమర్శకులలో కొత్త పేర్లు ఎన్నో గమనిస్తాం.

1938లో శ్రీపాద తన పత్రిక 'ప్రబుద్ధాంధ్ర'లో 'మన పంతులుగారు (నాగేశ్వరరావు)' పేరుతో రాసిన వ్యాసాన్ని ఏప్రిల్, 1980 **భారతి**లో పునర్ముద్రించారు. అందులో, **భారతి** ద్వారా కాశీనాథుని నాగేశ్వరరావు తెలుగు సాహిత్యానికి, సంస్కృతికి చేసిన సేవ అజరామరమైనది. రాజరాజనరేంద్రుని తరవాత-ప్రతాపరుద్రుని తరువాత-కృష్ణదేవరాయని తరవాత రఘునాథరాయని తరవాత, మన కవులకు మన పంతులుగారు తప్ప కథానాయకుడుగా స్వీకరించతగ్గవారు మరెవరున్నారూ? అంటారు శ్రీపాద. ఇంకా,' పంతులుగారి గొప్పతనం మనమేమి గుర్తించ గలిగాము? వారికి మనమేమి పూజ చెయ్యగలిగాము! వారిని మనమేవిధంగా సత్కరించగలిగాము? ఇవాళ ఇలాగ ఆంధ్రులంతా సిగ్గుపడుతున్నారు. ఇదే వారికి సత్కారం (సిగ్గు పడడం) అంటున్నాను నేను. ఏమంటే, పంతులుగారే మన జాతి కళ్లు తెరిచారు. అదివరకి, జాతి జాతంతా నల్లమందు మింగినట్టు మైకం కమ్మి వుండినది. ఇప్పుడు మనమా దశ దాటేశాము. తప్పు గుర్తించడము, సిగ్గు పడడము మనకిప్పుడు చేతనయింది. పంతులుగారి ఆత్మత్యాగం వల్లనే మనకీయోగ్యత కలిగిందని మనం గుర్తించగలిగాము.' అన్నారు శ్రీపాద. కానీ **భారతి** శత వసంతం నాటికి ఈ సిగ్గు మిగిలి ఉన్నదా? అనుమానమే. అలాంటి పత్రిక శత వసంత వేడుకను మనం గర్వపడేటట్టు చేయలేదన్నది నిజం. ఆ సందర్భం నిశ్చయంగా నేటి పరిస్థితులలో గుర్తు చేసుకోవసినదే మరి!

తెలుగు పత్రికలకు బలవంతపు ఫ్రీ లిస్టులు తప్పవు అన్నారు శ్రీపాద. **ఆంధ్ర దినపత్రిక** కాంప్లిమెంటరీ కాపీల సంఖ్య ఎనిమిది వందలని ఒకసారి శ్రీపాదవారికి కాశీనాథుని చెప్పారట. అలాగే నెలకు పాతిక ముప్పయ్ వేల రూపాయల నష్టంతో నాగేశ్వరరావు హయాంలోను **భారతి** నడిచిందన్న వాస్తవం శ్రీపాద చెప్పారు.

**భారతి** శతవసంతం సందర్భం అంటే ఒక ఆత్మ పరిశీలనకు అవకాశం. సృజన, విమర్శ, పరిశోధన విషయాలలో మనకాలం ఎంత ముందు ఉంది? అన్న ప్రశ్నకు ఈ సందర్భం దోహదం చేస్తుంది. ఇందుకు నిజాయితీతో కూడిన సమాధానం రాదన్నది చేదువాస్తవం. ఇంకొక ప్రశ్న ఇంతటి ప్రజాస్వామిక వేదికను మళ్లీ చూడగలమా? **భారతి** మనుగడ మీద వచ్చిన కొన్ని అభిప్రాయాలు, వెల్లడైన వాస్తవాలు గమనిస్తే, అరుదైనదే అయినా ఇలాంటి పత్రిక పట్ల తెలుగువారు చూపవలసినంత శ్రద్ధాసక్తులు, గౌరవం చూపలేదనే చెప్పవలసి వస్తుంది. భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, విప్లవ కవుల రచనలు, దిగంబర కవుల రచనలను సమంగా గౌరవించిన ప్రజాస్వామిక పోకడ-తరువాత వచ్చిన ఏ పత్రికలోను మనం చూడలేదు. అందుకే **భారతి**ది భారతీయ పత్రికారంగ చరిత్రలో నిరుపమానమైన స్థానం.

**డా. గోపరాజు నారాయణరావు**
సీనియర్ జర్నలిస్ట్, ఫోన్ : 98 49 32 5634

## ఐదు దశాబ్దాల ఏకాంతవాసి

# అన్నపూర్ణాదేవి

– శ్రీనివాస్



అన్నపూర్ణాదేవి

ఎమర్జెన్సీ టైంలో ఒకానొక రోజు, బొంబాయిలోని, బ్రీచ్ క్యాండి ఏరియాలో ఉండే **ఆకాశగంగ** అపార్ట్‌మెంట్ అలవాటు ప్రకారం, రోజులాగే ఎదురుగా ఉన్న అరేబియా సముద్రపు అలలకేసి చూస్తూ ఉంది. అందులో ఫ్లాట్‌లో ఉండే ఓ యాభై ఏళ్ళ మహిళ మాత్రం అక్కడే ఉన్న భారతదేశపు ఉక్కుమహిళగా పిలవబడే దేశప్రధాని ఇందిరాగాంధి వైపు దిక్కుతోచక చూస్తోంది.

ఎందుకంటే వచ్చినావిడ అత్యంత ప్రభావశీలమైన వ్యక్తి , తెచ్చిన ఆఫర్ దేశ అత్యున్నత ద్వితీయ పురస్కారం పద్మ విభూషణతో పాటు జాతీయ ప్రదర్శన కళల కేంద్రం కోసం ఆమె వాద్య సంగీతాన్ని రికార్డు చేయడం. కానీ, ఆ రెండు ప్రతిపాదనల్నీ, సున్నితంగా తిరస్కరించింది, పండిట్ రవిశంకర్ మొదటి భార్య అన్నపూర్ణాదేవి. ఆమె తిరస్కారాన్ని హుందాగా స్వీకరించిన ఇందిరాగాంధీ, ఆమెను "ఎమర్జెన్సీ గురించి మీ అభిప్రాయం ఏమిటి" అడిగింది, దానికావిడ "రాజకీయాల గురించి నాకంతగా తెలియదు గానీ మీరు చేసింది బాగాలేదు" అని చెప్పింది. ఎమర్జెన్సీ కాలంలో ఇందిరాగాంధీ ముఖాన్నే 'మీ నిర్ణయం సరి అయింది కాదు' అని చెప్పడం నిజంగా ఎంత పెద్ద సాహసం? అన్నపూర్ణాదేవి, హిందుస్థానీ సంగీత పితామహుడు అల్లావుద్దీన్ ఖాన్ మైహర్ సంస్థానంలో పనిచేసేటప్పుడు ఒక చైత్ర పూర్ణిమ రోజున జన్మించింది, మహారాజా బ్రిజనాథ సింగ్ ఆమెకు 'అన్నపూర్ణాదేవి' అని హిందూదేవత పేరు పెట్టారు. ముస్లిం సంప్రదాయ ప్రకారం 'రోషనార' అనే నామధేయం వున్నప్పటికీ, ఆమెను లక్ష్మీ పార్వతుల స్వరూపంగా భావించి అన్నపూర్ణ అనే పిలిచేవారు.

ఆ సాహసబుద్ధి, ముక్కుసూటితనం ఆమెకు జన్మతః వచ్చింది. ఐదు ఏళ్ల ప్రాయంలో మధ్య ప్రదేశ్‌లోని మైహర్ సంస్థానంలో తన సోదరుడు, ప్రపంచ ప్రసిద్ధ సరోద్ విద్వాంసుడు, అలీఅక్బర్ ఖాన్ సంగీతసాధనలో అపస్వరాలను, అలవోకగా సరిదిద్ది తన తండ్రి, మహా సంగీత విద్వాంసుడు అయిన అల్లావుద్దీన్ ఖాన్ దృష్టిని ఆకర్షించింది. ముప్పయి హిందుస్తానీ వాద్య పరికరాలు వాయించ గల నేర్పు, ఎందరో ప్రపంచ స్థాయి కళాకారులని తీర్చిదిద్దిన విద్వత్తు ఉన్న అల్లావుద్దీన్ ఖాన్ తన చిన్న కూతురు అన్నపూర్ణకు తమ కుటుంబ వారసత్వకళ అయిన హిందూస్థాని సంగీతం నేర్పకుండా ఏదో ఒక అయ్యకు ఇచ్చి పెళ్లి చేసి పంపాలి అని నిర్ణయించుకుని ఉన్నాడు. కారణం ఆమె అక్క జహానార సంగీత ప్రావీణ్యం, అత్తారింట ఎత్తిపొడుపులకు, అర్ధరహితమైన అసూయా ద్వేషాలకు కారణభూతమై, చివరికి ఆమె జీవితాన్నే అంతం చేసుకునే విపత్కర పరిస్థితిని తెచ్చిపెట్టింది.

జహానారా ఉదంతంతో రోషనారని మామూలు గృహిణిగా చేయాలని అల్లావుద్దీన్ ఖాన్ నిర్ణయిస్తే విధి ఆమెను హిందూస్థాని సంగీత జగత్తులో ఆమెకు సాటిరాగల వాయిద్య కళాకారిణి మరొకరు లేరు అనేంత స్వరజ్ఞానాన్ని వరంగా ఇచ్చింది. దానికి మూలం తాన్‌సేన్, వజీర్ ఖాన్, మైహర్ సేనియా ఘరానా నుండి సంక్రమించిన ఆమె రక్తంలో ప్రవహించే హిందూస్థాని సంగీత వారసత్వం.

ఆమె అసాధారణ సంగీత ప్రతిభను గుర్తించిన అల్లావుద్దీన్ ఖాన్, కుమారుడు అలీ అక్బర్ ఖాన్‌కు సరోద్, శిష్యుడు పండిట్ రవిశంకర్‌కు సితార్ నేర్పించి అన్నపూర్ణాదేవికి అత్యంత కఠినమైన సుర్బహార్ (బేస్ గిటార్) వాద్యం సాధన చేయమని పురమాయించాడు. ఆమె సాధన రోజుకు 12 నుండి 16 గంటలు కొనసాగేది.

ఆ వాద్యం, ప్రశంస కంటే రససిద్ధి కలుగజేస్తుంది గావున ఎప్పుడూ దాని పలుకుల పర్యవసానం గురించి విచారం ఉండకూడదని సాధన దశలోనే ఆమెకు బోధించాడు అల్లావుద్దీన్ ఖాన్.

ప్రముఖ నాట్య కళాకారుడి ఉదయశంకర్ సోదరుడైన రవిశంకర్ మైహర్ ఘరానాలో సితార్ నేర్చుకునేవాడు, అతని తల్లి హేమాంగనీదేవి, సోదరుడు ఉదయశంకర్‌లు స్వరమూ స్వరమూ కలయికతో ఒక రాగం పుడుతుందని భావించి అన్నపూర్ణ, రవిశంకర్‌ల వివాహ ప్రతిపాదన చేశారు. తీగల మీద ప్రవహించే రాగం, తాళి అనే బంధంతో అనురాగ తాళంగా పరిణమిస్తుందని అల్లావుద్దీన్ ఖాన్ రవిశంకర్, అన్నపూర్ణల వివాహం 1941 మే 15న ఆర్యసమాజ్ పద్ధతిలో చేశారు.

తన పద్నాలుగేళ్ల తనయను కన్యాదానం చేస్తూ అల్లావుద్దీన్ ఖాన్ "అల్లారుముద్దుగా పెంచుకున్న నా కూతుర్ని మాత్రమే నీకు ఇవ్వడం లేదు, నా జీవిత సర్వస్వం అయిన మైహార్ సంగీత స్వరూపాన్ని నీ వెంట పంపుతున్నాను. ఎప్పటికీ ఆమెను ఖరాజ్కి తార్, తరబ్ తీగల నుండి వేరు చేయకు, ఆమెకు సంగీతమే ప్రాణం" అని చెప్పారు. కానీ విధి వేరుగా ప్రవర్తించింది. పెళ్లి అయ్యాక రవిశంకర్, అన్నపూర్ణలు జుగల్బందీ శ్రోతలను మంత్రముగ్ధులను చేసేది. కచేరీలలో అన్నపూర్ణ దేవి సుర్బహార్ ముందు రవిశంకర్ సితార్ వెల వెల బోయేది, ప్రేక్షకులు ఆయన్ను విస్మరించి ఆమెకు నీరాజనాలు పట్టేవారు. రవి శంకర్ ఎంతటి మహా కళాకారుడు అయినా మగవాడే కదా! అతనిలో పురుషాధిక్యత, కీర్తి కాంక్ష వేల పడగలతో బుసలు కొట్టాయి. ఆమె తన పక్కన కచేరి చేస్తే తను మసి బారిన దీపం అవడం ఖాయం అని ఆమెకు దూరంగా జరగడం ప్రారంభించాడు. 1942లో వారికి శుభేంద్ర శంకర్ పుట్టాడు. అయినా రవిశంకర్ భార్య, కొడుకు పట్ల మొగ్గు చూపలేదు. తనకు నచ్చిన దారిలోనే సాగిపోయాడు. వారిద్దరి మధ్య మొదలైన దూరం ఆమె ఎంత ఓర్పుగా ప్రవర్తించినా, సంగీత కచేరీలకు స్వస్తి చెప్పినా తరగలేదు, సరికదా మరింత విస్తృతమయ్యింది. వారిద్దరూ కలిసి చేసిన ఐదు జుగల్ బందీ కచేరీలలో ఒకటి 1952లో ఢిల్లీ Constitution Club లో జరిగింది. అందులో అన్నపూర్ణాదేవి సుర్బహార్, రవిశంకర్ సితార్ మీద యమునా కళ్యాణి రాగం వాయించాక ప్రేక్షకులు ఆమె ఆలాపనలో శుద్ధ శాస్త్రీయ సంగీత ధ్వని, అమృతతుల్యమైన మాధుర్యం ఉట్టిపడుతోందని ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు. కచేరి ముగిసి ఇంటికొచ్చాక, భోజన సమయంలో చపాతీ ముక్కలు చేస్తూ, రవిశంకర్ "మన జుగల్ బందీ కచేరిలో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి" అన్నాడు. "ఎలాంటి సమస్యలు?" అని అడిగింది, అతని మనసులో ఏముందో అప్పటికే ఒక అంచనాకు వచ్చిన ఆమె."మారుతున్న కాలానికి అనుగుణంగా మనమూ మారాలి. మన సంగీతంలో మార్పురావాలి."



శుభేంద్ర శంకర్

"మీరు చెప్పే మార్పులు నేను అమలుచేయలేను. ఆఖరి శ్వాస వరకు బాబా నేర్పించిన సంగీతాన్నే సాధన చేస్తాను, ప్రజెంట్ చేస్తాను" "కావాలనే పాటించవు, అది మన పెళ్లి అయిన మొదటి రోజు నుండే గమనిస్తున్నాను. ససేమిరా మారడానికి ప్రయత్నం చెయ్యవు" ఏదైనా ఫంక్షన్లకు వెళ్ళినప్పుడు, చీరలు, నగలు పక్కన పడేసి సాదా సీదాగా వస్తావు." "ఈ మాటలు ఎప్పుడు అనేవేగా ! నువు చెప్పినట్టే నేను ధగధగలాడే చీరలు కట్టుకుని, మెరిసిపోయే నగలు వేసుకుని వస్తాను, నువు కూడా నాకు నచ్చినట్టు మారగలవా? నా పట్ల అంకిత భావంతో నాకు మాత్రమే కట్టుబడి ఉండగలవా?"

"ఈ చర్చ మన మధ్య ఎప్పుడూ వచ్చేదే కదా!"

"మీరు ఎప్పుడయినా నామాటకు విలువ ఇచ్చారా? నన్ను ఎన్నటికీ మారని జగమొండి అనే ముందు ఒక్కసారి ఆత్మావలోకనం చేసుకోండి. నేను ఇప్పటికే ఎన్నో విషయాల్లో, సందర్భాల్లో రాజీ పడ్డాను. కానీ నా మీద మీ నిందారోపణలు తగ్గలేదు." ఆమె స్వరంలోని కాఠిన్యాన్ని, మాటల్లో సూటిదనాన్ని గ్రహించిన రవిశంకర్ "నువ్వెప్పుడూ హేతుబద్ధంగా ఆలోచించలేవు, పాఠశాల టీచర్లాగా, ఆజన్మ అవివాహితలాగా జీవితంలో ఏ అనుభూతిని దరిచేర నీయకుండా, ఇనుపకచ్చడాల మధ్య ఇరుకు జాగానే విశాల



కమల రవిశంకర్

విశ్వం అనుకుంటూ వుంటావు." అన్నాడు. అలా వారి మధ్య రాజుకున్న అగ్ని సున్నితమైన భార్యా భర్తల బంధాన్ని దహించి వేసింది. ప్రొఫెషనల్ జెలసితో పాటు ఉదయ శంకర్ మరదలు కమల, రవిశంకర్‌ల బహిరంగ ప్రేమ కలాపం మరింత వైమనస్య భావాన్ని రాజేసింది. అన్నపూర్ణాదేవికి తన తండ్రి సంగీతంతో పాటు, నిబద్ధతను, క్రమశిక్షణను కూడా నేర్పించాడు. రవిశంకర్ డైరెక్ట్‌గా తన ప్రియురాలిని ఇంటికి తీసుకువచ్చినా, మరో స్త్రీతో తన భర్త బంధం కారణంగా తమ వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేసుకోకుండా మౌనంగా భరించే సహనాన్ని కూడా అలవరచుకుంది.

1962లో రవిశంకర్ కమలతో అమెరికా వెళ్ళిపోవడంతో అన్నపూర్ణాదేవి పూర్తిగా అజ్ఞాత జీవితంలోకి వెళ్ళిపోయారు. ఇంటర్వ్యూలు, కచేరీలు, రికార్డింగులు, జుగల్బందీలు అన్నిటికీ స్వస్తి చెప్పి, ఇంటికే పరిమితం అయ్యింది.

రవిశంకర్‌కి అంతర్జాతీయ కీర్తి, సిరి సంపదలు వచ్చి చేరాయి, తాంబుర వాయించే కమలతో సంగీతంతో పాటు జీవితానికి కూడా శృతి కుదిరింది. అన్నపూర్ణాదేవికి మాత్రం ఆర్థిక ఇబ్బందులు, ఒంటరి బ్రతుకు తాలూకు అభద్రతాభావం వేధించసాగాయి. శుభేంద్రకు సితార్ నేర్పించింది. 1962 నుండి విడివిడిగా వుంటున్న వారు, 1982లో అధికారికంగా విడాకులు తీసుకున్నారు. రవిశంకర్ సంప్రదాయ సిద్ధమైన వివాహబంధం నుండి వైదొలిగినా, ఎక్కడా స్థిరమైన సాహచర్యం పొందలేక పోయారు. 1981 నుండి స్యూ జోన్స్ (నోరా జోన్స్ తల్లి), 1986 నుండి సుకన్య రాజన్ (అనుష్క శంకర్ తల్లి)..అలా ఆయన మరణించేవరకు సహచరి అన్వేషణ ప్రయోగం కొనసాగుతూనే ఉంది. మరో వైపు అన్నపూర్ణాదేవి మాత్రం వివాహ బంధం నిలబెట్టుకోవడానికి ప్రాణప్రదమైన సంగీతాన్నే తృణప్రాయంగా వదిలివేసి, ఐదు దశాబ్దాలు ఇంటికే పరిమితం అయ్యింది.



స్యూ జోన్స్ (నోరా జోన్స్ తల్లి)

కొన్ని కథనాల ప్రకారం రవిశంకర్, అన్నపూర్ణాదేవి జీవితాల ప్రేరణగా తీసుకుని హృషికేశ్ ముఖర్జీ తీసిన "అభిమాన్" హిందీ సినిమా నిర్మాణానికి ముందు దర్శకుడు ఆమెను కలిసినప్పుడు "నిజ జీవితంలో మా బంధం ముక్కలైనా, సినిమాలో చివరికి జంట కలిసిపోయినట్టు హ్యాపీ ఎండింగ్ ఇవ్వండి, సంగీతం నేర్చుకునే మహిళలకు అది కొండంత మనో ధైర్యాన్ని ఇస్తుంది " అని చెప్పారుట.

1966 నాటికే ప్రముఖ వేణువిద్వాంసుడు హరి ప్రసాద్ చౌరాసియా, అన్నపూర్ణాదేవి వద్ద సంగీతం నేర్చుకోవాలని తలంపుతో ఆమె తలుపు తట్టాడు. అప్పటికే అతను ఆకాశవాణిలో వేణుగాన విద్వాంసుడిగా స్థిరపడి, బాలీవుడ్ సినిమా రంగంలోకి అప్పుడప్పుడే ప్రవేశిస్తున్నాడు. ఆమె ఫ్లాటు ముందు ఒక బోర్డు ఉంటుంది." మూడు సార్లు కాలింగ్ బెల్లు నొక్కండి, బదులు రాకపోతే మీ సమాచారాన్ని ఆ పక్కనున్న ఉత్తరాల డబ్బాలో వేసి వెళ్ళండి" అని. ఆమె అనుమతి దొరకలేదని హరిప్రసాద్ వెనుదిరిగి పోలేదు. నెలకు రెండు మూడు సార్ల చొప్పున మూడు సంవత్సరాలు తన ప్రయత్నం కొనసాగించాడు. ఆఖరికి 1969లో ఆమె ఒక కండీషన్‌తో సంగీతం నేర్పడానికి అంగీకారం తెలిపింది. హరిప్రసాద్ అప్పటికే వేణుగానంలో రాణించి, పేరు ప్రఖ్యాతులు గణించిన కళాకారుడు. ఆయనకు బేసిక్స్ నుండి సంగీతం నేర్పించాలి అంటే గత కాలపు అలవాట్లు, పొరపాట్లు ఆయన అభ్యాసంలో కనిపించకూడదు. అందుకామె హరిప్రసాద్‌ను కుడిచేతితో కాకుండా ఎడమ చేతితో మురళి వాయించాలి అనే నిబంధన విధించింది. అతనికి వేణువు కాకుండా గాత్రంలో హిందూస్తానీ సంగీత పాఠాలు చెప్పింది. హరిప్రసాద్ పూర్తిగా తన శైలిని, ఆలాపననీ మార్చుకుని ఆమె

శిష్యరికంలో ప్రపంచస్థాయి వేణు విద్వాంసుడుగా రూపొందాడు. వారిద్దరి గురు శిష్య బంధం దాదాపు ఐదు దశాబ్దాలు కొనసాగింది . అతను అంతర్జాతీయస్థాయి కచేరీలు చేసే ఉన్నతస్థితిలో కూడా ఆకాశగంగ అపార్ట్‌మెంట్‌కు వచ్చి అమెముందు కూర్చుని మురళి వాయించి మెళుకువలు నేర్చుకునే వాడు.

*She was not a teacher or preceptor to me. She was like my mother.. I Constantly received guidance from her from the beginning till the very end - Hariprasad Chourasia (2018).*

ఆమె తన శిష్యులతో తరచూ ఇలా చెప్పేది:

"మీ వాద్యం ద్వారా మీ కళ్లలో నీళ్లు రాకపోతే, మీరు నిజమైన సంగీతాన్ని సృజించడం లేదన్న మాట."

ఆమె ఎంత కఠినమైన గురువైనా, తన శిష్యులను తల్లిలా ఆదరించి, వారికి స్వయంగా వండి పెట్టేది. బాబా అల్లవుద్దీన్ ఖాన్ ద్వారా తను సంపాదించిన సంగీత సారాన్ని ఒక్క రూపాయి కూడా ఆశించకుండా వారికి ధారపోసేది. ఆమె శిష్యగణంలో భారతీయ సంగీత వైభవాన్ని ప్రపంచం నలుమూలల విస్తరింప జేసిన ప్రసిద్ధులు ఎందరో ఉన్నారు.

వేణుగాన విద్వాంసుడు హరిప్రసాద్ చౌరాసియా, సితార్ విద్వాంసుడు నిఖిల్ బెనర్జీ, బహదూర్ ఖాన్ (సరోద్) ఆశిష్ ఖాన్ –ఆమె సోదరుడు అలీ అక్బర్ ఖాన్ కుమారుడు (సరోద్) అమిత్ భట్టాచార్య (సరోద్), నిత్యానంద హల్దీపూర్ (బాసురి), సురేష్ వ్యాస్ (సరోద్), ప్రదీప్ బరోట్ (సరోద్).

1970లో 20 శతాబ్దపు అత్యంత గొప్ప అమెరికన్ వయోలిన్ కళాకారుడు యోహుది మెనుహిన్, లెజెండరీ రాక్ బాండ్ "బీటిల్స్" సభ్యుడు జార్జ్ హారిసన్ ఒక మ్యూజిక్ రికార్డు విడుదల కోసం ఇండియాకి వచ్చారు. యోహుది



తండ్రితో అనుష్క, నోరా జోన్స్

మెనుహిన్ అప్పటికే పండిట్ రవిశంకర్‌తో **వెస్ట్ మీట్ ఈస్ట్** అనే మ్యూజిక్ ఆల్బమ్‌ను సృష్టించి గ్రామీ అవార్డ్ సాధించి ఉన్నాడు. జార్జ్ హారిసన్‌కు సితార్ అంటే ఎనలేని మక్కువ. వీరిద్దరికీ పండిట్ రవిశంకర్ సితార్ కంటే అన్నపూర్ణాదేవి సుర్బహార్ గొప్పగా వుంటుంది అన్న విషయం ప్రత్యక్షంగా వీక్షించాలనిపించింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీని అన్నపూర్ణాదేవి కచేరి ఏర్పాటు చేయించమని కోరారు. ఆమె ఆ ప్రపంచ స్థాయి కళాకారుల కోసం ఒక ప్రత్యేక కచేరి చేయమని అన్నపూర్ణాదేవిని అడిగారు. అప్పటికే తాను ఏ వ్యక్తుల ముందు కానీ, సమూహాల ముందు కానీ సంగీత కచేరి చేయకూడదు అన్న నిర్ణయం తీసుకుని ఉన్నారు అన్నపూర్ణాదేవి. అడిగింది దేశ ప్రధాని, వచ్చింది హిమాలయ సమున్నతులైన పాశ్చాత్య సంగీత స్రష్టలు, అయినా స్వయం నిర్ణయం ప్రకారం కచేరీకి నిరాకరించింది. మధ్యే మార్గంగా తను రియాజ్ (సాధన) చేసే సమయంలో వారిరువురినీ వచ్చి వినమని కొద్దిపాటి సడలింపు ఇచ్చారు.

యోహుది మెనుహిన్ అనుకోకుండా పిలుపు రావడంతో అమెరికా వెళ్ళిపోయారు. జార్జ్ హారిసన్ ఒక్కడే వేకువజామున 2.30 నుండి 4.30 మధ్య ఆమె సాధన చేసే సమయంలో ఇంటి బయట నుండి ఆమె అద్భుత సుర్బహార్ సంగీత సమ్మోహన నాదాన్ని వినగలిగారు.

"ప్రపంచ దేశాల్లో ఏ మ్యూజిక్ కూడా ఆమె సంగీతానికి సాటి రాదు, ఏ దేవతలో కచేరి చేసినట్టు ఆత్మను తాకింది" అన్నారు ఆ రవిశంకర్ వీరాభిమాని. ఆమె సంగీత పాటవం గురించి ఆమె సోదరుడు, ప్రపంచ ప్రసిద్ధ సరోద్ విద్వాంసుడు అక్బర్ అలీ ఖాన్ ఒకసారి "నన్ను, పన్నాలాల్ ఘోష్‌ను, రవి శంకర్‌ను ఒక వైపు, అన్నపూర్ణా దేవిని ఒక వైపు వుంచి తూస్తే, ఆమె వైపే మొగ్గు వుంటుంది' అని చెప్పారు.

హిందూస్థాని సంగీత పిపాసి ఆయన రుషి కుమార్ పాండ్య అనే అమెరికాకు చెందిన సైకాలజీ ప్రొఫెసర్ సితార్ నేర్చుకోవడానికి అన్నపూర్ణాదేవి దగ్గరకు వచ్చి, వివాహానికి ప్రపోజ్ చేసినప్పుడు, ఆమె మొదట తిరస్కరించింది. మొదటి వివాహ బంధం మిగిల్చిన చేదు అనుభవం ఆమెనుండి జీవితాంతం వదిలిపోలేదు. కానీ రుషి కుమార్ ఆమె సంగీతానికి ఆరాధకుడు, అనురక్తుడు, ప్రియభక్తుడు.. స్వరాల ద్వారా కలిసిన చెలిమి పూర్వాపరాలను మరచేలా చేసింది – 55 ఏళ్ళ వయసులో 42 ఏళ్ళ రుషి కుమార్‌ను



రవిశంకర్ – సుకన్య

పునర్వివాహం చేసుకుంది. మొదటి వివాహంలోని, అంతర్మథనం, అనుమానం, అనిశ్చితత, అవమానం, గందరగోళం పునరుక్తం కాకుండా, ప్రశాంతంగా, రాగం తానంల రసైక్యంలా సాగింది వారి వివాహబంధం, 2012లో రుషి కుమార్ మరణించేంతవరకు.

చలం ''జీవితాదర్శం''లో ఒకచోట లాలన దేశికాచారి నుద్దేశించి : "ఆయనకు నాకూ మధ్య లోకం అనుకునే ప్రేమ లేదు, ఒకరి నొకరు వదిలి ఉండలేమనే ఆరాటం లేదు, ఒకరిపై ఒకరికి హక్కులు లేవు. అసలు ఏ ఉద్రేకమూ లేదు. కానీ మా మధ్య ఒక అమూల్యమైన ఐక్యం ఉంది." అంటుంది. అలా వారిద్దరి అనుబంధం దేహబంధానికి అతీతమైన రాగబంధంగా నిలిచింది.

రవిశంకర్ తన జీవిత చరిత్ర "రాగమాల"లో 'అన్నపూర్ణాదేవితో తన వివాహబంధం, ఆమె కఠినమైన క్రమశిక్షణ, చీటికి మాటికి అలగడం, కోపంపై అదుపు లేకపోవడం, ప్రపంచరీతుల కనుగుణంగా తన శైలిని మార్చుకోలేకపోవడం, పెద్దలు కుదిర్చిన పెళ్లిలో ఎలాంటి ప్రేమ–ఆకర్షణ లేకపోవడం, వంటి కారణాల వలన విచ్ఛిన్నం అయ్యింది' అని రాసారు.



జార్జ్ హారిసన్

ఎవరితో ఏ సంగతీ పంచుకోకుండా ప్రవాస జీవితం గడిపే అన్నపూర్ణాదేవి ఈ నేరేటివ్ పూర్తిగా వాస్తవ విరుద్ధం అని, అసలు నిజం లోకానికి చెప్పాలి అనే ఆమె శిష్యుల కోరిక మేరకు 2000లో Man's World అనే పత్రిక కోసం ఆలీఫ్ సుర్తి అనే జర్నలిస్ట్‌కి ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. అది కూడా అతను హాల్లో కూర్చొని ప్రశ్నలని కాగితం మీద రాసి ఇస్తే వంట గదిలో కూర్చుని వాటికి స్వహస్తాలతోజవాబులు రాసి పంపారు. ముఖా ముఖి చూడకుండా కేవలం అక్షర మార్పిడితో ఆ అరుదైన ఇంటర్వ్యూ సాగింది. 'కచేరీలలో ప్రేక్షకులు రవిశంకర్ కంటే ఎక్కువగా తనను ప్రశంసించడం అతను తట్టుకోలేకపోయాడు. తద్వారా అన్యాయం, ఆత్మన్యూనత పెరిగి తమ అనుబంధాన్ని అహం మింగేసింది' అని ఆమె చెప్పారు. శుభేంద్రశంకర్ సంగీత శిక్షణ పూర్తికాకుండానే అతన్ని అమెరికా తీసుకువెళ్లి అంతర్జాతీయ వేదికలపై, Fathers and Sons, తన మన' వంటి కాన్సర్ట్‌లు చేయించి అతని కెరియర్‌ను నాశనం చేశారని చెప్పారు. శుభేంద్ర శంకర్ తండ్రిని మించిన తనయుడిగా సితార్ పలికించడమే రవిశంకర్‌లో సొంత కొడుకు నైపుణ్యాన్ని సైతం అంగీకరించలేని అమానుష ఆలోచనా విధానాన్ని కల్పించింది అని కూడా చెప్పారు.



రుషి కుమార్ పాండ్య

ఒక్కగానొక్క కుమారుడు శుభేంద్ర 1992లో, రవిశంకర్ 2012లో, రుషి కుమార్ పాండ్య 2012లో ఆమెను వదిలి వెళ్ళిపోయారు. కీర్తి ప్రతిష్టల వ్యామోహానికి లొంగక, తను ఎంతగానో ప్రేమించే సంగీతాన్ని శిష్యుల ప్రదర్శనలలో చూసుకుంటూ, స్వయం ప్రతిపాదిత ఏకాంతపు చెరసాలలో బందీగా దశాబ్దాలు జీవించి, 2018 అక్టోబర్ 13న, అసూయ ద్వేషాలు లేని మరో లోకంలో సంగీత కచేరి కోసం తరలిపోయారు. ఆమె భౌతికంగా లేకపోయినా హిందుస్తానీ సంగీతచరిత్రలో ఆమె విశిష్ట స్థానం, ఎలాంటి క్లిష్ట పరిస్థితిలోనూ సదలిపోని క్రమశిక్షణ, నిరంతర సంగీతసాధన ఆమె శిష్యుల వేణుగానంలోనో, సరోద్ నాదంలోనో, సితార్ స్వరాలలోనో చిరంతనంగా వినిపిస్తూనే వుంటుంది.

**పి. శ్రీనివాస్**
హైదరాబాద్, ఫోన్ : 9908162430

సంగీత సాహిత్యాలే... మానవత్వాన్ని కాపాడతాయి

# జి. ఆర్. కృష్ణ

“**ఆ**యన వయసు ఎనభై పైమాటే ..కానీ ఆయనో గ్లోబ్ ట్రాటర్. ఈరోజుకీ కార్పొరేట్ సి.ఇ.ఓ.లకు శిక్షణా తరగతులు తీసుకుంటారు. సంగీత, సాహిత్యాలొక్కటే మనిషిని పునీతం చేస్తూ అతనిలోని మానవత్వాన్ని కాపాడుతాయని బలంగా విశ్వసిస్తారు. ఆయనే ప్రొఫెసర్ **జి. ఆర్. కృష్ణ.** విద్యార్థి దశనుంచే అన్యాయాన్ని ఎదిరించే స్వభావం వారి జీవలక్షణం. తెలుగు రాష్ట్రాలకు దూరంగా ఉన్నా, తెలుగు సంస్కృతీ సాహిత్యాలకు దూరం కాలేదు.

కృష్ణ గారు గుంటూరు దగ్గర కోర్నెపాడు గ్రామంలో సాధారణ రైతు కుటుంబంనుంచి వచ్చినవారు. ఏటుకూరులో స్కూల్ విద్య, గుంటూరు హిందూ హైస్కూల్‌లో, హిందూ కాలేజ్‌లో తరువాత ఆంధ్రాయూనివర్శిటీలో వారి విద్యావ్యాసంగం నడిచింది. ఆంధ్రాయూనివర్శిటీలో ఎమ్.ఏ సోషియాలజీ చేసి, మైసూర్ యూనివర్శిటీలో సోషల్ సైన్సెస్‌లో డాక్టరేట్ తీసుకున్నారు. ఆ తరువాత నాలుగు పి. హెచ్‌డీలు చేసారు. యూరప్‌లో బ్రెసెల్స్ నుంచి డాక్టరేట్, యు.ఎస్. నుంచి డి.లిట్ పొందారు. వారు కర్నాటక మంగుళూరులో స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్ & సోషల్ సైన్సెస్‌లో చాలాకాలం పనిచేశారు. మంగుళూరులోనే ఏ.జె. ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అనే విద్యాసంస్థకి స్థాపక నిర్దేశకుడిగాను, ప్రొఫెసర్ ఆఫ్ ఎమిరటస్‌గా పనిచేశారు. ఆ సంస్థ ఎమ్.బి.ఎ, పి. హెచ్‌డీలకు విద్యానిర్దేశం చేస్తుంది. వరల్డ్ బ్యాంక్‌కి, యూరోపియన్ ఎకనమిక్ కమ్యూనిటీకి సలహాదారుడిగా పరిశోధనావ్యాసంగం నిర్వహించారు. అలాగే ఆర్థికశాస్త్రంలో, సామాజికశాస్త్రంలో, మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో పుస్తకాలు వ్రాసి అంతర్జాతీయ బహుమతులు పొందారు.



జి.ఆర్. కృష్ణ, మైథిలి

ప్రొ. జి. ఆర్. కృష్ణ.. ఆధ్యాత్మిక గురువు జిడ్డు కృష్ణమూర్తికి అతి సన్నిహితులు.

మంగుళూరులో స్థిర నివాసమేర్పరుచుకున్నా, వారు అంతర్జాతీయంగా ఎంతో సుప్రసిద్ధులు. గతనెలలో **మిసిమి** పాఠకులకు వారిపై “ఒకే ఒక్కడు” అనే ఒక ప్రత్యేక వ్యాసాన్నందించాం. ఇంటర్వ్యూ నిమిత్తమై వారితో మాట్లాడుతుంటే ఒక కర్మయోగితో సంభాషించినట్లనిపించింది. ఎన్ని కబుర్లు, ఎన్ని జ్ఞాపకాలు అన్నీ కలబోసుకుని కాలాన్ని స్థంభింపచేశాయి. వారితో వారి శ్రీమతి డా. మైథిలి కూడా విచ్చేశారు. ఆయనతో జరిపిన సంభాషణలోని భాగాలు **మిసిమి** పాఠకులకు అందిస్తున్నాం. ఆయన మనతో పంచుకున్న అనేక అంశాలు ఒక కాలాన్ని పరిచయం చేయటమే కాదు, వర్తమానాన్ని వెలికితీసి శుభ్రపరుస్తాయి. ఈ సంభాషణ భాగాలు తప్పకుండా మిమ్మల్ని కూడా ఆలోచింపచేస్తాయన్న నమ్మకం మాకుంది. ఇక వారి అంతరంగ వీక్షణం చేద్దాం రండి..”

**- సం.**

**మిసిమి : కృష్ణగారూ చాలా సంతోషంగా ఉంది. మూడు దశాబ్దాల తర్వాత కలుస్తున్నాం. నా జ్ఞాపకం మీ గుండెల్లో ఇప్పటివరకూ పదిలంగా ఉండటం నా అదృష్టం. మీరు మాత్రం తెలుగు ప్రపంచానికి దూరంగా ఉన్నారు. అందువల్ల తెలుగు రాష్ట్రాలలో మీగురించి తెలిసినవారు తక్కువే అనుకుంటున్నాను. మీకు సాహిత్యంలో, సంగీతంలో ప్రవేశముంది. సంగీత సాధన చేశారు. మీరు తెలుగు వారికి తెలియకుండా ఎలా ఉండిపోయారు? ఆశ్చర్యంగా ఉంది.. మిగిలిన రంగాలు వేరు. సాహిత్యంలోను, సంగీతంలోను ప్రవేశం ఉండి తెలుగు ప్రజలకు దూరంగా ఉండటం వేరని నేననుకుంటాను. మీకు మంగుళూరు అంతగా అలవాటయిపోయిందా? ఇక్కడి వారితో రాకపోకలు అరుదైపోయాయా?**

**కృష్ణ :** మీరన్నట్టు సంగీత సాహిత్యాలలో ప్రవేశమున్న మాట వాస్తవమే. అంతకన్నా ఎక్కువగా తెలుగుభాష అంటే అమితమైన ప్రీతి నాకు. దూరంగా ఎందుకుండిపోయారు అన్నారు. కొన్ని కారణాల వలన తెలుగు ప్రజలకు దూరంగా ఉండిపోవలసి వచ్చింది. పుట్టిన ఊరుకు, తెలుగు భాషకు, సంస్కృతికి దూరంగా ఉండిపోవటం వలన కలిగే ఈ పరాయీకరణ, పరాధీకరణ అనుభవించాను నేను. నా అదృష్టం కొద్దీ జీవితం నాకు ఎన్నో అవకాశాలిచ్చింది. ఎంతోమందిని మిత్రులను నాకు పరిచయం చేసింది. దూరంగా ఉన్నప్పటికీ నా పరిధిలో తెలుగు వాతావరణాన్ని, సంస్కృతిని నేను నిర్మించగలిగాను.

**మిసిమి : నేనడిగింది అదికాదు. మీరు తెలుగు ప్రజలకు ఎంతవరకు తెలుసు. "ఒకే ఒక్కడు" శీర్షికతో సెప్టెంబర్ సంచికలో వేసిన వ్యాసం ఉద్దేశ్యం కూడా మీగురించి అందరికీ తెలియచెప్పటం కోసమే.**

**కృష్ణ :** తెలుగు పరిసరాల్లో ఉండకపోయినా ఎక్కడుంటే అక్కడ తెలుగు వాతావరణం నిర్మించుకోవచ్చు అనేది నా ఉద్దేశ్యం. నేను తెలుగు ప్రజలకు దూరంగా ఉండటం వలన తెలియకుండా పోయానని మీరంటున్నారు. నిజానికి ప్రచారానికి దూరంగా ఉండటమే నాకిష్టం, నేను కోరుకునేది కూడా అదే. విజయవాడ, విశాఖపట్నం, వరంగల్, హైదరాబాద్ నగరాల్లో జరిగే సాహిత్యసభలకు నేనంటే తెలిసిన మిత్రులు, కావలసిన మిత్రులు పిలుస్తుంటారు. వాటికి వస్తుంటాను. గత సంవత్సరం విజయవాడలో జరిగిన తెలుగు మహాసభలకు హాజరయ్యే అవకాశం కలిగింది. అలా కొంతమంది మిత్రులతో టచ్‌లో ఉన్నాను. రెగ్యులర్‌గా తెలుగు పత్రికలు తెప్పించుకుంటాను. రేడియోలో తెలుగు వార్తలు వింటాను. ఇంట్లో తెలుగే మాట్లాడుకుంటాము.



**మిసిమి : మీరు ఆంధ్రా యూనివర్సిటీలో చదువుకున్నారు కదా. మీరు చేసిన మంచిపనులు, కొంటెపనులు అన్నీ చదివాను. మొదటి సంవత్సరంలోనే హాస్టల్ సెక్రటరీగా పోటీ చేశారు. అప్పుడు డి.ఎల్.నారాయణగారు వి.సిగా ఉన్నారు. గోపాలస్వామి రిజిస్ట్రార్‌గా ఉన్నారు. వైస్ ఛాన్సలర్ సమక్షంలో మీరొక స్పీచ్ ఇచ్చారు. మీకెందుకు ఓటు వేయాలో చెప్పారు. ఆ స్పీచ్‌లో స్పష్టంగా మీకెందుకు ఓటెయ్యాలో చెప్పారు.. ఆ స్పీచ్ మీకింకా గుర్తుందా? ఆరోజున ఏం చెప్పారు మీరు?**

**కృష్ణ :** ఆ స్పీచ్ నేను మర్చిపోలేదు నేను. ఆ నాటి నా ప్రసంగం ఇంకా నా కళ్ళముందు కదలాడుతుంది. ఆ రోజుల్లో ఆంధ్రా యూనివర్సిటీలో ఓ సంప్రదాయముండేది. మగపిల్లలు రాత్రి తొమ్మిది గంటలవరకు బయట తిరిగి హాస్టల్‌కు రావొచ్చు. అదే ఆడపిల్లలు మాత్రం ఆరుగంటలకల్లా తిరిగొచ్చేయాలి. నేను ఆరోజున చేసిన ప్రసంగంలో ఈ సంప్రదాయాన్ని ఖండిస్తూ ఆడపిల్లలు, మగపిల్లలు ఒకే చదువు చదువుతున్నప్పుడు, ఒకే జ్ఞానం పొందుతున్నప్పుడు ఈరకమైన అంతరాలు తప్పని.. నేను గనక సెక్రటరీనయితే దీన్ని ఎత్తివేస్తానని ఒక రాడికల్ ప్రపోజల్ చెప్పాను. మరొకటి ఆడపిల్లలు బయటకు వెళితే ఎక్కడికి పోతున్నారో చెప్పాలి. మగపిల్లలకి ఆ రూల్ లేదు. అదికూడా తీసేస్తానని హామీ ఇచ్చాను. మరొక హామీ ఏమిటంటే ఆంధ్రాయూనివర్సిటీ క్యాంటీన్ పాత మిలిటరీ బ్యారక్స్‌లో ఉండేది. చాలా పాతది. అలాగే ఎంతో ఉత్సాహం తొణికిసలాడే ఆంధ్రాయూనివర్సిటీలో ఆ కేంటీన్ సాయంత్రం ఏడుగంటలకల్లా మూసేసేవారు. బయటకు పోయివచ్చేవారికి ఇబ్బందిగా ఉండేది. అందుకని ఆ కేంటీన్‌ను రాత్రిపూట తొమ్మిదిగంటల వరకూ తెరిచి ఉంచుతానని ప్రామిస్ చేశాను. నిజానికి నేను పోటీ చేసేనాటికి నాకేమీ తెలియదు. కానీ నా హామీలలోని నిజాయితీని గుర్తించి నాకు ఓట్లు బాగాపడ్డాయి. గెలిచాను. అప్పటికే

అక్కడ కమ్యూనిస్ట్, కమ్యూనిస్టేతర వర్గాలుండేవి. కొల్లా మోహన్ రావు అనే నా సీనియర్ ఉండేవాడు. అతనిపై పోటీ చేశాను.. ఆంధ్రాయూనివర్సిటీ హాస్టళ్ళ పేర్లు ఆరోజుల్లోనే సిద్ధార్థ, గౌతం, వినయ, వివేక అన్న పేర్లతో ఉండేవి. అప్పటి వి.సి. (వైస్ ఛాన్సలర్) సి.ఆర్.రెడ్డిగారు ఆ యూనివర్సిటీని ఒక బౌద్ధాశ్రమంగా తీర్చిదిద్దారు. అదొక మధురస్మృతి. నన్నారోజుల్లో ప్రిన్స్ అని పిలిచేవారు (నవ్వు). నేను అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడతానని, అందంగా ఉంటానని అలా పిలిచేవారు.

**మిసిమి : మీలో ఒక మార్క్స్ ఉన్నాడు.. ఒక గాంధీ ఉన్నాడు. వీళ్ళిద్దరినీ ఎలా సమన్వయపరుస్తున్నారు?**

కృష్ణ : కొంతమంది మహాత్ముడిని మహాత్మాగాంధీజీ అంటారు. అది కరెక్ట్ కాదు. మహాత్మా గాంధీ అనాలి అంతే. నేను కేరళ సిండికేట్ ఛైర్మన్‌గా ఉన్నప్పుడు ఒక యూనివర్సిటీ పేరును మహాత్మాగాంధీజీ నుంచి మహాత్మాగాంధీగా మార్పించాను. మహాత్మా గాంధీలోని ప్రామాణికత నాకు చాలా ఇష్టం. తను నమ్మినదాన్ని ఆచరించి చూపి అప్పుడు ఇతరులను ఆచరించమన్నాడు. నమ్మిన ఆదర్శాలకు కట్టుబడి జీవించాడు. గొప్ప నిరాడంబరతను కలిగిఉండటం.. ఇవన్నీ ఆయన్ని మహాత్ముడిని చేశాయి. సత్యం, అహింస, నిరాడంబరతలను తను పాటిస్తూ ప్రచారం చేశాడు. ఇందుకు నాకు గాంధీ అంటే ఇష్టం.

ఇక మార్క్స్ ఎందుకిష్టమంటే wherever there is injustice, some social change must happen అని అతనంటాడు. అందుకే ప్రపంచంలో అన్యాయం ఉన్నంతకాలం ఒక వర్గం ఇంకో వర్గాన్ని దోచుకున్నంతకాలం, అణచివేత ఉన్నంతకాలం మార్క్సిజం ఉంటుంది. మార్క్స్ తను జీవించినకాలంలో తాను చూసిన ప్రీ ఇండస్ట్రియల్ సొసైటీలోని దారుణాలను చూసి స్పందించాడు. అది మార్క్సిజానికి పునాది అయింది. ఈనాడు మార్క్సిజం ప్రాసంగికత ఉన్నదా అని మీరడిగితే.. ఇవాళ ఆయన కాలం నాటి అప్రోచ్ లేకపోవచ్చు కానీ ఆయన ఫిలాసఫీ తప్పుకాదు. అప్లికేషన్ మెథడ్స్‌లో మార్పు ఉండొచ్చు కానీ ఆయన సిద్ధాంతాల్లో మార్పులేదు. ఉగ్రవాదులు, టెర్రరిస్టులు మార్క్సిస్టులు కారు. అలాగే జాతీయవాదం పేరుతో జరిగే ఎక్స్‌ట్రీమిజాన్ని సమర్థించలేము. ఇక నావరకు వస్తే I am a Gandhian and I am a Marxist. వినటానికి ఆశ్చర్యంగా అనిపించినా అది వాస్తవం. నాలో అటు గాంధేయవాది ఉన్నాడు. ఇటు మార్క్సిస్టు థింకర్ ఉన్నాడు. నేను రెండు భావజాలాలను సమన్వయపరుస్తాను. ఇప్పుడు చెప్పాలంటే ఒక గాంధేయవాదిగా గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవిస్తున్నాను. మార్క్సిస్టు సిద్ధాంతాలే ప్రాతిపదికగా తీసుకుని సాగుతున్నాను. హెచ్చుతగ్గుల సమాజం నన్ను కలవరపెడుతుంది.

స్టేటస్ కాన్షస్నెస్ ఉన్న సొసైటీగా అమెరికా, చాలా ఇతర దేశాలకు ఆదర్శంగా నిలవటం ఒక దురదృష్టమైతే.. భారతదేశం కూడా దాన్ని (status consciousness) అలవరుచుకోవటం నాకు బాధ కలిగిస్తోంది. ఈ రకమైన ధోరణి మనకు ఐరోపా దేశాల్లో కనిపించదు. ఉన్నవాడు లేనివాడిని పురుగుకంటే హీనంగా చూడటమనేది ఒకటయితే అది కులంతో కలిసి మరింత వెర్రితలలు వేయటం చాలా చాలా బాధాకర పరిణామం. వెర్రితలలు వేస్తున్న ఈ ధోరణికి విరుగుడు గాంధీజీ అలాగే మార్క్స్ అని నేను నమ్ముతాను. ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా సమసమాజ నిర్మాణాన్ని సిద్ధాంతరీత్యా మార్క్స్ బలపరుస్తాడు. గాంధీ దాన్ని ఆచరించి చూపిస్తాడు.

**మిసిమి : నిజమే గాంధీ ఆయన చేయలేనిది ఆయన చెప్పడు.**

**కృష్ణ :** అది అతని ప్రత్యేకత. That is the uniqueness of Mahatma. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక Man of the century అనే అంశం మీద ప్రపంచవ్యాప్తంగా ఉన్న నాయకులతో ఒక సర్వే చేస్తే వారిలో ఎనభైశాతం మంది మహాత్మా గాంధీకి ఆ గౌరవాన్ని ఇచ్చారు. అందుకే ఇరవయ్య శతాబ్దం మహాత్మాది అని మనం గర్వంగా చెప్పుకోవచ్చు. ఒక్క భారతదేశానికే కాదు. మొత్తం ప్రపంచానికి కూడా.. టి.కె.జార్జ్ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక సంపాదకుడిగా ఉన్నప్పుడు గాంధీపై స్పెషల్ ఎడిషన్ తీసుకొచ్చారు.

**మిసిమి : మీలో ఒక మేధావి ఉన్నాడు. మీలో ఒక పరిశోధకుడున్నాడు. ఒక సాహిత్యకారుడున్నాడు. ఒక కవి ఉన్నాడు. ఒక రచయిత ఉన్నాడు. ఇంతమంది కలిస్తే ఒక జి ఆర్ కృష్ణ. మీరో బహుముఖీనుడు అన్నమాట వాడటం నాకిష్టం లేదు. అన్నింటికి మూలమైన జ్ఞాన ప్రవాహం ఉంది మీలో. ఒక జ్ఞాన ప్రవాహం లేనిదే ఇన్ని పాయలు రావని నేను నమ్ముతాను. దీన్ని నేను తెలుసుకోవటం, మా పాఠకులకు తెలియచేయటం.. ఈ సంభాషణ ఉద్దేశ్యం అది. మీరు తెలుగు ప్రాంతాలకు దూరంగా ఉన్నారు. అందుచేత సెప్టెంబర్ సంచికలో మీగురించోపరిచయ వ్యాసం ఇచ్చాం. అది చదివిన పాఠకులలో ఎవరీ కృష్ణ అన్న జిజ్ఞాస మొదలయింది. ఆ జిజ్ఞాసను పూరించాల్సిన బాధ్యత నాపై ఉంది. ఆ రకంగా మనం ఈ సంభాషణ సాగిద్దాం కృష్ణగారు. ఇందాక ఒక ప్రశ్న అనుకున్నాం. జ్ఞానం ధనాన్నిస్తుందా? దీన్ని మనం ఉపయోగించి చూస్తే సిద్ధార్థుడు బుద్ధితో వ్యాపారం చేశాడు.**

కృష్ణ : (నవ్వుతూ) అవును.. గొప్పగా.

**మిసిమి : ఒకవిధంగా ఆడుకున్నాడు. అంటే మీకు తెలివితేటలుంటే, జ్ఞానం ఉంటే ఏ పనైనా చేయవచ్చు. ఆ జ్ఞానం మంచికోసం వాడమన్నారు మనపెద్దలు. సమాజం శ్రేయస్సు కోసం వాడమన్నారు. జ్ఞానం అంటే విద్య దగ్గరికి వస్తారు. ఈ విద్య గురించి మళ్ళీ మాట్లాడుకుందాం. ప్రజలు విద్య అంటే ఏమాలోచిస్తారు. ఏది చదువుకుంటే ఉద్యోగం వస్తుందా అని. ఈ ఉద్యోగాలలో ప్రభుత్వమిచ్చే ఉద్యోగాలు పదిశాతం ఉంటే మిగిలిన తొంభై శాతం ఉద్యోగాలు ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు ఇస్తున్నారు. వీళ్ళు నిజమైన దేశభక్తులు. జండా పట్టుకు తిరిగేవారు కాదు. ఇది చాలామంది గమనించరు. గుర్తించరు అంటే ఏమిటన్న మాట..పనిచేస్తే ఉద్యోగం.. పనిచేయకపోతే నిరుద్యోగం..**

కృష్ణ : మీమాటకడ్డొస్తున్నాను అశ్విని గారూ. ఇప్పుడు సమస్య తగినంత పని లేకపోవటం. అంటే అది తన అర్హతకు తగిన పనిలేకపోవటం లేదా తన అభిరుచికి తగిన పనిలేకపోవటం కావొచ్చు.

**మిసిమి : కృష్ణగారూ, నేననేదేమిటంటే సంక్షేమ పథకాలు వారిలో ఉన్న పనిచేసే తత్వాన్ని చంపేస్తున్నాయా? ఒక మేనేజ్‌మెంట్ నిపుణుడిగా మీరెలా చూస్తారు ఈ స్థితిని!**

కృష్ణ : ఉపాధి, నిరుద్యోగం, విద్య..ఈ మూడింటిని అన్వయించి చూస్తే, నేర్చుకునే విద్యలో నైపుణ్యాలు అంటే స్కిల్స్ కొరవడి యువతకు ఉపాధి దొరకటం లేదు అని అందరూ చెబుతున్నమాట. దురదృష్టమేమిటంటే విద్య స్టేటస్ సింబల్‌గా మారింది మనదేశంలో. పెళ్ళి చేసుకోవాలంటే డిగ్రీ, బి.టెక్, ఎమ్బీబీస్.. అన్నీ స్టేటస్ సింబల్స్‌గా మారిపోయాయి. స్టేటస్ సింబల్స్‌గా చదివే కోర్సుల్లోని సబ్జెక్టుల్లో లోతులేదు. నైపుణ్యాలు లేవు. దీనివలన వీరిలో పదిశాతం మంది కూడా ఉద్యోగ అర్హత ఉన్న పట్టభద్రులు లేరంటున్నాం..

ముప్ఫై నలభై ఏళ్ళ కితం బి.ఏ. బి.కాం. బి.ఎస్సీ. డిగ్రీలే ఎక్కువగా చదివేవాళ్ళు. సైన్సు, కామర్స్ కాకపోతే బి.ఏ.కి వచ్చేవాళ్ళు. ఇప్పుడు ఆ స్థానాన్ని ఇంజనీరింగ్, మెడిసిన్ చదువులు తీసుకున్నాయి. అభిరుచిలేని చదువుకు, స్టేటస్ కోసం మాత్రమే చదివిన చదువుకు ఉద్యోగాలు లభించే అవకాశాలు తక్కువ. డొనేషన్ కట్టి మెడిసిన్ చదివేవాళ్ళు, కట్నం కోసం మెడిసిన్ చదివేవారి వలన ఏమిటి ప్రయోజనం. వారికి మెడిసిన్ అంటే అభిరుచిలేదు. కానీ చదువుతారు అలాగే సూపర్ స్పెషాలిటీ కోర్సు చదువుతారు. చదివిన తర్వాత వీళ్ళ దృష్టంతా డొనేషన్ డబ్బు రికవర్ చేయటం గురించే. ఒకప్పుడు వైద్యో నారాయణో హరి అనేవాళ్ళం. అంటే డాక్టరు ఆ దేవుడితో సమానమని కదా. కానీ ఈనాడు వారిలో ఆ సేవాభావం లోపిస్తోంది. ఇది బాధించే విషయం.

**మిసిమి : ఈ సమస్య మనదేశంలోనే ఉందా? మిగిలిన దేశాల్లో ఉందా?**

కృష్ణ : ఇది ఏ దేశంలోను లేదు ఒక్క మన దేశంలో తప్ప. అరవై, అరవైఐదు దేశాలు చూసినవాడిగా చెబుతున్నాను. ఆ దేశాల్లో లోపాలున్నాయి. సమస్యలున్నాయి.. కానీ ఈ రకమైన సమస్యలేదు. ఆ దేశాల్లో ఇంటర్మీడియెట్

అవగానే వాళ్ళకి వాళ్ళు నిర్ణయం తీసుకుంటారు. చదవాలా వద్దా, ఒకవేళ చదివితే పనిచేసుకుంటూ చదువుకుంటారు. చదివిన వారంతా ఒక ఆసక్తితో చదువుకుంటారు తప్ప స్టేటస్ కోసం డొనేషన్ కట్టి చదవరు. ఆస్ట్రేలియాలాంటి దేశంలో గ్రాడ్యుయేషన్ దాటి చదవరు. రెండు మూడు కోట్ల జనాభా ఉన్న సంపన్నదేశం ఆస్ట్రేలియా. వాళ్ళకి చదువు అవసరం ఉందని కూడా అనుకోరు. అదే మీరు చూస్తే భారతదేశంలో చదువు అనేది చాలా విచిత్రమైన స్థితిలో ఉంది. ఇక్కడ ఐటిఐ, పాలిటెక్నిక్‌ల్లో చదివినా వాళ్ళకి అవసరమైన నైపుణ్యాలు ఉండవు. చివరికి ఏ చదువు లేకుండా గ్యారేజీ నడుపుతున్న వాడి దగ్గర చేరి నేర్చుకుంటారు. దానికి కారణం మన చదువులు ప్రాక్టికల్‌గా ఉండకపోవటం. ఆ పరిస్థితి వలన పిల్లలకు కలిగే అసౌకర్యం పూడ్చలేనిదని గ్రహించటం లేదెవ్వరూ. ఇంకో విషయమేమిటంటే భారతదేశంలో నైపుణ్యాల మీద చాలా అతిగా దృష్టి పెడుతున్నారు. ప్రతివారు వాటిగురించి మాట్లాడుతున్నారు. మంచిదే. అంతకుమించి విద్య మనలో విలువలు పెంచాలి. మనలోని మానవత్వాన్ని మేలుకొలపాలి. దానిగురించి ఎవరూ మాట్లాడటం లేదు. అదో విషాదం అని నాకనిపిస్తుంది.

**మిసిమి : విద్య మనకు నేర్పవలసింది నేర్పటం లేదు.**

**కృష్ణ :** అదెందెకు నేర్పటంలేదు. ఎప్పుడైనా కారణం వెతికామా? ఇప్పుడు ఆర్ట్స్ సబ్జెక్ట్స్ చదువుకోవటానికి ఎవరూ ముందుకు రావటం లేదు. ఆ కోర్సులు మూసివేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది చాలా దురదృష్టకరమే కాదు, దేశానికి మంచిది కూడాకాదు. అమెరికా వంటి దేశంలో ఒకప్పుడు ఈ విషపరిణామం జరిగింది. ఇప్పుడు ఆ దేశంలో పనికట్టుకుని మరీ పిల్లలను ఆర్ట్స్, హ్యూమానిటీస్ చదివేందుకు పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. సంగీతం, నృత్యం, సాహిత్యం ఈ రకమైన లలితకళలు మానవమనుగడకు అవసరమని వారు గుర్తించారు. జంతుప్రవృత్తి లక్షణాలున్న మనిషిని మానవత్వ ఛాయలను పుణికిపుచ్చుకునేందుకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయని గ్రహించారు. ఈ ఆర్ట్స్ సబ్జెక్టులు మనుషులను మానవీకరణ చేయటంలో ఎంతగానో తోడ్పడతాయి. వాటిల్ని మానవశాస్త్రాలు (humanities) అనటానికి కారణమేమిటంటే మానవత్వాన్ని అవి మనలో విస్తరింపచేసేందుకు దోహదపడతాయి. కిందస్థాయిలో ఉన్నవారికి అవసరమైన నైపుణ్యాలు లభించటం లేదు. హ్యూమానిటీస్ చదవకుండా మనిషి డబ్బు సంపాదించే యంత్రంగా మారిపోతున్నాడు. ప్రతిచోటా పదిశాతం మంది రూల్‌కి భిన్నంగా ఉంటారు. వారిని వదిలేద్దాం. Exceptions ఎప్పుడూ ఉంటాయి. సమాజ స్పృహతో ఉన్న విద్యావ్యవస్థ నేటి అవసరమని మనం గుర్తించాలి. సమాజ స్పృహలేక, అవసరమైన నైపుణ్యాలు లేక, దూరదృష్టిలేక మన విద్యావ్యవస్థ ఎటువైపు సాగుతోందో మనం మదింపు చేయాల్సిన సమయమిది. మనం గమనిస్తే చదువుకున్న వారిలోనే స్వార్థం వెర్రితలలు వేస్తోందీరోజున. చదువుకున్న వారిలో విలువలున్న వారు లేరా అని మీరు ప్రశ్నించవచ్చు. అయితే అలాంటివారు లేరనికాదు.. వారి సంఖ్య తగ్గుతోంది. అధికశాతంలో ఇది లోపిస్తోంది అని చెప్పటం నా ఉద్దేశ్యం. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప సంస్కృతి ఉన్న దేశం మనది. భారతీయ సంస్కృతిలో తప్ప మరే సంస్కృతిలోనూ లేని ఎన్నో గొప్ప లక్షణాలు ఉన్నాయి. అలాంటి చోట మన విలువలను మనం గౌరవించటం మానేశాం. ఏది చెబుతామో దాన్ని ఆచరించటంలేదు. ద్వంద్వ ప్రమాణాలు ఎక్కువై పోయాయి. అవసరార్థం అబద్ధాలు చెప్పే సంస్కృతి పెరిగిపోయింది. పిల్లలకు ఏవి నేర్పించకూడదో



అవి నేర్పిస్తున్నాము. ఇదీ మన దౌర్భాగ్యస్థితి ఇవ్వాళ. మళ్ళీ చెబుతున్నాను, ప్రతి రూల్‌కూ మినహాయింపులున్నట్టే ఇక్కడ కూడా ఇప్పుడు చెప్పినదానికి భిన్నంగా ఉండే వారున్నారు.

**మిసిమి : మీరన్నది అక్షరసత్యం. ఇటువంటి దుర్మార్గపు స్థితి మనకు యూరోప్ దేశాల్లో కనిపించదు.**

**కృష్ణ :** మరోసారి చెబుతున్నాను ఏమీ అనుకోకండి.. మన కుటుంబ జీవితంలోనైనా బయటి జీవితంలోనైనా అబద్ధాలపైనే సమాజాన్ని నిర్మిస్తున్నాం. నటించటం మనం చేయటమే కాదు, మన పిల్లలకు కూడా నేర్పుతున్నాం. ఈమాట చెప్పటానికి బాధగా ఉంది కానీ తప్పటంలేదు. most double standards societyగా మనదేశం తయారవుతుండటం కలవరపెట్టే విషయం. ఆలోచనలపరంగా మనమందరం ఎంతో సౌమ్యులం. కానీ ఆచరణపరంగా అందుకు పూర్తి భిన్నం.

**మిసిమి : ఈ విషయాన్ని ఇక్కడ ఆపి మళ్ళీ మీ యూనివర్సిటీ రోజుల్లోకి వెళదాం. ఆరోజుల్లో మీరు చాలా పాపులర్. ప్రొఫెసర్ అయ్యంగార్, ఆచార్య ఎస్.వి.జోగారావు వంటి వారిగురించి మేం విన్నాం, కానీ మీరు వారితో కలిసి నడిచారు. ఎందుకంటే వాళ్ళంతా మిమ్మల్ని విద్యార్థిగానే భావించలేదు. మీరొక ఫ్రెండ్‌గా వారు భావించారు. అది మామూలు విషయం కాదు. వారితో మీ అనుభవాలు చెప్పండి.**

**కృష్ణ :** అప్పటికి ప్రొఫెసర్ కె.ఆర్.శ్రీనివాస్ అయ్యంగార్ ఇంగ్లీషు మాస్టారుగా ఉన్నారు. ఆయన రాజారావు, ఆర్కే నారాయణ్, ప్రజ్ఞానంద వంటి భారతీయ ఆంగ్ల రచయితల రచనలను క్రోడికరిస్తూ కేంద్రసాహిత్య అకాడమీ వారికో చక్కటి పుస్తకం రాశారు. వారమ్మాయి ప్రేమ అరవిందుల సావిత్రి నవల మీద గొప్ప పుస్తకం రాసింది. నేనప్పుడు Masters in Social Work కోర్సు చేస్తుండేవాడిని. ప్రొఫెసర్ సర్వేశ్వరరావుగారు మాకు ఆర్థికశాస్త్రాచార్యులుగా ఉండేవారు. తెలుగులో ప్రొ.జోగారావు, కొర్లపాటి శ్రీరామమూర్తి ఉన్నారప్పుడు. గంటి సోమయాజిగారు అప్పటికే రిటైర్ అయ్యారు. వీళ్ళందరిళ్ళకు పోతుండేవాళ్ళం. నిరంతరం సాహిత్యం, సంగీతం, నృత్యం అంశాలమీదే చర్చలు చేస్తుండేవాళ్ళం. థియేటర్ ఆర్ట్స్ కోర్సు అప్పుడే మొదలైంది. కన్యాశుల్కంలోని గిరీశం పాత్రకు ప్రసిద్ధిచెందిన కె.వెంకటేశ్వరరావు అప్పుడు స్టూడెంట్. నాకు నాటకాలంటే చాలా ఇష్టం. నేను స్టూడెంట్‌గా ఉండగానే గుంటూరు దగ్గరున్న పల్లెల్లో ముప్పైనాటకాలకు పైగా ప్రదర్శించాం. మా సంస్థ పేరు అభ్యుదయ నాట్యమండలి. నేను పి.యు.సి.చదువుతున్న రోజులనుంచి మా నాటకాలను నేనే డైరక్ట్ చేస్తూ ఉండేవాడిని. మా దృక్పథం ఒకటే, కళలు సమాజసేవకు ఉపయోగపడాలన్నది. దానితోబాటుగా తిరుపతివెంకటకవుల కృష్ణరాయబారం కూడా ఆడేవాళ్ళం. పౌరాణిక నాటకాలంటే నాకు మహా ఇష్టం. తిరుపతి వెంకటకవులంటే నాకు ఆరాధన. Krishna & Karna dialogue అనే పేరుతో వారు రాసిన సంభాషణలను కామెంటరీ రూపంలో ఆంగ్లంలో Gleanings from modern Telugu poetry అనే గ్రంథంలో పొందుపరిచాను. నాకు కంఠతా వచ్చునవన్నీ. నిజానికి అవి అనువాదం చేసిన రచనలు కావు. నా గుండె ప్రకంపనల అనునాదం.

**మిసిమి : మల్లంపల్లి సోమశేఖర శర్మ కూడా మీకు బోధించినట్లున్నారు కదా**

**కృష్ణ :** ఆయన చరిత్ర ఉపన్యాసకులు. నాకు వారంటే చాలా ఇష్టం వాళ్ళబ్బాయి ఆదిత్య నాకు మంచి మిత్రుడు. ఆయనకున్న డిగ్రీలు రాస్తే నాలుగు పేజీలవుతాయి. అంతగా అకెడెమిక్ కోర్సులు చేశారాయన. ఆయనలోని నమ్రత, వినయశీలత నాకు చాలా ఇష్టం. నన్ను ప్రోత్సహించిన ఆయనకు నేను ఋణపడుంటాను. తర్వాత మా గుంటూరాయన బియస్ఎల్ హనుమంతరావుగారు వస్తారు. వీరివలన తెలుగు, ఆంగ్ల భాషల్లో పట్టు వచ్చింది. తెలుగు భారతం కంఠతా వచ్చింది. పురాణాలు మొత్తం చదివేశాను. మరో చరిత్ర ప్రొఫెసర్ ఓరుగంటి రామచంద్రయ్యగారని ఉండేవారు. ఆయన కవిత్వం కూడా రాసేవారు.ఆయన "గంగాలహరి" అని ఓ కావ్యం రాశారు.వివేకానందుని పద్యాలు అనువాదం చేశారు. ఆయన చాలా తక్కువగా మాట్లాడతారు.నాతోమాత్రం వెయిట్ చేసి మరీ నాతో ఎంతో ఇష్టంగా మాట్లాడేవారు. సిరిపురంలో క్వార్టర్సు

ఉండేవి. అక్కడదాకా నడుచుకుంటూ వెళ్ళే వాళ్ళం. అక్కడ టీ తాగుతూ గంటలు గంటలు ఆయన నాతో మాట్లాడేవారు. వీళ్ళందరు కూడా నన్ను ఇతరులకు పరిచయం చేసేందుకు ఇష్టపడేవారు. ఎలా పరిచయం చేసేవారంటే మీట్ మై యంగ్ ఫ్రెండ్ అని పరిచయం చేసేవారు.

**మిసిమి : మీకు విశాఖ రచయితల సంఘంతో అనుబంధం ఉండేది.తెన్నేటి విశ్వనాథం గారంటే మీకు అభిమానమండేది కదా.. అదే అభిమానం ఆయన మీపై చూపేవారని మాకు తెలుసు. అలాగే వి.ర.సం. అంటే రావిశాస్త్రి, రంగనాయకమ్మ, జేష్ఠ వంటి రచయితలుండేవారు కదా.**

కృష్ణ : అవునండీ..విశాఖ రచయితల సంఘం (వి.ర.సం.)లో నేను చురుగ్గా పాల్గొంటుండేవాడిని. మీరన్నట్టు తెన్నేటి విశ్వనాథం గారికి నేనంటే ప్రత్యేకమైన అభిమానముండేది. ఎన్.జి.రంగా గారి పుణ్యమా అని అప్పటికే నాకు రాజకీయ అవగాహన, సామాజిక చైతన్యం మెండుగా ఉండేవి. విశ్వనాథంగారిల్లు రచయితల సమావేశాలకు వేదికగా ఉండేది. ఆయన చక్కగా టీ, స్నాక్స్ ఇచ్చి చక్కటి మర్యాదలు చేసేవారు. వారిల్లు నగరం నడిబొడ్డునుండేది.ఎక్కువసార్లు సమావేశాలు వారింటిలోనే జరిగాయి. ఒకటి రెండుసార్లు నేను, జ్యేష్ఠ కలిసి హోస్ట్ చేశాము. ఆరోజుల్లో రంగనాయకమ్మగారు కూడా నన్ను అభిమానిస్తూ ఉండేది. I am the champion of the underdog అవ్వటం దానికి కారణం. ఆడవారికి అండగా నిలిచేవాడినని ఆవిడకు ఆ అభిమానముండేది.

**మిసిమి : మీరు ఆరోజుల్లో విద్యార్థులను బాగా ప్రభావితం చేసేవారుట కదా.. ఎలా?**

కృష్ణ : మనం నిజాయితీతో ఉంటే మన ప్రభావం ఇతరుల మీద తప్పకుండా ఉంటుందండీ. నా నిజాయితీయే అందుకు కారణం అనుకుంటాను.నేను హాస్టల్ సెక్రటరీగా గెలిచిన తర్వాత నేనేదైతే చెప్పానో దాన్ని అమలు చేశాను. ఎవరికైనా ఒకటే రూల్ అన్నమాటను ఆచరణలో పెట్టాను. చెప్పాను కదా. చేసేపనిలో నిజాయితీ ముఖ్యమని. అది నాకు చాలా పాపులారిటీ తెచ్చిపెట్టింది. ఒకసారి రెండువేలమంది విద్యార్థులు పాల్గొన్న సభలో రిజిస్ట్రార్ గోపాలస్వామి, వైస్ ఛాన్సలర్ నారాయణమూర్తి కానీ విద్యార్థులు చేసే గోలను నియంత్రించలేకపోతుంటే నేను స్టేజీ ఎక్కి ప్లీజ్ ఫ్రెండ్స్ అనగానే సభంతా నిశ్శబ్దం చోటుచేసుకుంది. ఆరోజున గోపాలస్వామిగారు నన్ను కౌగలించుకుని ఏం మంత్రం వేశావయ్యా అన్నారు. సర్ స్టూడెంట్స్ ఫస్ట్.. ఎవ్విరి థింగ్ నెక్స్ట్ అన్నాను. అదే నేను నమ్మాను. వాళ్ళంతా నన్ను నమ్మారు.

**మిసిమి : మీరు హాస్టల్ సెక్రటరీగా గెలిచాక మీరు చెప్పినవన్నీ అమలు చేశారా? మీకు అమ్మాయిల్లో ఫాలోయింగ్ ఎక్కువంటారు..ఎందుకు?**

కృష్ణ : నేను ఏదయితే ప్రామిస్ చేశానో దాని గురించి శషభిషలు లేకుండా నా శక్తిమేరా కృషి చేశాను. నా కృషిని అందరూ మెచ్చుకున్నారు. ఇక ఆడపిల్లల అభిమానమంటారా .. మనం ప్రేమగా అందరితో ఉంటే అందరూ మనలను అభిమానిస్తారు. లవ్ అంటే మనం ఆడా, మగ శరీరాల స్పర్శ అనుకుంటున్నాం. అది సరైన ఆలోచన కాదు. లవ్ అంటే హ్యూమానిటీ. ఆ రోజున వేదికపైన ఒక్కమాట చెప్పాను.హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్ ను కలవాలంటే రోజుకో గంట అని బోర్డు ఉండేది. వెంకటరామన్ అని, లా ప్రొఫెసర్ ఉండేవారు. దేశవ్యాప్తంగా పేరున్న మనిషి. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్. వారి సమక్షంలోనే చెప్పాను. స్టూడెంట్స్ ఎప్పుడైనా కలవగలగాలి మిమ్మల్ని. ఇప్పుడున్న ఆ గంట మాత్రమే అన్న రూల్ పోవాలి అని. British barbarity is continuing in the University.. It should not అని చెప్పాను. ఇలా ఏది చేసినా సిన్సియర్‌గా చేసేవాడిని. నా మాటల్లోని నిజాయితీ మీరన్న ఆ ఫాలోయింగ్ నాకు తెచ్చిపెట్టుండొచ్చు.

**మిసిమి : ఒకామె మిమ్మల్ని ప్రేమించి, పెళ్ళి చేసుకోవాలని తపించి అది వీలుకాక అవివాహితగా ఉండిపోయిందిట. నిజమేనా?**

**కృష్ణ :** నిజమే.. తరువాతికాలంలో కెరీర్‌లో ఎంతో పురోభివృద్ధి సాధించిన వ్యక్తి ఆవిడ. నాకు కుటుంబం, బాధ్యతలు ఉన్నాయి. నన్ను ఎంతో చదివించిన మా అక్కగారి కుటుంబాన్ని ఆదుకోవటం ముఖ్యం.

**మిసిమి : మీరెప్పుడైనా గిల్టీగా ఫీలయ్యారా?**

**కృష్ణ :** రెండు సంవత్సరాల క్రితం ఆవిడ మరణించింది. చెప్పానుకదా. నా కుటుంబ బాధ్యతలు నాకున్నాయని. అయినా ఆవిడతో టచ్‌లో ఉండేవాడిని. అవసరమైనప్పుడు సహాయం చేసేవాడిని. నేనో బైరాగిలాంటివాడిని. నేనో విరాగిని. సంగీతము, సాహిత్యము, పబ్లిక్ పాలసీ.. ఇవే నన్ను నడిపించేవని ఆవిడకు నచ్చచెప్పాను. నాలాంటివాడితో మాట్లాడటం బానేఉంటుంది. కానీ కలిసి జీవించటం కష్టం. అది నా భార్యకు బాగా తెలుసు. కావాలంటే మీరు నా పక్కనే ఉన్న మా ఆవిడను అడొగొచ్చు. ఎందుకంటే నాకు లౌకిక వ్యవహారాల్లో కానీ లౌకిక విషయాల్లో కానీ ఆసక్తి తక్కువ. అసలు ప్రేమనే పదాన్ని చాలామంది చాలా అపార్థం చేసుకున్న పదం. అవతలి వారు ఏ దృష్టితో ఈ పదాన్ని వాడుతున్నారు, వారి దృష్టిలో ప్రేమంటే ఏమిటి అన్న అవగాహన కలిగి ఉండటం ప్రధానం. అప్పుడు చాలా అపోహలు, అపార్థాలు తొలగిపోతాయి.

**మిసిమి : మీరు పదేపదే సంగీతం గురించి ప్రస్తావిస్తారు మీ మాటల్లో. అసలెప్పటినుంచి మీలో ఈ అభిరుచి మొదలయ్యింది?**

**కృష్ణ :** నా చిన్నప్పుడు మా ఊరిదగ్గర బ్రాహ్మణ అగ్రహారంలో ఎక్కిరాల కృష్ణమాచార్య అనే శ్రీవైష్ణవ బ్రాహ్మణుండేవారు. ఆయన దగ్గర సంగీతం నేర్చుకున్నాను. అలాగే ఆచంట వెంకటరెడ్డయ్య గారనే ఆయుర్వేదం మాస్టారుండేవారు. ఆయన దగ్గర కూడా నేర్చుకున్నాను. మన పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాంగారు నేను చాలా వేదికలమీద ప్రసంగించాం. చాలాసార్లు కలిసి ప్రయాణం చేశాం. మేమిరువురం వీణావాదనం గురించి మాట్లాడుకునేవాళ్ళం. ఒకసారి నేను లక్షద్వీప్ దీవులకి ప్రభుత్వ సలహాదారుగా ఉన్నప్పుడు ఒక రాత్రి బోట్‌లో సాహసయాత్ర చేసి మాల్దీవ్స్‌కి వెళ్ళాం. ఆ పడవ తిరగబడింది. నాకు ఈతరాదు. నాకు ఈతరాదన్న సంగతి పడవవాళ్ళకు తెలియదు. చివరికి నన్ను మాల్దీవ్స్ వాళ్ళే కాపాడారు. కానీ అరెస్ట్ చేశారు. తరవాత నా గురించి వాకబు చేస్తే లక్షద్వీప్ అడ్వైజర్ అని తెలిసి నిర్ఘాంతపోయారు. మరోసందర్భంలో నేను, నార్మన్ కుబెక్ అనే ప్రొఫెసర్ ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ)లో విమానమెక్కి లండన్ వెళ్ళాలి. నేను ఆలస్యం చేశాను. మేము చేరుకునే రెండునిముషాలముందే ఆ విమానం గాలిలోకి ఎగిరిపోయింది. కానీ ఆ విమానం ప్రమాదానికి గురైంది. ముప్ఫైమంది మరణించారు. కుబెక్ నాతోటి "నువ్విది తెలిసే ఆలస్యం చేశావు. ఎలా తెలుసు నీకు" అంటాడు. నీవలన నా ప్రాణాలు నిలిచాయని కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్నాడు. కొన్ని సంవత్సరాలక్రితం అతను భారతప్రభుత్వానికి అతిథిగా భార్యతో సహా వచ్చాడు. మంగుళూరు వచ్చి నన్ను కలిసి వెళ్ళాడు కూడా. నా చిన్నప్పుడు పదకొండేళ్ళ వయసులో దీపావళి పండగ జరుగుతోంది. రామకృష్ణయ్య అనే ఆయన మా ఊరిలో చదువుకున్నవాడు. మంచి వక్త. నన్నుచూసి పండగనాడు కొత్తబట్టలు వేసుకోలేదే అన్నాడు. అవన్నీ పిల్లల్కు, మనకెందుకు అంటే ఆశ్చర్యపోయి ఆరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఇది ప్రస్తావించాడు. ఇదెందుకు చెబుతున్నానంటే నాకు చిన్నతనంనుంచీ పెద్దవారితోనే పరిచయాలన్నీ. అలాగే దేనికీ నేను రియాక్ట్ కాను. రెస్పాన్స్ ఉంటుంది. నామీద నెగిటివ్‌గా రాసినా, చెడుగా ఆలోచించినా, నన్ను మానసికంగా గాయపరచినా నేను బాధపడను. స్పందించను. మొదట ఆ పరిస్థితి రాకుండా చూసుకుంటాను. రెండవది ఆ పరిస్థితి వస్తే బాధపడను. నిర్వికారంగా రియాక్ట్ కాకుండా ఉంటాను.

*Reactionlessness is the last point of human evolution* అని నమ్మే వ్యక్తిని నేను. జిడ్డు కృష్ణమూర్తి అందుకే నన్ను ఇష్టపడేవాడు.

**మిసిమి : జె.కె. మిమ్మల్ని వంశీ అని పిలిచేవారు కదా. తనతో కలిసి ప్రయాణం చేసి జీవిస్తున్న చివరి వ్యక్తి మీరు. ఆయనతో మీ అనుబంధం గురించి చెప్పండి?**

**కృష్ణ :** అది పందొమ్మిదివందల అరవైనాలుగో అరవై ఐదు ప్రాంతంలోనో, నేను జె.కె.ని కలిసినప్పుడు.. మొదట మూడు నాలుగు మీటింగుల్లో ఆయనతో నేను వాదనకు దిగుతుండేవాడిని. అయినా నన్ను ఆయన అంగీకరించారు. నాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. నలభై నిముషాలపాటు మేమిద్దరం మాట్లాడుకున్నాం. మాటల మధ్యలో మూడు నాలుగుసార్లు, నేను చెప్పిన పాయింట్ నచ్చి you are right, I accept అన్నారు. మీకిచ్చిన సమయం అయిపోయిందని అరుణా అసఫ్ అలీ, సుమిత్రా పట్వర్థన్ (తర్వాత నా దగ్గర పి.హెచ్.డి.చేశారావిడ) అంటుంటే వాళ్ళని జె.కె. వారించారు. కాసేపు ఎవర్నీ పంపకండి. మేమిద్దరం లంచ్ చేయబోతున్నాం అని జె.కె. వారికి చెప్పారు. అలా అతనితో ఒక అనుబంధం ఏర్పడింది. ఆయనకు విద్యార్థులంటే బాగా ప్రేమ. ఎక్కువ వారితోనే మాట్లాడేవారు. చిన్నప్పటినుంచి నాది రెబెల్ స్వభావం. ఎవరైనా సరే చెప్పేదొకటి, చేసేదొకటి అయినప్పుడు నేను విభేదించాను. గొంతెత్తాను. ఇదే జె.కె.కి నాలో నచ్చిందనుకుంటాను. మొన్న మీరన్నమాట గుర్తుకొచ్చి నవ్వొస్తోంది. కారులో ఎవరొచ్చారు అనేదానికన్నా ఏ కారులో వచ్చారు అనుకునే మూర్ఖుల మధ్య ఉన్నాం. మనది మైనారిటీ ప్రపంచమే అయుండొచ్చు. కానీ అందులో గుండె ధైర్యాన్ని కలిగుండాలనేది నా స్థిర అభిప్రాయం.

**మిసిమి : ఆస్కార్ వైల్డ్ ఎప్పుడో అన్నాడు. ఈ పెద్దప్రపంచంలో మనదో చిన్న ప్రపంచం ఉంటుంది. కానీ ఈ రెండింటికీ పడదు అని. మళ్ళీ జె.కె. దగ్గరికి వద్దాం. ఆయనలో మీకు నచ్చిన గుణాలు.**

**కృష్ణ :** ఆయనలోని మొండితనం, సత్యసంధత నన్ను ఆకట్టుకున్నాయి. స్థితప్రజ్ఞత గురించి మన గ్రంథాలు కూడా కొన్ని నిజాలు చెప్పాయి. అవొదిలేసి వేరే చెత్తవిషయాలు మనం గుర్తుంచుకుంటాం. మూడే వాక్యాల్లో గీతాకారుడు చెప్పాడు.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే॥** (భగవద్గీత – 2.56)

దుఃఖం వచ్చినప్పుడు చింతపడనివాడు, సుఖం వచ్చినప్పుడు విర్రవీగనివాడు, భయము, ఆసక్తి, క్రోధము.. ఈ మూడింటిని విడిచినవాడు నిజమైన యోగి అన్నారు. జె.కె. అటువంటి యోగిపుంగవుడు. జె.కె. కొన్నిసార్లు కోపం నటించేవారు.. నటించటం వేరు, కోపం రావటం వేరు.. కోపం కంటే ఒక్కోసారి indignation చూపించాలి. లేకపోతే పనులు జరగవు. ఒకసారి జె.కె. రిషీ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపల్ రాధికా హీస్బర్గర్ (పుపుల్ జయకర్ కుమార్తె)పై కోపం చూపితే ఆమె నొచ్చుకుని నన్నడిగింది. డాక్టర్ (ఆమె నన్నలాగే పిలిచేది) జె.కె.కి ఎందుకు నాపైన కోపం చూపారని. అది కోపం కాదమ్మా అని నచ్చచెప్పాను. ఆయనలో ఏ ఎమోషన్స్ ఉండవు. నాకూ అదే అలవాటు. కొన్ని జన్మతః వచ్చే లక్షణాలుంటాయి కదా. నాతో ఎవరైనా మాట్లాడినప్పుడు వారు మాట్లాడింది నిజమా అబద్ధమా అని నాకు తెలిసిపోతుంది. అది హైయ్యస్ట్ యోగిక్ పవర్స్. మనిషికి ఆత్మావగాహన ఉండాలి. అది కలిగించేందుకు మూడింటిని కలిగి ఉండాలి. అవేమిటంటే introspection, retrospection, reflection. విపాసన ప్రక్రియ కూడా ఇదే చెబుతుంది.

**మిసిమి : అంటే మానసికంగా సన్యాసి అయిఉండాలి. మళ్ళీ మీ యూనివర్సిటీ రోజుల్లోకి వెళదాం. మీ study of interest చూస్తే సోషియాలజీ, ఎకనమిక్సు, పొలిటికల్ హిస్టరీ.. కానీ మీ interest of studies వేరు. సైకాలజీ చేశారు. ఆంత్రపాలజీ చేశారు. హిస్టరీ ఆఫ్ తెలుగు చేశారు.**

**కృష్ణ :** ఇవన్నీ అభిరుచులకు సంబంధించినవి. నాకు తెలుగు సాహిత్యం ఇష్టం. మామూలు ఇష్టం కాదు.. బాగా ఇష్టం. ఇంకా ఆంగ్ల, ఫ్రెంచ్ సాహిత్యాలు కూడా ఇష్టం. సంగీతం కూడా ఇష్టం. అందులో వీణావాదనం మరీ ఇష్టం. ఎన్ని ఆసక్తులున్నా టైం మేనేజ్మెంట్ పట్ల జాగ్రత్త వహించాలి. అప్పుడే అన్నీ సాధ్యమవుతాయి..

**మిసిమి : మీరు సాహిత్యమంటే ఇష్టమంటున్నారు. విద్యార్థి జీవితంలోనే మీరు "జీవనజ్యోతి" అనే కథల పుస్తకం వెలువరించారు కదా.**

**కృష్ణ :** నేను గుంటూరు హిందూ కాలేజీలో ఉండగా బి.ఏ.సెకండ్ ఇయర్లో ఉండగా "సుధ" అనే కథకు మొదటి బహుమతి ఇచ్చారు. ప్రిన్సిపల్ వల్లభజోస్యుల సుబ్బారావుగారని వాకింగ్ ఎన్సైక్లోపీడియా. గ్రేట్ హ్యూమనిస్ట్. కరుణశ్రీ గారేమో ఏసి కాలేజీలో పనిచేస్తుండేవారు. ఆయన, నేను రిక్షాలో వెళ్లి మున్సిపల్ ఆఫీసు దగ్గర mischievousగా ఐస్ క్రీం తింటుండేవాళ్ళం. ఆయన ఐస్ క్రీం తినకూడదు. కానీ తింటుండేవారు. ఆయనతో అంత చనువుండేది.

**మిసిమి : అప్పట్లో ఇంగ్లీషు పత్రికలకు కూడా రాసినట్టున్నారు మీరు.**

**కృష్ణ :** *Poet* అనే పత్రిక మద్రాసు నుంచి వస్తుండేది. కృష్ణశ్రీనివాస్ అనే ఆయన ఎడిటర్. ఆ పత్రికకు ఇద్దరు ఎడిటర్లుండేవారు. నేను ఏషియన్ ఎడిటర్గా ఉండేవాడిని. చైనీస్, జపనీస్ ఇట్లా అనేకభాషల సాహిత్యాన్ని స్పెషల్స్ సప్లిమెంట్లు రూపంలో వేస్తుండేవాళ్ళం. ఒకసారి తెలుగు సప్లిమెంట్ తెచ్చాం. అరిపిరాల విశ్వం ఆ బాధ్యత తీసుకున్నాడు. అనుకున్నంతగా రాలేదు. అది వేరే విషయం. ఐదేళ్ళ క్రితం వరకు ఆ పత్రిక వెలువడుతుండేది. ఇప్పుడు అదికూడా మూతపడింది.

**మిసిమి : మీరు ఎంతోమంది సి.ఈ.ఓ.లకు టాప్ లెవెల్ కార్పొరేట్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు కదా. దానితోపాటు చాలా విశ్వవిద్యాలయాలకు కరికులం తయారు చేస్తుంటారు. విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో విద్య, విద్యార్థులు, సంస్కరణలు వీటిగురించి మీ అభిప్రాయం ఏమిటి? స్కూల్ లెవెల్లో ఎలా ఉంది? కాలేజీ లెవెల్లో ఎలా ఉంది?**

**కృష్ణ :** మీరన్నది నిజమే. నేను ఒకానొక సందర్భంలో పొద్దున్న మూడు ట్రైనింగ్ సెషన్లు, సాయంత్రం మూడు ట్రైనింగ్ సెషన్లు చేసేవాడిని. నేను కాకుండా ఇంకో ఇద్దరు మాత్రమే ఈరకమైన ఎక్స్పర్ట్స్ ఉండేవారు. సంస్కరణలు నిజానికి విద్యావ్యవస్థను కాంప్లికేట్ చేశాయి. సంస్కరణల్లో ఉండవలసిన సహజత్వం లేకపోవటం దానికి కారణం. ఇవాళ మనం పోతున్న దారికి వ్యతిరేకంగా వెళ్ళటం కరెక్టు. అంటే ఏమిటంటారా! స్కూల్ కరికులంకు సంబంధించి నాకేమనిపిస్తుందంటే మన సిలబస్ చాలా తగ్గించాలి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నది గమనిస్తే మనం వెనకబడి ఉన్నామనిపిస్తుంది. ఈ విషయంలో జె.కె. స్కూల్స్ ఆదర్శంగా నిలుస్తాయి. ఇక్కడే కాదు అమెరికాలోను, యుకెలోని లండన్లో ఉన్న స్కూల్స్ కూడా ఆ కోవలోకే వస్తాయి. రిషివ్యాలీలోని జె.కె. స్కూల్ విద్యార్థులు నిజాయితీపరులు, లోకజ్ఞానం ఎక్కువ. బతకటం రానివాళ్ళు అన్న ఇంప్రెషన్ ఉంది. అక్కడి పిల్లలు ముప్పైమంది ఐయ్యేస్ పరీక్ష రాస్తే పద్దెనిదిమంది ఎంపికయ్యారు. ఎంతోమంది ఎంట్రప్రెన్యూర్లయ్యారు. కానీ వాళ్ళందరిలో ఒక కామన్ లక్షణం ఉంటుంది. వారు విలువలకు చాలా ప్రాధాన్యం ఇస్తారు. ఏవిధంగానూ కరప్ట్ కానివారు. కానీ ఈరోజేంజరుగుతోంది.. కార్పొరేట్ స్కూళ్ళన్నీ చిన్నవీ, పెద్దవి అన్నతేడాలేకుండా హ్యూమన్ టచ్ అంటే ఒక మానవీయ స్పర్శలేకుండా చేస్తున్నాయి. ఇక వాళ్ళేం సమాజాన్ని బాగుచేస్తారు. ఏ రకమైన సమాజహితాన్ని కోరతారు! స్కూల్ స్థాయిలో unburdening the child అన్న కాన్సెప్ట్ రావాలండీ. అది మొదటి స్టెప్. మనం చూస్తే పిల్లలకు చాలా సబ్జెక్టులుంటాయి. అవి తగ్గించాలి. కంప్యూటర్ నుంచి లోకల్ అడ్మినిస్ట్రేషన్ వరకు, సెక్స్ ఎడ్యుకేషన్ నుంచి ఫస్ట్ ఎయిడ్ వరకు వాళ్ళపై రుద్దుతున్నారు. ఇది సమంజసం కాదని నాకనిపిస్తుంది. థియరీ ప్రకారం చూసినప్పుడు ఇవన్నీ అవసరం అనే అనిపిస్తాయి. అయితే ఇవన్నీ పదేళ్ళ లోపలే ఎందుకు నేర్చుకోవాలన్నదే నా ప్రశ్న. uncluttering the mind, uncluttering the information అనేది చాలా ముఖ్యం.. shoe is pinching అంటాం కదా. Parents are Pinching కరెక్ట్ మాటగా అనుకోవచ్చు. అదికాదు కావలసింది. లైఫ్ అనే కోర్ సబ్జెక్టు మీద పిల్లవాడి ఫోకస్ ఉండాలి. దానితోబాటు రిలేషన్ షిప్స్, ఫామిలీ, పేరెంట్స్ ఇవన్నీ తెలియజెప్పాలి. ఆ తరవాతి కోర్ సబ్జెక్ట్ ఫుడ్. మనం తినే ఆహారం ఎలా పండుతుందో నేర్పాలి. మన చిన్నప్పుడు కొంతయినా నేర్చుకోగలిగాం. ఇప్పుడున్న పిల్లలకు ఎంత కష్టమో

అనిపిస్తుంది. ఒక త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. పాశ్చాత్య సంస్కృతిలో కొన్ని గొప్ప గుణాలున్నాయి. వాళ్ళు అబద్ధాలు చెప్పరు. detachment ఉంటుంది. possessiveness ఉండదు. మనకు ఇవన్నీ ఎక్కువ. ఇతర సంస్కృతుల్లోని ఇలాంటి మంచి విషయాలు నేర్పించాలి.

**మిసిమి : మరి కాలేజీ స్థాయిలో ఎలా ఉండాలంటారు?**

కృష్ణ : Decluttering the information అలవాటు చేయాలి. సోషల్ రిలేషన్షిప్స్ ఎక్కువగా చెప్పాలి. సైన్స్ సబ్జెక్టులు ఎలాగో చెబుతున్నారు. డిగ్రీనుంచి మోరల్ సైన్సెస్ ఎక్కువగా బోధించాలి. నిజానికి moral అనే పదం వాడటం నాక్కూడా ఇష్టం లేదు. మనందరం స్కిల్స్ పెంచటం గురించి మాట్లాడతాం. అది నాకు కేరళ రాష్ట్రంలో ఎక్కువ కనిపిస్తుంది. అయితే అందరిలోను ఆ స్కిల్స్ కనిపించటం లేదు. అదొకటి ఆలోచించవలసిన విషయం.

**మిసిమి : ఇవాళ వృత్తికారులను ఎవరు రీప్లేస్ చేయగలుగుతారు. కంసాలి, వడ్రంగి, కమ్మరి వృత్తులు ఎప్పుడూ డిమాండ్ ఉన్న ప్రొఫెషన్స్ అని నాకనిపిస్తుంది.**

కృష్ణ : వృత్తిపరంగా వచ్చిన కంసాలి, కమ్మరి వంటి ప్రొఫెషన్స్ ఎప్పుడూ దృఢమైనవే. కానీ అవన్నీ ఇవాళ తగ్గిపోతున్నాయి. వృత్తికోర్సుల విద్యాలయాలు సర్టిఫికెట్ ఇవ్వటంతో సరిపుచ్చుకుంటున్నాయి. ముఖ్యంగా పాలిటెక్నిక్స్, ఐటిఐ కళాశాలలు. హోంసైన్స్ చదివినవాళ్ళకి హోం నడపటం రావటం లేదు. పబ్లిక్ రిలేషన్సు కోర్స్ చదివిన వ్యక్తి ఇంట్లో భార్యతోనే గొడవపడుతుంటాడు. కాబట్టి ఎడ్యుకేషన్ ద్వారా స్కిల్స్ వస్తాయన్న గ్యారంటీలేదు. ఈ స్కిల్సే కాదు, మానవసంబంధాలు కలిగిఉండటం కూడా స్కిల్ లేదా నైపుణ్యమే.. కుటుంబాన్ని బాధ్యతతో నడపటం కూడా ఒక గొప్ప నైపుణ్యమేనని గ్రహించాలి. అందుకోసం హ్యూమానిటీస్ చదవాలి. అదేవిధంగా సంగీతము, సాహిత్యము మనిషిని సానబెడతాయి. రెండింటినీ సమన్వయం చేస్తూ సాగాలి. స్కిల్స్‌కు ప్రాక్టికల్ శిక్షణ జతచేయాలి. స్వర్ణకారులు, చేనేతపనివారలకు ఇళ్ళే శిక్షణా కేంద్రాలు. చైనా ఈనాడు తన ఉత్పత్తులతో అమెరికాను కూడా భయపెట్టగలుగుతోందంటే అక్కడి పనివారి నైపుణ్యాలే కారణం. అక్కడ గృహాలే తప్పకుండా శిక్షణాకేంద్రాలయి ఉంటాయి. మన విద్యావిధానం ఇంత కాంప్లెక్స్‌గా ఉండకూడదు. సరళతరం చేయాల్సిన అవసరముంది. ఎమ్.బి.బి.ఎస్. చదువుకునే వ్యక్తి దాదాపు పన్నెండేళ్ళపాటు చదువుతూనే ఉండాలి. మనకు మెడికల్ డిప్లొమాలు లేవు. చైనాలో ఉన్నాయి. ఇలాంటి ఆలోచనలు మన దగ్గరకూడా ఇప్పుడిప్పుడే చోటు చేసుకుంటున్నాయి. అది హర్షించదగ్గ విషయం. ఫామిలీ డాక్టర్ కాన్సెప్ట్ మళ్ళీ రావాలి. మనదగ్గర వైట్ కాలర్ జాబ్స్ గొప్పవన్న భావనను ఇంకా వదులుకో లేకపోతున్నాం. బ్లూ కాలర్ జాబ్స్ అంటే చిన్నచూపు. ఇది మారాలి. ఈరోజున సిటీలలో ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ ఎక్కువని మనం గుర్తించాలి. మన దగ్గర స్పెషలైజేషన్ ఎక్కువైపోతోంది. నిజానికి అది నష్టాన్ని కలగచేస్తోంది. ఒక్కమాట గుర్తుంచుకోండి. కాలేజీ లెవెల్లో కోర్సుల వ్యవధి తగ్గించాలి. అది ముఖ్యం. నర్సింగ్ ప్రొఫెషన తీసుకుంటే ఆ ప్రొఫెషన్ వ్యవధి మొదట మూడేళ్ళుండేది. తర్వాత నాలుగేళ్ళు చేశారు. ఇప్పుడు ఐదేళ్ళు చేసే ఆలోచనలో ఉన్నారుట. మీకెట్లా తెలుసు అంటారేమో. నేను దానికి సంబంధించిన మీటింగ్‌లో పాల్గొన్నాను. నర్సింగ్ ప్రొఫెషన్ ఎంత నోబుల్ ప్రొఫెషనో మనందరకు తెలుసు. మనదేశంలో ఆ వృత్తిలో ఉన్నవారికి జీతం, గౌరవం రెండూ తక్కువే అనిపిస్తుంది. అదే మీరు ఆస్ట్రేలియాలాంటి దేశం వెళ్ళండి. అక్కడ వారు డాక్టర్‌తో సమానంగా వేతనం పొందుతున్నారు. అలాగే వారికి గౌరవం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ముఖ్యంగా మన విద్యావ్యవస్థలో కావలసినది కాంపాక్ట్ ఎడ్యుకేషన్, కాంపాక్ట్ లెర్నింగ్, కాంపాక్ట్ ట్రైనింగ్. వీటిమీద మనం దృష్టి పెడుతున్నామాలేదా అన్నది ఆలోచించవలసిన విషయం.

**మిసిమి : మంచి విషయాలు ప్రస్తావించారు. ఇవాళ ప్రాధాన్యతలు మారిపోయాయి. కారు కావాలి. మాల్స్‌కు వెళ్ళాలి. అవసరమున్నా లేకపోయినా వస్తువులు కొనేయాలి. అవసరమైతే క్రెడిట్ కార్డు వాడదాం. ఈ.ఎమ్.ఐ.లు**

**కట్టుకుందాం. ఇదీ వరస. ముఖ్యంగా కొవిడ్ తరవాత ప్రజలు రేపుందో లేదో అన్నట్టు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు. దానికి కారణం మనిషి తననెవరూ (దేవుడితో సహా) కాపాడలేరని తెలుసుకున్నాడు. ఉన్న జీవితాన్ని తమకు వీలైనరీతిలో అనుభవించాలని తాపత్రయపడుతున్నారు. ఇరవై రూపాయల టీ ని నూటయాభైరూపాయలున్న ఖరీదైన హొటళ్లకెళ్లి తాగుతున్నారు. అది వాళ్ళ డోపమైన్ అయిపోయింది. దానికి కారణం నేను మధ్యతరగతిలో ఉన్న ఆలోచనాధోరణి మారిపోవటమేనంటాను. కొవిడ్ తరవాత ఈ మార్పులు నేను చూశాను కృష్ణగారూ. ఇదంతా నేనెందుకు ప్రస్తావించానంటే మీరొకచోట మధ్యతరగతి వర్గం కుంచించుకుపోతోంది అని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితిని సామాజికపరంగా ఎలా విశ్లేషిస్తారు చెప్పండి. నేనడిగింది మీ సబ్జెక్టే..**

**కృష్ణ :** ప్రపంచ చరిత్రలో కొవిడ్ రాక కీలక మలుపు. అది భారతదేశ చరిత్రలో మరింత కీలకమైన మలుపు తీసుకుంది. కానీ మీరు చేసిన విశ్లేషణ కరెక్టు కాదు. కొవిడ్ సమయంలో మన దగ్గర చూపించిన నష్టం కంటే పదిరెట్లు ఎక్కువ జరిగింది. ఆ గణాంకాలు, వాస్తవాలు బయటికి రాలేదు. అశ్వినీ.. మీరు చెప్పినట్టు బతుకు శాశ్వతం కాదు అన్న భావన ప్రజల్లో వచ్చింది. ఆ భయానికి వచ్చిందీ వినిమయవాదం (Consumerism). అదొక పాయింట్. నిజంగా దేవుడు కూడా కాపాడలేడు మనల్ని అనుకుంటే ప్రజల్లో మూఢ భక్తి ఎందుకు పెరుగుతోంది, పూజలెందుకు పెరుగుతున్నాయి, ఆలయాలన్నీ ఎందుకు కిటకిటలాడుతున్నాయి.. కొత్తకొత్త గుళ్ళెందుకు వెలుస్తున్నాయి చెప్పండి.. అంటే అసలు మార్పేమీ రాలేదు. ఇక కన్స్యూమిరిజం ఎందుకు పెరిగిందంటే, ఇదొక ఓపియం వ్యసనం లాగా మనకు అంటుకుంది. ఆల్కహాలిజం ఎలాగో ఇదీ అంతే.. మీరు గమనిస్తే మనవాళ్ళలో తిండిపోతుతనం విపరీతంగా పెరిగింది. దానితోపాటు తిరుగుబోతుతనం కూడా పెరిగింది. ఈమూడుతనాలలాగానే ఖర్చుచేసేతనం కూడా పెరిగింది. మాల్స్ తిరగటం. అనవసరంగా ఖర్చుపెట్టడం జరుగుతోంది. దానికోసమని ప్రాపగాండా ద్వారా, ప్రకటనల ద్వారా ఖర్చుపెట్టడం ఒక అవసరమన్న భయాన్ని, భ్రాంతిని కలిగించి మీతో కొనిపించటం..అలా కార్పొరేట్ మైండ్ గేం నడుస్తోంది. ఎవడో ఒకడు Aspirational Society అన్న కాన్సెప్ట్ తయారుచేసి మనమీద వదిలాడు. అమెరికా దేశంలో ఉన్నవారి జీవనవిధానం మనకు ఆరాధ్యదైవమయింది. అక్కడ వాళ్ళేమీ కొంటున్నారు, ఏం తింటున్నారో అవన్నీ ఇక్కడ వచ్చేశాయి. ఆదేశంలో ప్రపంచంలో ఉన్న నాలుగు శాతం జనాభా ఉంటే ప్రపంచంలో ఉన్న నలభై శాతం సంపదను అనుభవిస్తోంది. అంటే అమెరికా ఎంత దోచుకుని కూడబెడుతోందో మీరు గమనించవచ్చు.నలభైశాతం ప్రపంచ సంపద ఆ దేశంలోనే ఉందిప్పుడు. Aspirational Society అనే పదాన్ని అమెరికలోని ఒక ప్రముఖ సోషియాలజిస్టు సృష్టించాడు. ఈ పదాన్ని మనదేశ పరిస్థితులకు అన్వయించటం మొదలుపెట్టారు మన రాజకీయనాయకులు గత పదేళ్ళుగా. అమెరికా ఫస్ట్ అని వాళ్ళ దేశాధ్యక్షుడంటే రష్యా గ్రేట్ అని వాళ్ళధ్యక్షుడంటాడు. భారత్ సూపర్ పవర్‌గా అవతరించబోతోందని మనం చెప్పుకుంటాం. ఇవాళ యూనివర్సల్ హ్యూమానిటీ అన్న భావనెక్కడుంది. అంతర్జాతీయవాదము పక్కకు పోయి జాతీయవాదం తెరపైకి వచ్చింది. దానికి ఈ Aspirational Society కాన్సెప్ట్ జతయ్యింది. తోడుగా అమెరికాతో, చైనాతో మనలను మనం పోల్చుకోవటం మొదలయ్యింది. అశ్వినీ మన చిన్నప్పుడు మనకేం చెప్పేవారు.. నువ్వు ఎవ్వరితో పోల్చుకోకు నువ్వు unique. నువ్వు అపూర్వము అని చెప్పేవారు. మనదేశానికో గొప్పజ్ఞాన సంపద ఉన్నది. అది నువు ఎవరితో పోల్చుకోకు అనిచెప్పే జ్ఞానాన్ని కాదనుకున్నాం. ఈ దేశాన్నిప్పుడు వస్తువాదం (Consumerism), జాతీయవాదం (Nationalism), Aspirational Society దృక్పథం నడిపిస్తున్నాయి. దేశాన్ని క్రెడిట్ కార్డు ఎకానమీగా మార్చేస్తున్నాయి.

**మిసిమి : ఇప్పుడు WTO (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్) మూతపడింది. ప్రపంచీకరణ పంచ సర్దుకుంది. దేశానికీ దేశానికీ మధ్య ఒప్పందాలు జరుగుతున్నాయి. డీ కాలనైజేషన్, డీ డాలరైజేషన్ తెరపైకి వచ్చింది. దేశాలు ఆర్థికంగా పుంజుకుంటున్నాయి. సూపర్ పవర్ అంటే అర్థం మారిపోయింది. నిజానికి మనం దీనిని రాజకీయనాయకులకు ఆపాదించడం కంటే ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రక్రియను అమలు చేస్తున్న ఐదొందల కార్పొరేట్ కంపెనీలను కారణంగా చెప్పుకోవచ్చు. అలాగే దేశాలమధ్య జరిగే వాణిజ్య ఒప్పందాల వలన డాలర్ పెత్తనం కూడా తగ్గిపోతోంది. అమెరికా బాధ కూడా అదే. అందుకే యుద్ధాలు చేస్తున్నారు. దీన్ని మనం పాజిటివ్‌గా ఎలా తీసుకోగలం. ఇది మొదటి పాయింట్.. రెండవ పాయింట్ సంగీత సాహిత్యాలు మనలోని మనిషిని మేలుకొలుపుతాయన్నారు. విద్య నేర్పించనిది ఇవి నేర్పిస్తాయన్నారు. ఎలాగో చెప్పండి?**

కృష్ణ : మనిషి ఎనభైశాతం జంతురూపమే కదా. మిగినదంతా ఎగో రూపం. నేను అన్న అహం అతన్ని నడిపిస్తుంటుంది. నేను, నాకులం, నా ప్రాంతం, నా ఆహారం, నా దేశం అన్న ఐడెంటిటీతో మసలుతుంటాడు. జంతువులకు సోషియల్ కాంపొనెంట్ లేదు. మనిషిని ఆ సామాజిక జీవనం, సామాజిక ప్రవృత్తి నడిపిస్తుంటాయి. అలా ఈ social conditioning ముఖ్య పాత్ర పోషిస్తుంటుంది. అది సోషల్ కల్చరల్ ఐడెంటిటీకి దారి తీస్తుంది. దానికి ఈ ego దారి చూపుతుంది. మనకు జంతువులకు తేడా ఆ సోషల్ కాన్షస్నెస్ మాత్రమే కదా. పుట్టుకతో జంతుప్రవృత్తితో ఉన్న మనిషిని కల్చర్, కండిషనింగ్ కలిసి సోషల్ యానిమల్‌గా తయారుచేస్తాయి. కల్చర్ అంటే దేవుడూ, భక్తీ కాదు.. సమాజంలో నలుగురితో కలిసేవిధంగా నేర్పేది. పోనీ నటించడం నేర్పేది.ఈ సోషల్ కల్చరల్ కాంపొనెంట్‌ని ఐడెంటిటీ లేదా ఈగో నేర్పుతుంది. యానిమల్ ఇన్స్టింక్ట్, కల్చరల్ కాంపొనెంట్ మనిషిలోని తొంభైఐదు శాతాన్ని తయారుచేస్తే శరీరంలోని ఐదుశాతం మాత్రమే enlightened human ని తయారుచేస్తుంది. ఏపిజె కలాం, రతన్ టాటా, మదర్ థెరీసా వంటి వారు enlightened humansగా వారికిష్టమైన రంగాలలో అద్భుతంగా సేవలందించారు. అయితే ఆ విధంగా రూపొందటానికి మన ప్రయత్నం ఎంతవరకూ ఉన్నది అనే ప్రశ్న ఎవరికి వారు వేసుకోవాలి. మళ్ళీ అందులో ఒక్కశాతం మాత్రమే నిర్వాణ, మోక్షం వైపు పయనిస్తారు. వారి మనసులు నిర్మలంగా, స్వచ్ఛంగా ఎటువంటి భవబంధాలకు లోనుకాకుండా నిరామయంగా ఒక నిర్వికార స్థితిని పొందుతాయి. వారు యోగులు ఆ స్థితికి చేరటం అందరికీ సాధ్యం కాదు. దీనికి సంగీత సాహిత్యాలు తోడ్పాటునిస్తాయి. మనిషి మానవత్వాన్ని సిద్ధింపచేసుకోవటానికి బాటలు వేస్తాయని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను.

**మిసిమి : ఇవి లేకపోతే మనిషుంటాడు కానీ మానవత్వం ఉండదు. మీరు చెప్పిన అంశాలు పునశ్చరణ చేసుకోవటం చాలా అవసరం. మనిషి మనీషిగా రూపొందాలంటే హ్యూమానిటీస్, ఫైన్ ఆర్ట్స్ ముఖ్యమని గ్రహించాలి. టెక్నాలజీ ఒక్కటే సరిపోదు. ఎందుకంటే అది మనిషిని యంత్రంగా మార్చేస్తుంది. సోషల్ ఎవేకినింగ్, కండిషనింగ్ ప్రభావం మనిషిపై ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. సామాజిక జీవనవిధానాన్ని ప్రభావితం చేసే కన్స్యూమరిజం, aspirational society పట్ల జాగురూకతతో ఉండటం కూడా అవసరమన్న మీమాట వెలుగుచూపే కాంతిపుంజం లాంటిది. ధన్యవాదాలు ప్రొఫెసర్ జి.ఆర్.కృష్ణగారు. అనేకానేక కృతజ్ఞతలు మీకు తెలియచేస్తూ నమస్కారం.**

కృష్ణ : మనిషి మరింత మెరుగుపడటానికి ప్రయత్నించాలి. అందుకు లలితకళలొక్కటే శరణ్యం.. **మిసిమి** ఒక విలక్షణ, ప్రత్యేక పత్రిక. రవీంద్రనాథ్ గారి మానవవాదాన్ని మీరు నిజాయితీగా **మిసిమి** ద్వారా ముందుకు తీసుకెళుతున్నారు. మీ **మిసిమి** పాఠకులతో నా అభిప్రాయాలు పంచుకునే అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు అశ్వినీ.

**సంభాషణ : అశ్వినీకుమార్**

*ధ్వని ముద్రణకు రాత ప్రతి : **సి.ఎస్. రాంబాబు (అసిస్టెంట్ డైరెక్టర్, ఆకాశవాణి ; రిటైర్డ్)***

## భారత చారిత్రక వైభవం
# సువర్ణ పథం

– యన్. విజయరాఘవ రెడ్డి

ప్రపంచచరిత్రలో భారత చారిత్రక వైభవాన్ని తిరిగి నిలబెట్టే గ్రంథం : **ది గోల్డెన్ రోడ్**

విలియం డాల్రింపుల్ రచించిన **The Golden Road:** How, **Ancient India Transformed the World** ఒక సాధారణ చరిత్ర గ్రంథం కాదు. శతాబ్దాలుగా మౌనంగా దాచిపెట్టబడిన ఒక మహోన్నత నాగరకతకు జరుగుతున్న మేధోపరమైన న్యాయం.

**డాల్రింపుల్** ఈ గ్రంథాన్ని ఒక చారిత్రక వాదనతో కాదు, ఒక తిరుగుబాటు ఆలోచనతో ప్రారంభిస్తారు. *ప్రపంచ చరిత్రలో భారతదేశం పోషించిన పాత్రను కాలం మరచిపోలేదు, వ్యవస్థీకృతంగా మరచిపోయేలా చేయబడింది.* ఈ ఒక్క వాక్యమే మొత్తం గ్రంథానికి ప్రాణవాయువు.

**ది ఇండోస్ఫియర్**–మరుగునపడిన ప్రభావానికి పునర్జన్మ. డాల్రింపుల్ దృష్టిలో ప్రాచీన భారతదేశం కేవలం ఒక భౌగోళిక దేశం కాదు, అదొక సజీవ నాగరకతాప్రవాహం. అది రక్తపాతంతో కూడిన యుద్ధాలతో సామ్రాజ్యాలను నిర్మించలేదు, ఉదాత్తమైన ఆలోచనలతో ప్రపంచాన్ని జయించింది. అది సరిహద్దుల వైపు ఖడ్గాన్నికాదు, దిగంతాలకు జ్ఞానాన్ని ఎగుమతి చేసింది. కేవలం మసాలా దినుసులను మాత్రమే కాదు, జీవితాన్ని సార్థకంచేసే తత్త్వచింతనను పంచింది. సంపదను మాత్రమే కాదు, బౌద్ధం, సంస్కృతం, గణితం, ఖగోళం, శిల్పకళలను జగత్తుకు అందించింది.

భారతదేశం ఆసియాను సైనికబలంతో జయించలేదు. ఆసియాదేశాలే భారతీయ జ్ఞానాన్ని, సంస్కృతిని స్వచ్ఛందంగా ఆహ్వానించాయి. ఆగ్నేయాసియా రాజ్యాలు భారతీయ జీవన విధానాన్ని స్వీకరించింది బలవంతపు ఆక్రమణలవల్లకాదు, దాని నైతిక, మేధోఔన్నత్యాన్ని గుర్తించి మాత్రమే.

**"సిల్క్రోడ్" భ్రమలను ఛేదించిన సముద్రవాణిజ్యం :**

**The Golden Road:** How, *Ancient India Transformed the World* పుస్తకం ప్రపంచ చరిత్రపై ఉన్న ఒక పెద్ద అపోహను పునాదులతో సహా కదిలిస్తుంది. ఇప్పటివరకు ప్రాచీన చరిత్రలో చైనా కేంద్రంగా సాగిన "సిల్క్రోడ్" గురించే ఎక్కువగా మాట్లాడారు. కానీ ప్రాచీన ప్రపంచ ఆర్థిక రంగానికి అసలైన వెన్నెముక *భారతమహాసముద్రపు* సముద్ర వాణిజ్య మార్గాలు.




రోమ్‌సామ్రాజ్యానికి చేరిన అనేక తూర్పుదేశాల వస్తువులు భారతీయ ఓడరేవుల ద్వారానే ప్రయాణించాయి. రోమ్ సామ్రాజ్యం అత్యంత భారీ ఎత్తున నేరుగా వర్తకం సాగించింది భారతదేశంతోనే. తమిళనాడు, కేరళ తీరాల్లో నేటికీ కుప్పలు తెప్పలుగా దొరుకుతున్న రోమన్ బంగారు, వెండి నాణేలే ఇందుకు తిరుగులేని పురావస్తు సాక్ష్యాలు.

రాజకీయంగా భారతదేశం అనేక స్వతంత్ర రాజ్యాలుగా విభజించబడి ఉన్నప్పటికీ, "భారతం" అనే సాంస్కృతిక భావన ఎంత అవిచ్ఛిన్నంగా నిలిచిందో ఫాక్సియాన్, హ్యుయెన్‌త్సాంగ్, స్ట్రాబోవంటి యాత్రికుల రాతలను ఉటంకిస్తూ డాల్రింపుల్ నిరూపిస్తారు.

**కుషాణుల యుగం : నాగరికతల సంగమవేదిక**

భారతీయ ఆలోచనలు దేశ సరిహద్దులు దాటడానికి ఒక బలమైన అంతర్జాతీయ వేదిక అవసరమైంది. ఆ వేదికే కుషాణ సామ్రాజ్యం. ప్రపంచ చరిత్రలో అత్యంత అన్యాయంగా విస్మరించబడిన శక్తులలో కుషాణులు ఒకరు. వారి సామ్రాజ్యం భారతదేశాన్ని మధ్యఆసియా, చైనా, పర్షియా, రోమన్ ప్రపంచాలతో అనుసంధానించింది.

**కనిష్కుడు – నాగరకత నిర్మాత :** కనిష్కుడి గొప్పతనం యుద్ధ విజయాల్లో లేదు, బౌద్ధాన్ని ఒక ప్రపంచ మతంగా తీర్చిదిద్దే మహాయానప్రస్థానానికి ఆయన కల్పించిన రాజపోషణలో ఉంది. ఆయన ఆస్థానం పండితులు, తాత్వికులు, అనువాదకులు, శిల్పులతో కూడిన ఒక అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలా వర్ధిల్లింది.

**గాంధారకళ–రెండు ప్రపంచాల కలయిక :** గ్రీకు కళారూప వాస్తవికత, భారతీయ ఆధ్యాత్మిక భావన ఒకే శిల్పంలో లీనమైన అద్భుత సమ్మేళనమే గాంధారశిల్పకళ. నాగరకతలు ఒంటరిగా ఎదగవు, పరస్పర ఆదాన ప్రదానాలతోనే వికసిస్తాయనడానికి ఇది సజీవ నిదర్శనం.

**నాణేలు పలికిన సామరస్యం :** కుషాణుల నాణేలపై ఒకవైపు శివుడు, మరోవైపు బుద్ధుడు, ఇంకోవైపు గ్రీకు–పర్షియన్ దేవతలు కొలువుదీరి ఉండటం ఆనాటి విశాల దృక్పథాన్ని, మతసామరస్యాన్ని చాటుతుంది.

**ఆసియాకు గురుకులం :** చైనా తదితర దేశాల నుంచి యాత్రికులు ఇక్కడికి వస్తువుల కోసం రాలేదు. జ్ఞానాన్ని ఆర్జించడానికి ప్రాణాలను పణంగాపెట్టి తరలివచ్చారు. నలంద, తక్షశిల, విక్రమశిలవంటి విద్యాకేంద్రాలు భారతదేశాన్ని ఆసియాఖండానికే మహాగురుకుల స్థానంలో నిలిపాయి.

**ది గోల్డెన్ రోడ్** అనేది ఒకేసారి చదివి పక్కనపెట్టేసే పుస్తకం కాదు. అది వేలఏళ్ల భారతీయ మేధోవైభవాన్ని మన కళ్లముందు నిలిపే ఒక మహాదృశ్య కావ్యం. పది అధ్యాయాలుగా విస్తరించిన ఈ గ్రంథంలో ప్రతి అధ్యాయం ఒక విభిన్న కోణాన్ని, చారిత్రక సత్యాన్ని లోతుగా ఆవిష్కరిస్తుంది.

ఈ పది అధ్యాయాల లోతైన సమీక్ష ఎందుకు?

ఒక నాగరకత ప్రపంచాన్ని ఏవిధంగా తీర్చిదిద్దిందో అర్థం చేసుకోవడానికి ఉపరితల పరిశీలన సరిపోదు. ఈ గ్రంథంలోని ఒక్కో అధ్యాయం ఒక స్వతంత్ర ఆలోచనారంగాన్ని–కళ, ఆర్థికవ్యవస్థ, రాజనీతి, విద్య, సంస్కృతి, తత్త్వశాస్త్రం, గణితాలను–లోతుగా స్పృశిస్తుంది. ఈ పది అధ్యాయాలను విడివిడిగా, సవివరంగా సమీక్షించడం ద్వారా కేవలం ఒక పుస్తకాన్ని విశ్లేషించడమే కాకుండా, శతాబ్దాల తరబడి మరుగునపడిన మన సాంస్కృతిక సార్వభౌమత్వాన్ని, ఆధునిక ప్రపంచానికి భారతీయ నాగరకత అందించిన పునాదులను సమగ్రంగా పునఃసమీక్షించుకోవచ్చు.

**పది అధ్యాయాల సమగ్ర అవలోకనం :**

1. **A Gale of Stillness (నిశ్శబ్దపు మహా తుఫాను):** ఈ తొలి అధ్యాయం అజంతా గుహల నిశ్చల గర్భంలో దాగున్న సజీవ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. 1819లో జాన్ స్మిత్ ద్వారా వెలుగు చూసిన ఈ గుహలు కేవలం బౌద్ధసన్యాసుల ఏకాంత స్థావరాలు కావు. అవి ప్రాచీనకాలపు కళ, సమాజం, అంతర్జాతీయ వాణిజ్యాల సమ్మేళన కేంద్రాలు. కళింగ యుద్ధానంతరం కత్తిని విడనాడి మానవతా దృక్పథాన్ని రాజశాసనాలుగా మలచిన అశోకుని పరివర్తనను, మతసహనాన్ని, బౌద్ధం ప్రపంచ నాగరికతలతో సంభాషణ ప్రారంభించిన తొలి క్షణాలను ఈ అధ్యాయం అత్యంత భావోద్వేగభరితంగా చిత్రించింది.

**2. India: The sink of the world's most precious metals (విశ్వ సంపదను ఆకర్షించిన ఆర్థిక కేంద్రం) :** రోమన్ సామ్రాజ్యం భారతదేశపు వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, రత్నాలకోసం వెచ్చించిన అపారమైన సంపదను ఈ అధ్యాయం చర్చిస్తుంది. ప్రాచీన ప్రపంచీకరణకు సిల్క్‌రోడ్ కంటే భారతమహాసముద్రపు సముద్రమార్గాలే అసలైన వెన్నెముక అని డాల్రింపుల్ నిరూపిస్తారు. భారతదేశానికి తరలివచ్చిన రోమన్ బంగారు నాణేలు నాటి ఆర్థిక సమతుల్యతను రోమ్‌కు ప్రతికూలంగా ఎలా మార్చాయో, దక్షిణ భారత తీరప్రాంతాలు గ్లోబల్ ట్రేడ్ హబ్‌లుగా ఎలా వర్ధిల్లాయో ఇందులో సమగ్రంగా వివరించబడింది.

**3. The Great King, King of Kings, Son of God (రాజాధిరాజు : నాగరకతల కలయిక) :** మధ్య ఆసియా, చైనా, పర్షియా, రోమన్ సామ్రాజ్యాలతో భారతదేశాన్ని అనుసంధానించిన కుషాణుల పాలనను, ముఖ్యంగా కనిష్క చక్రవర్తి దార్శనికతను ఈ అధ్యాయం విశ్లేషిస్తుంది. కనిష్కుడి ఆశ్రయంలో బౌద్ధం 'మహాయాన' రూపంలో విశ్వమతంగా ఎలా రూపాంతరం చెందిందో, గ్రీకు కళాసౌందర్యం–భారతీయ ఆధ్యాత్మికత కలిసి 'గాంధారశిల్పకళ'గా ఎలా అవతరించాయో ఇందులో చూడవచ్చు. వివిధ సంస్కృతులు, మతాలు సంఘర్షణ లేకుండా ఎలా సహజీవనం చేశాయో కుషాణుల నాణేల ఆధారంగా రచయిత స్పష్టం చేస్తారు.

**4. The Sea of Jewels: Exploring the Great Library of Nalanda (రత్నాలసాగరం : నలంద గ్రంథాలయ వైభవం) :** ఆసియా నలుమూలల నుంచి జ్ఞాన పిపాసులను ఆకర్షించిన ప్రాచీన అంతర్జాతీయ విశ్వవిద్యాలయం నలంద విశిష్టతను ఈ అధ్యాయం ఆవిష్కరిస్తుంది. తొమ్మిది మిలియన్లకు పైగా తాళపత్ర గ్రంథాలతో అలరారిన **ధర్మగంజ్** గ్రంథాలయం, అక్కడి కఠినమైన ప్రవేశపరీక్షలు, బౌద్ధ, హిందూ, తార్కిక, ఖగోళశాస్త్రాల బోధనా పద్ధతులను ఇది కళ్లకు కడుతుంది. చైనాయాత్రికుడు హ్యూయెన్‌త్సాంగ్ సాగించిన ప్రమాదకర ప్రయాణం, భారతదేశం ఆసియాఖండానికి జ్ఞానగురుకుల కేంద్రంగా నిలిచిన వైనం ఇందులో విస్తృతంగా చర్చించబడింది.

**5. The Fifth Concubine (చైనా సింహాసనంపై భారతీయముద్ర) :** చైనా రాజకీయ, సాంస్కృతిక ముఖచిత్రాన్ని భారతీయబౌద్ధ ఆలోచనలు ఎలా ప్రభావితం చేశాయో చైనా ఏకైక సామ్రాజ్ఞి **వూజెటియాన్** (Wu Zetian) పాలన ఆధారంగా ఈ అధ్యాయం వివరిస్తుంది. బౌద్ధసూత్రాల ఆధారంగా తన సార్వభౌమత్వాన్ని స్థిరపరచుకున్న ఆమె, భారతీయ పండితులను ఆహ్వానించి సంస్కృత గ్రంథాలను చైనీస్ భాషలోకి అనువదింపజేసింది. భారతీయ తాత్త్వికత చైనా రాజప్రాసాదాలు, సామాన్య ప్రజల జీవనశైలిలో అంతర్భాగంగా ఎలా మారిందో ఈ అధ్యాయం లోతుగా స్పృశిస్తుంది.

**6. The Diaspora of the Gods (దేవతల దిగ్విజయం : సంస్కృతవలయం) :** భారతీయ దేవతలు, ఇతిహాసాలు ఎటువంటి సైనిక దండయాత్రలు లేకుండానే సముద్రాలు దాటి ఆగ్నేయాసియాకు ఎలా చేరాయో ఈ అధ్యాయం వివరిస్తుంది. రామాయణ, మహాభారతగాథలు, శైవ-వైష్ణవ సంప్రదాయాలు ఇండోనేషియా, కంబోడియా, థాయ్‌లాండ్ దేశాల సంస్కృతిలో ఎలా స్థిరపడ్డాయో చూపిస్తుంది. స్థానిక సంస్కృతులను తుడిచిపెట్టకుండా, వాటితో సామరస్యంగా కలిసిపోయిన భారతీయ **సాంస్కృతిక ప్రవాహం** (Sanskrit Cosmopolis) విశిష్టతను ఇది చాటి చెబుతుంది.

**7. In the Land of Gold (సువర్ణ భూమిలో నాగరికతావికాసం) :** ఆగ్నేయాసియాలోని 'సువర్ణభూమి'తో ప్రాచీన భారతదేశం సాగించిన వర్తక, సాంస్కృతిక బంధాలను ఈ అధ్యాయం చర్చిస్తుంది. మలక్కాజల సంధిగుండా సాగిన వాణిజ్య నౌకలు సంపదతోపాటు శిల్పకళ, నగరప్రణాళిక, పరిపాలనావిధానాలను కూడా చేరవేశాయి. శ్రీ విజయ, మజాపహిత్ వంటి బలమైన సామ్రాజ్యాల ఆవిర్భావానికి, అక్కడ రూపుదిద్దుకున్న హిందూ-బౌద్ధ సంస్కృతుల సమన్వయానికి భారతీయ ప్రభావం ఎలా పునాదిగా నిలిచిందో ఇందులో వివరించబడింది.

**8. He who is protected by the Sun (సూర్యరక్షిత సామ్రాజ్యాలు & అంగ్కోర్వాట్ వైభవం) :** ఖ్మేర్ (Khmer) సామ్రాజ్యం, సూర్యవర్మన్ వంటి పాలకుల తాత్త్విక భావనలు, ప్రపంచంలోనే అతి పెద్ద మతపరమైన కట్టడమైన కంబోడియాలోని **అంగ్కోర్వాట్** నిర్మాణ నేపథ్యాన్ని ఈ అధ్యాయం వివరిస్తుంది. విశ్వస్వరూపాన్ని (Cosmology) రాతిలో ప్రతిబింబింపజేసిన హైందవ నిర్మాణశాస్త్రం, క్షీరసాగరమథన శిల్పాలు భారతీయ ఆలోచనా పరిధి ఎంతటి మహోన్నత స్థాయికి విస్తరించిందో చాటిచెబుతాయి.

**9. The Treasury of the Books of Wisdom (వివేక గ్రంథాల అంతర్జాతీయ ప్రస్థానం) : పంచతంత్రం, జాతకకథలు** వంటి భారతీయ నీతిశాస్త్రాలు, తత్త్వాలు అరబిక్, పర్షియన్ భాషల్లోకి అనువదించబడి, బగ్దాద్‌లోని 'బైత్‌అల్-హిక్మా' (House of Wisdom) ద్వారా ఐరోపాకు ఎలా చేరాయో ఈ అధ్యాయం వివరిస్తుంది. **కలీలావాదిమ్నా** పేరుతో ప్రపంచవ్యాప్తమైన పంచతంత్ర కథలు పాశ్చాత్య సాహిత్యంపై వేసిన ముద్రను విశ్లేషిస్తూ, మానవ వివేక వికాసంలో భారతీయ కథాసంప్రదాయం పోషించిన పాత్రను ఇది ఎత్తి చూపుతుంది.

**10. Fruits of the Science of Numbers (ప్రపంచాన్నినడిపిస్తున్నభారతీయగణితం) :** ఆధునిక సాంకేతిక విప్లవానికి, శాస్త్రవిజ్ఞానానికి పునాది అయిన సున్నా (Zero), దశాంశ పద్ధతి (Decimal System), త్రికోణమితి వంటి భారతీయ గణిత ఆవిష్కరణలను చివరి అధ్యాయం చర్చిస్తుంది. బ్రహ్మగుప్తుడు, ఆర్యభట్టుల సిద్ధాంతాలు అరబ్ ప్రపంచం (అల్-ఖ్వారిజ్మీ ద్వారా) మీదుగా ఐరోపాకు చేరి ప్రపంచ విజ్ఞానాన్ని ఎలా మార్చాయో వివరిస్తూ, కంప్యూటర్ యుగానికి మూలమైన సంఖ్యావ్యవస్థ భారతీయ మేధస్సు అందించిన అత్యున్నత కానుక అని డాలింపుల్ ముగిస్తారు.

ఈ పది అధ్యాయాలు ప్రాచీన భారతదేశం ప్రపంచానికి కేవలం ఒక వర్తక భాగస్వామి మాత్రమే కాదని, మానవ నాగరికతకు దిశానిర్దేశం చేసిన నిరంతర మేధో ప్రవాహమని తిరుగులేని ఆధారాలతో స్పష్టం చేస్తాయి. ఈ పది అధ్యాయాలు ప్రాచీన భారతదేశం ప్రపంచానికి అందించిన అపురూపమైన మేధో, సాంస్కృతిక సంపదను ప్రతిబింబించే అద్దాలు. ఈ మహా ప్రస్థానాన్ని అర్థం చేసుకోవడానికి మనం కాలచక్రంలో వెనక్కి ప్రయాణించి, ఒక్కో అధ్యాయాన్ని లోతుగా తరచి చూడాలి. ఆ జ్ఞానయాత్రకు నాందిగా, రాబోయే సంచికలో అజంతా గుహల నిశ్శబ్దగర్భంలో శతాబ్దాల చరిత్రను మేల్కొలిపిన తొలి అధ్యాయం– A Gale of Stillness తో మన సమగ్ర సమీక్షా ప్రయాణాన్ని ప్రారంభిద్దాం.

**యన్. విజయరాఘవ రెడ్డి**
(విశ్రాంత కార్యక్రమ నిర్వహణాధికారి, ఆకాశవాణి,
ఫోన్ : 944 123 9803)

# గాంధీ – చార్లీ చాప్లిన్ సమావేశం

## తూర్పు, పశ్చిమల సంగమం

**– అవధానం రఘుకుమార్**

**తూ**రుపు తూరుపే, పడమర పడమరే కానీ ఇద్దరు యోధులు కలసిన వేళ అన్ని దూరాలు కరగిపోతాయి. ఒకరు తూరుపు గంభీరపు స్వేచ్ఛా సమర యోధుడు – మహాత్మా! ప్రాక్, పశ్చిమ దేశాల ప్రతి హృదిలో అప్పటిదాకా తెలియని నూతన సత్యావిష్కరణాలను, సమస్యల పరిష్కార మార్గాలను, వెలుగులను ప్రసారిస్తోన్న మహామనీషి – మోహన్‌చంద్ కరమ్ చంద్ గాంధీ. జైన, వైష్ణవ సాంప్రదాయాల నుండి మొదలయ్యి, పశ్చిమ దేశాల ఉన్నతమైన ఆలోచనలను, భారతీయ సనాతన భావాలతో మేళవించిన అరుదైన దార్శనీకుడు. రాజకీయ పోరాటానికి, వలస దోపిడీకి, విదేశీ ఆధిపత్య ధోరణులకు, శ్వేత జాత్యహంకారానికి వ్యతిరేకంగా జరిగే స్వేచ్ఛా, స్వాతంత్ర్య పోరాటాలకు కేవలం సాయుధ, హింసాత్మక పోరాటాలు మాత్రమే మార్గాలు అని ప్రాక్, పశ్చిమ దేశాల మేధావులు, జ్ఞానులు కొండెక్కి కూస్తున్న కాలాన, మానవ హేతుకతను మరచి, దానిపై విశ్వాసం లేక, ఆయుధం అనివార్యం అంటున్న సమయాన, ఆ ఆలోచనలు తప్పని, సత్యం, అహింస, శాంతియుత మార్గాలలో కూడా ప్రాచీన కాలాల నుండి యుద్ధాలు జరిగాయని, జరగవచ్చని, శత్రువుపై ద్వేషం కంటే అతనిలోని ఉన్నత విలువలను ఉద్దీపింప చేయడం శాశ్వత ఫలితాలను, ఉత్తమమైన సమాజాన్ని నిర్మిస్తుందని భావించిన వైతాళికుడు. సాంప్రదాయకుల దృష్టిలో అరాచక వాది, వామపక్ష మేధావుల ఆలోచనలలో సాంప్రదాయ వాది అని విమర్శలందుకున్న తన సహచరులతో సహా ఎందరికో అర్థం కానీ ప్రహేళిక.

స్వాతంత్ర్యం అంటే బ్రిటిష్ వారిని తరిమి వేయడం కాదు, మనలోని దాస్యభావాన్ని తొలగించుకోవడం, సమస్య మనలో వుంది, ఆ తెల్లవాడి అధికార యంత్రాంగంలో కాదు అని 'స్వరాజ్' అన్న పదానికి కొత్త అర్థం ఇచ్చిన దార్శనికుడు. బ్రిటిష్ వాళ్ళ కళ్ళలోకి సూటిగా చూసి, వెన్నెముక నిటారుగా వుంచుకుని మాట్లాడడమే స్వరాజ్యానికి మొదటి ముందడుగు అంటూ ప్రకటించిన వాడు. స్వాతంత్ర్యం అంటే ముందు మనం ఆధ్యాత్మికంగా, మానసికంగా విముక్తిని సాధించడం, ఆ తరువాతే భౌతిక, భౌగోళిక, రాజకీయ స్వాతంత్ర్యం అని భావించిన వ్యక్తి.

మరొకరు పశ్చిమ దేశాన వెలిసిన పదార్థవాద, హేతువాదాల ప్రతిరూపం. ఆధునికుడు. పారిశ్రామిక విప్లవం శ్రామికుణ్ణి స్వేద బంధనాల నుండి విముక్తి చేసింది, సామ్యవాదం దాన్ని సైద్ధాంతికంగా వివరించింది అని బలంగా విశ్వసించిన సామాజిక కళాకారుడు. హాస్యానికి, నటనకూ కొత్త వర్ణాలు అద్దుతోన్న నటుడు. "ది లిటిల్ ట్రాంప్" అని ప్రేమగా పిలిపించుకున్న **సర్ చార్లీ చాప్లిన్.** మూకీ సినిమాలను, హాస్యాన్ని, సినిమా భాషను ప్రపంచ భాషగా మార్చిన వ్యక్తి. హాస్యం, హాస్య నటుడు అంటే విచిత్ర వేషధారణతో, ఏవో కొన్ని సర్కస్‌లో కొన్ని విచిత్ర విన్యాసాలు అనుకునే సాంప్రదాయ హాస్యానికి నూతనార్థలను, సామాజిక తాత్వికతను సమన్వయం చేసిన విలక్షణుడు.

ఒక్క భారతీయ నాట్య శాస్త్రంలో మాత్రమే కాదు, పాశ్చాత్య నాట్య శాస్త్రాలలో కూడా హాస్య నటుడు లేదా విదూషకుడు అంటే : నాటకంలోని గంభీర అధ్యాయాల మధ్య భావోద్వేగాలను తగ్గించే ఒక పాత్ర. షేక్స్పియర్ విషాద నాటకాలలో కూడా విదూషకుడు అతి ముఖ్యమైన విషాదభరిత సన్నివేశాలలో ఆ ప్రవాహాన్ని, గంభీర, శోక రసాప్లవాల నుండి ప్రేక్షకులను రక్షించే, నాటకాన్ని మరింత రక్తి కట్టించే దిశగా ఆటవిడుపుగా వచ్చే ఒక పాత్ర. భారతీయ సాంప్రదాయ నాటకంలోనూ, ముఖ్యంగా సంస్కృత నాటకాలలో, విదూషకుడు ఒక ముఖ్యమైన

పాత్రధారుడైనా అతనికి ప్రత్యేకమైన రూపం, స్వభావం ముందే నిర్ణయింపబడ్డది. సాధారణంగా బట్టతల, వికృతమైన ముఖకవళికలు, విచిత్ర వేషధారణ కలిగి వుండి ఆ బాహ్య రూపమే ప్రేక్షకులను నవ్వించాలి అని భావించారు. అతను భోజన ప్రియుడు, పిరికి వాడు, లేదా నాయకుడిని నవ్వించే స్నేహితుడు. అయితే భారతీయ సాంప్రదాయ నాట్యశాస్త్రం అతనికి కొన్ని ప్రత్యేకతలను కూడా ఆపాదించింది అన్నది మరో కోణం. పాశ్చాత్య సాంప్రదాయ నాటకశాస్త్రంలోనూ అతనికి కొన్ని ప్రత్యేక బాధ్యతలు వున్నా, చాలా వరకూ విదూషకులు తెలివి తక్కువ వారు, కేవలం హాస్య ప్రాధాన్యతే వారి పాత్ర. కానీ హాస్య నటుడిని ప్రధాన పాత్రధారుడినే కాదు, నాయకుడిగా మార్చిన వ్యక్తి **చార్లీ చాప్లిన్.**

గాంధీ సినిమాలు చూడడు. అతని కార్య క్షేత్రం సమాజం. అది కూడా సూర్యాస్తమయం తెలియని సువిశాల సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరులో తలమునకలైన వ్యక్తి. అలాగని అతనికి కళలు, హాస్యం తెలియదు అనలేము. తన డెబ్బై తొమ్మిది ఏళ్ల జీవన ప్రస్తావనలో ఒకటో, రెండో సినిమాలు చూసినట్టు తెలుస్తోంది. 1944లో అనారోగ్యంతో ముంబాయి దగ్గర జుహూలో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, "రామరాజ్య" అనే సినిమా ఒకటి చూసినట్టు తెలుస్తోంది. అయితే ఆ సినిమాను చూసి ఆనందంతో ఉప్పొంగిన దాఖలాలు లేవు. "రామరాజ్యం" తన కలల ఆదర్శరాజ్యం అయినా, సినిమా అనే అనుభవం ఆయనకు ఏదో అర్థం కానీ శబ్దకాలుష్యంలా అనిపించిందట. అలాగే అంతకు ముందు "మిషన్ టు మాస్కో" అని రెండవ ప్రపంచ యుద్ధ సమయాన అమెరికా, రష్యాలు కలసి పనిచేయవలసిన అవసరాన్ని తెలిపే ఒక హాలీవుడ్ ప్రచార సినిమాను కూడా చూసాడట. కానీ మొత్తం మీద గాంధీ ఆలోచనలలో సినిమా అనేది ఒక "పాపమయమైనది" లేదా "అవినీతి సాంకేతికత ఉత్పత్తి". చిన్నతనంలో "హరిశ్చంద్ర", "శ్రావణ కుమార" లాంటి నాటక ప్రక్రియలను చూసినట్టుగా తెలుస్తోంది. వాటివల్ల తాను అనేక ఆధ్యాత్మిక ప్రకంపనలకు లోనేయినట్టు ఆయన రాసుకున్నట్టు కూడా మనకు తెలుసు.

గాంధీ కళలూ, కళాస్వరూపాలు తెలియని మూర్ఖుడా? కళలపట్ల అతనికి ఎలాంటి అవగాహన వుండేది? హాస్యం, చతురత, కళాభినివేశం, రసికత లేని మూర్తీభవించిన జాడ స్వరూపమా? ఈ ప్రశ్నకు సమాధానాలు వెదికిన ఆధునిక పరిశోధకులలో **ఆంథోనీ జే. పేరెల్** అనే చరిత్రకారుడు ఒకడు. ఆయన తన 2006వ సంవత్సరపు "గాంధీ'స్ ఫిలాసఫీ అండ్ ది క్వెస్ట్ ఫర్ హార్మోని" పుస్తకంలో ఈ విషయంపైన కొంత చర్చ వుంటుంది. అందులోనే ఈ.ఏం. ఫోస్టర్ గాంధీ గురించి రాసిన వాక్యం ప్రస్తావన కూడా వుంటుంది: "కళలు తన ప్రధాన ప్రచార సాధనం కాకపోయినా, గాంధీ గొప్ప కళాకారులతో కలిసే వుండేవాడు" అని. అదే సమయంలో **పార్థ మిట్టర్** అనే మరో కళాచరిత్రకారుడు తన "ఇండియా 1850-1922" అనే పుస్తకంలో "గాంధీ కార్యక్రమాలలో నందాలాల్ బోస్ హరిపురా కాంగ్రెస్ సభాస్థలిని అలంకరించిన సంఘటన మినహాయిస్తే గాంధీకి కళలతో ఎక్కడా సంబంధం కనబడదు" అంటాడు.

అయితే 1931లో రెండవ రౌండ్ టేబల్ సమావేశం నుండి తిరిగి ఇండియా వచ్చేప్పుడు గాంధీ తన శిష్యురాలు మీరాబెన్ (మెదిలియన్ స్లేడ్) కోరికపై జెనీవాలోని రోనాల్డ్ రోలా ఇంటికి వెళ్ళి అక్కడ ఒక వారం వుంటాడు. అక్కడ రోలాతోపాటు అనేక మంది పాశ్చాత్య మేధావులతో దాదాపు వారం రోజులు సమావేశమై సుదీర్ఘ చర్చలో భాగస్వామి అవుతాడు. ఆ సమయంలో రోలాకు, గాంధీకి మధ్య "కళలు, కవిత్వం" అనే అంశంపై సుదీర్ఘ చర్చ జరుగుతుంది. అలాగే 1936లో గుజరాతీ సాహిత్య సొసైటిలో ఇచ్చిన ఉపన్యాసంలో "కళలు, సాహిత్యం ప్రజలకు మరింత చేరువ అవ్వాలని" సూచిస్తాడు. వీటన్నింటికంటే బలమైన సాక్ష్యం తన "హింద్ స్వరాజ్" హిందీ రూపానికి అనుబంధంగా గాంధీ టాల్‌స్టాయ్ రచన "వాట్ ఈజ్ ఆర్ట్?" మరియు రస్కిన్ రాసిన "ఏ జాయ్ ఫర్ ఎవర్" అనే సాహిత్య వ్యాసాలను చేరుస్తాడు. అంటే గాంధీకి కళల పట్ల అవగాహన కానీ, తనదైన ఆలోచనలు కానీ లేవూ అనలేము.

1931లో గాంధీ రెండవ రౌండ్ టేబల్ సమావేశాల సందర్భంగా లండన్‌లో ఉన్నప్పుడు అనేక మంది ప్రపంచ నాయకులు, మేధావులు, రకరకాల నిపుణులు, కళాకారులు, పార్లమెంట్ సభ్యులు, రచయితలు ఆయనను కలిసే ప్రయత్నం చేశారు. అందులో ఒకరు చార్లీ చాప్లిన్.

ఆ విషయంపై శ్రీశ్రీ తన "అనంతం"లో ఒకచోట ఇలా రాశాడు: "తర్వాత చాలా కాలానికి లండన్‌లో గాంధీ గారిని చార్లీ చాప్లిన్ చూసినప్పుడు చిత్రాలను తూలనాడుతూ గాంధీగారు మాట్లాడబోతే, చాప్లిన్ కాస్తా గట్టిగానే ఇచ్చుకున్నాడు. తానే ప్రపంచ ప్రసిద్ధుడయిన వ్యక్తి అయినట్టుగా గాంధీగారు చాప్లిన్ పేరే వినలేదనీ, అసలు సినిమా ఎలా వుంటుందో తనకనవసరమని, అయినా ఈ యంత్ర నాగరికత అంటేనే తనకు పరమ అసహ్యమనీ ఆ అంగవస్త్రధారి మాట్లాడితే చాప్లిన్ తనకు కూడా ప్రపంచపు మారు మూలాల్లోసహా కాస్త పేరుందని, ప్రపంచ ప్రజలందర్నీ ఏకం చేయగల ఒకే భాష మూకీ చిత్రం మాట్లాడుతుందనీ, ఇంతకీ గాంధీ గారు మెచ్చుకునే రాట్నం కూడా ఒక యంత్రమే అనీ, మనం తిట్టవలసింది యంత్రాలని కాక వాటిని సాటి మానవుణ్ణి దోచుకునే సాధనాలుగా ఉపాయోగించే మానవులనే అనీ, ఇలా ఎడాపెడా వాయించాడు. ఈ కమ్యూనిస్ట్‌తో వాదించి, వాదించి లాభం లేదనుకున్నాడో ఏమో అక్కడితో గాంధీ గారు మౌనంలోకి నిష్క్రమించారు."

ఎంత దురదృష్టకరం? తెలుగు ప్రజలు మహాకవీ అని పిలుచుకునే శ్రీ శ్రీ ఇంత బాధ్యతారహితంగా ఒక విషయాన్ని ప్రజలకు ఎలా చెప్పారు? ఒక చిన్న పిల్లవాడిలాగా, ఒక దుందుడుకు స్వభావంతో ఆ సంఘటనను రిపోర్ట్ చేయడం ఏమిటి? చార్లీ చాప్లిన్ గాంధీకి ఇచ్చిపడేశాడా? గాంధీ జవాబు చెప్పలేక మౌనంలోకి నిష్క్రమించాడా? నిజానికి ఆ సమయాన గాంధీ, చాప్లిన్ కలయిక, సమావేశం ఎలా జరిగినది? ఇంతకీ దీనిపై గాంధీ ఏమన్నాడు? చాప్లిన్ ఏమన్నాడు? (ఈ వ్యాస రచనకు ప్రేరేపణ ఈ ప్రశ్నల నుండే వచ్చింది.)

మొదట గాంధీ వైపు నుండి పరిశీలిద్దాం. 1931లో రెండవ రౌండ్ టేబల్ సమావేశాలకు గాంధీ వెళ్ళడం అనేది ఇటు భారతదేశ చరిత్రలోనూ, అటు ప్రపంచ చరిత్రలోనూ అత్యంత ముఖ్యమైన సంఘటన. సెప్టెంబర్ 12వ తారీఖు నుండి డిసెంబర్ 14 దాకా లండన్‌లో గాంధీ వున్నాడు. 1909 తరువాత గాంధీ మళ్ళీ 22 ఏళ్ల పాటు ఇంగ్లండ్ వెళ్ళ లేదు. ఈ మధ్యకాలంలో భారత స్వాతంత్ర్య పోరాటంలో అనేక చారిత్రకమైన సంఘటనలు జరిగాయి. స్వదేశీ వస్తు ఉత్పత్తి, విదేశీ వస్త్ర బహిష్కరణ, మొదటి ప్రపంచ యుద్ధం, రష్యాలో కమ్యూనిస్ట్ విప్లవం, జర్మనిలో హిట్లర్ ఎదుగుదల, ఇలా అనేక ప్రపంచ సంఘటనల ప్రభావం ప్రపంచం మీద పడింది.

పాశ్చాత్య దేశాల మేధావులు తీవ్రమైన గందర గోళంలో వున్నారు గత శతాబ్దం పైగా వారు పెంచి పోషించుకున్న విక్టోరియన్ విలువలు, హేతుకత పతనం చెందడం, యుద్ధాలు, పారిశ్రామిక విప్లవ ఫలితాలపై కొన్ని ప్రశ్నలు .. ఇలా ఎన్నో ప్రశ్నలకు ప్రపంచ దేశాలు సమాధానం వెదుక్కుంటున్నాయి. ఈ నిర్భ్రాంతపోయిన పాశ్చాత్య సమాజం గాంధీ లండన్‌లో వున్న సమయంలో ఈయన ద్వారా ఏదైనా కొత్త పరిష్కారాల అవకాశం వుందా అని ఎదురు చూస్తోంది.

గాంధీ అక్కడ వున్న నాలుగు నెలలు ఒక్క క్షణం తీరికలేని సభలు, సమావేశాలు. అలా ఆ సమయంలో గాంధీని కలవాలని ఆసక్తి చూపిన ప్రముఖులలో కొందరు – జార్జ్ బెర్నార్డ్ షా, డా. హ్యులెట్ జాన్సన్, సి. పి. స్కాట్, ఎవెలిన్ రెన్చ్, లాయడ్ జార్జ్, డా. గిల్బర్ట్ ముర్రే, ప్రొఫెసర్ హెరాల్డ్ జే లాస్కి డా. లిండ్సే, ప్రొఫెసర్ ఎడ్వర్డ్ థామ్సన్. నిజానికి ఈ లిస్ట్ చాలా పెద్దది. అలాగే గాంధీ విదేశీ వస్త్ర బహిష్కరణ, ఖాదీ ఉద్యమం వల్ల మాంచెస్టర్‌లో, ఇంకా అనేక చోట్ల వస్త్ర పరిశ్రమ కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి వున్నారు. వారూ గాంధీని కలవడానికి ఆసక్తిగా వున్నారు. స్త్రీల ఓటు హక్కు ఉద్యమకారులు కూడా గాంధీతో సంభాషించాలని కోరుకుంటున్నారు. అనేక ఇతర దేశాల స్వాతంత్ర్య పోరాటాలలో తలమునకలై ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించే వారు గాంధీ నుండి సలహాల కోసం ఎదురు చూస్తున్నారు.

అదే సమయంలో చార్లీ చాప్లిన్ తన "సిటీ లైట్స్" సినిమా ప్రమోషన్ కోసం దాదాపు దశాబ్దం తరువాత లండన్‌కు తిరిగి వచ్చాడు. ఆయనకూ ఆ కొద్ది సమయంలో తాను కలవవలసిన పెద్ద జాబితా ఒకటి వుంది. అందులో ప్రధానంగా సినిమా పరిశ్రమకు చెందిన వారు, మేధావులూ, రాజకీయ నాయకులూ .. ఉన్నారు. మొదట చార్లీ చాప్లిన్ గాంధీ ఇంటర్వ్యూ కోసం అడిగితే గాంధీ తన విముఖతను ప్రదర్శిస్తాడు అని కొన్ని వార్తలూ ఉన్నాయి.

ఈ విషయంపై గాంధీ ఏమైనా ప్రస్తావించారా? గాంధీ సమగ్ర సాహిత్య సంకలనాలలో 48వ వాల్యూమ్‌లో

తనకు, చాప్లిన్‌కు సంబంధించిన ఇంటర్వ్యూ గురించి కొన్ని వివరాలు వున్నాయి. 22 సెప్టెంబర్, 1931న ఆ సమావేశం లండన్‌లోని ఈస్ట్ ఇండియా డాక్ రోడ్డులో ఒక మురికివాడలో డా. కతియాల్ ఇంట్లో జరిగినది. గాంధీ వ్యక్తిగత కార్యదర్శి, సహచరుడు మహదేవ్ దేశాయి "లండన్ లెటర్" అనే రిపోర్టులో దీని వివరాలు ఇచ్చారు. అదే ఈ సంపుటిలో పేజి 47-48లో పేర్కొనబడినది. "మీరు యంత్రాలను ద్వేషిస్తారెందుకు? అవి మనుషులను శ్రమ దాస్యం నుండి విముక్తి చేసి శ్రామికుడికి తన మేధో పరమైన, ఇతర ఆనందాలకు అవకాశం ఇస్తుంది కదా?" అన్న చాప్లిన్ ప్రశ్నను ఆహ్వానిస్తూ గాంధీ ఇచ్చిన వివరణ: "అవును. బట్టలు, తిండి విషయంలో ప్రతీ దేశం స్వతంత్రంగా వుండాలి. మేము స్వయం సమృద్ధి కలిగిన దేశంగా వుండేవారం, మేము మళ్ళీ అలా అవడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఎక్కువ స్థాయిలో వస్తు ఉత్పత్తి చేయడం వల్ల ఇంగ్లండ్‌కు విదేశాలలో మార్కెట్ కావాలి. దాన్నే మేము దోపిడి అంటాం. ఈ దోపిడి చేసే ఇంగ్లండ్ ప్రపంచానికే పెద్ద ప్రమాదం. అది అలా వుంటే తన వలస దేశం అయిన భారతదేశంలో దాని అవసరాలకు మించి యంత్రాలూ, బట్టలు ఉత్పత్తి ఎంత ఎక్కువ దోపిడి చేసిందో?"

చాప్లిన్ మాట్లాడుతూ "అంటే ఈ ప్రశ్న ఇండియాకే పరిమితమా? ఒకవేళ ఇండియాకు రష్యాలాగా స్వాతంత్ర్యం వస్తే మీ దేశంలో నిరుద్యోగులకు ఇతర మార్గాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి, ఉత్పత్తి ఆదాయాన్ని సమానంగా పంచడానికి మీరు యంత్రాలను ద్వేషించరన్నమాట? మీరు శ్రామికులకు తక్కువ పని గంటలు, ఎక్కువ విశ్రాంతిని అంగీకరిస్తారా?" అని అడుగుతాడు. దానికి గాంధీ "ఖచ్చితంగా!" అని సమాధానం ఇస్తాడు.

అప్పుడు చార్లీ చాప్లిన్ అంటాడు : "నేను సహజంగానే మీ స్వాతంత్ర్య పోరాటం పట్ల సంఘీభావంతో ఉన్నాను. అయినా యంత్రాలపై మీ అభిప్రాయాల విషయంలో గందరగోళంలో వున్నాను." దానికి జవాబు చెబుతూ గాంధీ అత్యంత ప్రశాంతంగా అన్న మాటలు ఇవి : "నేను అర్థం చేసుకోగలను. అయితే ఇండియా ఆ ఆశయాలను సాధించడానికి ముందు బ్రిటిష్ పరిపాలన నుంచి బయటపడాలి. గతంలో ఈ యంత్రాలు మమ్మల్ని ఇంగ్లండ్‌పై ఆధారపడేలా చేశాయి. ఆ ఆధారపడటం నుండి బయట పడాలి అంటే ఆ యంత్రాలు ఉత్పత్తి చేసిన వస్తువులను బహిష్కరించాలి. అందువల్లే చర్ఖాను వాడటం, మా బట్టలు మేమే ఉత్పత్తి చేసుకోవడం మా దేశభక్తి అంశంగా చేసుకున్నాం. ఇంగ్లండ్‌లాంటి బలమైన దేశాన్ని ఎదురించడంలో అది మా పోరాట రూపం. ఇంకా అనేక కారణాలు ఉన్నాయి. ఇండియా వాతావరణం భిన్నమైనది. దాని అలవాట్లు, అవసరాలు భిన్నమైనవి. ఇంగ్లండ్ లోని చల్లటి వాతావరణం వాళ్ళకు తీవ్రమైన శ్రమతో కూడిన పరిశ్రమల అవసరాన్ని కలిగిస్తుంది. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కూడిన ఆర్థిక వ్యవస్థను సృష్టిస్తుంది. మీకు తినడానికి ఉపయోగపడే వస్తువులు తయారు చేసే పరిశ్రమలు కావాలి. మేము మా చేతులతో తింటాం. ఇలాంటి ఎన్నో అంశాలు అనేక విభేదాలకు కారణం అవుతుంది."

అసలు ఎందుకు గాంధీ తొలుత చార్లీ చాప్లిన్ కలయికకు అభ్యర్థనను మన్నించలేదు? గాంధీ జీవిత చరిత్ర గురించి ఎనిమిది సంపుటుల పుస్తకం రాసిన జి.డి.టెండూల్కర్ తన మూడవ వాల్యూమ్‌లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తాడు. సినిమా నటులు అంటే చాలా విలాసవంతమైన జీవితాలు గడిపే ఉన్నత వర్గాలకు చెందిన వారు అని గాంధీ అభిప్రాయం. అయితే గాంధీ సెక్రెటరీ చాప్లిన్ ఒక పేద కుటుంబం నుండి వచ్చాడని, అతను సామాజిక అంశాలపై సినిమాలు తీస్తూ వుంటాడని చెప్పడంవల్ల గాంధీ ఆ మీటింగుకు ఒప్పుకుని, యంత్రాల విషయంలో తన, అతని అభిప్రాయాలను పంచుకోడానికి ఒప్పుకుంటాడు అని వుంది. ఇంతకు మించి ఆ మీటింగుపై పెద్ద చర్చ ఆ పుస్తకంలో లేదు.

గాంధీ జీవిత చరిత్రపై వచ్చిన మరో ముఖ్యమైన పుస్తకం లూయి ఫిషర్ రాసిన "ది లైఫ్ ఆఫ్ మహాత్మా గాంధీ" లో కూడా ఈ కలయిక చిన్న ప్రసావన వుంది. అందులో పేజి 353-354లలో ప్రస్తావన ఇలా వుంది: చార్లీచాప్లిన్ గాంధీని కలవాలని కోరుతూ ఆయన అపాయింట్మెంట్‌ను అడిగాడు. గాంధీ ఆయన గురించి ఎప్పుడూ వినలేదు. ఆయన కదిలే చిత్రాలను కూడా ఎప్పుడూ చూడలేదు. చాప్లిన్ గురించి తన సహచరులు చెప్పినప్పుడు గాంధీ తనకు సినిమా నటులు అంటే

ప్రత్యేకమైన ప్రేమ లేదు అంటాడు. అయితే ఎప్పుడైతే అతను లండన్‌లోని ఈస్ట్‌వుడ్‌లోని పెద కుటుంబం నుండి వచ్చాడు అని చెబుతారో అప్పుడు అతను డా. కతియాల్ ఇంట్లో కలవడానికి ఒప్పుకుంటాడు. ఆ కలయిక పళ్ళులేని, పళ్లున్న ఇద్దరి మధ్య నవ్వుల పోటీలా సాగింది అంటాడు ఫిషర్. అది తప్పనిసరిగా యంత్రాల మీద గాంధీ అభిప్రాయాలపై చర్చకు దారి తీసింది. నిజానికి చాప్లిన్ గాంధీకి సంబంధించిన మొదటి ప్రశ్న అదే. బహుశా గాంధీ ఇచ్చిన సమాధానం చాప్లిన్ తదుపరి చిత్రాలకు ప్రేరణగా పనిచేసిందేమో?" అని కూడా ప్రశ్నిస్తాడు ఫిషర్. ఎందుకు అని ఫిషర్ వివరించలేదు కానీ చాప్లిన్ తరువాతి సుప్రసిద్ధ సినిమా "మోడర్న్ టైమ్స్" 1936లో వస్తుంది. ఇందులో పెరిగిపోతున్న పారిశ్రామిక సంస్కృతిపై విమర్శ హాస్యం రూపంలో కనిపిస్తుంది.

గాంధీ మీద మరింత విస్తృతమైన రచనలలో రాబర్ట్ పైన్ రాసిన "ది లైఫ్ అండ్ డెత్ ఆఫ్ మహాత్మా గాంధీ" ఒకటి. అందులోని 414-16 పేజీలలో ఈ విధంగా వుంది: "అప్పుడు తన సినిమా "సిటీ లైట్స్" ప్రమోషన్ కోసం వచ్చిన చార్లీ చాప్లిన్‌కు, గాంధీకి మధ్య ఒక ఆనందకరమైన ముఖాముఖీ జరిగింది. గాంధీ ఎప్పుడూ చాప్లిన్ గురించి వినలేదు, సినిమాలు చూడలేదు, నిజానికి సినిమా నటులు అంటే అతనికి ఏ మాత్రం ఇష్టం లేదు. చాప్లిన్ "లిటిల్ ట్రాంప్" అనే పాత్ర సృష్టికర్త, ఆ పాత్రకు ప్రపంచమంతటా అనేక మంది అభిమానులు ఉన్నారు అన్నా గాంధీ పెద్దగా ప్రభావితం కాలేదు. కానీ ఎప్పుడైతే చాప్లిన్ లండన్‌లోని ఈస్ట్ ఎండ్‌కు చెందిన ఒక పేద కుటుంబం నుండి వచ్చాడు అని తెలుసుకుంటాడో అప్పుడు గాంధీ కొంత తగ్గాడు. ఈస్ట్ ఇండియా డాక్ రోడ్డులో వున్న భారత దేశానికి చెందిన ఒక వైద్యుడి చిన్న ఇంట్లో ఈ సమావేశం జరిగినది. చాప్లిన్ నేరుగా యంత్రాల ఉపయోగం, దుర్వినియోగంపై ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చాడు. మనుషులను శ్రమ బంధాల నుండి విముక్తం చేసి, వారి పని గంటలు తగ్గించి, జీవితానికి సంబంధించిన అనేక ఇతర అంశాలను ఆనందించే అవకాశం ఇచ్చిన యంత్రాలపై గాంధీకి ఎందుకు వ్యతిరేకతో తనకు అర్థం కావడం లేదు అంటాడు. గాంధీ ఆయన మాటలను ఒప్పుకుంటూ చిరునవ్వు నవ్వాడు. కానీ చాప్లిన్‌కు ఇది చాలా ఇష్టమైన విషయం, అందుకే ఆయన ఈ విషయాన్ని మధ్యమధ్యలో పునరుద్ఘాటిస్తాడు. మిగతా సమాచారం అంతా ఇంతకు ముందు ప్రస్తావించేనట్టే వుంటుంది కనుక పునశ్చరణ అనవసరం.

గాంధీ, చాప్లిన్‌ల మధ్య ఇంత హుందాగా, ఇంత అందంగా, ఇంత ఆనందకరమైన వాతావరణంలో చర్చలు జరిగితే శ్రీశ్రీ గారు తన 'అనంతం'లో ఎందుకు ఆవిధంగా రాశారు? ఈ ప్రశ్నకు మన సమాధానాల వెదుకులాటలో ఇంతకీ ఈ సంఘటనపై చాప్లిన్ తన స్వీయ చరిత్రలో ఏమీ రాసుకున్నాడు అనేది కూడా పరిశీలించాలి కదా?

1964లో చాప్లిన్ తన జీవిత చరిత్రను రాసుకున్నాడు - ""మై ఆటోబైయోగ్రఫి" అందులో పేజి 335-37లలో దీనికి సంబంధించిన ప్రస్తావన వుంది.

చార్లీ ఆత్మకథను అశ్వినీకుమార్ తెలుగు చేశారు- నా కథ చార్లీచాప్లిన్ లో ఈ సమావేశ వివరాలు విపులంగా అందులో చదువవచ్చు (చాప్టర్ 22).

"చర్చిల్‌ను కలసిన మరుసటి రోజు నేను గాంధీని కలిశాను. గాంధీ రాజకీయ వివేకం, అతని ధృఢ సంకల్పాన్ని నేను ఎప్పుడూ గౌరవించే వాడిని. అయితే అతని లండన్ టూర్ తప్పు అని నేను భావించాను. లండన్ సన్నివేశంలో అతని చారిత్రక గొప్పతనం ఆవిరైపోయింది, ఆయన మతపరమైన ప్రదర్శన విశిష్టంగా లేదు. అతని దుస్తులు ఇంగ్లండ్ శీతల వాతావరణంలో అంతా గొప్పగా లేవు. లండన్‌లో ఆహారం తీసుకునే నేపథ్యంలో ఆయన ఉనికి ఒక వ్యంగ్య చిత్రంగా కనబడింది. గాంధీని కలుస్తారా అని నన్ను అడిగారు. నేను నిజంగానే ఉప్పొంగిపోయాను.

ఈస్ట్ ఇండియా డాక్ రోడ్డులో ఒక మురికివాడలో ఒక చిన్న గదిలో ఆయన్ని కలిశాను. వీధి మొత్తం జనసమూహాలతో, పత్రికా విలేఖరులతో, ఫోటోగ్రాఫర్లతో నిండి వుంది. మొదటి అంతస్తులోని ఒక పన్నెండు చదరపు అడుగుల గదిలో సంభాషణలు నడిచాయి. మహాత్మా ఇంకా రాలేదు. నిరీక్షిస్తూ అతన్ని ఏమీ అడగాలి అని ఆలోచిస్తున్నాను. నేను ఆయన జైలు జీవితం గురించి, నిరాహార దీక్షలు, స్వాతంత్ర్య పోరాటం గురించి విన్నాను. అలాగే అతని యంత్ర వ్యతిరేకత గురించి లీలగా విన్నాను.

అంతిమంగా ఆయన వచ్చేప్పటికి వీధిలో కోలాహలం, విజయధ్వానాలు, హర్షధ్వానాలు, అతని

చుట్టూ పోగయిన జనాలు. ఒక తెలియని వ్యక్తికి, ఒక నిగర్వికి అంత చిన్న మురికివాడ వీధిలో ఇంత హర్షధ్వానలతో స్వాగతం అనేది విచిత్రంగా అనిపించింది. ఆయన పైగదికి వచ్చి కిటికీ నుండి బయటకు చూస్తూ, నన్నూ రమ్మన్నాడు. ఇద్దరం కలసి క్రింద వీధిలో వున్న జన సమూహాన్ని చేతులు ఊపుతూ పలకరించాం.

ఇంతలో మేము సోఫాలో కూర్చోగానే కెమెరాల వెలుగులు గదిపై దాడి చేశాయి. నేను మహాత్మకు కుడి పక్కన వున్నాను. ఇంతలో ఇబ్బందికరమైన, ఆందోళనకరమైన నాకుంది. ఇంతలో ఒక ఆవిడ నా కుడి పక్కన కూర్చొని కథలు చెబుతున్న అమ్మాయిని మందలిస్తూ గట్టిగా – "అమ్మాయి! నీవు నీ మాటలు ఆపి, చాప్లిన్ ను గాంధీతో మాట్లాడ నివ్వు." అంది.

ఒక్కసారిగా జనాలతో క్రిక్కిరిసిన ఆ గదిలో నిశ్శబ్దం ఆవరించింది. మహాత్మ తన సాధారణ గంభీరవదనంతో చూస్తుంటే నాకు అర్థం అయ్యింది భారత దేశం మొత్తం నా మాటల కోసం ఎదురు చూస్తోంది అని. నేను నా గొంతు సవరించుకుని: "సహజంగా నేను భారత దేశపు



చాప్లిన్ గాంధీతోపాటు సరోజినీదేవి

ఆ క్షణం రానే వచ్చింది. నాకు అతి తక్కువగా తెలిసిన విషయంపై నేను బలంగా, ఎంతో తెలివిగా చెప్పాలి. నా కుడిపక్కన కూర్చున్న ఓ యువతి ఏదో పెద్ద కథ చెబుతూనే వుంది. నేను తల ఊపుతున్నానే కానీ ఒక్క మాటా పట్టించుకోలేదు. నాకు తెలుసు చర్చను నేనే మొదలు పెట్టాలని. ఎందుకంటే నా పాత సినిమాలు చూసి తాను ఎంతో ఆనందించానని మహాత్మా చెప్పడు కదా? అసలు నా సినిమాలు అతను చూశాడా అన్న అనుమానం

ఆశలకు, పోరాటాలకు సానుభూతి కలిగిన వాణ్ణి. కానీ నేను యంత్రాలపై మీకున్న అసహనం విషయంలో కొంత గందరగోళంగా వున్నాను." అని అన్నాను.

మహాత్మా సమ్మతితో తల ఊపుతూ, చిన్నగా నవ్వగా, నేను కొనసాగిస్తూ: "యంత్రాలు అన్నవి దాని నిజమైన ఉద్దేశ్యంలో వాడితే అవి మనిషిని శారీరక శ్రమ, బానిసత్వం నుండి విడుదల చేస్తాయి. మనిషి శ్రమను, పని గంటలు

తగ్గించి అతనికి విశ్రాంతినిస్తాయి. జీవితాన్ని ఆనందించడానికి అవకాశం ఇస్తుంది." అన్నాను.

గాంధీ చాలా ప్రశాంతంగా : "నేను అర్థం చేసుకోగలను. అయితే ఇండియా ఆ ఆశయాలను సాధించడానికి ముందు బ్రిటిష్ పరిపాలన నుండి బయటపడాలి. గతంలో ఈ యంత్రాలు మమ్మల్ని ఇంగ్లండ్‌పై ఆధారపడేలా చేశాయి. ఆ ఆధారపడడం నుండి బయట పడాలి అంటే ఆ యంత్రాలు ఉత్పత్తి చేసిన వస్తువులను బహిష్కరించాలి. అందువల్లే చర్ఖాను వాడడం, మా బట్టలు మేమే ఉత్పత్తి చేసుకోవడం మా దేశ భక్తిలో ప్రధాన అంశంగా చేసుకున్నాం. ఇంగ్లండ్ లాంటి బలమైన దేశాన్ని ఎదురించడంలో అది మా పోరాట రూపం. ఇంకా అనేక కారణాలు ఉన్నాయి. ఇండియా వాతావరణం భిన్నమైనది. దాని అలవాట్లు, అవసరాలు భిన్నమైనవి. ఇంగ్లండ్ లోని చల్లటి వాతావరణం వాళ్ళకు తీవ్రమైన శ్రమతో కూడిన పరిశ్రమల అవసరం కలిగిస్తుంది. అందువల్ల ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో కూడిన ఆర్థిక వ్యవస్థను సృష్టిస్తుంది. మీకు తినడానికి ఉపయోగపడే గరిటెలు, ఫోర్క్‌లు తయారు చేసే పరిశ్రమలు కావాలి. మేము మా చేతులతో తింటాం. ఇలాంటి ఎన్నో అంశాలు అనేక విభేదాలకు కారణం అవుతుంది." అన్నాడు.

నాకు భారత దేశపు స్వాతంత్ర్య పోరాటానికి, వ్యూహాత్మక ఎత్తుగడలకు సంబంధించిన కొన్ని విరోధభాసలు, వాళ్ళ అవసరాల వాస్తవికతను, వైరుధ్యాలను అర్థం చేసుకున్న శక్తిమంతమైన దార్శనికుడు, దానిని నడిపించే ధృఢమైన ఉక్కు ఆశయం కలిగిన వ్యక్తి,.. ఇలాంటి విషయాలపై ఒక స్పష్టమైన నిరాపేక్షమైన పాఠం విన్నట్టయ్యింది. ఆయన మరోమాట కూడా అన్నాడు: "అనవసరమైన విషయాలను వదులుకోవడమే అత్యంత ఉన్నతమైన స్వాతంత్ర్యం, హింస తనను తానే నాశనం చేసుకుంటుంది." అని.

గది అంతా ఖాళీ అయ్యాక ఆయన కాసేపు వుండి మా ప్రార్థనా విధానాలను చూసి వెళ్ళమన్నాడు. మహాత్మా పద్మాసనంలో కూర్చుని వున్నాడు. మరో ఐదుగురు ఆయన చుట్టూ క్రింద కూర్చున్నారు. లండన్‌లోని ఒక మురికి వాడలో ఆరుగురు నేలపై కూర్చున్నారు. వెనక సూర్యుడు కాషాయ వర్ణంలో భవనాల వెనక్కి దిగిపోతున్నాడు. నేను సోఫాలో కూర్చుని వున్నాను. వాళ్ళు వాళ్ళ ప్రార్థనలోకి జారుకుంటున్నారు. ఎంతటి విరోధాభాస. నేను క్షణం క్రితం ఒక తీవ్రమైన వాస్తవికవాదిని, తన స్పష్టమైన న్యాయవాది మేధస్సు, వాస్తవ రాజకీయాల గురించి గంభీరమైన, లోతైన జ్ఞానం కల వ్యక్తిని చూశాను. అంతలోనే అంతా ఒక రాగయుక్తమైన గానంలో కరగిపోయింది".

ఇక్కడ రెండు ఉన్నతమైన ఆలోచనలు ఒకదాన్ని మరొకటి ఎలా అర్థం చేసుకున్నాయి? ఇందులో ఎక్కడైనా నేను ఉన్నతుడిని అనే ప్రస్తావన కానీ, ఒకరినొకరు ఖండించుకోవడం కానీ వుందా? ఇక్కడే నాకు రుడియార్డ్ కిప్లింగ్ బ్యాలడ్ గుర్తుకు వచ్చింది:

"తూరుపు తూరుపే, పడమర పడమరే,
ఈ రెండు కొసలు ఎప్పుడూ కలువవు"

అంటూ మొదలయిన ఆ గీతంలో చివర్లో:

"భూమి రెండు చివర్లలో నుండి వచ్చినా ఇద్దరు బలమైన వ్యక్తులు ఎదురెదురుగా నిలబడ్డప్పుడు, అక్కడ తూరుపు లేదూ, పడమర లేదు, సరిహద్దులు లేవు, పరంపరలు లేవు, పుట్టుకా లేదు."

**డా. అవధానం రఘు కుమార్**
న్యాయవాది, కన్వీనర్, సెంటర్ ఫర్ సోషల్ డయలాగ్,
హైదరాబాద్, ఫోన్ : 944 123 9803)

## కమ్మతెమ్మెర



మాన్యులు అశ్వినికుమార్ గారికి, సెప్టెంబరు **మిసిమి** సంచిక ఆనందంతో అందుకున్నాను. ధన్యవాదాలు. ఈ మధ్య కొన్ని ఆరోగ్య సమస్యల మూలంగా హాస్పటల్‌లో చికిత్స పొంది, ఇప్పుడు ఇంట్లోనే నెమ్మదిగా కోలుకుంటున్నాను. మిసిమి నాకిస్తున్న ప్రోత్సాహం అనూహ్యం, అమూల్యం. మీ, **మిసిమి** సాంగత్యం నాకు భగవదనుగ్రహం. శుభాకాంక్షలు. మీ వీరాభిమాని.

***- రాయవరపు సత్యనారాయణ, ముంబయి***

### ఉండీ లేని దేశం

# ట్రాన్సినిస్ట్రియా




హౌస్ ఆఫ్ సోవియట్స్

**ఆంగ్లం – నిమ్మగడ్డ శేషగిరి రావు**

**తెలుగు – శ్రీమతి అట్లూరి జయశ్రీ**

**మా**ల్డోవాలోని కిషినావ్ నుండి రెండు గంటల పాటు సాగిన నా మొట్టమొదటి టిక్కెట్టు లేని ప్రయాణం, నన్ను ట్రాన్సినిస్ట్రియా రాజధాని తిరాస్పోల్ చేర్చింది. నా ఎరుకలో చాలామంది ఇలాంటి దేశం ఒకటుందని ఒప్పుకోరు. కానీ నేను ఇప్పుడు అక్కడే ఉన్నాను. అంటే.. ట్రాన్సినిస్ట్రియా ఏదో ఊహాజనిత రాజ్యం కాదు! సోవియట్ పాలనా ప్రపంచంలో సంచరించాలనుకునే నాలాంటి పథికులకు, కాలంలో ఘనీభవించినట్లు, ఈ నాటికీ అదే ఫక్కీలో నడుస్తున్న ట్రాన్సినిస్ట్రియా ఒక మంచి అవకాశం ఇస్తుందని, ఇదొక సోవియట్ సామ్రాజ్యపు శిలాజ శకలమని నేను విని ఉన్నాను. ఉండీ లేని దేశంగా ట్రాన్సినిస్ట్రియాను అభివర్ణించటం, మొదటిసారిగా నేను, సైమన్ రీవ్స్ డాక్యుమెంటరీ, 'ప్లేసెస్ దట్ డోంట్ ఎక్సిస్ట్', బి.బి.సి.లో చూశాను. ఆ తరువాత, ఇల్లినాయ్‌లో ఉండే నా మిత్రుడు, విస్తృత పర్యాటకుడు, డా. అషోక్ వాన్.. మాటల్లో ట్రాన్సినిస్ట్రియాను, వింతగా, విలక్షణమైన ప్రాంతంగా అభివర్ణించడం కూడా జరిగింది. ఇక్కడకు బయలుదేరే ముందు, ఈ ప్రాంతాన్ని ఈ మధ్య కాలంలో సందర్శించిన డా. కాలిన్ స్టీవెన్సన్ (టొరాంటో, కెనడా)ను కూడా సంప్రదించాను. అందువలన ఇక్కడకు రావటానికి, రాకముందే తెలుసుకోవలసిన విషయాలెన్నో తెలుసుకోగలిగాను.

ఒక స్వతంత్ర దేశానికి ఉండవలసిన లక్షణాలు.. సైన్యం, సరిహద్దులు, మారక ద్రవ్యం (రూబుళ్ళ, కోపెక్కులు), విదేశీ, వలస విధానాలు, తంతి తపాలా, ప్రజా ప్రతినిధులతో ఏర్పడిన పార్లమెంట్, అధ్యక్షుడు.. ఇలాంటివన్నీ ఉన్న దేశం ఇది. కానీ ఏ ఇతర దేశమూ దీనిని ఒక స్వతంత్ర దేశంగా గుర్తించదు. ఇది మాల్డోవాలో ఒక ప్రాంతం మాత్రమే. ఈ దేశం ఏర్పడిన విధానం ఏమైనా, ఒక విధంగా ఇదొక త్రిశంకు దేశం.

మాల్డోవా నుండి వేరుపడిన ప్రాంతం ట్రాన్సినిస్ట్రియా. ఇప్పటికీ సోవియట్ రష్యాతో దానికి ఉన్న చారిత్రాత్మక సంబంధాన్ని సగర్వంగా, బాహాటంగా చాటుతూనే ఉంటుంది. ప్రపంచంలో ఇంకెక్కడా లేని విధంగా, అది ఈనాటికీ దాని జాతీయ జెండా మీద కమ్యూనిస్టు సుత్తి, కొడవలి చిహ్నాన్ని నిలుపుకునే ఉంది. ట్రాన్సినిస్ట్రియా సన్నగా పొడవుగా, పీలికలా ఉండే ప్రాంతం. 400 కి. మీ. పొడవు. 40–50 కి.మీ. వెడల్పుతో నీస్టర్ నది వెంబడే, మాల్డోవా, ఉక్రెయిన్‌ల మధ్య ఉన్న ట్రాన్సినిస్ట్రియా వైశాల్యం 3567 చ. కి. మీ.లు. ఐరోపాలో ఉన్న మరొక చిన్న దేశం లక్సెంబర్గ్‌తో పోల్చితే ఒకటిన్నర రెట్లు పెద్దది. జనసంఖ్య 5 లక్షలు. రాజధాని తిరాస్పోల్.

అయితే, నాలాంటి యాత్రీకులకు, అందని మాని పండ్ల మీదే చూపు ఉంటుంది. ఏ ప్రాంతమైతే విలక్షణమని, వింత అని, అసామాన్యం అని చెప్పబడుతుందో.. అక్కడికే వెళ్లాలనే ఉత్సాహం.. నిలవనివ్వదు. అట్లా ట్రాన్సినిస్ట్రియా చాలా రోజుల నుండి నన్ను పిలుస్తూనే ఉంది. మొన్నీమధ్య వరకు అక్కడికి వెళ్ళటం దుస్సాధ్యం. విదేశీ యాత్రికుల రాకపోకల పైన ప్రభుత్వ పరమైన నిబంధనలు, ఆంక్షలు, భద్రతాగతమైన

ఆందోళనలు వీటన్నిటి దృష్ట్యా అక్కడికి వెళ్ళొద్దనే సలహాలు నా ప్రయాణోత్సాహాన్ని నిలిపి ఉంచాయి. ఇప్పుడిప్పుడే అక్కడికి వెళ్ళటం రావటం కొంత సులభం అయింది. అదీ జాగ్రత్తగా, ప్రతి విషయం ముందస్తుగా వాకబు చేసి, ఒక ప్రణాళికగా ఏర్పాటు చేసుకుని వెళితేనే. బ్రిటన్ విదేశాంగ శాఖ, కామన్ వెల్త్ ఆఫీసు, అక్కడ బ్రిటిష్ రాయబార కార్యాలయం లేనందున, ట్రాన్సినిస్ట్రియా వెళ్ళొద్దనే చెబుతున్నాయి. పైగా అక్కడకు వెళ్ళినప్పుడు ప్రయాణపు ఆరోగ్య భీమా సదుపాయం కూడా ఉండదు.

కానీ, అక్కడకు చేరుకుని, స్టేషన్ నుండి బయటకు రాగానే, "హల్లో కామ్రేడ్", అనే సాంప్రదాయిక సోవియట్ పలకరింపుతో, మనసులో ముసురుకున్నటువంటి భయాలన్నీ పటాపంచలైపోయాయి. ''వెల్కమ్ టు ట్రాన్సినిస్ట్రియా" అంటున్న స్వరం తాలూకు మనిషి, నేను ఏర్పాటు చేసుకున్న గైడ్, ఆంటన్ డెన్డెమార్చెంకో. అందులో ధ్వనించిన స్నేహం, మర్యాద నా జంకు గొంకులను తగ్గించాయి. ఇప్పటి వరకు నేను విన్నది.. ఇక్కడ విదేశీయులను అనాహ్వానితులుగా, పరాయివారిగా చూస్తారని. ఆంటన్ స్థానిక రూపురేఖలతో, చురుకుగా కనపడుతున్న ఆజానుబాహుడు. ముప్ఫయికి దగ్గరపడుతున్న వయసు ఉంటుందేమో! కీవ్‌లో నాకు కలిసిన ఆస్ట్రేలీయా మిత్రుడు, మిక్, ఆంటోన్ పేరు ప్రస్తావించి సమాచారం ఇచ్చాడు. మాల్డోవాలో నుండే అతనితో పరిచయం కలుపుకున్నాను. కొద్దిగా రష్యన్ ఉఛారణతో, చక్కని ఇంగ్లీషులో మాట్లాడుతూ, నా వీసా పని పూర్తి చేయించి, నేను ఆ ముందురోజే బస ఏర్పాటు చేసుకున్న, 'హోటల్ రష్యా'కు నాతో పాటే టాక్సీలో వచ్చాడు.

వీధులకు ఇరువైపులా, నగర కూడళ్ళలోనూ, లెనిన్ విగ్రహాలు, మర ఫిరంగులు, విమానాలు మొదలైన యుద్ధ కాలపు స్మారక చిహ్నాలు, తదితర యుద్ధ కాలపు ప్రదర్శకాలు.. సోవియట్ కాలపు సగర్వ సంకేతాలుగా నిలబడి ఉన్నాయి. అవన్నీ, 20వ శతాబ్దంలో చాలా కాలంపాటు, ప్రపంచంలో మూడవ వంతును శాసిస్తూ వెలిగిన సోవియట్ యూనియన్ ప్రభుతాలూకు అవశేషాలు. 1970కి చేరువవుతున్న దశకంలో పుట్టిన నాలాంటి వారికి.. సోవియట్ యూనియన్ నవశకానికి నాంది పలికిన మహాశక్తి. అప్పట్లో అది 1990 దాటుతూనే ఒరిగిపోతుందనేది ఊహకందని విషయం.

హోటల్ చేరగానే, నా సామాన్లు రూమ్‌లో పెట్టేసి, ఆంటోన్‌తో పాటు పురవిహారానికి బయలుదేరిపోయాను. ఈ మధ్యే కట్టినట్లున్న హోటల్ రష్యా భవనం, 'హౌస్ ఆఫ్ సోవియట్స్' ఎదురుగా ఉన్న వీధి కూడలిలో ఉంది. సోవియట్ల కాలంలో నిర్మించబడిన హౌస్ ఆఫ్ సోవియట్స్ తిరాస్పోల్‌లోనే అత్యంత సుందరమైన భవనం అన్నట్లుంది. ప్రస్తుతం ఇది నగర ప్రజలకు సాంస్కృతిక కేంద్రం. శ్వేత వర్ణంలో మెరుస్తున్న భవనపు ముందు భాగం అక్కడక్కడా ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో దిద్దబడి ఉంది. భవనం ముందు ఒక ఎత్తుగా కట్టిన వేదిక మీద ఛాతీ వరకు ఉన్న లెనిన్ విగ్రహం ఉంది.

మా విహారం అక్టోబర్25 వీధి నుండి మొదలయింది. తిరాస్పోల్‌లో అతి ముఖ్యమైన వీధిని ఈ పేరుతో పిలుచుకుంటూ, జారిస్ట్ రష్యాలో లెనిన్ నాయకత్వాన నడపబడిన బోల్షివిక్ విప్లవం మొదలయిన రోజును నిత్యం స్మరించుకుంటున్నారు ట్రాన్సినిస్ట్రియన్లు. రష్యా సైన్యంలో 14వ దళం, సోవియట్ కాలం నుండి, ఇప్పటికీ ఇక్కడే మోహరించి ఉంది. ఆ కాలంలో, ట్రాన్సినిస్ట్రియాతో పాటున్న మాల్డోవా 16 సోవియట్ రిపబ్లిక్కులలో ఒకటి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమయినప్పుడు, మిగిలిన రిపబ్లిక్కులతో పాటు మాల్డోవా స్వతంత్రతను ప్రకటించుకోగా, ట్రాన్సినిస్ట్రియా మాత్రం రష్యాలో భాగంగా ఉండటానికి నిశ్చయించుకుంది. ఇక్కడి ప్రజలలో 30% మంది రష్యా సంతతివారే. వీరితో పాటు ఉక్రేనియన్లు, మాల్డోవా వారు కూడా ఉన్నారు.

జన్యు లక్షణాల పరంగా చూస్తే, మాల్డోవా ప్రజలు రుమేనియా వారిని పోలి ఉంటారు. భాష కూడా రుమనియా యాసకు దగ్గరగా ఉంటుంది. ఈ రెండు ప్రాంతాల సంస్కృతి సాంప్రదాయాలు కూడా దగ్గరగా ఉంటాయి. కాగా, రష్యా వారు, ఉక్రెనియన్లు శ్లావిక్ జన్యు లక్షణాలతో ఉండి, రష్యా భాష మాట్లాడుతారు. 1992లో మాల్డోవా, సోవియట్ రష్యా నుండి విడిపోవటంతో పాటు, రుమేనియన్‌ను అధికారిక భాషగా ప్రకటించింది. దీనితో ట్రాన్సినిస్ట్రియా ప్రాంతంలో అశాంతి ఏర్పడింది. మాల్డోవా నుండి వేరుపడాలని నిశ్చయించుకుంది. అప్పుడు జరిగిన యుద్ధంలో ఇరువైపులా కలిపి సుమారు 700 మంది మరణించారు. ఇదొక రకంగా దేశపు భాషా, సంస్కృతుల

పరిరక్షణ కోసం అక్కడి ప్రజలు చేసిన ప్రాణ త్యాగమే కదా!! ఒక దేశానికి ప్రత్యేక గుర్తింపునిచ్చే భాష ఎప్పుడూ సున్నితమైన అంశమే. దీనిని రాజకీయ ప్రయోజనాల కోసం ఫణంగా పెట్టాలని చూసిన ప్రతిసారీ బలమైన స్పర్ధ, ప్రతికూల పరిణామాలు చరిత్రలో చాలాసార్లు కనిపించాయి. ఆ సమయంలో ట్రాన్సినిస్ట్రియా ప్రజలకు అండగా ఇక్కడ నిలచిన రష్యా సైన్యపు 14వ దళం, ఇప్పటికి కూడా ఇక్కడే ఉంది.

ట్రాన్సినిస్ట్రియా, మాల్డోవా మధ్య ఉన్న స్పర్ధ ఈనాటిది కాదు. రెండవ ప్రపంచ యుద్ధం నాటికి ట్రాన్సినిస్ట్రియా ఉక్రెయిన్‌లో భాగంగా రష్యన్ జార్ సామ్రాజ్యంలో ఉంది. మిగిలిన మాల్డోవా, బెస్సరేబియా అనే పేరుతో రొమేనియాలో భాగంగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం కుదిరిన సంధి షరతుల ప్రకారం, హిట్లర్ బెస్సరేబియాను సోవియట్ యూనియన్ పరం చేశాడు. అటు తరువాత స్టాలిన్ ట్రాన్సినిస్ట్రియాను, బెస్సరేబియాతో కలిపి మాల్డోవా సోవియట్ సోషల్ రిపబ్లిక్‌ను ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో చాలా మంది రష్యన్ సంతతికి చెందిన వారు ట్రాన్సినిస్ట్రియాలో స్థిర పడటం జరిగింది. సహజంగా వారికి రష్యా మీద అభిమానం ఉంటుంది కదా. ట్రాన్సినిస్ట్రియా, రాజకీయంగా మాల్డోవాలో భాగంగా ఉండి కూడా, తన ప్రత్యేక ప్రతిపత్తిని వదులుకోక పోవటం వెనుక, తరాల తరబడి అక్కడి ప్రజల మనోభావాలే కాకుండా, నేటి రష్యా దేశపు ఆంతర్జాతీయ విధానాలు కూడా కారణం. ఈ రోజుకు కూడా, ట్రాన్సినిస్ట్రియా, ఉక్రెయిన్-మాల్డోవాల మధ్య ఇమిడిపోయి ఉండటం వలన, భౌగోళికంగా తన దేశంలో భాగంగా రష్యా చూపించుకోలేదు. కానీ, రష్యన్ సంతతి ప్రజల పరిరక్షణ కోసమని అక్కడ ఏర్పరచిన సోవియట్ ఆయుధాగారాల రక్షణ కోసం, ఇంకా నాటో దేశాలు తూర్పు దిశగా చొచ్చుకు రాకుండా, ట్రాన్సినిస్ట్రియాలో కాలూని, మోకాలు అడ్డుపెట్టి వాటిని నిలవరించటం కోసం కూడా ట్రాన్సినిస్ట్రియా తన రెక్కల క్రింద ఉన్నట్లు చూపటం రష్యాకు చాలా ముఖ్యం. ఈ కారణాల వలన ట్రాన్సినిస్ట్రియా, మాల్డోవాలో 'ఉండీ లేని భాగం' గా దీర్ఘ కాలం పాటు కొనసాగటం తథ్యం.

ఆంటోన్‌తో పాటు ఆ వీధులలో తిరుగుతున్నప్పటికి రోడ్ల మీద సందడి ఇంకా మొదలవలేదు. అక్కడున్న పార్కు ప్రవేశ ద్వారం వద్ద యూరీ గగారిన్ ఛాతీ వరకు ఉన్న విగ్రహం చూడగానే, చిన్న నాడు రోదసీలోకి వెళ్ళిన మొట్టమొదటి మానవునిగా అతని పేరు విని విస్మయపడిన నేను, నా జ్ఞాపకంలోకి వచ్చాను. తిరాస్పోల్లో ఈ పార్కును, నాలాగే చూడటానికి వచ్చిన అతని పేరును, ఆ పార్కుకే పెట్టటం చూస్తే సంతోషమనిపించింది. రష్యాకు గర్వకారణమైన, ఇతని పేరును గౌరవించి, చిరస్మరణీయం చేసిన ట్రాన్సినిస్ట్రియాకు రష్యాతో ఉన్న అనుబంధం ఎంతో ప్రత్యేకం. పార్కులో నడుస్తూ వెళ్ళి అక్కడున్న కెఫేలో కాఫీ త్రాగి, బిల్లు చెల్లించినప్పుడు ఆంటోన్ అక్కడున్నావిడతో ఏదో చెప్పాడు. ఆమె గల్లా పెట్టె వెతికి, చిల్లరతో పాటు, రూబుల్ గుర్తు వేసి ఉన్న కొన్ని ప్లాస్టిక్ టోకెన్లను నాకు ఇచ్చింది. అవి అక్కడ వాడే ట్రాన్సినిస్ట్రియా నాణాలని ఆంటోన్ చెప్పాడు. ఇక్కడికి వచ్చిన సందర్శకులు, వీటిని జ్ఞాపికలుగా తీసుకెళతారట.

ఆ సమీపంలో ఉన్న ఒక లైబ్రరిలో గోడ మీద 1970లలో, సోవియట్ కాలం నాటి మొజాయిక్ చిత్రాన్ని ఆంటోన్ చూపించాడు. ఇది అతనికి ఎంతో ఇష్టమయిన కళా ఖండమట. అధివాస్తవిక ధోరణిలో రూపొందించిన ఈ చిత్రంలో చేతులు చాచి ఉన్న ఒక స్త్రీ కనపడుతోంది. మసిగుడ్డలో కట్టిన మాణిక్యంలా, తిరాస్పోల్‌లో మరుగున పడి ఉన్న కళాఖండం ఈ మొజాయిక్ అని ఆంటోన్ చెప్పాడు. ఆంటోన్ స్వయాన చిత్రకారుడట. ప్రఖ్యాత భవంతులు, స్మారక చిహ్నాలను, ట్రాన్సినిస్ట్రియాలోని ప్రముఖ ప్రాంతాలను కళాత్మకంగా సృజించటం అతని ప్రత్యేకత. అతని చిత్రాలు అక్కడి స్థానిక దుకాణాలలో పోస్ట్ కార్డులుగా అమ్మకానికి ఉన్నాయి. కొన్ని పోస్ట్ కార్డులు అతని వద్ద కూడా ఉన్నాయి. వాటిని అమ్మటంతో పాటు, కొన్నిటిని జ్ఞాపికలుగా, బహుమతులుగా కూడా ఇస్తూ ఉంటాడట.

ఆంటోన్ ఆ వూర్లో అందరికీ తెలుసనుకుంటాను. దోవ పొడవునా స్థానికులందరితోనూ స్నేహపూర్వక సంభాషణ చేస్తూ సాగుతున్నాడు. నన్ను కూడా కొందరికి పరిచయం చేసి, మా మధ్య దుబాసీగా వ్యవహరించాడు. వాళ్ళలో అయిదారుగురు కొంచెం వయసు మళ్ళిన వాళ్ళు. చాలా సంతోషంగా కనిపించారు. నన్ను ఇండియా గురించి అడుగుతూ, రష్యాకు ఇండియాతో ఉన్న మిత్రుత్వం గురించి ప్రస్తావించారు. సోవియట్ కాలంలో

మన ప్రధాన మంత్రులుగా ఉన్న నెహ్రూ, ఇందిరా గాంధీలను గుర్తు చేసుకున్నారు. వాళ్ళంతా, సోవియట్ యుగంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన వాళ్ళు. వాళ్ళ జీవితాలలో, గుర్తుపెటుకోగలిగిన మంచి కాలం అదేనని వాపోయారు. ఆ కాలంలో అతి తక్కువ బాధలతో జీవితం సుఖంగా గడచి పోయేదని ఒకరన్నారు. అప్పట్లో వారికి డబ్బు ఎక్కువేమీ ఉండేది కాదని చెపుతూ, అసలు దాని అవసరమే ఉండేది కాదని, కావలసినవన్నీ ప్రభుత్వమే సమకూర్చేదని మరొకరన్నారు. అలా వారితో కాసేపు సత్కాలక్షేపం చేసి, అక్కడి నుండి ప్రముఖ రష్యన్ కవి, అలెక్సాండర్ పుష్కిన్‌ను విగ్రహ ప్రాయంగా చూడటానికి బయలుదేరి పోయాము.

రష్యాలో పుష్కిన్ కవిత్వం ఎంతో కొంత తెలియని వారు ఉండరని చెపుతూ, ఆంటోన్ పుష్కిన్ విగ్రహం ముందు నిలబడి, పుష్కిన్ కవితల నుండి కొన్ని పాదాలను లయబద్ధంగా, ఆర్తితో పాడాడు. భాష అర్ధమవకపోయినా, కవితా పఠనం అలౌకికంగా ఉండి, నన్ను మైమరపించింది. రష్యా సాహితీ పితామహుడని చెప్పదగిన పుష్కిన్ రచనలను, మాల్దోవాలో 'ఉన్నా లేని' ట్రాన్సినిస్ట్రియా దేశంలో గౌరవప్రదంగా ఉంచిన అతని విగ్రహం ముందు, ఒక స్థానిక యువకుడి ముఖతా, పూర్తి ఆరాధనతో కూడిన కవితాలాపన వినగలగటం నా అదృష్టం. నా ప్రయాణాలలో నాకు దక్కే అపురూపమైన అనుభవాలు ఇవే. ఆ ప్రాంతాలను తలచుకున్నప్పుడల్లా, చిరకాలం పాటు మనసులో మెదిలే అందమైన భావ సంపద కూడా ఇవే.

అక్కడి నుండి ఆంటోన్ పౌర అవాస కేంద్రాలుగా కనపడుతున్న సోవియట్ కాలపు సాదా బహుళ అంతస్తుల భవన సముదాయం వైపుకు దారి తీశాడు. ఒక ఎత్తైన భవనంలో ఉన్న లిఫ్ట్ ఎక్కి పై అంతస్తుకు చేరాము. తిరాస్పోల్ నగరం మొత్తాన్ని ఒకేసారి చూడటానికి ఇది మంచి అవకాశం. నీస్టర్ నది నగరం మధ్యగా దోవ చేసుకుంటూ పోతోంది. దూరాన ఒక ఎత్తైన బెల్ టవర్‌తో పాటు, సువర్ణ కాంతితో మెరుస్తున్న చర్చ్ గోపురాలు కనపడుతున్నాయి. అది నోల్ నెమెట్ మోనాస్ట్రీ అని ఆంటోన్ చెప్పాడు.

ఒక చోట కివింట్ కోగ్నాక్ ఫ్యాక్టరీ వ్యాపార చిహ్నం కనిపించింది. కివింట్ కోగ్నాక్, తిరాస్పోల్‌లో తయారయ్యే విశిష్టమయిన ఆల్కహాల్ బ్రాండ్. అవిభిన్న సోవియట్ యూనియన్ అంతటా జనాదరణ పొందిన మద్యం ఇది. ఇక్కడ తయారై, 'మేడ్ ఇన్ మాల్డోవా' అనే గుర్తింపుతో ఉక్రెయిన్, రష్యా, ఇంకా ఇతర ఐరోపా యూనియన్ దేశాలకు పంపబడే ప్రధాన ఎగుమతి ఇది. ఇక్కడకు వచ్చే మధుపాన ప్రియులకు ఎంతో ఇష్టమైన 'కోగ్నాక్ టూర్' తీసుకోవటానికి నాకు సమయం లేక పోవటం కొంచెం బాధ అనిపించింది.

మాటల్లో, నగర మహర్దర్శనం చేయించే ఈ ఎత్తైన భవన పీఠం తనకు యాదృచ్ఛికంగా కనిపించిందని, దీనిని ఇంకెవరికీ చూపించలేదనీ ఆంటోన్ గర్వంగా చెప్పాడు. తిరాస్పోల్‌ను ప్రత్యేకమైన కోణాలనుండి సందర్శకులకు పరిచయం చేయటంలో అతను సిద్ధహస్తుడని నాకు అర్ధమయింది. నగరాన్ని అందులోని భవనాలను అందంగా చూపించటంతో పాటు, తాను చూసిన వాటిని అంతే అందంగా చిత్రించటం కూడా అతని ప్రత్యేకత. అతని చిత్రాలు ఎన్నో, యాత్రికులకు జ్ఞాపికలుగా పోస్టు కార్డుల మీద, ప్లాస్టిక్ నాణాల మీద నాకు కనిపించాయి. అతను ఒక మామూలు గైడ్ కాదు. ఆ నగరాన్ని అమితంగా ప్రేమిస్తూ, చూడ వచ్చిన నాలాంటి వారిని సొంత పరివారంగా భావిస్తూ, నగర పరిచయం చేసే వ్యక్తిగా నాకు తారసిల్లటం నా అదృష్టం. చాలామందికి తెలియని ఇంకొన్ని విశేషాలు మీకు చూపిస్తానంటూ, ఆంటోన్ సందర్శకుల హడావుడి నుండి దూరంగా తీసుకెళ్ళి, అక్కడున్న ఒక పాత స్కూల్ ప్రాంగణంలో ఉన్న ఒక ఛాతీ సైజు విగ్రహాన్ని చూపించాడు. అది, నికోలోయ్ జెలెన్స్కి విగ్రహం. 1915లో, చార్ కోల్‌ను ఉపయోగించి గ్యాస్ మాస్క్‌ను తయారుచేసిన మొట్టమొదటి రసాయన శాస్త్రవేత్త అతడు. బహుశా తిరాస్పోల్ ప్రపంచానికి అందించిన అత్యంత ఉపయోగకరమైన వస్తువు ఇదే నేమో!1

అక్కడ ఒక భవనం రంగు రంగుల జెండాలతో నన్ను ఆకట్టుకుంది. అది, సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి కారణంగా చెల్లా చెదురైన రిపబ్లిక్కులకు కేంద్ర కార్యాలయమట. ట్రాన్సినిస్ట్రియాతో పాటు సోవియట్ యూనియన్ నుండి విడివడిపోయి, ప్రపంచ రాజకీయ పటం మీద గుర్తింపు లేకుండా, అధికారికంగా, ప్రపంచ పటం మీద లేనివి ఇంకా కొన్ని ఉన్నాయి. అవి

ఒస్సాటియెు, అభకాజియా, నగోర్నో-కరబఖ్. ఒస్సాటియెు, అభకాజియాలు జార్జియా నుండి వేరు పడిన ప్రాంతాలు. వీటికి రష్యా మద్దతు ఉంది. నగోర్నో-కరబఖ్ ఆర్మేనియా సంతతితో నిండిన, అజర్బైజాన్ రిపబ్లిక్‌లో భాగం. చెదురు మదురైన ఈ దేశాలకు, ఆ భవనం ఐక్య రాజ్యసమితి లాంటిదని ఆంటోన్ అన్నాడు. ఈ దేశాలన్నీ మిగిలిన వాటిని ప్రత్యేకమైన దేశాలుగా గుర్తించుతాయట. కాని వీటికి ఐక్య రాజ్య సమితి గుర్తింపు మాత్రం లేదు. లెక్క ప్రకారం ఈ దేశాల పౌరులు వీసా లేకుండా రాకపోకలు సాగించవచ్చు. కానీ భౌగోళికంగా ఏక ఖండంగా లేకపోవటం వలన, వీటి మధ్య ఉన్న ఇతర దేశాలు వీటిని గుర్తించక పోవటం వలన, ఇది నిజంగా జరిగే పని కాదు.

అక్కడున్న ఒక పుస్తకాల షాపులో, జ్ఞాపికలు, ముఖ్యంగా సోవియట్ కాలపు జ్ఞాపికలు ఉన్నాయి. ఆంటోన్ చిత్రాలున్న పోస్ట్‌కార్డులతో పాటు కొన్ని జ్ఞాపికలు కొని మళ్ళీ వీధుల వెంట చెట్ల నీడలో నడుస్తున్నప్పుడు ఆ రోజు చాలా వేడిగా ఉన్నట్లు తెలిసింది. దాహం తీర్చుకునే వంకతో, అక్కడ అమ్ముతున్న పానీయం క్వాస్ రెండు గ్లాసులు కొనుక్కుని, దానిని ఆస్వాదిస్తూ నగర కేంద్రం వైపుకు సాగి పోయాము. దూరంగా, ఎరుపు ఆకుపచ్చ రంగులలో, మధ్యలో బంగారపు కొడవలి, సుత్తి చిహ్నంతో రెపరెప లాడుతున్న, ట్రాన్సినిస్ట్రియా జెండా వైపుకు నడుస్తూ, సువొరొవ్ కూడలి చేరాము. దాని మధ్యలో గుర్రం మీద ఠీవిగా ఉన్న జనరల్ సువొరొవ్ విగ్రహం ఉంది. 18వ శతాబ్దంలో, జారిస్ట్ రష్యాలో పేరొందిన సైన్యాధికారి అలెక్సాండర్ సువొరొవ్.అతని విగ్రహాలు రష్యా అంతటా కనిపిస్తాయని ఆంటోన్ చెప్పాడు. 1792 లో ఒట్టోమన్ సామ్రాజ్యపు ధాటి, రష్యా వైపుకు సాగకుండా నిలవరించటానికి, ఒక పథకం ప్రకారం, ఈ తిరాస్పోల్‌ను ఏర్పాటు చేసిన ఘనత అతనిదేనట.

అక్కడున్న పార్కులో తెలుపు రంగు వేసి ఉన్న చర్చ్, దాని డోమ్ కు ఉన్న ఆకుపచ్చ, బంగారు రంగులతో ఆకర్షణీయంగా కనపడింది. ఇది ఈ మధ్యే అంటే సోవియట్ కాలం తరువాత నిర్మించబడి, ఏసు క్రీస్తు జన్మ స్థలపు పవిత్రతను ఆరాధించే చర్చ్. ఇక్కడి గోడల మీద, పై కప్పు మీద ఉన్న క్రిస్టియన్ మతపరమైన చిత్రాలను చూడటానికి కొంత సమయం పట్టింది. అక్కడ ఉండగానే,



జనరల్ సువొరొవ్

మరొక టూరిస్ట్ గ్రూప్ 'వాకింగ్ టూర్' చేయమని ఆంటోన్‌కు సందేశం పంపింది. నాకు ఇబ్బంది అవుతుందని అతను సంశయిస్తుంటే, నేను కూడా వాళ్ళతో కలుస్తానని అతనితో చెప్పి ఒప్పించాను. ఆ గ్రూపు కోసం చూస్తున్న సమయంలో ఆ దగ్గరలో ఉన్న జెలెని మార్కెట్‌కు వెళ్ళాము.

స్థానికుల నిత్య జీవన శైలిలోకి తొంగి చూడటానికి మార్కెట్లు మంచి అవకాశం ఇస్తాయి. చుట్టూ ప్రక్కల ప్రాంతాల నుండి వచ్చిన రైతులు, చేతి వృత్తుల వారు, చిన్న వ్యాపారులు అక్కడ అమ్ముతున్న వస్తువుల రంగు, రుచి, వాసనలతో ఆ మార్కెట్టు చైతన్యవంతంగా ఉంది. ఒక చిన్న దుకాణంలో చిన్నప్పుడు బొమ్మలలో చూసిన రష్యన్ బాబుష్కాలా కనపడుతున్న ఒక పెద్ద వయసు మహిళ, తరతరాలుగా అనుసరించే పద్ధతులలో తయారైన కాబేజీ ఆకుల పచ్చళ్ళు/వ్యంజనాలు అమ్మటం కనపడింది. నా యాత్రలలో, చాలా సార్లు ఈ ప్రక్రియను ప్రపంచ వ్యాప్తంగా నేను గమనించాను. ముఖ్యంగా ఆహారం తయారీలో, నిలవ బెట్టటంలో అనుసరించే విధానాలు, ముందు తరాల వారి సంప్రదాయాలను, తరువాత తరాలవారు గౌరవంతో అంది పుచ్చుకుంటారు.

ఆంటోన్ చెప్పిన దానిప్రకారం, ట్రాన్సినిస్ట్రియా ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు కూడా చాలా ఉన్నాయి. సోవియట్ కాలంలో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండేదట. భారీ యంత్రాల తయారీ ఈ ప్రాంతంలోనే జరిగేదట. ఇప్పటికీ ఇది కొనసాగుతున్నప్పటికీ, అంతర్జాతీయ గుర్తింపు లేకపోవటంతో, అభివృద్ధి ఉండవలసిన స్థాయిలో లేదు. ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే, మాల్డోవా పాస్ పోర్ట్ కానీ, రష్యా పాస్ పోర్ట్ కానీ ఉండవలసిందే. సంపద కొద్ది

మంది వద్ద కూడబడి ఉంది. పాలక వర్గంలో ఉన్న సంపన్నులు దేశాభివృద్ధిని నిర్దేశిస్తారు. పార్లమెంట్ ముందున్న లెనిన్ విగ్రహం వద్ద, కొత్త గ్రూప్‌ను కలిసాము. ఆంటోన్ మా అందరికీ అక్కడున్న చారిత్రాత్మక ప్రదేశాలన్నీ వివరంగా చూపించాడు. వాటిలో ఒకటి, టి-34 మిలిటరీ టాంకర్. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీ జర్మనీని జయించటానికి సోవియట్ దళాలు వాడిన ఆయుధాలలో టి-34 అతి ముఖ్యమైనది. ఇక్కడ ఒక ఎత్తైన వేదిక మీద ఉంచిన టాంకరు మీద ఎక్కటానికి సందర్శకులకు అనుమతి ఉంది. అందరితో పాటు నేను కూడా ఆ పని చేశాను. రెండవ ప్రపంచ యుద్ధంలో వాడబడిన ఒక నిజమైన అస్త్రానికి ఇంత దగ్గరగా వెళ్ళటం నాకు ఇదే మొదటి సారి. ట్రాన్సినిస్ట్రియాలో చాలా చోట్ల ఇటువంటి మారణాయుధాలను ప్రదర్శించటం నేను చూశాను. టాంక్ ఎదురుగా ఒక చిన్న చాపెల్ ఉంది. ఇది సెయింట్ జార్జ్ చాపెల్. ప్రస్తుతం ట్రాన్సినిస్ట్రియాలో ఉన్న ప్రశాంత వాతావరణానికి ఇది ప్రతీకలా కనిపించింది.

చాలాసార్లు ట్రాన్సినిస్ట్రియా ముగిసిపోయిన సోవియట్ శకానికి గుర్తుగానూ, సోవియట్ చరిత్రకు అద్దం పట్టే నిజ రూప ప్రదర్శనశాలలానూ చూడబడుతుంది. కానీ ఆంటోన్ చెప్పిన దాని ప్రకారం, అదేమీ కాలంలో ఘనీభవించిన చరిత్ర శకలం కాదు. కాలం వెంబడి మారుతూ వస్తూనే ఉంది. కాకపోతే రష్యాతో సహా, ఇతర సోవియట్ నుండి విడిపోయిన దేశాలకు విభిన్నంగా, ఇక్కడ సోవియట్ కాలం అభిమానించబడుతుంది. సమ్మానించబడుతుంది. ఇవాల్టి కాలంలో ట్రాన్సినిస్ట్రియాలో క్రొత్తగా వెలసిన చర్చ్‌లు, చాపెల్ లూ.. లెనిన్ విగ్రహాలు, సోవియట్ సైనిక స్మారక చిహ్నాలతో పాటు సమానంగా చూడబడటం కనపడుతుంది.

అక్కడి నుండి మేమంతా బస్ లో బెండెరీ వెళ్ళాము. ఆంటోన్ మమ్మల్ని, ముందు భాగంలో సి. సి. సి. పి. అనే పెద్ద పెద్ద అక్షరాలు, ఎరుపు రంగు మీద, పసుపు పచ్చ రంగులో కొట్టొచ్చినట్లున్న భవనానికి తీసుకు వెళ్ళాడు. ఆ అక్షరాలు నాకు సుపరిచితమే. నా చిన్నతనంలో అందంగా మెరిసిపోయే సోవియట్ పత్రికలు విరివిగా, ఎక్కువ ఖర్చు పెట్టకుండానే లభించేవి. వాటిని చదివి, చూసి, కమ్యూనిస్ట్ దేశాల పట్ల అభిమానం పెంచుకున్న యువతలో నేనూ ఒకడిని. ఈ విజ్ఞానం వలన, యూ.ఎస్.ఎస్.ఆర్. (యూనియన్ ఆఫ్ సోవియట్ సోషలిస్ట్ రిపబ్లిక్స్) ను రష్యన్ భాషలో వ్రాసేటప్పుడు సి. సి. సి. పి. అని వ్రాస్తారని నాకు తెలుసు. ఒకప్పుడు బస్ స్టేషన్‌గా ఉన్న ఈ భవనం కొంత కాలం పాటు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫీసుగా ఉండేదట. ఇప్పుడు అది ఒక సోవియట్ కాంటీన్.

ఇక్కడ వాతావరణం, లభించే ఆహార పదార్థాలు సోవియట్ కాలాన్ని తలపిస్తున్నాయి. నేను కూడా, సోవియట్ శ్రామిక వర్గ మిత్రుల పంథాలోనే, క్యూలో నిలబడి, నా ప్లేటు నింపుకుని, తినటానికి ఒక టేబుల్ చేరాను. బీట్రూట్ రంగులో కొట్టొచ్చినట్లు కనపడే బోర్ష్ట్ సూప్ అన్నీ చోట్లా దొరుకుతుంది. పదార్థాల రుచి బాగానే ఉన్నా.. అక్కడి సోవియట్ తరహా వాతావరణం కొంత విభిన్నంగానే అనిపించింది. ఆంటోన్ నన్ను కాంటీన్ యజమానికి పరిచయం చేశాడు. ఇక్కడ సోవియట్ కాలపు పదార్థాలకు మంచి డిమాండ్ ఉంటుందని ముందుగానే తెలుసుకుని, అదే అనుభవం సందర్శకులకు అందించటాని ప్రయత్నిస్తునట్లు అతను చెప్పాడు.

మొత్తం మీద, ఇప్పటి రష్యా కూడా మరచిపోయిన సోవియట్ జీవన విధానం, దాని తాలూకు గుర్తులు ట్రాన్సినిస్ట్రియా అంతటా ఉండటం నేను చూశాను. ఈ దేశం తన ఉనికిని కాపాడుకోవటం కోసం, సోవియట్ యూనియన్‌తో ఒకప్పుడు తనకు ఉన్న అనుబంధాన్ని ఆసరాగా చేసుకుని, నిలబెట్టుకుంటున్నట్లు నాకనిపించింది. ఆ సందర్శకుల బృందం నుండి వేరుపడి, బెండెరీలో సోవియట్ కాలపు విశేషాలు నింపాదిగా చూడటం కోసం, నేను ఆంటోన్ టాక్సీలో బయలుదేరిపోయాము. అక్కడ నేను చూసిన వాటిలో మొదటిది, రైలు స్టేషన్ ప్రక్కన ట్రాన్సినిస్ట్రియా విప్లవకారుల గౌరవార్థం, ఆరుబయట వాడకంలో లేని రైలులో ఏర్పాటుచేసిన స్మారక చిహ్నం. ఇక్కడ మరొక పెద్ద లెనిన్ విగ్రహం కనిపించింది. బెండెరీ రైల్వే స్టేషన్ భవన సముదాయపు ముందు భాగం కూడా సోవియట్ శైలిలోనే ఉంది.

అప్పుడే, ఆంటోన్ కుమారునికి ఆరోగ్యం బాగుండలేదని, ఆసుపత్రికి తీసుకెళ్లాలని అతని భార్య నుండి మెసేజ్ వచ్చింది. అతను తటపటాయిస్తుంటే, నా గురించి ఆలోచించకుండా వెంటనే బయలుదేరివెళ్ళమని చెప్పాను. అతనికి హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలిపి సెలవు తీసుకుని, టాక్సీలో బెండెరీ కోట చూడటానికి వెళ్ళాను. ఇది నీస్టర్ నది ఒడ్డున ఉంది. నా టాక్సీ బడబడ

లాడుతున్న ఒక పాత 'లాడా' కారు. డ్రైవరు సెర్గీ మంచి మాటకారి. స్నేహపూర్వకంగా మాటలు కలపటంతో, కారు చేస్తున్న వింత శబ్దాల మాట మరచిపోయాను.

తీరా బెండెరీ కోట చేరగానే, అది మధ్యాహ్నం తెరచి ఉండదని తెలిసింది. సాయంత్రం కోట తెరవబడే వరకు అక్కడే ఉండటానికి, ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. అదే టాక్సీలో, చిట్కని గ్రామంలో ఉన్న నోల్ నీమ్ట్ మోనాస్టరీకి వెళదామని సెర్గీని అడిగాను. డ్రైవరుకు నాకు మధ్య భాష ఒక సమస్య కాలేదు. చిట్టడవిలా కనిపిస్తున్న ప్రాంతం మీదుగా పోతున్న పరిచయం లేని గతుకుల రోడ్ల మీద, అంతంత మాత్రంగా ఉన్న పాత కారులో సెర్గీ పోతూనే ఉన్నాడు. అరగంట గడిచేటప్పటికి, సరైన దోవలో వెళుతున్నాడో లేదోనని సందేహం వచ్చింది కానీ, పైకి మాత్రం ఏమీ అనలేదు. ఆ ఇరుకు రోడ్ల మీద ప్రయాణం అప్పటికే దుస్సహంగా ఉంది. సెర్గీ దృష్టి పూర్తిగా రోడ్డు మీద ఉండటం అవసరం.

ఇటువంటి ఆలోచనలతో నేను కొట్టుమిట్టాడుతుంటే, అంతలోనే ఎత్తైన గంట స్తంభం, నీలం, బూడిద రంగు, బంగారు రంగులు అద్దబడిన గోపురాలతో ఉన్న భవనాలు కనిపించాయి. 1861లో నిర్మించబడిన ఈ మొనాస్టరీ, ట్రాన్సినిస్ట్రియాలో అతి ముఖ్యమైన ఆధ్యాత్మిక కేంద్రం. 1960లలో సోవియట్ కాలంలో దీనిని మూసివేశారు. సోవియట్ యూనియన్ విచ్ఛిత్తి తరువాత దీనిని పునరుద్ధరించారు. ముఖద్వారం వద్ద నల్లని దుస్తులలో ఉన్న క్రైస్తవ మత భిక్షువు, సందర్శకులను స్వాగతిస్తూ, అక్కడి షాప్‌ను కూడా చూసుకుంటున్నాడు. లోపల అందమైన పూతోటలో నాలుగు చర్చిలు ఒకదానికొకటి సమ దూరంలో ఉన్నాయి. అక్కడ నేను కాక, మరొక మధ్య వయసు దంపతులు ఉన్నారు. ఒక అరగంట అక్కడ తిరిగి చూసి టాక్సీ చేరుకునే సరికి సెర్గీ, చెట్ల నీడలో కారును చల్లగా ఉంచి నా కోసం చూస్తున్నాడు. వెంటనే బెండెరీ కోటకు బయలుదేరాము. సెర్గీ నా కోసం కొని ఉంచిన చల్లటి మంచి నీళ్ళు, ఎంతో రుచిగా ఉండి సేద తీర్చాయి. 16 వ శతాబ్దపు బెండెరీ కోట, ఒట్టోమన్ చక్రవర్తులు నిర్మించిన దుర్గం. ఒట్టోమన్ టుర్క్ లు, రష్యా వారి మధ్య చేతులు మారుతూ వచ్చిన ఈ కోట, ప్రస్తుతం ఒక మ్యూజియం. ఇక్కడ ఒక గదిలో, మధ్య యుగంలో ఖైదీలను హింసించటానికి ఉపయోగించిన ఉపకరణాలు, వాటిని ఉపయోగించే విధానంతో సహా ఉన్నాయి. ఆ ప్రక్రియ ఊహించటానికే కష్టమనిపించింది. అక్కడ ఉన్న ఒక హంగరి దేశస్తుడు, వాటి మీద నా అభిప్రాయం ఏమిటని అడిగినప్పుడు, ఆ కాలంలో నేను లేనందుకు చాలా సంతోషిస్తున్నాను అని చెప్పాను. అతను కూడా నవ్వుతూ, 'నేను కూడా' అన్నాడు. కోట గోడల మీద నడచి, నీస్టర్ నదిని, ఆ ప్రాంతమంతటినీ  పై నుండి చూడటం నాకు చాలా నచ్చింది.

నేను మళ్ళీ కారు చేరేసరికి, సెర్గీ మంచి నిద్రలో ఉన్నాడు. తిరాస్పోల్‌లో ఉన్న నా హోటల్‌కు వెళ్ళే దోవలో కారుకు గ్యాస్ అవసరమయింది. గ్యాస్ ఇక్కడ చాలా చవక. రష్యా, ట్రాన్సినిస్ట్రియాకు దాదాపు ఉచితంగా గ్యాస్ ఇస్తుంది. సెర్గీ చాలా నెమ్మదస్తుడు. ఎవరికైనా ఇట్టే నచ్చుతాడు. ఆ రోజు టాక్సీ మీటరు విషయమే నేను మరచిపోయాను. మూడున్నర గంటల పాటు సెర్గీ నాతోనే ఉన్నాడు. ఎంతవుతుందో? అనుకుంటుండగానే.. సెర్గీ, ట్రిప్ మొత్తానికి 15 యూరోల చార్జి అని చెప్పాడు. ఇది చాలా తక్కువ అనుకుని, అతనికి ఇంకో 10 యూరోలు సంతోషంగా ఇచ్చాను. లండన్‌లో ఉండటం వలన ఒక ప్రయోజనం ఉంది. అదేమిటంటే ప్రపంచంలో ఇంకెక్కడైనా టాక్సీ చార్జీలు చాలా తక్కువగా అనిపిస్తాయి.

హోటల్ చేరుకున్న వెంటనే, ఆంటోన్ కుమారుడు ఎట్లా ఉన్నాడని, అతనికి మెసేజ్ పెట్టాను. క్రమంగా కోలుకుంటున్నాడని, ప్రమాదం ఏమీ లేదని చెపుతూ, 'సాయంత్రం చీకటి పడిన తరువాత, నగర వీధులలో తిరిగిరండి. నా దేశం చాలా సురక్షితమైనది' అని నన్ను ఆ పనికి ప్రోత్సహించాడు. అప్పటికే చాలా అలసిపోయి ఉన్నాను. కానీ రేపు ఉదయాన్నే ఇక్కడి నుండి వెళ్లిపోతాను. మళ్ళీ జీవితంలో ఇక్కడకు తిరిగి రాకపోవచ్చు. సమయం ఉన్నప్పుడే చూడవలసినవి చూసి, చేయాలనుకున్న పనులు చేసేయాలి. షవర్లో బడలిక కడిగేసుకుని, అక్టోబర్ 25 వీధిలో, హౌస్ ఆఫ్ సోవియట్స్ నుండి సువరోవ్ స్క్వేర్ వరకు నడుస్తూ వెళ్ళాను. ఆంటోన్ చెప్పినట్లే, అన్నీ అధికార భవనాలు, ఖాళీ స్థలాలు లైట్ల వెలుతురులో, పట్ట పగలు కనపడినట్లే ఉన్నాయి. పగలు ఉన్న ఎండ తీవ్రత లేక పోవటం వలన అవి ఇంకా ఆకర్షణీయంగా ఉన్నాయి.

భోజన సమయం అవటంతో ఒక మంచి స్థానిక రెస్టారెంట్ కోసం వెతుక్కుంటూ, అక్కడ కనపడిన షెరీఫ్

సూపర్ మార్కెట్‌లోకి వెళ్ళి, నాకు కావలసిన అత్యవసర వస్తువులు కొన్ని కొన్నాను. షెరీఫ్, ట్రాన్సినిస్ట్రియాలో ఒక పెద్ద సంస్థ. ఇది చాలా పెట్రోల్ స్టేషన్లను, ఫుట్ బాల్ స్టేడియంలను, మొబైలు నెట్ వర్కులను, సూపర్ మార్కెట్లను.. ఇంకా చాలా వ్యాపారాలను నిర్వహిస్తుంది. ట్రాన్సినిస్ట్రియాలోని ఒక సంపన్నవర్గం వీటిని అదుపు చేస్తుంది. అధికారం, సంపద కొద్దిమంది సంపన్నుల చేతిలో ఉండటం విచ్చిన్న యు. ఎస్. ఎస్. ఆర్. ప్రాంతాలన్నీటిలో కనపడుతుంది. ఆ రాత్రి నా డిన్నర్, లా టోకాన రెస్టారెంట్ లో. 'సార్మలే' అని పిలువబడే కాబేజీ రోల్స్, మొక్కజొన్న రవ్వ ఉడికించి చేసిన జావ, 'మామలిగా'.. తీసుకున్నాను.

మరునాడు ఉదయం 8.30కు ఉక్రెయిన్‌లోని ఒడెసకు వెళ్ళే రైలు ఉంది. రెడీ అయి, టాక్సీ తీసుకుని వెళుతుండగా, దోవలో ఒక అందమైన నిర్మాణాలతో ఉన్న పార్క్ కనిపించింది. అది కిరోవ్ పార్క్. కాస్త ఆపమని డ్రైవరును అడిగి, ఆ పార్కు చుట్టూ తిరిగి చూశాను. అయినా స్టేషన్ చేరేసరికి, ఇంకా అరగంట సమయం మిగిలి ఉంది. టికెట్ కొనుక్కుని, ఇమ్మిగ్రేషన్ తనిఖీ చేయించుకున్నప్పుడు, అక్కడున్న అధికారి, నా వీసా కాగితాన్ని తీసేసుకున్నాడు. దానిని 'ఉండీ లేని దేశం' లో నా యాత్రకు జ్ఞాపికగా తీసుకు వెళ్లాలనే నా ఆలోచనకు తిలోదకాలు ఇవ్వవలసి వచ్చింది. నిజానికి, నేను ఇంకా మాల్డోవాలోనే ఉన్నట్లు లెక్క. ట్రాన్సినిస్ట్రియా ఒక ప్రత్యేక దేశంగా గుర్తింపు లేని దేశం కాబట్టి, ఇక్కడకు వచ్చినా, మాల్డోవా వీడి వెళ్ళినట్లు నాకు ఇంకా స్టాంపు లేదు. ఇదొక విచిత్రమైన అనుభవం.

కాసేపట్లో స్టేషన్లో కలకలం రేగింది. రైలు శబ్దం క్రమంగా చేరువయింది. ఉక్రెయిన్‌లోని నల్ల సముద్ర తీరంలో ఉన్న ఒడెసకు నన్ను చేర్చే రైలు పెట్టె ఎక్కి కూర్చున్నాను. ట్రాన్సినిస్ట్రియాలో నేను ఉండబోయే ఆఖరు క్షణాలలో, అక్కడ నేను పోగు చేసుకున్న అనుభవాలు, ఒక్క సారిగా మనసులో ముసురుకున్నాయి. మళ్ళీ ఇక్కడకు ఇంకెప్పుడైనా వస్తానా? అనే భావం కలిగేసరికి, ఆంటోన్ సాహచర్యంలో దానితో నేను పెంచుకున్న అనుబంధం మనసును బరువెక్కిస్తుంటే, కదులుతున్న రైలు నుండి ట్రాన్సినిస్ట్రియాకు నిశ్శబ్దంగా వీడ్కోలు చెప్పాను. మి

**ఆంగ్లం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)**
e-mail: srnimmagadda@googlemail.com
**అనువాదం: శ్రీమతి జయశ్రీ అట్లూరి (ఇంగ్లాండ్)**
e-mail: jayasreeatluri@hotmail.com

## కమ్మతెమ్మెర

**మిసిమి** సంపాదకవర్గానికి నమస్సులు. **'ఆకుల్లో బొమ్మ, కొమ్మల్లో కొమ్మ'**తో సహా వచ్చింది. చిత్రాలకన్నా వాటి పేర్లు ముచ్చటగా వున్నాయి. **చిరునామా–భూమండలం** రచనలో సౌందర్యవంతమైన వచనంలో సాగింది. శ్రీ అశోక్ ప్రపంచమంతా పర్యటించిన విశ్వమానవుడు. ఎన్ని దేశాలు తిరిగినా–ఆ దేశాలలోని మనుషుల మనసుల్ని పట్టుకున్న తాత్త్వికుడు, మానవతావాది. నిరాడంబరతలో విశ్వజనీనతత్త్వంతో కూడిన ఔన్నత్యం వారిది.



శ్రీ **నందిని సిధారెడ్డి** గారి యింటర్వ్యూ బాగున్నది. కవి, పండితుడు, అధ్యాపకులు, సాహిత్యోద్యమశీలి, తెలంగాణా సారవంతమైన మట్టిలో పుట్టిన మాణిక్యం. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమాన్ని నడిపించిన నాయకశ్రేణిలోని వారు. మేధావులు– విద్యార్థులు, ప్రతిభావంతులు ఎందరో పాల్గొని కోటిరత్నాల వీణ తెలంగాణ సాధించుకున్నారు. ఎందరు పోరాడినా కీర్తిని మూటకట్టుకున్నారు కె.సి.ఆర్ అనిపిస్తుందీ సామాన్యుడికి; గురువులైన సి.నా.రె గారి గురించి స్పష్టంగా చెప్పిన శిష్యులు వీరు. దాశరధి, కాళోజీ వంటి వారు కాదు. అలనాటి శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి అష్టదిగ్గజ కవుల్లో మహాకవి వారు. ఆయన మనసంతా, మనిషంతా కవిత్వమే కదా! వారు తెలుగుజాతి గర్వించే సిధారెడ్డి వంటి శిష్యులను అందించిన కవిశేఖరులు కదా! బంకించంద్రుని **సీతారాం** నవల అద్భుతంగా వున్నది.. శ్రీ, జయంతి, రమ వంటి ఆదర్శవంతులయిన స్త్రీ పాత్రల ద్వారా భారతీయ పాతివ్రత్య పవిత్రతను నవల ద్వారా చూపించారు. వారి రచనల్లో భారతీయత హిందూత్వం తప్పక వుంటుంది. శ్రీ పార్థసారథి గారు మావంటి వారికి బంకించంద్రుని నవలనను పరిశీలించి చక్కగా వివరిస్తున్నారు. వారికి నా ధన్యవాదములు. చూపు కనపడదాయె–కేక వినపడదాయె! అన్నట్లు 'ఎంకి'లాగా పరిస్థితి. అయినా **మిసిమి** కోసం తహతహ.

***- చెరుకువాడ వెంకటరామయ్య, విస్సాకోడేరు, ఫోన్ : 9542118184***

# న్యూయింగ్‌టన్ పాఠశాల

– సగిలి సుధారాణి

**భా**రతదేశంలో జరిగిన హత్య కేసుల్లో అత్యంత ముఖ్యమైనది ఒకటి ఉంది. దీనంత 'ఖరీదైన' హత్యకేసు ఇంతవరకు నమోదు కాలేదు. ఈ హత్య చేసిన వారంతా విడుదలయ్యారు. డబ్బుంటే హత్యచేసైనా తప్పించుకోవచ్చు అనడానికిది ఉదాహరణ ఈ ఘటన. ఈ హత్యకు గురైనవాళ్ళు ఎవరు? హత్య చేసినవాళ్ళు ఎవరు? తెలుసుకోవాలంటే సుమారు శతాబ్దం క్రిందటి చరిత్రను తిరిగి తోడవలసిందే!

19వ శతాబ్దంలో మద్రాసులోని తేనాంపేటలో మౌంట్‌రోడ్డు పక్కన (న్యూయింగ్‌టన్ హౌస్‌లో న్యూయింగ్‌టన్ పాఠశాల ఏర్పాటు చేశారు. ఇది సాధారణ బడికాదు! ముఖ్యంగా ఇది భారతదేశపు రాచరిక యువతకోసం ఉద్దేశించి ఏర్పాటు చేయబడింది. ఇందులో బ్రిటిష్ ఇండియాలో కటకం నుండి కన్యాకుమారి వరకు విస్తరించి ఉన్న చిన్న, పెద్ద వివిధ రాచరిక సంస్థానాలకు చెందిన సుమారు 18 సం.లోపు యువ (మైనర్) జమీందార్లు చదువుకునేవారు. అందుకే దీనికి 'మైనర్ బంగ్లా' అని పేరు. ఈ పాఠశాలలో విద్యార్థులకు వసతి సౌకర్యం కూడా ఉండేది. సంస్థానాధీశుల పిల్లల పనులు చేసేందుకు సేవకులను పెట్టుకొనే సదుపాయం ఈ పాఠశాలలో కల్పించారు. ఇందులో విద్యార్థులకు తెలుగుతో పాటు ఆంగ్లభాషను నేర్పేవారు. యుద్ధ విద్యలతో పాటు సైనిక శిక్షణలో తీర్చి దిద్దేవారు. బ్రిటిష్ ప్రభుత్వానికి చెందిన 'కోర్ట్ ఆఫ్ వార్డ్స్' ద్వారా ఈ పాఠశాల నడపబడేది. ఈ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించిన వారిని పై చదువులకోసం లండన్‌కు పంపేవారు. వలసపాలనలో మద్రాసు ప్రెసిడెన్సీలోని భారతదేశపు యువ రాజులను పరిపూర్ణ సామ్రాజ్య పౌరులుగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన బ్రిటిష్ ఆదర్శాలకు న్యూయింగ్‌టన్ పాఠశాల ఒక దుర్గంలా నిలిచింది. కానీ దాని బ్రహ్మాండమైన ప్రాంగణంలో మెరిసే బూట్లు వేసుకొని, ఇస్త్రీ చేసిన తెల్లని యూనిఫారాలు




న్యూయింగ్‌టన్ స్కూల్ తైల వర్ణచిత్రం

ధరించిన యువ జమిందారీ విద్యార్థుల వెనుక నిశ్శబ్దంగా తిరుగుబాటు రాజుకుంది.

**క్లెమెంట్ దెలాహే హత్యకేసు :** 1919లో మద్రాసులోని న్యూయింగ్‌టన్ హౌస్' 1919 అక్టోబర్ 15వ తేదీన, ఉక్కపోతతో కూడిన రాత్రి ఒకే ఒక్క తుపాకీ కాల్పు నిశ్శబ్దాన్ని చీల్చింది. న్యూయింగ్‌టన్ ప్రిన్సిపాల్ అయిన డిలాహే తన మంచం మీద గాఢనిద్రలో ఉండగా కాల్చి చంపబడ్డాడు. విగతజీవిగా మారిన అతడి పడకపై దోమతెరలో పొగలు కక్కుతున్న రంధ్రమే ఏకైక ఆధారంగా నిల్చింది. అతని భార్య అలజడి వల్ల మేల్కొంది. ఈ సంఘటన భారతదేశ చరిత్ర పుటల నుండి ఆ పాఠశాల ఉనికిని పూర్తిగా తుడిచి పెట్టింది. ఇది ఆ రహస్యమైన తుపాకీ కాల్పు కథ. ఇది క్లెమెంట్ డిలాహే కథ. కళాశాల ప్రిన్సిపాల్ క్లెమెంట్ డిలాహే హత్యకేసు అప్పట్లో చాలా సంచలనం సృష్టించింది. ఈ హత్యకు వివిధ కారణాలు ఆపాదించబడ్డాయి. అయితే, చివరికి, ప్రధాన నిందితుడు నిర్దోషిగా విడుదలయ్యాడు. ఈ కేసు ఈనాటికీ అపరిష్కృతంగానే మిగిలిపోయింది.

**ఆ సంఘటనవెనుక నేపథ్యం –** ఘటన తేది: 1919, అక్టోబర్ 15 న్యూయింగ్ టన్ హౌస్‌లో సమయం రాత్రి 9.గం.లకు విద్యార్థులు అందరూ పడుకొన్నారు. ప్రిన్సిపాల్ డిలాహే, అతని భార్య పాఠశాల మొదటి అంతస్తులోని పడకగదిలో పడుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 12:30 గం. సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పడకగదిలోకి ప్రవేశించి 12–బోర్ తుపాకీతో డిలాహే తలపై కాల్చారు. భార్య కళ్ళు తెరచి చూసేసరికి భర్త రక్తపుమడుగులో పడి ఉన్నాడు. అది చూసి ఆమె అదిరిపోయి అరిచింది. ఆ శబ్దానికి హాస్టల్లోని విద్యార్థులు మేల్కొన్నారు. ప్రిన్సిపాల్ తలపై తుపాకి తూటా దూసుకొని పోయి ఉండటం మొదటి సారిగా చూసిన



హత్యకు గురైన ప్రిన్సిపల్ క్లెమెంట్ డెలాహే

విద్యార్థి హోసూరుకు చెందిన బేరికాయ జమీందారు బిత్తర పోయాడు. వెంటనే సివిల్ సర్జన్, మేజర్ హింగ్‌స్టన్‌కు ఫోన్ చేశాడు. ఆయన సుమారు 10 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని, డిలాహేను నాడిపట్టి చూసి చనిపోయాడన్న విషయాన్ని ధృవీక రించాడు. సహజంగానే శ్రీమతి డిలాహే తీవ్ర భయాందోళనలో ఉన్నారు. సమాచారం అందుకొన్న పోలీసులు వచ్చి, బేరికాయ జమిందారునే మొదట విచారించారు. అతను తాను వచ్చేసరికి సింగపట్టి జమీందార్, కాదంబూర్ జమీందార్ ఇద్దరూ ప్రిన్సిపల్ గదినుండి బయటకు రావడం కన్పించదని చెప్పాడు. అతని దగ్గర రాతపూర్వకంగా స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. పాఠశాల సమీపంలోని నడకదారిలో తుపాకి పడి ఉండటంతో దానిని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

డిలాహే హత్యకేసు మద్రాస్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాదంబూర్, సింగంపట్టి సంస్థాన వారసులైన ఇద్దరివైపు గుసగుసలు వినిపించాయి. రహస్య లేఖలు, నిశ్శబ్ద బెదిరింపులు బయటపడటం ప్రారంభించాయి. అక్కడ విద్యను అభ్యసించే విద్యార్థులు 12-18 సం. మధ్యగల మైనర్లే కావడంతో వారికి సహాయం చేయడానికి వచ్చిన సేవకులను పోలీసులు విచారించి, ఈ హత్యకు కారణం విద్యార్థులే అని ప్రాథమిక నిర్ధారణకు వచ్చి దర్యాప్తు కొనసాగించారు. ఈహత్యకు వెనుక ఉన్న కారణాలపై రకరకాల వాదనలు వినవచ్చాయి. వివిధ కారణాలు ఆపాదించబడ్డాయి.

**1. జాతివివక్ష / అవమానం :** క్లెమాన్ మొదట ప్రెసిడెన్సీలో బ్రిటిష్ క్రికెట్టు టీంకు కేప్టన్‌గా ఉన్నాడు. బౌలింగ్‌లో సిద్ధహస్తుడు. అయితే అతనిలో మరోకోణం "ఆంగ్లేయులే గొప్ప! జమిందార్లు వారిక్రింద పనిచేసేవారు!" అనే చులకన భావనలో ఉండేవాడు. ఈ విషయం రామనాథ సేతుపతి చెవిలో కూడా పడింది. దీనితో ఆయన క్లెమాన్‌పై ఆగ్రహంతో ఉండేవాడు. 1902 సం.లో కేమరన్ మేసన్ అనే అతడు 'న్యూయింగ్టన్ హౌస్' ప్రిన్సిపాల్‌గా ఉన్నాడు. అతని తరువాత క్లెమాన్‌ని ఏక్టివ్ ప్రిన్సిపాల్‌గా నియమించి అతడు బ్రిటన్‌కు వెళ్ళాడు. క్లెమాన్ సోదరి డీలాహే మద్రాసులో ప్రసిద్ధిపొందిన క్వీన్ మెరీస్ కళాశాల మొదటి ప్రిన్సిపల్. క్లెమాన్ దగ్గర ఉన్నది జమిందారీ విద్యార్థులైనా వారిని సాధరణ పౌరులుగానే పరిగణించేవాడు. జాతి వివక్షత చూపేవాడు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం, డిలాహే తరచుగా విద్యార్థులను అనాగరికులని జాతి వివక్షతో పిలిచేవాడని, అతని జాత్యహంకార వ్యాఖ్యలవల్ల వారు తరచుగా మనస్తాపానికి గురైయ్యేవారని, ఈ కారణంగా విద్యార్థుల్లో అతనిపై తీవ్రకోపం ఉండేదని దానితో కక్షపెట్టుకొని ట్రిగ్గర్ లాగడానికి చాలాకాలం ముందే క్రమశిక్షణకు, ప్రతీకారానికి మధ్య ఉన్న గీత అస్పష్టంగా మారింది. ఇదే వారిమధ్య విభేదానికి ఆజ్యం పోసింది. అది పతాక స్థాయికి చేరి అతనిపై హత్యచేశారని ఒక అభియోగం.

**2. వ్యక్తిగత కక్షలు :** డిలాహే భార్యకు హాస్టల్‌లోని కొందరు కుర్రాళ్లతో సంబంధాలు ఉన్నాయనే వదంతులు కూడా ప్రచారంలోకి వచ్చాయి.

**విచారణలో కేసుమలుపులు :** ఈ సంఘటన జరిగిన వెంటనే చిన్న, పెద్ద సంస్థానాలకు చెందిన వారసుల తల్లిదండ్రులు ఆఘమేఘాల మీద అక్కడకు చేరుకొన్నారు. కానీ నిజానికి హత్య చేసినది ఎవరో విద్యార్థులకు తెలుసు! కానీ, వాళ్ళు నోళ్ళు మెదపలేదు! దానికి కారణం వాళ్ళ తల్లిదండ్రుల ఒత్తిడే! సింగంపట్టి, కడంబూరు ఇద్దరు మైనర్లు ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని నిర్ధారణకు వచ్చిన పోలీసులు వెంటనే వారిద్దరినీ అదుపులోనికి తీసుకొన్నారు. ఈ విషయం బయటకు పొక్కింది. జమిందారుల పిల్లలు ఏవిధంగా ఈ హత్య చేసి ఉంటారనే ఊహాగానాలతో హత్యోదంతంపై ప్రముఖ పత్రికలు పతాక శీర్షికలతో కథనాలు ప్రచురించాయి.

సింగంపట్టి జమిందారు మద్రాసు ప్రెసిడెన్సీలో పెద్దపెద్దవాళ్ళతో సత్సంబంధాలు కలిగి ఉండేవాడు. తమ బిడ్డను ఏవిధంగానైనా ఈ కేసునుండి బయటపడాలని వాళ్ళను సంప్రదించాడు. దానికి ఏకైక మార్గం తమబిడ్డ అప్రూవర్‌గా మారిపోవడమే అని చెప్పడంతో విచారణ సమయంలో విద్యార్థి సింగంపట్టి యువజమిందారు నిందితుడు సాక్షిగా మారిపోయాడు. కుట్రదారులలో ఒకడైన సింగంపట్టి ఎస్టేట్ వారసుడు ఆ రాత్రి జరిగిన సంఘటనలను వివరంగా వివరించాడు.



సింగంపట్టి యువజమిందారు టి. ఎన్. శివసుబ్రహ్మణ్య శంకర తీర్థపతి
కడంబూర్ యువజమిందార్ సీడి వెళ్ళార శివ సుబ్రహ్మణ్య పాండ్యన్ తలైవర్

కడంబూర్ ఎస్టేట్‌కు చెందిన యువ జమీందార్ ఈ రాత్రే మనం దొర్రై (ప్రధానోపాధ్యాయుడి) పనిపట్టాలి అని అన్నాడని, 1919, అక్టోబర్15 రాత్రి 8:30 నుండి 9:00 గంటల మధ్య బయటకు వెళ్ళి డిలాహే దంపతులు పాఠశాలకు తిరిగి వచ్చారు. హాలులో విద్యార్థులకు నమస్కరించి, వారికి శుభరాత్రి చెప్పి, తమ పడకగదికి మెట్లపైకి వెళ్ళారు. ఆ భవనంలో వరండాకు సరిగ్గా పైన, మొదటి అంతస్తులోని పడక గదిలో రెండు మంచాలు ఉన్నాయి చెరి ఒక మంచంమీద పడుకొని నిద్రపోయారు. డిలాహే త్వరలోనే గాఢనిద్రలోకి జారుకున్నాడు. అర్ధరాత్రి దాటిన సుమారు 30 నిమిషాలకు, ఎవరో పడకగదిలోకి ప్రవేశించి, డిలాహే నిద్రపోతున్న మంచం వద్దకువెళ్ళి, 12-బోర్ తుపాకీతో అతడిని కాల్చి చంపారు. బుల్లెట్ అతని తల కుడివైపున తగలడంతో డిలాహే అక్కడికక్కడే మరణించాడు. తుపాకీ శబ్దానికి శ్రీమతి డిలాహేతోపాటు పలువురు బాలురు కూడా భయపడ్డారు" అని సింగంపట్టి కోర్టులో సాక్ష్యం చెప్పాడు. సింగంపట్టి వాంగ్మూలం ఆధారంగా, కడంబూర్ ఎస్టేట్ వారసుడిపై హత్య ఆరోపణలు వచ్చాయి. ఇందుకు సాక్ష్యంగా ఊరుకాడ జమిందారు సోదరులు కూడా వత్తాసు పలుకుతూ కడంబూరు జమిందారు తమదగ్గర ఎప్పుడూ ''ఆ ప్రిన్సిపాల్‌కు ఎలాగైనా బుద్ధి చెప్పాల"ని చెప్పేవాడని ఈ విషయం మేము ప్రిన్సిపాల్‌కు చెప్పడానికి కడంబూర్ ఏమంటాడో అని భయంవదేవారమని చెప్పారు. న్యాయమూర్తి జ్యూరీకి "ఇది నిస్సందేహంగా హత్యకేసు, ఇందులో ప్రమాదం లేదా ఆత్మహత్యకు ఎటువంటి సూచన గానీ, అవకాశం గానీ లేదని, ఈ కేసులో చిన్న సంస్థానానికి చెందిన కడంబూర్ ఎస్టేట్ వారసుడిని ప్రధాన నిందితుడిగా చేర్చారు. అతని మాటలను రికార్డు చేసి అతనితో నేరం చేసినట్లు సంతకం పెట్టించి జైలులో పెట్టించారు. దీనితో కడంబూర్ జమిందార్ చుట్టూ ఉచ్చు బిగించుకొంది.

"కడంబూర్ జమిందార్ నిజాన్ని ఒప్పుకొన్నాడు అతనికి శిక్ష పడటం ఖాయం!" "ప్రిన్సిపాల్ భార్యకు పది లక్షలు నష్ట పరిహారం ఇచ్చారు" అన్న ప్రధాన శీర్షికలతో ఆంగ్ల, తెలుగు ప్రధానపత్రికల్లో ఈ కేసుకు సంబంధించి వివిధ రకాలైన కథనాలు ప్రచురితమైనాయి.

జనాలు ఈ కేసు గురించి చిలువలు పలువలుగా మాట్లాడుకొంటున్న నేపథ్యంలో ఆ నేరం తనే చేశానని అంగీకరించి జైల్లో ఉన్న కడంబూర్ యువ జమిందార్‌ను స్వామినాథన్ అనే క్రిమినల్ లాయర్ కలసి విచారించాడు. అతని మాటలను బట్టి ఆ పిల్లవాడు ఈ హత్య చెయ్యలేదనే నిర్ధారణకు వచ్చాడు. స్వామినాథన్‌తోపాటు ఎత్తిరాజన్ అనే మరో న్యాయవాది కడంబూర్ జమిందార్ నిరపరాధని, కొందరి ఒత్తిడి కారణంగా కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని వాదించారు. మద్రాసు హైకోర్టులో జ్యూరీ మెంబర్లు అధికశాతం ఆంగ్లేయులే కావడంతో అక్కడ నిష్పక్షపాతంగా విచారణ జరగదని భావించి, ఈ కేసును మద్రాసు హైకోర్టునుండి బదిలీ చెయ్యవలసినదిగా స్వామినాథన్ పిటిషన్ వేశాడు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 27 క్రింద భారత ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వు ద్వారా ఈ కేసు మద్రాస్ హైకోర్టు నుండి బొంబాయి హైకోర్టుకు బదిలీచేయబడింది.

ఇవే ఆధారాలను బొంబాయికోర్టులో సమర్పించారు. కడంబూర్ తరపున మరో న్యాయవాది చేరాడు. అతడే ఆర్.డి.ఎన్. వాడియా, ప్రఖ్యాత న్యాయవాది. అతనితోపాటు స్వామినాథన్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ కడంబూర్ జమిందారు పక్క నిలిచి వాదించారు. ఊరు సోదరులు సహాయంతో సింగంపట్టి యువ జమిందార్ కుమ్మక్కై ఈ హత్య చేసి ఉంటారని వాదించడంతో భయపడిన సింగపట్టి జమీన్ తమబిడ్డను కాపాడుకోవాలనే తాపత్రయంతో న్యాయవాది వాడియాతో "విద్యార్థుల బంగారు భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని తమను ఏవిధంగానైనా ఈ కేసు నుండి

గట్టిక్కించాల"ని వేడుకొన్నాడు. "అయితే అందుకు తనకు పెద్దమొత్తంలో ఫీజు చెల్లించవలసి ఉంటుంద"ని వాడియా డిమాండ్ చేశాడు. "కాని అంతపెద్ద మొత్తంలో తన దగ్గర ప్రస్తుతం ధనంలేదని దానికి బదులుగా పశ్చిమ కనుమల్లోని తన ఎస్టేటులోని దాదాపు ఎనిమిది వేల ఎకరాల భూమిని ఇస్తాన"ని చెప్పాడు. ఆంగ్లేయుల పాలన కాలంలో క్రయవిక్రయాలు జరపాలంటే తప్పనిసరిగా వారి అంగీకారం పొందాలి. ఈ పరిస్థితుల్లో అది జరిగేపని కాదు గనుక వాడియా తన దగ్గర అందుకు ఒక ఐడియా ఉందని 99 సం.పాటు తనపేరు మీద ఉన్న బర్మా ట్రేడింగ్ కంపెనీకి ఆ భూమిని లీజుకు ఇస్తే సరిపోతుందని కోరాడు. అందుకు సింగంపట్టి సంస్థాన జమిందార్ తన సమ్మతిని తెలియజేశాడు.

ఆ తర్వాత జరిగిన విచారణ అధికారం, మోసాల ప్రదర్శనగా నిలిచింది. విధేయతలు మారాయి, కథలు చెల్లాచెదురయ్యాయి, రహస్యాలు బయటపడ్డాయి. ఒకరు మరొకరిపై తిరగబడ్డారు, ప్రతివాదన కేసును చీల్చి వేసింది. ఉదా. పాఠశాల బయట నడకదారిలో పడివున్న తుపాకిని పైనుంచి పడవేసి ఉంటే అది దెబ్బతిని ఉండాలి. అది ఏమాత్రం చెక్కుచెదరకుండా ఉందంటే ప్రిన్సిపాల్‌తో విరోధం ఉన్న బయట వ్యక్తులు ఎవరో ఈ ఘాతుకానికి పాల్పడి, ఆ గన్ అక్కడ పడవేసి ఉంటారని వాదించారు. చివరికి, న్యాయస్థానంలో నిశ్శబ్దం ఆవరించింది, న్యాయం జరిగింది. ఒకప్పుడు రాకుమారులను నాగరికులుగా తీర్చిదిద్దమని చెప్పుకున్న ఆ పాఠశాల అపవాదులో కూరుకుపోయింది. వాడియా తన తెలివితేటలు ఉపయోగించి వాదించి సింగంపట్టి జమిందార్‌ను కేసు నుండి బయట పడేలాచేశాడు. ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న జనాలకు ఊరట లభించింది.

**తీర్పు –** క్షుణ్ణంగా కేసును పరిశీలించిన మీదట, విచారణ ముగింపులో, జ్యూరీ సింగంపట్టి వారసుడు చెప్పిన సాక్ష్యం నమ్మదగినదిగా లేదని, అతడు చెప్పిన విషయాలు అబద్ధమని జ్యూరీ తేల్చింది. చివరికి సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో ప్రధాన నిందితుడు కదంబూర్ నిర్దోషిగా విడుదలయ్యాడు.

ది హిందూ ఫిబ్రవరి 6, 1920 "న్యూయింగ్టన్ కేసులో సత్య ప్రమాణాలు అంత ఉన్నతంగా లేవని న్యాయాధిపతి మాక్లియోడ్ స్వయంగా గమనించారు. నాలుగు రోజుల విచారణ ముగింపులో, 1920 ఫిబ్రవరి 5న, జ్యూరీ ఏకగ్రీవంగా కదంబూర్‌ను నిర్దోషిగా ప్రకటించింది. ఈ విచారణను వీక్షించడానికి భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రేక్షకులు, హర్షధ్వానాలతో" తీర్పును స్వాగతించారు.

**అన్-సాల్వ్‌డ్ మిస్టరీ :** ఆ హంతకుడు ఎవరనేది ఇప్పటికీ నీడల్లోనే మరుగునపడిన పేరు. ఎందుకో ఏదీ నిజంగా పరిష్కారం కాలేదు. క్లెమెంట్ డిలాహేని ఎవరు చంపారనేది ఇప్పటికీ ఒక అంతు తెలని రహస్యంగానే ఉండి పోయింది! ఈకేసు అపరిష్కృతంగానే మిగిలిపోయింది! ఈ కేసులో ఎవరికీ శిక్షపడలేదు.

**కలోనియల్ రాజకీయం :** తెల్లజాత్యహంకారం, భారతీయ జమీందారీ వారసుల ఆగ్రహం మరియు బ్రిటిష్ లీగల్ సిస్టం పనినితీరుకు ఈ కేసు అద్దం పడుతుంది.

**పరిణామం :** ఈ హత్య ఉదంతం తర్వాత సంచలనం సృష్టించిన న్యూయింగ్టన్ హౌస్' కళాశాలను శాశ్వతంగా మూసి వేశారు. ప్రస్తుతం ఆ పాఠశాల తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్యశాఖ ఆధీనంలో ఉంది.

**కొసమెరుపు–**పూర్వకాలంలో రాజులు ఎందుకు పనికిరాక అప్రయోజకులుగా ఉన్న రాజకుమారులను నీతి కోవిదులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినవారికి తన అర్థరాజ్యాన్ని ఇస్తే, ఇక్కడ ఆంగ్లవిద్యను అభ్యసించడానికి వెళ్ళిన తమబిడ్డలకు శిక్ష పడకుండా ఉండటానికి తమ సంస్థానంలో కొంతభాగాన్ని మూల్యంగా చెల్లించుకోవలసి వచ్చింది. నాడు ఈ కేసులో కీలకపాత్ర పోషించిన స్వామినాథన్‌కు ఆంగ్లేయులతో సత్సంబంధాలు ఉండేది. కానీ ఈ కేసులో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా స్వామినాథన్ వాదించాక ఆయనపై వారు ద్వేషం పెంచుకొన్నారు. అయితే ఈకేసులో ప్రధానపాత్ర పోషించిన వాడియా స్వామినాథన్‌కు అండగా నిలచి, స్వామినాథన్ గారి అమ్మాయి మృణాళిని ప్రఖ్యాత అణుశాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్‌కి ఇచ్చి వివాహం జరిపించారు. అలాగే మరో అమ్మాయి లక్ష్మిని సేగల్ గారితో వివాహం జరిపించారు. కానీ వీరు కొన్నాళ్ళకే విడిపోయారు. లక్ష్మి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆరంభించిన నేషనల్ ఆర్మీలో చేరి తన శక్తి సామర్థ్యాలతో 'కేప్టన్ లక్ష్మీ'గా పదోన్నతి పొందింది.

**మనోహరం మంజోలై ఎస్టేట్ నేపథ్యం!** సాధారణ జనాలకు మంజోలై ఆహ్లాదకరమైన పర్యాటక స్థలంగా దర్శనం ఇస్తుంది! నాలుగు తరాలుగా టీ ఎస్టేట్ ఉన్నవారికి




నేషనల్ ఆర్మీ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌తో కెప్టెన్ లక్ష్మీ

బతుకుదారి చూపించింది! తేయాకు, కాఫీ, ఇలాచి వంటి తోటలను పెంచారు!

ఇదంతా వినేందుకు బాగానే ఉంది కానీ దీనివెనుక చరిత్రచూస్తే దాదాపు 200 సం.క్రిందట ట్రావెన్‌కూర్ రాజుకు శత్రువురాజు ఎట్టువీట్టుపిళ్ళైకి మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో సింగంపట్టి రాజు వెయ్యి గుర్రాలు, ఏనుగులతో కూడిన సైనిక దళంతో పాటు తన కుమారుడిని తిరువనంతపూర్ రాజుకు మద్దతుగా ఇచ్చి పంపాడు. కానీ ఆ యుద్ధంలో సింగంపట్టి రాజు కుమారుడు నల్లపులికుట్టి మరణించాడు. దీనితో మార్తాండవర్మరాజు ఎంతో బాధ పడుతూ అందుకు పరిహారంగా తన రాజ్యంలో కొంత భాగాన్ని 74,000 ఎకరాల విస్తారమైన పశ్చిమ కొండలు కూడిన అటవీ ప్రాంతాన్ని సింగంపట్టి నాయకునికి బహుమతిగా ఇచ్చాడు. అందులో 8, 300 ఎకరాలు విస్తరించిన మంజోలై ప్రాంతం ఉంది. దీనినే ఆంగ్లేయుల పాలనాకాలంలో 99 సం.లపాటు వాడియా సింగంపట్టి జమిందారు వద్దనుండి తన కొడుకును కేసునుండి బయటపడేందుకు ఫీజు రూపంలోఅన్నమాట ప్రకారం 1923 సం.లో బాంబే కంపెనీ సింగంపట్టి జమీన్ కుచెందిన మంజోలై భూమిలోని సుమారు 8,000 ఎకరాలు 99 సం.లపాటు లీజుకు వ్యవసాయం చేసేందుకు ఒప్పందం కుదిరింది. వాడియా తిరువనంతపురం నుండి కూలీలను తీసుకొని వచ్చాడు. వారు కారడవిగా విషపురుగులు, రక్తపింజరుల సంచరిస్తున్న మంజోలై ప్రాంతాన్ని తమ కాయకష్టంతో తమ ప్రాణాలు సైతం లెక్కచెయ్యక సాగులోనికి తెచ్చి తేయాకు, కాఫీ, ఇలాచి వంటి సుగంధ తోటలను పెంచారు. పనివేళల్లో ఒక్క నిముషం ఆలస్యం అయినా కూలీ ఇచ్చేవారు కాదు. బ్రిటిష్ వారి పాలన అనంతరం జమిందారీ వ్యవస్థ రద్దై రైత్వారీ విధానం ప్రవేశ పెట్టబడినది. సింగంపట్టి వారసులు 74,000 ఎకరాలపై యాజమాన్య హక్కును కోల్పోయింది. ఇది ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వం నియంత్రణలో కలక్కాడ్ ముండంతురై టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రధాన భాగంగా ఉంది. ఐనా సింగంపట్టి జమిందారు వాడియాకు 8,350 ఎకరాలు వాడియా కంపెనీకి లీజుకు ఇచ్చిన కారణంగా అది ఇక్కడ వర్తించలేదు. 2026 సం.కి 99 సం.లీజు గడువు పూర్తి అయింది. బి.బి.టి.సి (బాంబే బర్మా ట్రాడింగ్ కంపెనీ) ఈ మంజోలై నేలపై వేల కోట్ల రూపాయలు సంపాదించుకొని వస్త్రరంగం - బాంబేడైయింగ్, ఆహార సంస్థ- బ్రిటానియా, ఆటోమొబైల్ మొదలైన రంగాల్లో తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకొన్నారు. సింగంపట్టి వారసులు కోర్టు చుట్టూ తిరిగి తిరిగి తమ ఆస్తులను ఆరతి కర్పూరంలా కరిగించుకొని ఎల్.ఐ.సి ఏజెంట్లుగా మారి బ్రతుకులు ఈడుస్తున్నారు. వాడియావాళ్ళు మూటముల్లె సర్దుకొని అక్కడ పనిచేసే కూలీలను ఖాళీచేసి వెళ్ళిపోవలసినదిగా హుకుం జారీచేశారు. మరోపక్క తమిళనాడు ప్రభుత్వం త్వరలోనే ఈ ప్రాంతాన్ని స్వాధీనంచేసుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది. అయితే ఆనాడు ఈ మద్రాసు ప్రెసిడెన్సీలో ఏ ఏ రాష్ట్రాలున్నాయని పరిశీలిస్తే కటకం నుండి ఒరిస్సా, ఆంధ్ర, ఇప్పటి తమిళనాడు ప్రాంతాలు భాగాలుగా ఉండేవి. ఈ ప్రాంతాలకు అందులో హక్కు ఉంది. నేడు ఈ ప్రాంతం తమిళనాడు ప్రాంతంలో తిరునల్వేలికి 30. కిలో మీటర్లదూరంలో అంబాజంక్షన్‌కు సమీపంలో ఉంది కాబట్టి వారికే సొంతమని తమిళనాడు ప్రభుత్వం దానిని 'రిజర్వ్‌డ్ ఫారెస్ట్'గా పరిగణిస్తుంది. నాడు లీజు పేరుతో బి.బి.టి.సి పెత్తనం చెలాయిస్తే, నేడుటాటా, బిర్లా లాంటి ఏ బడా కంపెనీలకు ధారదత్తం చేస్తారో? తరతరాలుగా ఆ నేలనే నమ్ముకొని జీవిస్తున్న సామాన్య జనాలు ఇప్పుడు ఎక్కడికి పోతారు? తమ జీవితాలను ఆ తోటల అభివృద్ధికే వెచ్చించిన సామాన్యులు నివసించేందుకు అవకాశం ఇవ్వాలి అలాగే ఆ భూమిలో కనీసం అయిదు శాతం అన్నా జమీను వారసులకు చెందేలా చేస్తే వారికి కొంత ఆసరా ఉంటుంది.

**డా. సగిలి సుధారాణి**
చరిత్ర పరిశోధకులు, రచయిత్రి
హైదరాబాద్, సెల్ : 949 042 8825

## నిర్బంధాలను ఛేదించిన దీపశిఖ

# రాజ్‌మోహన్ భార్య

– వై. పార్థసారథి

**భారతీయ సంప్రదాయం – పాశ్చాత్య ఆధునికత**
**మాతృభాష – ఆంగ్లభాష**
**మౌలిక రచన – అనువాదం**
**స్త్రీ – పితృస్వామ్యం**
**ప్రేమ – వివాహధర్మం**

ఈ ద్వంద్వాల మధ్య నిలచిన సాహిత్య ప్రయోగం, బంకిం మొదటి నవల–మొదటి ఆంగ్ల నవల. ఇది భారతీయ ఆంగ్ల నవల ఆరంభం కాదు. ఒక కొత్త స్త్రీ స్వరూపం, స్వరం. ఒక కొత్త దేశ కల్పన రూపు దిద్దుకుంటున్న క్షణానికి సాహిత్య సాక్ష్యం.

ఆమె పాత్రలో అందమైన విరుద్ధభావాల కలయిక వుంది. ఆమె ఆలోచనల్లో స్వేచ్ఛ ఉంది; కాని జీవితంలో స్వేచ్ఛ లేదు. నైతిక నిర్ణయం తీసుకునే శక్తి వుంది – కాని తన జీవితాన్ని తాను నిర్ణయించుకునే సామాజిక అవకాశం లేదు. ఆమె రాజ్ మోహన్ భార్య. ఆమె విషాదం వ్యక్తిగత విషాదాన్ని దాటి సామాజిక విషాదంగా మారుతుంది.




ఆమె తిరుగుబాటు నైతికమైంది. సమాజం తనపై విధించిన భార్య ధర్మం కంటె మానవ ధర్మాన్ని ఎంచుకుంది. భర్తకు విధేయత కంటె మనస్సాక్షికి విధేయతను ఎంచుకోవడం – అదే పాత్రకు శాశ్వత సాహిత్య విలువను కలిగించింది.

వివాహం కేవలం ప్రేమ, అనుబంధం, కుటుంబ నిర్మాణానికి సంబంధించిన వ్యవస్థ మాత్రమే కాదని, అది అసమానతతో కూడినప్పుడు స్త్రీ జీవితాన్ని బంధించే వ్యవస్థగా మారుతుందని బంకించంద్ర ఈ నవలలో వ్యక్తీకరించాడు. రాజ్‌మోహన్–భార్య నుండి విధేయతను కోరుతాడు; కాని ఆమెకు ప్రేమను, గౌరవాన్ని ఇవ్వడు. అతని అనుమానం, హింస, స్వార్థం, పురుషాధిపత్యం ఎంత క్రూరమైన రూపాన్ని కలిగి వుందో ఈ కథనంలో చిత్రించబడింది. నేపథ్యాన్ని ప్రక్కన ఉంచితే, కథాకాలం మొత్తం వారంరోజులే.

ఈ కథను ఒక సామాజిక నవలగా పరిమితం చేయలేము. ప్రేమ, రహస్యం, కుట్ర, నేరం, ఉత్కంఠ, సాహసం, విషాదం, ఆస్తి సంబంధాలు, కుటుంబ సంబంధాల వంటి విభిన్న శక్తుల మధ్య సంఘర్షణగా కనిపిస్తుంది. బంకిం కూడా పూర్తిగా ఆధునిక స్త్రీ వాద పరిష్కారాన్ని ప్రతిపాదించలేదు. ఆయన ఆమెకు స్వరాన్ని ఇచ్చాడు. ధైర్యాన్ని ఇచ్చాడు. నైతిక స్వాతంత్ర్యాన్ని ఇచ్చాడు. కాని చివరకు సంపూర్ణ స్వేచ్ఛను ఇవ్వలేదు. ఇది కేవలం రాజ్‌మోహన్ అనే వ్యక్తి భార్య కథ కాదు. తనకు సమాజం విధించిన గుర్తింపును దాటి తన స్వంత వ్యక్తిత్వాన్ని వెతుక్కునే ప్రతి స్త్రీ కథ.

ఈమె ఒక మూసివేసిన గదిలో వెలిగే దీపంలాంటిది. ఆ దీపం గదిని పూర్తిగా తెరవలేకపోయినా, ఆ గది గోడలు ఎక్కడున్నాయో స్పష్టంగా చూపించగలుగుతుంది. ఆమె ధైర్యం, ప్రేమ, నైతికత, త్యాగం చివరకు ఆమెకు వ్యక్తిగత ఆనందాన్ని ఇవ్వలేకపోయినా, ఆమె పాత్ర పాఠకుని మనస్సులో ప్రశ్నను మిగులుస్తుంది. సమాజం నిర్దేశించిన కర్తవ్యమే స్త్రీ జీవితానికి అంతిమ సత్యమా?

– – – –

బంకించంద్ర 1864లో రచించిన **రాజ్‌మోహన్స్ వైఫ్** తొలి భారతీయ ఆంగ్ల నవల. బంకిం రచనలలో మొదటి నవల. దీని రచన ఒక ఆసక్తికర చరిత్ర. బంకిం మొదట దీనిని ఆంగ్లంలో రచించాడు. తరువాత దీనిని బెంగాలీలోకి అనువదించడం ప్రారంభించి, మొదటి ఏడు అధ్యాయాలు మాత్రమే పూర్తి చేశాడు. ఆయన మరణానంతరం, ఆ అసంపూర్ణ బెంగాలీ అధ్యాయాలను శచీశ్‌చంద్ర చటోపాధ్యాయ వేరే రచనగా భావించి, దానికి **వారి–వాహిని** అనే పేరు పెట్టి తనదైన రీతిలో పూర్తి చేశాడు.

తరువాత 1935లో **బ్రజేంద్రనాథ్ బెనర్జీ,** ఆంగ్ల రచనలోని మొదటి మూడు అధ్యాయాలను, బంకిం చేసిన

బెంగాలీ అనువాదం ఆధారంగా తిరిగి ఆంగ్లంలోకి అనువదించి నవలను పునర్నిర్మించాడు. అందువల్ల 1935లో ప్రచురింపబడిన నవలలో మొదటి మూడు అధ్యాయాలు బంకిం బెంగాలి రూపాంతరం నుండి తిరిగి ఆంగ్లంలోకి వచ్చాయి.

ఇది ఒక అసాధారణ సాహిత్య పరిస్థితిని సృష్టించింది. ఇప్పుడు మన ముందున్న **రాజ్‌మోహన్ భార్య** నవల పూర్తిగా ఒకే దశలో రాసిన, ఒకే భాషలో లభించిన మౌలిక ప్రతి కాదు. దాని ప్రచురణలో మూల రచన, స్వీయ రచన, స్వీయానువాదం, పునరనువాదం, సంపాదకత్వం అన్ని పరస్పరం కలసిపోయాయి. ఒక విధంగా దీనిని భాషా ప్రయోగశాలగా కూడా చూడవచ్చు. నవలా రూపంలో భారతీయ జీవనానుభవాన్ని ఆంగ్లంలో వ్యక్తపరచి, అదే కథను మాతృభాషలో తిరిగి నిర్మించడం ద్వారా బంకిం భారతీయ నవలా పరిణామానికి ఒక నూతన మార్గాన్ని సూచించడనడంలో ఆశ్చర్యం లేదు.

ఇది భారతీయ నవల తన స్వరూపాన్ని వెతుక్కుంటున్న సమయంలో జరిగిన ఒక భాషా- సాంస్కృతిక ప్రయోగం.

- - - -

**నీరద్ సి. ఛౌదరి, శిశిర్‌కుమార్ దాస్, మీనాక్షి ముఖర్జీ** వంటి ప్రముఖ రచయితలు - వ్యాఖ్యాతలు - బంకిం ఆంగ్లంలో ఈ రచనను చేపట్టడం ఒక నిశీథ లోయలోకి వెళ్లినట్లు భావించినందునే, బెంగాలీలో తిరిగి పూర్తిగా రచించి వుండకపోయి వుండవచ్చని అభిప్రాయపడ్డారు. **శ్రీ అరబిందో, రవీంద్రనాథ్ ఠాగూర్ బంకిం** ఆంగ్ల సాహిత్య ప్రతిభను గౌరవించినప్పటికి, బంకిం బెంగాలి రచనలతో పోలిస్తే దీనికి పరిమితులున్నాయని గుర్తించారు.

**ఓంద్రిలా ముఖర్జీ** ఈ నవలను పాఠకుడిని ఉత్కంఠతో ముందుకు నడిపించే కథన నిర్మాణమని - వివిధ అంశాలు ఒక దానితో మరొకటి సంఘర్షణ పడే అంశాలతో కథనాన్ని నడిపించారని, కథ చెప్పే శక్తి తొలి రచనలోనే కనపించిందని-తదనంతరం కళాత్మక పరిపక్వత మరింతగా అభివృద్ధి చెందిందని అభిప్రాయపడింది.

ముఖ్యంగా రాజ్‌మోహన్ భార్య పాత్రే ఈ నవలకు శాశ్వత విలువ. తన కాలపు పితృస్వామ్య సమాజంలో పూర్తిగా విముక్తి పొందిన స్త్రీని సృష్టించలేకపోయినా, తన మనస్సాక్షిని వినగలిగిన, తన నిర్ణయాన్ని తానే తీసుకోగల, అన్యాయానికి ఎదురు నిలబడగల స్త్రీని మాత్రం మొదటి రచనలోనే బంకిం సృష్టించాడు. ఈ నవల భారతీయ నవలా చరిత్రలో ఒక 'మొదటి అడుగు' మాత్రమే కాదు- భారతీయ సాహిత్యంలో స్త్రీ, సమాజం, ఆధునికత గురించి వచ్చిన అనేక ప్రశ్నలకు మొదటి ప్రతిధ్వని కూడా.

### రాజ్‌మోహన్ భార్య

బెంగాల్‌లోని ప్రసిద్ధ జమీందారీ కుటుంబాలన్నీ ఏదో ఒక తక్కువ వర్గాల నుండి వచ్చాయనే నింద ప్రచారంలో ఉంది. ఒకరకంగా అది యదార్థమే.

**వంశీ వదన్ ఘోష్** తూర్పు బెంగాల్‌లోని ఒక వృద్ధ జమీందారు వద్ద వంటవానిగా వుండేవాడు. మొదటి భార్యకు సంతానం లేకపోవడంతో, వృద్ధాప్యంలో ఆ జమీందారు రెండో వివాహం చేసుకున్నాడు. యవ్వనంలో ఉన్న అందమైన రెండో భార్యతో సంతోషంగా వుండడానికి మొదటి భార్య అడ్డుపడుతూ వుండడంతో, మధ్యవర్తి సహాయంతో ఆస్తి అంతా ఆమె పేరు మీద రాసి, ఆమెను ఈ లోకం నుండి పంపించి వేసి, ఆస్తి అంతా తిరిగి తనకే దక్కడంతో, పడుచు పెళ్ళాంతో నిశ్చింతగా ఉన్నా, ఈ ఆస్తిపాస్తులన్నీ ఏమైపోతాయో అనే భయంతో మానసిక ఆనందం లేకపోయింది.

దాంతో స్థిరాస్తులన్నింటిని డబ్బు, విలువైన వజ్రాభరణాలలోకి మార్చి వాటన్నిటిని చూసి ఆనందిస్తూ పరమపదించాడు. ఆ అపార ధన సంపద అంతా నవజవ్వనియైన భార్యకు లభించింది.

సీతను అడవికి పంపి, బంగారు సీతను చేసుకుని రాముడు సమాధానపడ్డాడు. అలాగే ఈ యువతి బంగారు భర్త బదులు సజీవ వ్యక్తినే ఆ స్థానంలో నిలుపుకోదలచి, వంటవాడైన **వంశీవదనుడి**కి అంతఃపుర పట్టాభిషేకం చేసింది. ఒక జడ పదార్థాన్ని ఆరాధించడంకంటె, సజీవ పదార్థ ఆరాధనే సృష్టి ధర్మమని ఆమె అనుకుని అనుసరించింది.

భార్య దేహ సామ్రాజ్యంతోపాటు, ఆమె ఆస్తికి కూడా అధికారి కావడం కోసం **వంశీవదనుడు** పెద్దగా కష్టపడకుండా మొత్తం జమీకి సర్వాధికారి కావడంతో పాటు, తన జమీందారు పెద్ద భార్యను చేసిన విధంగానే, ఈ యువతికి కూడా తెలియని రోగంతో మంచం పట్టించి స్వర్గప్రాప్తి కావించాడు. మిగిలిన ఆస్తి అంతా అమ్మేసి, పెద్ద జమీందారు రూపంలో రాధాగంజ్ గ్రామానికి చేరుకున్న **వంశీవదనుడు** మరో యువతిని వివాహం చేసుకుని, ముగ్గురు పుత్రులను కని ఆస్థి అంతా జాగ్రత్తగా పిల్లలకు పంచి మరణించాడు.

మొదటివాడైన **రమాకాంతుడు** ఆస్తిని జాగ్రత్తగా చూసుకుని, తన కుమారుడు **మధురబాబుకు** ఇంగ్లీష్ చదువు నేర్పించడానికి వ్యతిరేకించి, జమీ వ్యవహారాల్లో

అవసరమైన మోసము, కుట్ర, జూదము, ప్రజలను శాసించడం, అణచడం వంటి మెళకువలన్నీ నేర్పాడు.

వంశీవదనుడి రెండో కుమారుడు **రామకన్హాయి** కలకత్తా వెళ్ళి తన ఆస్తినంతా పోగొట్టుకున్నప్పటికి, నగర ప్రభావంతో పిల్లలకు కాస్త చదువు చెప్పించాడు. తన కుమారుడైన **మాధవ్‌ఘోష్‌**కు చదువు సంధ్యలు, నాగరికత అబ్బినప్పటికి, చేతిలో చిల్లిగవ్వ లేదు. వంశీవదనుడి మూడవ కుమారుడు **రామ్‌గోపాల్‌**కి సంతానం లేక పోవడంతో పెద్దన్న **రమాకాంతుడి**పై వున్న కోపం కారణంగా **మాధవ్‌ఘోష్‌** పేర వీలునామా రాయడంతో **మాధవ్‌ఘోష్‌** అదృష్టం దశ తిరిగింది.

- - - -

కలకత్తా సమీప గ్రామంలోని ఒక పేద కాయస్థునికి ఉన్న ఇద్దరు కుమార్తెలు రూపలావణ్యాలు, వినయ సంపన్నులు, అమూల్య సంపద అని అందరూ చెప్పుకునేవారు. అదృష్ట దేవత సహజంగా కోమల హృదయం, సున్నిత మనస్సు, అత్యంత సౌందర్యం కల బాలికలకు చెడ్డ భర్తలను సమకూరుస్తుంది. పూర్ణ యవ్వనంలో ఉన్న **రాజమోహనుడు** బలిష్టంగా, మంచి కాయకష్టం చేయగలడని భావించి వయస్సులో తేడా ఉన్నప్పటికి పెద్ద కుమార్తె **మాతంగిని**తో తండ్రి వివాహం జరిపించాడు. రెండవ కుమార్తె **హేమాంగినికి** మాతంగిని సహాధ్యాయి, చదువుకున్న మాధవ్‌ఘోష్‌తో వివాహం జరిగింది.

చిన్న వయస్సులోనే పెళ్ళిళ్ళు కావడంతో, అక్క చెల్లెళ్ళిద్దరూ కలిసి, మెలసి పుట్టింట్లోనే గడిపారు. ఈ మధ్యకాలంలో ఉన్నట్టుండి మాధవ్‌ఘోష్ ధనవంతుడు కావడంతో, చెల్లెలు హేమాంగినిని దూరదేశం తీసుకు వెళ్లడానికి మాధవ్‌ఘోష్ అత్తగారింటికి వచ్చినపుడు, తన భర్తకు కూడా జమీలో ఏదైనా ఉద్యోగం ఇప్పించమని మాతంగిని చెల్లెలు ద్వారా మాధవ్‌ఘోష్‌ను అడిగించింది.

మాధవ్‌ఘోష్ అంగీకరించి, **రాజ్‌మోహన్‌**ను జమీలో ఉద్యోగానికి రమ్మన్నప్పుడు, తన పేదరికాన్ని వెక్కిరిస్తున్నారని మొదట వ్యతిరేకించినా, చివరకు తప్పనిసరై రాధాగంజ్‌కు సపరివారంగా చేరుకున్నారు. తోడల్లుడి మంకు స్వభావం, మర్యాద తెలియనితనం, దుష్ట స్వభావం, కృతఘ్నత లక్షణాలు తెలిసినప్పటికి, ఒక గ్రామ వ్యవహారాలు అప్పగించి, ప్రత్యేకంగా ఇల్లు కట్టించి, కొంత భూమిని సాగుకోసం **మాధవ్‌ఘోష్‌** ఇచ్చాడు. జమిందారి వ్యవహారాలు ఏమీ అర్థం కాని **రాజ్‌మోహన్‌** వ్యవసాయ పనులతో సమయాన్ని గడుపుతూ, మాధవ్‌ఘోష్‌పట్ల ద్వేషభావంతో ఉన్న వారందరితో మిత్రుత్వం చేస్తూ వుండేవాడు. ఇలాంటి మనోభావాల వల్ల రెండు కుటుంబాలకు రాకపోకలు లేక, అక్క చెల్లెళ్ళిద్దరు కలుసుకోవడం తగ్గిపోయింది.

జమీందారి కుటుంబాల్లో పైకి కనిపించే ఆప్యాయత, ప్రేమల వెనుక కరడు కట్టిన విషం బుసలు కొడుతూ వుంటుంది. మాధవ్‌ఘోష్‌తో పైకి నవ్వుతూ, ప్రేమతో పలికే **మధురబాబు** వరుసకు తమ్ముడైన **మాధవ్‌ఘోష్‌** పైన లోలోపల తీవ్రద్వేషాన్ని నింపుకుని, ఆ ఆస్తినంతా కొట్టేయాలని పన్నాగాలు పన్నుతున్నాడు. ఈ క్రమంలోనే కలకత్తా వకీలు మాధవ్‌ఘోష్ దగ్గరకు వచ్చి, మాధవ్‌ఘోష్ పినతండ్రి రాసిచ్చిన వీలునామా ఫోర్జరీదని కోర్టులో ఎవరో దావా వేశారని, భయపడవలసింది లేనప్పటికి, కేసును ఎదుర్కోవలసి వుంటుందని చెప్పాడు.

- - - -

పాపిట్లో కుంకుమ దిద్దుకుని, నీళ్ళతో తలదువ్వుకుని, తాంబూలంతో పెదవులను ఎర్రగా చేసుకుని, చంకలో బిందెతో పక్కింట్లోకి వచ్చిన కనకమయి - రా! నదికి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుందాం - అని పనిచేసుకుంటున్న యువతిని అడిగింది. పసిమి వర్ణంతో, విశాలమైన పాలభాగం, వంపు తిరిగిన అందమైన కనుబొమ్మలు, సిగ్గుతో కంపిస్తున్న అర్ధనిమిలిత నేత్రాలు యవ్వనానందంతో మత్తెక్కినప్పటికి, ఆమె చూపులో తీరని ఆవేదన, శారీరక, మానసిక క్లేశం - మాసిన బట్టలు ధరించినా ఏ శిల్పి చెక్కలేని అత్యంత సౌందర్యవతి ఆ పద్దెనిమిదేళ్ళ యువతి. తాను చేస్తున్న పని ఆపి - నేనెప్పుడైనా నీళ్ళ కోసం బయటకు వచ్చానా - అని నవ్వుతూ అడిగింది.

రాత్రి - పగలు ఈ పంజరమేనా? అందరు కోడళ్ళు, ఆడపడుచులు నీళ్ళు తెచ్చుకుంటున్నారు కదా! నీవు రా - అని కనకమయి మళ్ళీ అడిగింది.

మా ఆయన సంగతి తెలుసు కదా! నేను నీళ్ళ రేవుకు వెళ్ళడం వారికి ఇష్టం ఉండదని నీకు తెలిసి ఇలా అడగడం బాగాలేదు అన్నా - కనక ఆ యువతిని బలవంత పెట్టింది.

నేనేమీ నా భర్తకు భయపడను. వందమంది భర్తలున్నా భయపడను అంటూ కనక నవ్వింది.

వందమంది భర్తలు కావాలని కోర్కెగా వున్నట్టుంది అని ఆ యువతి అంటే - నోటితో అనడం పాపం కాని - బ్రహ్మదేవుడు ఒక భర్తను ఇచ్చాడు. వందమంది అలాంటి వాళ్ళే అయినప్పుడు, కోటిమంది వుంటే నష్టం ఏమిటి? మనపై వున్న కట్టుబాట్లేమీ మారవు కదా! అని కనకమయి జవాబిచ్చింది.

నీతో వాదులాడలేను - జవాబులు చెప్పలేను - సరే వస్తా పద అంటూ ఆ యువతి బిందెతో బయలుదేరింది. ఆమె **రాజ్‌మోహన్ భార్య - మాతంగిని.**

\- - - -

మధుమతి నది ఒడ్డున ఉన్న రాధాగంజ్ గ్రామం చిన్నదైనప్పటికి, అక్కడ అనేకమంది వర్ధమాన్ జమీందారీ కుటుంబాలు ఉండడంతో దానికో ప్రత్యేకత, అందమూ చేకూరాయి.

అందమైన పూలతోటలు, చక్కటి కాలిబాటలు, ఉద్యానవనాలు, చిన్న చిన్న కొలనులు, దాని పక్కనే ఉండే కచేరీ గది, అక్కడ కూర్చుని తమ ఆడంబరం పటాలోపం ప్రదర్శించే జమీందారి యువకులు, వచ్చే పోయే స్త్రీలను, యువతులను చూస్తూ సరదా కబుర్లు చెప్పుకుంటుంటారు. నీళ్ళకోసం వెళ్ళే స్త్రీలంతా ముసుగులు ధరించి తమ మొహం ఏ మాత్రం కనపడకుండా బృందాలుగా వెళతారు. గాలి వాటుకు ముఖం మీది ముసుగు పైకి లేవడంతో మాతంగిని చూసిన యువ జమీందారు మాధవ్‌ఘోష్ తుళ్ళిపడ్డాడు.

ఆమె దేహలావణ్యం, నడకలోని సోయగం చూసి ప్రక్కనే ఉన్న **మధురబాబు,** ఎవరీమె - ఇంత అందగత్తె-నేనెప్పుడూ చూడలేదే అంటే - మాధవ్‌ఘోష్ అతడిని ఆపి - ఆమె నా వదిన - రాజ్‌మోహన్ భార్య - ఎప్పుడూ ఇంట్లోంచి బయటకు రాదు - పిచ్చిమాటలు మాట్లాడకు- అంటూ అశ్లీల సైగలు చేస్తున్న మధురబాబును మందలించాడు.

వివాహం అంటే లాటరీ అనే చెప్పాలి. ఇంత అందమైన అమ్మాయి రాజ్‌మోహన్ భార్య అంటే ఏమనాలి- అంటూ మధురబాబు మాట్లాడడం ఆపి ఆమె వెళుతున్న వైపే చూశాడు.

ఇద్దరు యువతులు నీళ్ళబిందెలతో ఇంటికి చేరుకున్నారు. రాజ్‌మోహన్ గుమ్మంలో నిలబడి కళ్ళెర్ర చేసి చూస్తుంటే మాతంగిని భయంతో కంపించి పోయింది. రాజ్‌మోహన్ ఆమె చేతిలోని బిందెను లాక్కుని నీళ్ళు బయట పారబోశాడు. నీకు లక్షసార్లు చెప్పినా ఎందుకు వెళుతున్నావ్? నీ అందాలను అందరికీ చూపించాలనా అంటూ చేయెత్తాడు. భీతిగొన్నప్పటికి ఆమె చూసిన చూపుకు అతను చెయ్యవిదిలించి, గర్జిస్తూ అనరాని మాటలు అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

\- - - -

మాతంగినిని తీవ్రంగా నిందించి, బెదిరించిన రోజు రాత్రి, **రాజ్‌మోహన్** ఆలస్యంగా ఇంటికి వచ్చి బయట ఎవరితోనో గుసగుసలు మాట్లాడడం చూసిన **మాతంగిని,** కిటికి ప్రక్కనే వుండి ఆ మాటలు విని ఆశ్చర్యపోయి, భయకంపితురాలైంది.

ఇద్దరు చీకట్లో వున్న వ్యక్తులు రాజ్‌మోహన్‌తో, మాధవ్‌ఘోష్ ఇంట్లో దొంగతనం చేయాలని, నగలన్నింటిలో నాల్గవ వంతు రాజ్‌మోహన్‌కు ఇవ్వడానికి చర్చిస్తున్నారు. తనకు మాధవ్‌ఘోష్ ఉపకారం చేసినప్పటికి, అతడంటే ఉండే అసూయ, ద్వేషం వల్ల, దొంగలకు సహాయపడతానని, అందుకు మరో వెయ్యి రూపాయలు అదనంగా కావాలని రాజ్‌మోహన్ బేరమాడుతున్నాడు. మాధవ్‌ఘోష్ ఇంటిలోపలి విషయాలు ఎంతో కొంత తెలిసిన రాజ్‌మోహన్‌ను దొంగలు ఎంచుకున్నారు. అలాగే ఏనుగు దంతంతో చేసిన పెట్టెలో ఉన్న వీలునామాను తెచ్చిస్తే మరో రెండు వందలు అదనంగా ఇస్తామని మొత్తానికి బేరం కుదిరింది. చంద్రుడు అస్తమించగానే, మాధవ్‌ఘోష్ ఇంటిపై దోపిడీ చేయాలని అందరూ నిశ్చయించుకున్నారు.

తన భర్త భయానక మానసిక రూపాన్ని మాతంగిని ఆరోజు స్పష్టంగా చూసింది. ఇంతకాలం శారీరక పశు ప్రవృత్తిని చూసిన ఆమె దొంగలకు సహాయపడే రూపంలో అసూయ, ద్వేషం నిండిన ఈ వ్యక్తి ఆలింగనంలో తన జీవితం శాపగ్రస్తంగా గడిచిందని కుమిలిపోయి, ఏం చేయాలో తెలియక బాధ పడింది. తమకెంతో సహాయం చేసిన మరిది మాధవ్‌ఘోష్. మాధవ్‌ఘోష్ - తాను ఒకరంటే ఒకరికి చిన్నప్పుడు చదువుకున్నప్పుడు కలిగిన ఇష్టం మూగగా అలాగే వుండిపోయింది. ఎప్పుడూ తమ భావాలను ఒకరికొకరు వ్యక్తపరుచుకోలేదు. ఇప్పుడు అతను తన చెల్లెలు భర్త. కుటుంబనియమాల ప్రకారం అతని ఎదురుగా ఒంటరిగా నిలబడడం, మాట్లాడడం నిషిద్ధం. తన భర్త వల్ల వారు నష్టపోతారు. సర్వనాశనమైపోతారు. కాని తన భర్త ఇలా చేస్తున్నప్పుడు ప్రక్కింటి కనకమయికి గాని, ఎవరికి చెప్పడానికి లేదు. చివరకు మాతంగిని ధైర్యం తెచ్చుకుని ఆరాత్రి మాధవ్‌ఘోష్ బంగళాకు ఒంటరిగా బయలుదేరింది.

దారిలో దొంగలంతా దాడికి మామిడి తోటలో సిద్ధమవుతున్నారు. వారికి కనపడకుండా చెరువు నీటిలో మునిగి, మాధవ్‌ఘోష్ బంగళాకు చేరుకుని, వెనుకవైపు నుండి వెళ్లి చెల్లెలను శబ్దం చేయకుండా నిద్రలేపమని పనిమనిషి కరుణను పైకి పంపించింది. అక్క చెప్పిన విషయాలను ఆశ్చర్యంతో విన్నప్పటికి భర్తను నిద్ర లేపడానికి హేమంగిని ధైర్యం చేయలేక మాతంగినినే వెళ్ళిచెప్పమంది.

మాతంగిని చెప్పిన విషయాలు మాధవ్‌ఘోష్ మొదట నమ్మలేకపోయాడు. ఆ రోజున్న కట్టుబాట్ల ప్రకారం మరిదితో ఒంటరిగా మాట్లాడడమే నిషిద్ధం. ముసుగు తీసి, తీక్షణంగా చూస్తూ, ఏనుగు దంతం పెట్టె, వీలునామా అన్ని చెబుతున్న మాతంగినిని ఆశ్చర్యంగా చూస్తూ అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకున్నాడు మాధవ్‌ఘోష్.

శబ్దం చేయకుండా, దీపాలు వెలిగించకుండా, బంగళాలో ఉన్న మనుషులందరిని బంగళా చుట్టూ వుంచి, దొంగలపై ఎదురు దాడి చేయడానికి లాఠీలు, బరిషలతో అందరూ సిద్ధమయ్యారు. మాధవ్ మనిషి రహస్యంగా వెళ్ళి మామిడి తోటలో వున్న దొంగలందరినీ చూసి వచ్చి మాతంగిని చెప్పినదంతా నిజమేనని చెప్పాడు.

బంగళా చెట్టూ దీపాలు వెలిగించి, పెద్ద పెద్దగా కేకలు వేస్తూ దొంగలను దమ్మంటే రమ్మని మాధవ్ మనుషులంతా సవాల్ చేస్తూ, ప్రతి అరగంట కోకసారి గట్టిగట్టిగా అరిచారు. దొంగలంతా పారిపోయారు. తమ కుటుంబాన్ని ఆపదనుండి కాపాడిన మాతంగినిని మాధవ్‌ఘోష్ కృతజ్ఞతలు చెప్పి, ఇదంతా ఎలా తెలుసని అడిగినా మాతంగిని, తన భర్త కూడా ఇందులో భాగమని చెప్పలేదు. ఆ రాత్రే వెళ్ళిపోవాలని చెప్పి ఏడుస్తూ, మాధవ్‌ఘోష్ చేతుల్లో మొహాన్ని పెట్టి, నన్ను ద్వేషించకండి, మళ్ళీ నేను మిమ్ములను కలుసుకోలేక పోవచ్చు – నేను నిన్ను హృదయపూర్వకంగా ప్రేమించాను. భర్త అంటే నీలా వుండాలి అంటూ మాతంగిని వెక్కి వెక్కి ఏడ్చింది. చిన్నప్పుడు కలకత్తాలో ఇద్దరూ కలసి ఆడుకున్న విషయాలు – ఒకర్నొకరు ఇష్టపడి తిరిగినవన్నీ గుర్తుకు వచ్చి ఇద్దరూ కన్నీటి పర్యంతమయ్యారు.

మనిద్దరం ఒకరినొకరు మరిచిపోవాలి. మన ప్రేమ కుటుంబాలను నాశనం చేయకూడదని ఇద్దరూ ఏడుస్తూ నిర్ణయం తీసుకున్నారు. దాని కరుణ తెల్లవారు ఝామున కంటే ముందు మాతంగినిని ఇంటికి దూరంగా దింపి వెళ్ళిపోయింది.

ఇంట్లోకి వస్తున్న మాతంగినిని రాజ్‌మోహన్ కత్తి చూపించి ఎక్కడకు వెళ్ళి వస్తున్నావని అడిగితే, భయపడకుండా జరిగినదంతా మాతంగిని చెప్పడంతో రెచ్చిపోయిన రాజ్‌మోహన్ ఆమెను పొడిచే సమయానికి దొంగల నాయకుడు సర్దార్, మరో ఇద్దరు దొంగలతో వచ్చి రాజ్‌మోహన్‌ను స్తంభానికి కట్టివేశారు. నీవే నీ భార్యను మరిది దగ్గరికి పంపి, ఈ నాటకాలెందుకని తీవ్రంగా కొట్టారు. ఈ సమయంలో మాతంగిని బయటకు పారిపోయింది. రాజ్‌మోహన్ జరిగినదంతా చెప్పడంతో అందరూ కలసి మాతంగినిని చంపాలని ఎంత వెతికినా ఆమె కనపడలేదు.

మాతంగిని మిత్రురాలు కనకమయి సహాయంతో, చెరువులో అప్పుడే స్నానానికి వచ్చిన సుఖియా తో మాట్లాడి, అసలు విషయాలు చెప్పకుండా, రాజ్‌మోహన్‌కు సంబంధించిన చెడు విషయాలు చెప్పి, మాతంగినిని కొట్టి ఇంట్లోంచి పంపివేశాడని, కొన్ని కారణాల వల్ల చెల్లెలు దగ్గరకు వెళ్ళలేదని, ఎలాగైనా కొంతకాలం దాచి పెట్టాలని కోరింది. సుఖియా మాతంగినిని తాను పని చేసే జమీందారు **మధురబాబు** ఇంటికి తీసుకు వెళ్ళింది.

– – –

జమీందారు **మధురబాబు** బయటకు సున్నితంగా కనిపిస్తాడు. వివిధ కారణాల వల్ల, చెడు అలవాట్ల వల్ల అతని ఆర్థిక పరిస్థితి బాగా లేదు. దివాలా అంచున ఉన్నాడు. అతనికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య తారను గౌరవిస్తాడు కాని, చిన్న భార్య చంప చేతిలో కీలుబొమ్మ. మాతంగినిని దాసి సుఖియా తార దగ్గరకు తీసుకువెళ్ళి, కొంతకాలం ఆశ్రయం కల్పించమని కోరింది. తార కోరిక మేరకు **మధురబాబు** మాతంగినిని తమ ఇంట్లో కొంతకాలం ఉండడానికి అంగీకరించాడు.

**మాతంగిని** జీవితంలో అమంగళకర ఆపదలు ఇంకా అస్తమించలేదు. **మధురబాబు** రెండవ భార్య **చంప** ఎన్ని రకాలుగా అడిగినా **మాతంగిని** వినయపూర్వక జవాబులు చెప్పింది తప్ప, అసలు విషయాలేమీ చెప్పలేదు. ఇది **చంప** అహాన్ని దెబ్బతీసింది. అంతేకాక భర్త తనతో మాటమాత్రం చెప్పకుండా, సవతి కోరికను ఆమోదించడం అసలు నచ్చలేదు. **మాతంగిని**ని పంపివేయమని భర్తతో దెబ్బలాడినా, అనాథస్త్రీకు ఆశ్రయం గురించి ఎందుకంత గొడవ అని **మధురబాబు** నచ్చచెప్పినా **చంప** అలిగి స్త్రీ చతురోక్తులన్ని భర్తపై ప్రయోగించి, చివరకు **మాతంగిని**ని పంపించి వేయడానికి అంగీకరింపజేసింది. **తార** భర్త నిర్ణయాన్ని మార్చలేకపోయింది. చివరకు మరో దాసి వెంట **మాతంగిని**ని భర్త దగ్గరకు పంపించి వేశారు.

– – –

సర్దార్ దొంగలందరినీ సమావేశపరచాడు. రాజ్‌మోహన్ భార్యవల్లే తమ ప్రణాళికలన్నీ దెబ్బతిన్నాయని, ఆమెను అంతమొందించాలని, అలానే మాధవ్‌ఘోష్ దగ్గర ఉన్న దస్తావేజును తేవడానికి పథకాలు వేశారు.

**మాతంగిని**ని చంపాలని నిశ్చయించిన రాజ్‌మోహన్ ఆమె కోసం అన్నిచోట్లా వెతికించాడు. సఖియా ద్వారా **మధురబాబు** ఇంట్లో ఉందని తెలుసుకుని విచారిస్తే,

ఆమెను మూడురోజుల క్రిందే పంపించారని తెలిసింది. వకీలు మనిషి రహస్యంగా కలవాలనే వార్త పంపి, మాధవ్‌ఘోష్‌ను బంధించి ఒక పాడుబడ్డ ఇంట్లో కట్టివేశారు. మాతంగిని ఆచూకీ లేదు.

– – – –

**మధురబాబు** అతిగా బాధపడుతూ వుండడం, నిద్రలేమితో పచార్లు చేయడం చూసిన **తార,** అతని బాధకు గల కారణాలు తెలుసుకోలేకపోయింది. రాత్రిపూట రహస్యంగా ఇంటి వెనుక వున్న శిథిలమైన ఇంటి వైపు నుండి రావడం గమనించింది. మాధవ్‌ఘోష్‌ను బంధించిన దొంగలు దస్తావేజు కోసం వత్తిడి చేశారు. గుమాస్తాకు కాగితం రాసిమ్మని, లేకపోతే చంపేస్తామని బెదిరించారు. వారిని ఇదంతా ఎవరు చేయమని చెప్పారో – వారిచ్చే డబ్బుకు మరింత ఇస్తామని మాధవ్‌ఘోష్ బేరమాడాడు.

**మాధవ్‌ఘోష్**ను బంధించిన గదిపై నుండి రకరకాల శబ్దాలు వస్తూ వుండడంతో, గంజాయి మత్తులో వున్న దొంగలు భూత, ప్రేతాలున్నాయని భయపడ్డారు. భర్త ఎందుకు ఆ శిథిల భవనంవైపు వెళుతున్నాడో తెలుసుకుందామని చీకట్లో వచ్చిన **తార**ను చూసి దెయ్యమనుకుని దొంగలు పారిపోయారు. ముందు భయపడినా, తరువాత మాధవ్‌ఘోష్ కిటికీలో నుండి కేకలు వేయడంతో, **తార** వచ్చి తమ బంధువర్గంలోని మాధవ్‌ఘోష్‌ను చూసి ఆశ్చర్యపోయి కట్లు విప్పి బయటకు తీసుకు వచ్చింది.

పై గదిలో నుండి మరిన్ని శబ్దాలు, ఆర్తనాదాలు వస్తున్నట్లు అనిపించడంతో **తార, మాధవ్‌ఘోష్** తలుపులు పగలగొట్టి చూస్తే, దోమ తెరలున్న మంచంపై కృశించి, నీరసించి పడివున్న **మాతంగి**నిని గుర్తుపట్టారు. ఆ స్థితిలో కూడా ఆమె అలౌకిక సౌందర్యం ఏమాత్రం తగ్గలేదు.

– – – –

కాస్త చల్లగాలి తగలడంతో **మాతంగిని** కాస్త తేరుకుంది. **తార** కిటికీలో నుండి ఆకాశంలోకి చూస్తూ **మాతంగిని** దుఃఖ గాథ విన్నది.

**మధురబాబు** దాసి వెంట భర్త ఇంటికి పంపినపుడు, తాను ఎలాంటి రాక్షసి చేతిలో చిక్కుకుందో **మాతంగిని** ఊహించలేదు. భర్త ఇంటికి వెళ్ళడానికి భయంగా వుంటే తాను కొన్ని రోజులు ఆశ్రయం కల్పిస్తానని, అప్పటివరకూ ఇక్కడ ఉండమని, ఎవరికీ కనపడని మొదటి అంతస్తు గదిలో బంధించి దాసి పారిపోయింది.

సాయంత్రానికి **మధురబాబు** వచ్చి తన కోర్కె తీర్చమని అడిగితే **మాతంగిని** ఛీత్కరించింది. తీక్షణంగా చూస్తూ, నాకేమీ తక్కువ బలం లేదు – నీ అంతు చూస్తాను కాని లొంగనని హెచ్చరించింది. నీ జఠరాగ్నే నాకు సహాయపడుతుంది అంతకు మించి మరే ఆయుధం లేదని చెప్పి, **మధురబాబు** భోజనం పెట్టడం మానివేశాడు. ఆ విధంగా ఆమెను లొంగదీసుకోవచ్చని అతని ఆశ, నిరాహారంగా ప్రాణాలు త్యజించాలని **మాతంగిని** నిశ్చయించుకుంది. ప్రతిరోజూ **మధురబాబు** వచ్చి పైశాచికంగా నవ్వి వెళ్ళేవాడు. చావడానికి సిద్ధంగా ఉన్న సమయంలో **తార, మాధవ్‌ఘోష్**లు ఆమెను కాపాడారు. **తార** సహాయంతో మాతంగిని చెల్లెలు వద్దకు చేరి, తనను తండ్రి దగ్గరకు పంపమని కోరింది.

దొంగల నాయకుడు సర్దార్ **మధురబాబును** కలసి దొంగలు పోలీసులకు దొరికిపోయి అన్ని విషయాలు చెప్పారని, ఎక్కడికైనా పారిపొమ్మని సలహా ఇచ్చాడు. తన దగ్గర వున్న ధనంతో పోలీసులను, జడ్జిలను కొనవచ్చని భావించాడు కాని కలెక్టర్‌గా వచ్చిన ఐరిష్ దేశస్థుడు ప్రతి విషయాన్ని లోతుగా చూస్తాడని, ధూర్తుడని తిట్టుకున్నాడు.

జిల్లా కోర్టు నుండి వచ్చిన గుమాస్తా, **మధురబాబు** వల్లే **మాధవ్‌ఘోష్** అపహరణ, దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని ఏ క్షణంలోనైనా పోలీసులు వస్తారని, పారిపొమ్మని చెప్పాడు. మర్నాడు ఉదయం పోలీసులతో వచ్చిన మేజిస్ట్రేట్, గదులన్నీ వెతికినా **మధురబాబు** దొరకలేదు. **మాతంగిని**ని బంధించిన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సర్దార్, రాజ్‌మోహన్‌లకు ద్వీపాంతరవాస శిక్ష వేయబడింది. అయోగ్యుడైన భర్త భయంకర జీవితాన్ని తలచుకుని ఏడుస్తూ **తార** వితంతువుగా చాలాకాలం జీవించింది. **మాతంగిని** మాధవ్‌ఘోష్ ఇంటివద్ద, ఒకరినొకరు చూసుకుంటూ వుండడం ఇష్టం లేక తండ్రి దగ్గరకు వెళ్ళిపోయింది. ఆమె తండ్రికి **మాధవ్‌ఘోష్** ప్రతినెలా డబ్బు పంపి సహాయపడ్డాడు. **మాతంగిని** ఎక్కువకాలం జీవించలేదని మాత్రం తెలిసింది.

– – – –

***స్వేచ్ఛ కోసం, సామాజిక నిర్మాణాలతో తిరుగుబాటు చేసి, తనకు విముక్తి ఫలం దక్కక, తిరిగి నిర్బంధించ పడినప్పటికి, ఆ పోరాటం రాబోయేతరాల స్వేచ్ఛాయాత్రకు వెలుగుబాటను పరుస్తుంది.***


**ఆచార్య వై. పార్థసారథి**

ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం (రిటైర్డ్),
ఉస్మానియా యూనివర్శిటీ, ఫోన్ : 900 043 8090

# ప్రజాకళలు - ప్రగతివాదులు

– టి. రమణయ్య

ధన్యజీవులైన ఆరుద్ర గారు ఓ విజ్ఞాన సర్వస్వం. అపారపారావార అవిశ్రాంత పరిశోధకులు. అంతకుమించిన అపూర్వ కవి. నృత్త, నృత్య, నాట్య, నాటక, నటనాది బహురూపక, సంగీత, సాహిత్య, కళారంగాల కాణాచి. పుట్టెడు ఓపికతో పట్టుదలగా చారిత్రక సత్యాలను తవ్వితీసి చక్కగా సమీక్షించి, సారం పిండి సంతర్పణ చేసిన సౌందర్య పిపాసి. ఒంటిచేత్తో ఏకబిగిన 13 సంపుటాలతో 12వేల పుటల సమగ్రాంధ్ర సాహిత్యాన్ని సమకూర్చిన సాహితీ విశారదుడు. కథ, కవిత, నాటిక, గల్పిక, నవల, ప్రహేళిక, పరిశోధన, విమర్శనాది సమస్త సాహితీ ప్రక్రియలను చేపట్టి బంగారం పండించిన ప్రతిభామూర్తి. బహుగ్రంథకర్త. బహుముఖీనత మూర్తీభవించిన పండితోత్తములు. మహోన్నత మేధావి. తెలుగు నుడికారపు ఇంపుసొంపులను సినీ రంగాన సంభాషణలు, కథ, మాటలు, పాటల్లో ప్రతిబింబించిన చిటారి కొమ్మల మిటారి పువ్వు. అనంతమైన వారి ఔన్నత్యాన్ని గూర్చి ఇలా ఎన్నైనా, ఎంతైనా చెప్పింది చెప్పకుండా చెప్పుకుంటూ పోవచ్చు.

ప్రస్తుతం 'ప్రజాకళలూ – ప్రగతివాదులూ' అను చిన్ని పుస్తక పరిచయ, పరిశీలనకే ఈ వ్యాసం పరిమితం. ఇందులోని రచనలన్నీ 1980–85 మధ్య రాసినవి. పత్రికల్లో పడినవే. ఆరుద్ర షష్టిపూర్తి ఉత్సవ సందర్భంగా గ్రంథస్థమైనవి. పునర్ముద్రణ పొందినవి, విశిష్టమైనవి, ప్రాసంగికత కలవి, ప్రశస్తమైనవి, ప్రజాప్రయోజన కరమైనవి.. ఆ దృష్ట్యానే ఈ పూనిక. ఈ పుస్తకం కేవలం 134 పుటలే. అందులోని శీర్షికలు 23. రాశిలో కడు చిన్నవే, వాసిలో మిక్కిలి పెద్దవి. ఆరుద్ర గారి విశ్వరూప సందర్శనం అనదగినవి.




'నరావతారం' మొదలు నాగరికతాప్రస్థానం వరకు; ప్రాచీన సాహిత్య పరంపర మొదలు ఆధునిక సాహిత్య పరిణామాల వరకూ అందులో ఉన్నాయి. తెలుగు ప్రజల కళారూపాలతో ప్రారంభించి జానపద విజ్ఞానం – పొడుపు కథలు; జనకళ – రంజనకళ; జానపద సాహిత్య అకాడమీ – జరూరత్; రంగురంగులూ వాటి తెరంగులూ; ఆంధ్ర నాట్యం – దాని ప్రత్యేకతలు; గీత గోవిందానికి తెలంగాణాకు ఏమిటి సంబంధం?; కూచిపూడి నాట్యంపై కూలంకష పరిశోధన; సిద్ధేంద్రుల భామాకలాపం – మూలపాఠం; దామర్లవారి దొరత – కూచిపూడి ఘనత; రంగుల కల – ప్రజాకళ; మధుర కవితలూ – వచన రచనలూ; అనుభవ సాహిత్యం – ఒక ప్రాచీన ఉద్యమం; తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి; మళయాళ మహాకవి కుమారన్ ఆశాన్, పంజాబీ పూరణ్‌సింగ్; తెలుగు గురజాడ, ఆధునిక ఆంధ్ర మళయాళ కవిత్వ జనకులు; జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ జీవన సమరం; బాలసరస్వతికి భాష్పాంజలి; క్యు–వివా–మెక్సికో; బెంగుళూరు ఫిలిమోత్సవ్–1980 విశేషాలు; నియోరియలిష్టు చిత్ర జనకుడు నిమైఘోష్ ఖ్యాతి – ప్రఖ్యాతులు; "మనుషులంటే ఎవ్వరోయ్?!"; మార్క్సుకు ముందు విఫలమైన కమ్యూనిజం ప్రయోగాలు; శ్రామికుల అంతర్జాతీయ గీతం; తెలుగువారి నూరేళ్ళ సాంస్కృతిక సాహిత్యోద్యమాలు(1874–1974); తదితర మకుటాలతో వెలసి విలసిల్లుతూ విస్తుగొలుపుతున్న వ్యాసాలు, వాటిలోని విషయాలు లోతుపాతులు పాఠకుణ్ణి సంభ్రమాశ్చర్యాలలో ముంచి, మైమరపించి, వెంటబెట్టుకు వెళ్లి చదివిస్తాయి. కళ్ళూ, నోరూ తెరిపిస్తాయి. కమనీయ ఆనందాన్ని కలిగిస్తాయి. ఎన్నెన్నో విషయాలను బోధపరుస్తాయి. అందుకు పూనుకుంటే మరో ఉద్గ్రంథమే రూపొందుతుంది. ఆ దృష్ట్యా, టూకీగా ఆ వ్యాసాలలోని కొన్ని ప్రాధాన్యతాంశాల ప్రియతకే పరిమితం.

మొట్టమొదటిది మోటూరు హనుమంతరావు గారి శుభకామనల సందేశం. అందులో "మానవాళికి పనికొచ్చే ఫలితాల కోసం పాటు పడతాను, పాట కడతాను" అన్న ఆరుద్ర గారి అభినివేశాన్ని ప్రస్తావించి "మన స్వతంత్రం మేడిపండు – మన దరిద్రం రాచపుండు'' అని పాలకపక్షాన్ని బోనుపై ఎక్కించడాన్ని ప్రశంసించి, "విప్లవానికి అడ్డదారులన్నీ చెడ్డదారులే"నని ఈసడించిన తీరును కీర్తిస్తూ.. "మార్క్సిస్టు అరుణపతాకాన్ని సాహిత్యపు వినువీధిన నిలిపిన ఘనుడు" అని కొనియాడి; బాగా బ్రతికి మరో నాలుగు దశాబ్దాల పాటు తన రచనా శక్తిని మానవాభ్యుదయానికి, విప్లవోద్యమానికి వినియోగించాలంటూ దీవెనలందించారు.

ఆ పరంపరలో "తెలుగు ప్రజల కళారూపాలు" అన్నది మొదటి మునుము. దాని నిడివి 13 పుటలే. అందులో నుడివిన సంగతులు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు శ్రమలో నుంచి శ్రమ కోసం కళలు పుట్టినట్లూ.. మాటలు, పాటలు, వేట వీడదీయరానివై ఉన్నట్లూ, ఆట, పాట, మోత (వాద్యం) 'తౌర్యత్రికం' పేరిట కలిసే ఉండినట్లూ, వీటికి గీత (ఆలేఖ్యం) కూడా తోడై తండాకంతా తిండి పెట్టే విద్యగా మారినట్లూ; ఆదిమజాతుల ఆహారంలో అడవికోళ్ళు, అడవి పందులు, ఉడుతలు, కప్పలు, కుందేళ్ళు, కొంగలు, కొండగొర్రెలు, చిట్టెలుకలు, చేపలు, జింకలు, నీటి కాకులు, నెమళ్ళు, కొన్ని రకాల పాములు, మైనగోరలు లాంటి చిల్లర జంతువులు ఉన్నట్లూ; వాటి వేటకు గరిక కర్ర, గొరస కత్తి, చేతపారు చేవలలు, కొడములు, ఊతలు, చువ్వలు; వెదురుదబ్బ విల్లు, వెదురునార అల్లితాడుగా, వెదురు ముక్క బాణంగా, వెదురుగొట్టం అమ్ములపొదిగా ఉండినట్లూ, కిందటి శతాబ్దం దాకా అవి వాడుకలో ఉన్న వైనాలు; వేటలో జంతువుల వరుసలు, వాలకాలు, అలవాట్లు, అరుపులు, నడకలు గమనించి – పిట్టలు కూసినట్లు, మృగాలు అరచినట్లు ధ్వన్యనుకరణం చేయడం, చెట్లూ, పొదలవలె కనిపించే విధంగా తమ తలలకు చెట్ల ఆకులు, మండలు తగిలించుకొని జంతువులను ఏమార్చి వేటాడే ఉపాయం, నేర్పు నుండి 'పత్ర ఛేద్యం' అను లలిత కళ పుట్టినట్లూ.. తెలియజేశారు.



ఆరుద్ర

పశు పక్ష్యాదుల అనుకరణే.. అభినయానికి ప్రాతిపదిక అని భరతుని నాట్యశాస్త్రంలోను, ఇతర గ్రంథాల్లోనూ కనబడే హస్తాలు, కరణాలు, వగైరాలు పశు పక్ష్యాదులకు సంబంధించినవేననీ, సంయుత, అసంయుత హస్తాలలోని 'కర్తరీముఖం' మొదలు 'గజదంత' వరకు గల ద్వాదశ (20) నామాల అర్థాలు – ఉదా॥ అమ్ము ముక్కే కర్తరీముఖమని, "ఊర్ల నాభం" అనగా సాలీడు అని, వేటకు సంబంధించిన వాటి వివరణతో పాటు, ఆటవిక దశలో పశుపక్ష్యాదుల అనుకరణే అభినయానికి ప్రాతిపదిక అని చెప్పడం, నృత్య హస్తాల్లోనే కాక, 108 కరణాలతో 'భుజంగ త్రాసితం', 'వృశ్చికం', 'గజక్రీడితం', 'వృషభ క్రీడితం' మొదలైనవి కూడా వేటాడే ఆటవిక దశలో మానవుడు గమనించి అనుకరించినవే అని ఆరుద్ర గారి నిష్కర్ష.

'అభినయ కళ' ఈ దశలోనే మొలకెత్తింది. అట్లాగే.. 'సంగీతం కూడా ఈ దశలో ప్రాథమిక స్థితిలో ఉండేది' అంటారు. ఆడ, మగ యథేచ్ఛగా జతకట్టడమే కాని, పెళ్లితంతు ఏదీ లేదు. మనిషి చచ్చిపోతే పాతిపెట్టడం తప్ప, మరే కర్మకాండ కనపడదు. అనురాగాలు, అనుబంధాలు అప్పటికి అంకురించలేదు అంటూ... ఈ దశలో కళలన్నీ కేవలం జీవనోపాధికి సంబంధించినవే అని కూడా ఆరుద్ర చెప్పారు. 64 కళలలో 14 జీవనాధార విద్యల జాబితా ఎత్తిచూపారు. ఊరు కట్టుకున్నాక, ఊరి పేర్లు, వేరు వేరు ఇళ్లలో నివసించడం వల్ల ఇంటి పేర్లు ఏర్పడ్డాయంటారు. గ్రామాలు వచ్చాక, గ్రామదేవతలు వెలిశారని చెప్తూ... పాతికమంది గ్రామదేవతల పేర్లు చెప్పి... కొన్నింటి ఉత్పత్తి కూడా వివరించారు. ఎందరో దేవతలున్నా... ఆదిలో ఎవరికీ గుడులు లేవని, వారి జాతరే మొదటి ఆరాధన అంటూ.. అంకమాళికల అంకమ్మశివాలు, అంకపొంకాల్లో వివిధ కులాల పాత్ర,

పొందులను వివరించారు. ఆసాది మొదలు, హరిదాసుల వరకు గల 40 కులాల గ్రామీణ గాథకుల పేర్లూ, కళారూపాలను కళ్ళముందు ఉంచారు. వారివల్లే ప్రజాకళా రూపాలు సజీవంగా ఉన్నాయి అంటారు.

జైన, బౌద్ధముల స్థితి, పాశుపతుల, కాలాముఖుల, స్మార్తుల పరిణామం, ఆపస్తంభుడి కృషి, నిఘమాల ప్రకారం దేవాలయాల నిర్మాణ యాజమాన్యాలు, గ్రామదేవతలను క్షుద్రదేవతలుగా చిత్రీకరించడం, అమ్మవారి జాతరలో 'రంగమెక్కడం'; ఆలయాల్లో, గర్భగుడి ముందు, నాట్యమండపాల్లో నర్తకి నృత్యాలు, పుష్పాంజలి, కవుతం, కైవారం, నవసంధి తదితర నృత్యాలు, అగ్గి తిరునాళ్ళ చిందుల నుండి వీరనాట్యం వరకు అష్టాదశ (18) ప్రజాకళారూపాల పేర్లు పేర్కొన్నారు. కళలకు గుడి కేంద్రంగా ఉండడం, పెద్ద ఆలయాలను ఆశ్రయించుకొని అర్చకుల మొదలు స్థానాపతుల వరకు 72 నియోగాల వారి జీవనము, స్థితిగతులను పేర్కొన్నారు. దేవాలయాలను ఆనుకుని మఠాలు, సత్రాలు ఉండటం; రాజులు, సామంతులు, దండనాథులు, సంపన్నులు పోషకులుగా మఠంలో చదువులు చెప్పి, సత్రంలో భోజనాలు పెట్టే పద్ధతి ఉన్నట్లు విశదపరచారు. జైనాలయాల విగ్రహాలను పగులగొట్టి శివాలయాలుగా మార్చిన తీరు; జంతు బలులకు బదులు టెంకాయలు కొట్టడం; తల గుండు ఇవ్వడానికి మారుగా తలనీలాలు ఇవ్వడం; పంచములు ఆలయ ప్రవేశానికి నోచుకోక పోవడం; శైవుల భక్తి సిద్ధాంతం; జైనుల కర్మసిద్ధాంతం, జన్మల పరంపర మొదలైనవి ప్రజలను మానసిక నిమిత్తమాత్రులను చేసి, వారిలో దాన్య ప్రవృత్తి పెంచుతుంది అంటారు. 'భుక్తి గడిచిపోతే, బ్రతుకు చల్లగా ఉంటే ప్రజలకు ఏ దేవుడైనా ఒక్కటే.. ఏ మతమైనా జీవనోపాధిని గ్యారంటీ చేసేది కావాలి' అని చెప్తారు. కాలక్రమంలో కాయకష్టం చేసేవారంతా ఒకటిగా ఉండాలన్న సత్యాన్ని గుర్తించిన పంచాణం వగైరా 69 కులాలు ఎడమ చేతి కులాలుగా ఏర్పడ్డాయని; కలవారు, వారి తాబేదారులైన కులాల వాళ్ళు కుడి చేతి కులాలుగా ఏర్పడినట్లూ, దానికి గుర్తుగా ఇప్పటికీ మన రాష్ట్రంలో కొందరు కుడి పైట వేసుకోవడాన్ని ఉదహరించారు. ప్రజాకళలు ఆలయ కళలుగా ఆస్థాన కళలుగా రూపాంతరం చెందాయని చెప్పారు. మనం నమ్మే సిద్ధాంతాలను జనం వద్దకు తీసుకువెళ్లాలంటే ప్రజాకళారూపాలే ప్రబల సాధనాలు అని చెప్పి; అభ్యుదయ రచయితలు గతంలో వలె సామ్యవాద ప్రచారానికి ప్రజా కళలను సాధనాలుగా వినియోగించుకోవాలని హితవు పలికారు. 'జానపద విజ్ఞానం – పొడుపు కథలు' వ్యాసంలో 'జానపద విజ్ఞానం లేని జాతి ఏదీ ప్రపంచంలో ఉండదు. ఏ సంస్కృతికైనా, నాగరికతకైనా జానపద విజ్ఞానమే పునాది. మానవులు ఆహార సేకరణ దశను దాటి, ఆహారోత్పత్తి దశకు చేరుకున్నప్పుడు జనపదాలు ఏర్పడతాయి. బ్రతుకుతెరువు కోసం ఉమ్మడిగా అనుభవం వల్ల నేర్చుకున్న విషయాలే జానపద విజ్ఞానం' అన్నారు. 'కట్టు కథలు, పిట్ట కథలు, పాత కథలు, నీతి కథలు మొదలైన ఊకుడు కథలకన్నా ముందుగా పొడుపు కథే పుట్టింది. మానవుల విజ్ఞానంలో అది తొలిమెట్టు' అని తేల్చారు.

'జానపద సాహిత్యం ఒక జాతి తాలూకు సమిష్టి సంపద. అనుభవసారం. సామూహిక సంతోషం. అవిచ్ఛిన్నంగా, అనుస్యూతంగా వస్తున్న జాతీయ సాంప్రదాయం. ఇది యశస్సు కోసం, ద్రవ్యం కోసం ఎవరో పేరున్న కవులు కల్పించిన కృతులు కావు. బడుగు వర్గాల వారు బతుకును సార్థకం చేసుకునే సాధనాలు. కనుక, జనుల కట్టూ–బొట్టూ, ఆచారాలూ–వ్యవహారాలూ, పండుగలూ– పబ్బాలూ, మొక్కులూ–ముడుపులూ, కొలువులూ–జాతరలూ... ఒక్కటేమిటి ప్రజా జీవనంలోని ప్రతి అంశాన్నీ స్పృశించాలి. అప్పుడే ఒక భాష మాట్లాడే ప్రజల సజీవ సంస్కృతిని అవగాహన చేసుకోవచ్చు' అని చెప్పారు. అందుకు జానపద సాహిత్య అకాడమీని ఏర్పాటు చేయాలని సూచించారు. సంతోషం. కానీ, అవశేష ఆంధ్ర రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం దాటుతున్నా.. నేటికీ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కూడా ఏర్పడలేదు. ఇక, జానపద సాహిత్య అకాడమీని ఆశించడం హాస్యాస్పదం.

'జనకళ – రంజనకళ' అనే రచనలో 'తెలుగు చరిత్ర అనేక కులాల చరిత్ర. ఆదినుండి ప్రతి ప్రధాన కులాన్ని ఆశ్రయించుకొని ఇంకొక కులం ఉంటూ వస్తోంది' అని వడ్రంగి, కమ్మరి, కంచరి, కంసాలి, కాసె(రాళ్ళు కొట్టేవారు)లను పంచాణం వారుగా పరిగణిస్తారు. పంచాణం అంటే శిల్పం. ఆదిలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు

వీరైదుగురు అవసరమై, ఒకే కుదురులోంచి వచ్చినట్లూ, వీరికి విశ్వకర్మ (దేవశిల్పి) తండ్రి, ఘృతాచీ (అప్సరస) తల్లి అని పురాణాలు చెప్తాయి అన్నారు. పురాణ కథనం బ్రాహ్మణ విద్య కాదనీ, నైమిశారణ్యంలో కథకుడైన సూతుని పాత్రే అందుకు సాక్ష్యం అంటూ సూతుడు సంకరజాతి వాడు. అగ్రవర్ణం వాడు కాదు అని ఆరుద్ర స్పష్టం చేశారు.

అనాదిగా 'ఆంధ్ర నాట్యం' వస్తూవున్నదే. అనంతంగా సాగిపోయేదే అంటూ, భాషా సాహిత్యాల్లేని అనాగరిక జాతులు ఉంటాయేమోగాని, నాట్యం లేని మానవ సంఘాలు ఉండవని, ఆంధ్రులు దాక్షిణాత్య ప్రవృత్తికి చెందినవారని, బహునృత్య, గీత, వాద్య, అభినయ ప్రియులనీ, సుకుమారమైన కైశికీ వృత్తి ప్రధానంగా కలవారని, దానికి ఉదాహరణగా పరిశోధకులు సేకరించిన గాథలను, డాక్టర్ కోణంగి శ్రీరామ అప్పారావు గారి 'తెలుగు నాటక వికాసం' గ్రంథం నుండీ, 'బృహద్దేశి', 'భారత సారం', 'అభినయ దర్పణం', 'నృత్తరత్నావళి' వంటి పుస్తకాల నుండి ఆకరాలను చూపి, దేవాలయాలపై వివిధ భంగిమల్లోని శిల్పాల మొదలు, 28 తెగల ఆదివాసులు, వారి నృత్తరీతులూ, గంటె భాగవతులు, చిందు మాదిగల చరిత్రలు సోదహరణంగా పొందుపరచి, అన్ని ఆదిమ సంఘాలలో నృత్తం ఆహారోత్పాదక ప్రక్రియ అని 'ఆంధ్ర నాట్యం-దాని ప్రత్యేకతలు' అన్న వ్యాసంలో వివరించారు.

ఒకప్పుడు వీధి భాగోతంగా జమకట్టి, ఈసడించిన కూచిపూడి నాట్యం, తనని తాను నిరూపించుకొని నిలదొక్కుకొని, నిగ్గుదేలి పరిఢవిల్లుతోంది. నేడు అఖిల ప్రపంచంలోని నాట్య శాస్త్రజ్ఞులు దానిని గౌరవించి, ఆదరించి ఆస్వాదిస్తుండడమే సదరు ప్రశస్తికి ప్రబల సాక్ష్యం... అంటూ సంబంధిత వివరాలు సమకూర్చారు. యక్షగాన ప్రబంధాల్లో సిద్ధేంద్రుల 'భామాకలాపం' తలమానికం అనీ, దాని పరిణామ - ప్రాశస్త్యాలను పేర్కొని, ఇంకా పరిశోధించి మూలరచనను ప్రకటించ వలసిన అవసరం ఉంది అని అన్నారు. కూచిపూడి నాట్యంపై కూలంకష పరిశోధన కూడా ఈ కుదురులోనిదే. ఇంకా దానిపై జరగవలసిన పరిశోధనావసరాలను, ప్రాధాన్యతలను వివరించారు.

దామర్లవారు, వెలుగోటివారు, వియ్యాలవారు. దొరతనం నెరపేవారు. కళలను, కళావంతులను ప్రోత్సహించిన రసికులు. వీరి ఆస్థానంలో ఎన్నో నట్టువ మేళాలు ఉండేవి. వారి కర్ణాటక నృత్య రీతులు శాస్త్రీయమైనవి. నదిరాట్టం - నట్టువ మేళం కోవకు చెందినది. స్త్రీలు ప్రదర్శించేది. కూచిపూడి - నాట్యమేళం శాఖకు చెందినది. పురుషులు ప్రదర్శించే నాట్యధర్మికి సంబంధించినదనీ; దామర్లవారు కాళహస్తి జమీందార్లని, చెన్నపట్టణం కట్టుకోవడానికి ఇంగ్లీషు వాళ్ళకి అనుమతిచ్చిన ఘనులనీ, కూచిపూడివారిని సత్కరించారనీ, వారిలో కవిత్వం చెప్పినవారు కూడా ఉన్నారనీ, దామర్ల వెంగళరాజు 'బహుళార్క చరిత్ర' అనే కావ్యం రాసినట్లూ, వారిని గూర్చి పరిశోధించవలసింది ఎంతో ఉందని 'దామర్ల వారి దొరత-కూచిపూడి ఘనత' అనే వ్యాసంలో వివరించారు.

జయదేవుని 'గీత గోవిందాన్ని' పూరి జగన్నాథ ఆలయంలో నిత్యం గానం చేసే ఆచారం ఉన్నట్లూ, ఆలయ ద్వారం ఎడమవైపు ఉన్న శాసనం - క్రీస్తుశకం 1499లో ప్రతాపరుద్ర గజపతి (1497-1539) వేయించినట్లు, జయదేవుని కాలం, ప్రాంతాల గూర్చి పరిశోధన చేసిన ఒరిస్సా మ్యూజియం క్యూరేటర్ శ్రీకేదార్‌నాథ మహాపాత్ర గారు జయదేవుడు పూరి సమీపంలోని కెందులివాసి అని నిరూపించినట్లూ, పద్మావతి తెలంగాణా నుండి వచ్చినట్లు, అందుకు ఆమె పేరే సాక్ష్యం అని చెప్తూ అనేకానేక ఆసక్తిదాయక విశేషాలనెన్నింటినో వివరించి, సమర్థులైన పండితుల చేత విస్తృత పరిశోధన చేయించాలని, ఒరియా, తెలుగు భాషల్లో నిష్ణాతులైనవారు దీనిని చేపట్టాలనీ సూచించారు.

'రంగు రంగులూ-వాటి తెరంగులూ' అన్న వ్యాసంలో రంగుల ప్రాధాన్యత, వాటిపై ఉన్న రంగుపద్యాలనూ ప్రస్తావించి రంగుకి కంటికి ఉన్న సంబంధం, 'వర్ణ సంకేత పద్ధతి' ప్రత్యేకతలను గుదిగుచ్చి- 'ఆహార పదార్థాలన్నింటికీ రంగు రుచీ సువాసన ఉన్నవన్న సంగతి తెలిసివచ్చాక, తొలి మానవులు ఆహార సేకరణలో సులభ పద్ధతులు నేర్చుకొన్నారు' అని చెప్పారు. తొలిదశలో రెండే రంగులు గుర్తించే మానవులు క్రమంగా 11 రంగులను వాడుతున్నారనీ, అందులో ఎనిమిది దశల జాబితా జతపరచి; ఆకుపచ్చలోనే కనీసం 12 ఛాయల వరకు చేనేత కార్మికులు చూపడం, వాటి పేర్లూ, వాటి పరస్పర సమ్మేళనం వల్ల 2048 ఛాయలు ఏర్పడడానికి అవకాశం ఉన్నట్లూ పేర్కొన్నారు. అమెరికాలోని బర్కిలీ

విశ్వవిద్యాలయంలో బ్రెన్ట్ బెర్లిన్, పాల్ కే అను సామాజిక భాషా శాస్త్రవేత్తలు 1969లో 'ప్రాథమిక వర్ణ సంకేతాలు' అనే అంశంపై చేసిన పరిశోధన ఫలితాలను, రసాత్మక అనుభవాలను వివరించారు. రంగులకు చాలా రకాల సామాజిక ప్రయోజనాలు ఉన్నాయి. వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**అనుభవ సాహిత్యం - ఒక ప్రాచీన ఉద్యమం :** 850 సంవత్సరాల క్రితం కర్ణాటకంలో బండారు బసవన్న (బసవేశ్వరుడు) జాత్యతీత సమాజ స్థాపన కోసం ఒక ఉద్యమం నడిపాడు. దానిని గూర్చి ప్రచారం చేసిన సాహిత్యం పేరే అనుభవ సాహిత్యం. ఇది ప్రజల కోసం ప్రజల భాషలో రాసినది. బసవన్న రచనలను 'వచనలు' అంటారు. డాక్టర్ బాదాల రామయ్య గారు పరిశోధించి 'బసవేశ్వర వచనాలు-సమగ్ర సమీక్ష' అను సిద్ధాంత గ్రంథం రచించారు. అందులో బసవన్న చెప్పిన 956 వచనాలను ఇచ్చారు. ఈ వ్యాసం మొత్తం కేవలం మూడు పేజీలే. అయినా, ప్రతి అక్షరం పలుమార్లు పొల్లుపోకుండా చదవదగ్గదే.

'ఆధునిక ఆంధ్ర, మళయాళ కవిత్వ జనకులు' మకుటంలోని వ్యాసంలో - కుమారన్ ఆశాన్ మహోన్నత ఆశయాలు గల మళయాళ మహాకవి. అందుకే ఆయనకు 'ఆశయ గంభీరన్' అనే బిరుదు ఉంది. తెలుగులో గురజాడ, రాయప్రోలు, అబ్బూరు రామకృష్ణరావులకు ఆ స్థానం కలదని, ఆశాన్ రచించిన 'దురవస్థ', 'చండాల భిక్షుకి' కావ్యాల్లోని అస్పృశ్యతా సమస్య, గురజాడ 'లవణరాజు కల'లో అంటరానితనం గురించి ఉదాత్త పరిశీలన చేశాడని, ఆశాన్, గురజాడలు అమరజీవులు, చీకట్లను పారద్రోలి వెలుగులు నింపిన యుగకర్తలు అని కొనియాడారు.

'పంజాబీ పూరణ్‌సింగ్ - తెలుగు గురజాడ' అన్న వ్యాసంలో వివిధ భారతీయ భాషల్లోని నవ్య సాహిత్య నిర్మాతలలో ఒకే రకమైన సాంఘిక, రాజకీయ, చారిత్రక పరిస్థితుల్లో, సామాజిక స్పృహ సామ్యాలు చాలా కనపడతాయి. అవి పంజాబీ పూరణ్‌సింగ్ - తెలుగు గురజాడలో ఉన్నాయి. ఆనంద గజపతి కొలువులో ఉన్న గురజాడ ఇంగ్లీష్ రచనలు చేస్తే, గ్వాలియర్ మహారాజ పోషణలోని పూరణ్‌సింగ్ నుండి బ్రిటీష్ వ్యతిరేక రచనలు వెలువడ్డాయి. మార్గ చంధస్సు స్థానే మాత్రాఛందస్సులో గురజాడ రాస్తే, వాల్ట్ విట్‌మన్ మార్గంలో పూరణ్‌సింగ్ బ్లాంక్ వెర్స్ ప్రవేశపెట్టడం, ఇద్దరూ బౌద్ధాన్ని అభిమానించడం, ఒకే కావ్య వస్తువును స్వీకరించడం లాంటి పోలికలెన్నో ఉన్నాయి. అంతేగాక, పూరణ్ భగత్ గాథ కేవలం మన సారంగధర చరిత్రే. అంటే ఆంధ్రుడన్న మాట. ఈ గాథ ఆంధ్ర నుండి పంజాబ్‌కి చేరిందా, పంజాబ్ నుండి ఆంధ్రాకి వచ్చిందా అనేది తులనాత్మక పరిశీలనాంశం. భాషలు వేరైనా, భావాలు ఒకటే. దూరాలు ఎంతైనా, ధోరణులు ఒకటే అని తద్వారా చాటి చెప్పాడు. తమిళ సాహిత్యంలో యుగవిప్లవం తెచ్చిన మహాకవి సుబ్రహ్మణ్య భారతి పుట్టుపూర్వోత్తరాలు, అభిరుచులు, రచనలు, స్వదేశీ ఉద్యమాభిమానంతో 'లాల్-బాల్-పాల్' వైపు మొగ్గడం, పాత్రికేయుడుగా దక్షిణ భారత పత్రికల్లో కార్టూన్లు ప్రవేశపెట్టడం, సంపాదకత్వం నెరపడం, సోదరి నివేదిత శిష్యరికపు ప్రభావం, ప్రత్యక్షంగా బాలగంగాధర్ తిలక్ దర్శనం చేసుకోవడం, "సంఘంలోని అసమానతలు, పరపీడన, దోపిడీ, ఆకలి, పస్తులను తొలగిస్తేనే స్వాతంత్ర్యం సిద్ధించినట్లు" అని నమ్మి, ఆ దిశగా రచనలు చేయడం, స్త్రీ పురుష సమానత్వాన్ని కాంక్షిస్తూ పాటలు రాయడం, కలాన్ని కత్తిలాగా, పాటను ఈటెలాగా చేపట్టి పండితుల బారినుండి సాహిత్యాన్ని కాపాడి, ప్రజల పరం చేసి, కొత్త పాటలను ప్రసాదించడం లాంటి తెలియదగ్గ సంగతులు ఎన్నో ఇందులో ఉన్నాయి.

"పిన్ననాట నుండే అభినయించడాన్ని అభినయిస్తూ.. అడుగులు వేయకముందే అభినయ కళ అబ్బిన సుప్రసిద్ధ నృత్యకళాకారిణి బాలసరస్వతి. ఆమె అభినయం అవనిలోనే అనవరతం ఉండిపోతుంది. కళ ఎక్కడ ఉంటే.. బాలమ్మ అక్కడే ఉంటుంది" అంటూ భాష్పాంజలి ఘటించారు. "బాలమ్మ అభినయాన్ని జీవితంలో ఒక్కసారైనా చూసినవాళు ్, ఆ అనుభవాలను ఎన్నడూ మరచిపోలేరు. ఆమెతో కొద్దిసేపైనా మాట్లాడినవారు, ఆ ముచ్చట్ల పచ్చదనాన్ని గుండెల్లో దాచుకొంటారు. సహృదయుడికి ఆమె పరిచయం ఒక సన్మానం" అంటూ తన జ్ఞాపకాలను, గురజాడ డైరీలలోని అనేక విషయాలను పేర్కొన్నారు. అవన్నీ పై వ్యాసం చదివి తెలుసుకోవలసిందే.

బి.నరసింగరావు గారి దర్శకత్వాన 1983లో వచ్చిన 'రంగుల కల' సినిమాను సమీక్షిస్తూ రాసిన తొమ్మిది పుటల

రచనలో – "ఆసక్తిదాయకమైన ప్రయోగం, ఆలోచనలు రేకెత్తించే చిత్రం" అని మెచ్చుకుంటూ; ఆధునిక చరిత్రకారుడు సంఘం పట్ల తనకు ఉన్న బాధ్యతలను ఎలా నెరవేరుస్తున్నారన్న ప్రశ్నకు సమాధానమే 'రంగుల కల' సినిమా అని తేల్చి.. "చుట్టూ అత్యాచారాలు, అమానుషాలు చెలరేగుతున్నప్పుడు నిజమైన కళాకారుడు ప్రజల పక్షాన చేరక తప్పదు" అన్న సందేశాన్ని ప్రతీకాత్మకంగా దృశ్యరూపంలో అందివ్వడం; పాబ్లోపికాసో 1937లో చిత్రించిన విశ్వవిఖ్యాత దృశ్యం "గెర్నికా" నేపథ్యం; రవివర్మ (1848–1906), అవనీంద్ర టాగూరు (1871–1951), దామెర్ల రామారావు, అడవి బాపిరాజు, ఆస్వాల్డ్‌కూల్‌డ్రేల ఘనత; అనుభవవాదం (ఇంప్రెషనిజం), పరిభావనావాదం (పోస్ట్ ఇంప్రెషనిజం), స్థూలతావాదం (క్యూబిజం), నిభావనావాదం (ఎక్స్‌ప్రెషనిజం), అనాగతవాదం (ఫ్యూచరిజం), అధివాస్తవికవాదం (సర్రియలిజం), డాడాయిజం తదితర కళా ఉద్యమాల కథాకమామిషూ; ఇటలీలో బయలుదేరిన అనాగత వాదం ప్రపంచ చరిత్రలో పీడకల లాంటి ఫాసిజానికి దారితీసిన తీరూ, చార్లీచాప్లిన్ "మాడరన్ టైమ్స్", "గ్రేట్ డిక్టేటర్" లాంటి ప్రపంచ ప్రసిద్ధ సినిమాల పాత్ర, ప్రభావం లాంటి అనేక అమూల్య విషయాల సమాహారమైన సదరు సమీక్షను చదివి తీరవలసిందే.

క్యు–వివా–మెక్సికో రచనలో ప్రాచీనకాలం నుండి ప్రస్తుతకాలం దాకా గొప్ప సంస్కృతి, పురాతన శిథిలాలు, బీచ్‌లు, వంటకాలు, చైతన్యం గల మెక్సికో చరిత్రను చిత్రించి "కళకు కాలావకాశాల హద్దులు లేవని రుజువు చేసిన ప్రసిద్ధ సినిమా 'క్యు–వివా–మెక్సికో' అంటూ చిత్ర నిర్మాణ పూర్వాపరాలూ, మానవుడు మృత్యుంజయుడనే నమ్మకాన్ని పాదుకొల్పడం, మృత్యుభీతి లేకుండా చేయడం, చావుపై గెలుపు సాధించడం, మృతజీవుల కోసం పండుగ చేయడం లాంటి మెక్సికో ప్రజల అనేక ఆసక్తిదాయక విశ్వాసాలు, అలవాట్లు, తదితర అంశాల వివరాల కోసం ఈ వ్యాసం ఎంతైనా చదవదగ్గది.

**నియోరియలిస్టిక్ చిత్ర జనకుడు నిమైఘోష్ (1914–1988):** నియోరియలిజం (నవవాస్తవికత)ను సత్యజిత్‌రే పథేర్ పాంచాలి కన్నా ముందు 1950లోనే "ఛిన్నమూల్" అను చిత్రం ద్వారా సహజసిద్ధంగా చిత్రీకరించి భారతదేశ విభజన సమయంలో తూర్పుబెంగాల్ (బంగ్లాదేశ్) నుండి పశ్చిమ బెంగాల్‌కు వలస వచ్చిన శరణార్థుల కష్టనష్టాలను కళ్ళకు కట్టినట్లు చూపించడం ద్వారా దేశ విదేశాల గుర్తింపు పొందిన నిమైఘోష్ జీవిత వివరాలు, విశేషాలు, కృషి, పేరుప్రఖ్యాతులు తదితర ఎన్నో విషయాలు ఇందులో ఉన్నాయి. అవన్నీ చదివి అర్థం చేసుకొని ఆస్వాదించవలసిందే.

**మధుర కవితలు – వచన రచనలు :** 'మన సాహిత్యంలో ఆది నుంచే వచన రచనలు వస్తూనే వున్నాయి. ఈనాటి వచన రచనలు మధ్యతరగతి దృక్పథంతో ఛందోరాజ్యం మీద విద్యాధికులు చేస్తున్న పితూరీలు" అంటూ కేవలం మూడు పుటల వ్యాసంలో చతుర్విధ కవితలు (ఆశు కవితలు, మధుర కవితలు, చిత్ర కవితలు, విస్తర కవితలు), మూడు రకాల గద్య రచనలు (వృత్త గ్రంథి, చూర్ణము, ఉత్కళిక), రగడ, మెరవణి గద్య, గొల్లసుద్దులూ, ఒగ్గకతా తదితర అంశాలు; హాస్యనటుడు అల్లు రామలింగయ్య గొల్ల సుద్దులను స్పెషలైజ్ చేయడం లాంటి సమాచారం, శ్రీరంగం నారాయణబాబు, నగ్నముని, గద్దర్ లాంటివారి సందర్భోచిత ప్రస్తావన ఆచార్య తూమాటి దొణప్ప గారి "జానపద కళాసంపద" గ్రంథంలోని విషయాలు ఇందులో నిబిడీకృతమై ఉన్నాయి.

మనుషులంటే ఎవ్వరోయ్?! అను మూడు పుటల రచనలో ముప్పై పేజీల సంగతులున్నాయి. అదెలా సాధ్యమో చదివితే తెలుస్తుంది. ఉన్నవాడికి లేనివాడికి మధ్య అనాదిగ సాగుతున్న సంఘర్షణే జీవన సమరం అనీ, ఇల్లు లేక ప్రెస్‌లోనే కాగితాలపై పడుకొన్న రావూరి భరద్వాజ కథా రచనలో అంచెలంచెలుగా ఎదిగి జ్ఞానపీఠ మెక్కిన పరిణామాన్ని, ఆయన కలం కార్చిన కన్నీటినీ; "ఈ పాడుముండాకొడుకు – దేవుడు సచ్చినోడు ఆకలి ఎందుకు పెట్టాడో తెలియదు. సముద్రాలు నిండుతున్నాయి గానీ, నా జానెడు పొట్ట నిండడం లేదు బిడ్డా" అని వాపోయిన వృద్ధురాలి పొట్ట నిండే తిండి కోసమే మనిషి జీవన సమరం చేస్తున్నాడంటూ.. తిండి కలిగిన కండ కలదోయ్, కండ గలవాడేను మనిషోయ్... అంటూ అలాంటి సమాజం కోసం ఆలోచనలు చేస్తున్న భరద్వాజ లాంటివాళ్ళు అభినందనీయులు అంటారు.

**మార్క్స్‌కు ముందు విఫలమైన కమ్యూనిజం ప్రయోగాలు:** 18వ శతాబ్దంలో ఇంగ్లండ్ పారిశ్రామిక విప్లవం, ఫ్రాన్సు

దేశంలోని రాజకీయ రక్తసహిత విప్లవం, అమెరికా స్వాతంత్ర్య సమరం నాటి మేధావుల్లో భావ సంచలనాన్ని కలిగించాయి. వారు సమాజాన్ని మార్చడానికి మార్గాలను అన్వేషించి సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ఊహా స్వర్గాన్ని చిత్రించారు. బైబిల్ కమ్యూనిజం, క్రిష్టియన్ సోషలిజం, ఉమ్మడి దాంపత్యాల అమలు లాంటి ప్రయోగాలు చేశారు. అవన్నీ విఫలమైనాయి. సదరు ప్రయోగాలను పరిశీలిస్తే మార్క్సిజం విశిష్టత విస్పష్టమౌతోంది. మార్క్స్, ఎంగెల్స్ ప్రకటించిన శాస్త్రీయ సోషలిజమే సరైన మార్గమని, అది మార్క్సిజం ద్వారానే సాధ్యమని రుజువైన వైనాలూ.. తదితర సమాచారం ఈ వ్యాసంలో ఉంది. అలాగే శ్రామికుల అంతర్జాతీయ గీతానికి సంబంధించిన వివరాలు కూడా పొందుపరచారు.

**తెలుగువారి నూరేళ్ళ సాంస్కృతిక, సాహిత్యోద్యమాలు (1874-1974) :** పై శీర్షిక సింహావలోకనమే ఈ వ్యాసం. సహృదయులు తెలుసుకోదగ్గ సమాచారం ఇందులో మెండుగా, దండిగా ఉంది. స్థూలంగా పైకాలాన్ని స్వాతంత్ర్యానికి పూర్వము, తర్వాత దశలుగా విభజించారు. ఈ కాలంలో ఇంగ్లీషు చదువుల వల్ల మనకు విశాల దృక్పథం అలవడింది. 1874లో వీరేశలింగం గారు 'వివేకవర్ధని' పత్రిక ప్రారంభించారు. అందులో 'రచనలు అందరికీ తెలియనట్లు ఉండాలని' పద్యాలకు బదులు గద్యం రాయాలని, నాటి ప్రజల్లో ఎక్కువమంది నిరక్షరాశ్యులు. కనుక, నాటకరంగంపై దృష్టిపెట్టాలని భావించారు. 'బ్రహ్మ వివాహం', 'వ్యవహార ధర్మబోధిని' అనే నాటకాలు రాశారు. వారి కలాన్ని సంఘసంస్కరణకి అంకితం చేసినప్పటినుండి తెలుగు సాహిత్యం ఆధునికత్వాన్ని సంతరించుకుంది అంటారు ఆరుద్ర. వీరేశలింగం లాగే మరో మహాకవి సామాజిక స్పృహతో కలం పట్టారు. దేశభక్తి గీతం, 'కన్యాశుల్కం' నాటకం రచించారు. వారే గురజాడ అప్పారావు గారు.

'ఆంధ్రభీష్మ' న్యాపతి సుబ్బారావు 1891లో 'చింతామణి' అనే పత్రిక పెట్టారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు 1884లో కాంగ్రెస్ మహాసభలకు మద్రాసు వెళ్ళి, అక్కడ సురేంద్రనాథ్ బెనర్జీ తదితర నాయకుల ఉపన్యాసాలతో ఉత్తేజితుడై ఆసువుగా "భరత ఖండంబు చక్కని పాడియావు - హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ, తెల్లవారను గడుసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అనీ, "అధికార భూతంబులడుగు లంచములిచ్చి, పరిపరి విధముల పన్నులిచ్చి, మునసబు కరణాల ముడుపులన్నియునిచ్చి, కోసినూర్చిన వరి కూలినిచ్చి, కచ్చేరి బంట్రోతు గాములకినాము లిచ్చి... గడ్డిమాత్రము మిగిలించు కాపువాడు కటకటా యెట్టులున్నదో కాపుల దశ" తదితర 12 సీస పద్యాలలో దేశ పరిస్థితులను, ప్రజల కష్టాలను చిత్రించి కలకలం సృష్టించారు. 1902లో కొండా వెంకటప్పయ్య పంతులు, దాసు నారాయణరావు కృష్ణాపత్రిక ప్రారంభించారు. 1908లో కాశీనాథుని నాగేశ్వరరావు 'ఆంధ్రపత్రిక' ప్రారంభించారు. అలాగే, సాహితీ, శారద, సఖి, భారతి, గృహలక్ష్మి తదితర పత్రికలు ప్రారంభమైనాయి. 1906లో కొమర్రాజు లక్ష్మణరావు 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి'ని స్థాపించారు. 1911లో ఆంధ్ర సాహిత్య పరిషత్ ఏర్పడింది. సాహితీ సమితి ఆవిర్భవించింది. 1913లో బాపట్లలో ప్రథమ ఆంధ్రమహాసభ జరిగింది. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును అజెండాలోకి తెచ్చింది. గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషోద్యమం, అయ్యంకి వెంకట రమణయ్య గారి గ్రంథాలయోద్యమం, 1905 బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా బ్రిటీషు వారిపై పెల్లుబికిన వ్యతిరేకత, జలియన్ వాలాబాగ్ ఊచకోతపై ఉవ్వెత్తున చెలరేగిన ఆగ్రహజ్వాలలు, రష్యాలో విప్లవం విజయం సాధించడం వల్ల మనమూ మన సమాజాన్ని మార్చవచ్చు అన్న విశ్వాసం, 1930 ఆర్థిక సంక్షోభ కడగండ్లు తదితర ప్రభావాలతో - త్రిపురనేని రామస్వామిచౌదరి, కవికొండల వెంకటరావు, గుడిపాటి వెంకటచలం, బసవరాజు అప్పారావు, చింతా దీక్షితులు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు, నోరి నరసింహశాస్త్రి, కొడాలి ఆంజనేయులు, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, తల్లావఝుల శివశంకరశాస్త్రి, కాళ్ళకూరి నారాయణరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, ఎన్.జి.రంగా, తుమ్మల వెంకట్రామయ్య, శ్రీశ్రీ, చాసో, సెట్టి ఈశ్వరరావు, జి.వి.కృష్ణారావు, గోపీచంద్ తదితర అభ్యుదయ కవుల రచనలు లక్నోలో జరిగిన "ఇండియన్ ప్రోగ్రెసివ్ రైటర్స్" సభల ప్రేరణ, అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు;

'మాలపల్లి' నవలలో సమధర్మ ప్రబోధం, చలం నవల 'మాలపిల్ల' సినిమాగా రావడం, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీల కృషి, తెలంగాణా సాయుధ పోరాటం, నావికుల తిరుగుబాటు, ఆజాద్ హింద్ ఫౌజ్ ప్రచారం లాంటి పలు ప్రభావాలు, ప్రేరణలు ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చాయి. ఆనాటి స్థితికి ప్రతిబింబాలుగా అనేకమంది కవులు రచయితలు ముందుకొచ్చి రచనలు చేశారు, నాటకాలు వేశారు, పాటలు పాడారు, పలు రకాల ప్రజాకళాకారులు, కళారూపాలు వెలశాయి. అనేక పత్రికలు ఆవిర్భవించాయి. పలు సాహితీ సంస్థలు, సంఘాలు, రాజకీయ పార్టీలు అగ్గి రాజేశాయి.

ఉదాహరణకు.. అనిశెట్టి 'అగ్నివీణ' శృతి చేశాడు. దాశరథి 'రుద్రవీణ' మీటుతూ 'అగ్నిధార' కురిపించాడు. సోమసుందర్ 'వజ్రాయుధాన్ని' ఎత్తాడు. గంగినేని 'ఉదయిని'ని సందర్శించాడు. రెంటాల సంఘర్షణను చిత్రించాడు. ఆరుద్ర 'త్వమేవాహం' అన్నాడు. పోట్లపల్లి రామారావు, తెన్నేటి సూరి లాంటివారు చక్కని కథలు రాశారు. కె.వి.రమణారెడ్డి 'అడవిలో అంగారవల్లరి'లో భువనఘోష విన్నాడు. ఆచార్య రంగా రైతు నాయకునిగా, వామపక్షీయునిగా ఉంటూ నాటి ఉత్తేజకర గేయాలను రైతు భజనావళి పేరిట ఒక పుస్తకం అచ్చు వేయించారు. అందులో రష్యాలోని విప్లవమే ఆదర్శం అని చాటారు. "ప్రపంచమందొక చోట రైతులు రాజ్యానికి వచ్చినారు. కూలీలు పెత్తనం చేస్తున్నారు, కోటీశ్వరులకు అచ్చట తావులేదు. తినటానికి తిండి, పరుండటానికి పడక అచ్చట ఎల్లరికీ కరువులేకున్నవి. ప్రజాసామాన్యమునకు పరువు ప్రతిష్ఠలచట లభ్యమగుచున్నవి. ఆంధ్ర ప్రజలు కూడా అలాంటి స్వరాజ్యమునే కాంక్షించుచున్నారు." అని చాటారు.

సామినేని ముద్దుకృష్ణ గారు 'జ్వాల' పత్రికను స్థాపించాడు. తొలి సంచికలో 'జ్వాల ఎందుకంటే' అనే సంపాదకీయంలో... "ప్రపంచమంతా ఒక ఇల్లుగా, నరజాతి అంతా ఒక కుటుంబంగా అయిపోయే రోజులు వస్తున్నవి. ఏ మూలనో ఉన్న ఒక దేశం సాహసించి చేసిన ప్రయత్నంలో అనాదినుంచి మానవజాతి విశ్వసించిన నీతి, ధర్మం, సత్యం, విలువలు తారుమారు అవుతున్నవి. మనం కూపస్థంగా ఉండడం వల్లనో, పురాతన మగత చేతనో, రక్తంలో నీరసం చేతనో నూతన తేజస్సుకు గుడ్లగూబల మవుతున్నాము. ఇది పనికిరాదు." అని పేర్కొన్నారు. నెహ్రూ ప్రభుత్వం సోషలిస్టు నమూనా సమాజాన్ని ప్రతిపాదించింది. సోషలిజమే ధ్యేయమని చట్టాన్ని సవరించింది. ఇది నాటి పరిస్థితికి ప్రతిబింబం. చక్కటి దర్పణం. ఇవీ, ఇలాంటి సంఘటనలెన్నో ఉన్నాయి. వాటి కోసం శ్రద్ధగా వ్యాసం చదువుకోవడమే శరణ్యం.

1874 వీరేశలింగం 'వివేకవర్ధని' స్థాపించిన నాటినుండి 1974లో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆరవ మహాసభల వరకూ సూక్ష్మంలో మోక్షంలా.. మన సాంస్కృతిక, సాహిత్యోద్యమాల విస్తృతే ఈ వ్యాసం.

ఇలా.. ఆరుద్ర తన ప్రతిభాపాటవాలతో తెలుగు సాహిత్య సాగర మథనం చేసి.. 'సమగ్రాంధ్ర సాహిత్యాన్ని' పాఠక లోకానికి అందజేసి ఎన్నో అమూల్యమైన.. అపారమైన చరిత్రాత్మకమైన సారస్వత సేవతో ధన్యులయ్యారు. వారి రచనల నుంచి.. రాసిన గ్రంథాల సుగంధాలను.. అక్షర సుమాలుగా ఏరుకొని.. ఆ పరిమళాలను ఆసాంతం ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాం.

**టి. రమణయ్య**
నెల్లూరు, సెల్ : 949 123 9884

## కమ్మతెమ్మెర



సెప్టెంబరు **మిసిమి**లో ప్రొఫెసర్ డా.జి.ఆర్. కృష్ణ గోగినేని గురించి విపులంగా చదివాను. మీరన్నట్టు వీరు ఒకే ఒక్కడుగా పరిగణించాలి. నాకు తెలిసినంతవరకు తెలుగువారెవరూ ఇంతటి జాతీయ, అంతర్జాతీయ సోషల్ వర్క్, సోషల్ సైన్సెస్‌లో పరిశోధన చేసినవారు లేరేమో. కృష్ణ గారు ముఖ్యంగా ఒక విషయం చెప్పారు. సంగీత, సాహిత్యాలు, లలితకళలు మనిషిలో దాగి ఉన్న జంతు లక్షణాలను పోగొట్టి మానవత్వాన్ని ఆపాదిస్తాయి. ఇది అందరూ గుర్తించుకోవలసిన, ఆచరించవలసిన విషయం. ముఖ్యంగా విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు తప్పనిసరిగా చెప్పి, నేర్పించవలసిన విషయం.

**- ఉమ**

# ఉత్తమ కళాశాల అధ్యాపకులు ఏమి చేస్తారు?

– వి.యస్. ప్రసాద్

హైదరాబాద్‌లోని అక్షర బుక్ షాప్‌ను సందర్శించిన సందర్భంలో **కెన్ బెయన్** రచించిన 'ఉత్తమ కళాశాల అధ్యాపకులు ఏమి చేస్తారు?' అనే పుస్తకం నా కంటబడింది. దాని శీర్షిక ఒక అనుభూతిని కలిగిస్తే, దానిని చదవడం అదృష్టంగా పరిణమించింది. శీర్షిక మాత్రమే గాక రచయిత నేపథ్యం కూడా నాకు ఆసక్తి రేకెత్తించిన విషయం. పుస్తక రచయిత హార్వర్డ్ విశ్వవిద్యాలయ చరిత్ర శాస్త్ర ఆచార్యుడుగా మాత్రమే గాక, 'ఉత్తమ ఉపాధ్యాయుల సంస్థ'కు అధ్యకుడిగా కూడా పని చేశారు. మనం చదవాలనే పుస్తకాలను ఎలా గుర్తిస్తాం? ఎలా ఎంచుకుంటాం? దీనికి సమాధానం అంత సులభంగా దొరకదు. వ్యక్తిగత ఆసక్తులు, అనుభవాలు, సందర్భం, నేపథ్యాలను బట్టి ఎంపిక మారుతూ వుంటుంది.




నేను కూడా కళాశాల అధ్యాపకుడిగా పనిచేసినందున 'ఉత్తమ కళాశాల అధ్యాపకులు ఏమి చేస్తారు? అనే ప్రశ్న నాలో ఆసక్తిని రేకెత్తించింది. ఎందుకంటే ఉత్తమ ఉపాధ్యాయుల్లో ఒకరిగా నిలవడం నా చిరకాల స్వప్నం. ఈ పుస్తకం నా ఉపాధ్యాయత్వాన్ని, నన్ను నేను పరిశీలించుకునేందుకు, నా బోధన ప్రస్థానాన్ని ఒక అద్దంలో చూసుకునేందుకు సహకరిస్తుందని భావించాను. నా ఈ ఆకాంక్షను ఈ గ్రంథం ఏ మాత్రం నిరాశ పరచలేదు. సరికదా నూతన ప్రశ్నలను రేకెత్తించింది.

ఆచార్యుడిగా పదవీ విరమణ చేసిన తరువాత, నేను నా సమయాన్ని ప్రధానంగా మూడు 'ఆర్' లతో (రీడింగ్, రిఫ్లెక్టింగ్, రిలాక్సింగ్) అంటే చదవడం, ఆలోచించడం, విశ్రాంతి తీసుకోవడంతో గడుస్తోంది. ఈ పుస్తకం చదవడం నాకు అత్యంత ఆనందాన్ని అంతకంటె ఎక్కువగా ఆత్మపరిశీలన చేసుకోవడానికి సహకరించింది.

**ఉత్తమ ఉపాధ్యాయుల అన్వేషణ :** ఉత్తమ పాధ్యాయులను గుర్తించేందుకు రచయిత **కెన్ బెయిన్** అనుసరించిన వినూత్న, సృజనాత్మక పద్ధతి – అలాగే అందుకు ఆయన సంధించిన ప్రశ్నలు నాకు ఒక గొప్ప అనుభవంగానే గాక, అభ్యాసంగా కూడా అనిపించాయనడంలో సందేహం లేదు. ఈ పద్ధతి సృజనాత్మకతతో పాటు సమగ్రతను కూడా కలిగి వుంది. గ్రంథంలోని రెండు అధ్యాయాలు – 'పరిచయం' – 'అధ్యయనం ఎలా నిర్వహించబడింది' అనే అనుబంధం ఆయన చేపట్టిన పరిశోధనా పద్ధతిని విశదంగా వివరిస్తాయి. ఈ పరిశోధనా అధ్యయనానికి అమెరికాలోని సుమారు 20 విశ్వవిద్యాలయాల నుండి, 60–70 మంది అసాధారణ ప్రతిభ కలిగిన అధ్యాపకులను – ప్రకృతిశాస్త్రం, సామాజిక మానవీయ శాస్త్రాలు, నాటకరంగ కళలు వంటి విభిన్న విద్యాశాఖల నుండి గుర్తించారు. వీరి ఎంపిక ఒక్క ప్రమాణం పై గాక, విద్యార్థుల అభిప్రాయాలు, అధ్యాపకుల విద్యా నేపథ్యం, సహచరుల వనితీరు, మూల్యాంకనం ఇతర ఆధారాలు, అలాగే వారు తరగతి గదిలో బోధించిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించడం వంటి విస్తృత అంశాల ఆధారంగా ఎంపిక చేశారు. ఉదాహరణకు థియేటర్ ఆర్ట్స్ విద్యావిషయంలో పాల్ బేకరే అనే అధ్యాపకుడు బోధించిన నైపుణ్యాలు – ప్రతిభలను అనుసంధానించిన కోర్సుని అత్యంత లోతుగా అధ్యయనం చేశారు.

**విద్యార్థుల రేటింగ్‌కు అతీతంగా....** భారతదేశంలో మంచి బోధనను ప్రోత్సాహించేందుకు అధ్యాపకులకు విద్యార్థుల రేటింగ్స్‌ను ఉపయోగించాలనే వాదన రోజు రోజుకూ పెరుగుతోంది. అయితే కెన్ బెయిన్ విద్యార్థి రేటింగ్స్‌లోని పరిమితులను గుర్తించారు. 1970వ దశకంలో డాక్టర్ ఫాక్స్ పరిశోధనా ఫలితాలను ఆధారంగా తీసుకుని, విద్యార్థుల రేటింగ్స్ ఎల్లప్పుడూ విశ్వసనీయమైనవి కావని ఆయన వివరించారు.

బెయిన్ ఉత్తమ ఉపాధ్యాయులను వారు ఎంత జ్ఞానాన్ని బోధించారనే ప్రమాణంతో కాక, ఆ బోధన విద్యార్థుల జీవితాల్లో ఎలాంటి మార్పు తీసుకువచ్చింది- వారి ఆలోచనలను జీవితాలను, అనుభూతులను ఎంతగా పరివర్తన చేసింది అనే అంశాన్ని ప్రధాన ప్రామాణికంగా తీసుకున్నారు. అందువల్ల ఆయన దృష్టిలో ఉత్తమ ఉపాధ్యాయుని లక్ష్యం 'జ్ఞానాన్ని బదిలీ చేయడం' మాత్రమే కాదు-అంతకంటే లోతైన 'అభ్యాసాన్ని పెంపొందించడం'. ఉత్తమ బోధకుడు సమాచారాన్ని విద్యార్థి మనస్సులో నింపడం గాక, జ్ఞానాన్ని విద్యార్థి స్వయంగా అన్వేషించేలా, నిర్మించుకునేలా, జీవించేలా చేస్తాడు. ఈ రకంగా ఉత్తమ ఉపాధ్యాయులను గురించేందుకు రచయిత అనుసరించిన పరిశోధనా విధానం-ఉపాధ్యాయ మూల్యాంకనా వ్యవస్థలకు, విద్యార్థుల అభ్యాస మూల్యాంకనా వ్యవస్థలకు ఒక ముఖ్య మేధోపర తోడ్పాటుగా నిలుస్తుంది.

ఈ పుస్తకం, ప్రత్యేకంగా ఎంపిక చేయబడిన ఉపాధ్యాయుల సమాధానాలపై నిర్మించబడ్డ మహాప్రాకారం. అందుకు కేంద్రబిందువుగా నిలచిన ప్రశ్నలు ఇవి.

1. ఉత్తమ ఉపాధ్యాయులు ఏ ప్రావీణ్యతలను పెంపొందించుకుంటారు? అందుకు అనుగుణంగా ఎలాంటి బోధనా పద్ధతిని ఎంచుకుంటారు?
2. వారు బోధించడానికి ఎలా సన్నద్ధమవుతారు?
3. వారు తమ విద్యార్థుల నుండి ఏమి ఆశిస్తారు?
4. వారు బోధించేటప్పుడు ఏమి చేస్తారు?
5. వారు తమ విద్యార్థులతో ఎలా వ్యవహరిస్తారు?
6. వారు తమ పనితీరును ఎలా మూల్యాంకనం చేసుకుంటారు?

ఈ ఆరు ప్రశ్నలు ఉత్తమ ఉపాధ్యాయుల కార్యాచరణలోని ఆరు పరిమాణాలను సూచిస్తాయి. ఒక రకంగా సోక్రటీస్ పద్ధతిని గుర్తుకు తెస్తాయి. మనం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రశ్నలు సంధిస్తూ, మనుషులను ఆలోచింపజేస్తూ, తమ స్వంత సమాధానాలను తామే అన్వేషించుకునేలా చేయడం ఈ పద్ధతి సారాంశం. ఈ ఆరు ప్రశ్నలే పుస్తకంలోని ఆరు అధ్యాయాలకు ప్రధాన ఇతివృత్తాలుగా, శీర్షికలుగా మారాయి. పరిచయం ఈ గ్రంథానికి మేధస్సు అయితే, ఈ ఆరు అధ్యాయాలు దాని హృదయం వంటివి.

ఉత్తమ ఉపాధ్యాయుల జ్ఞాన దీపికలు : 2 నుండి 7వ అధ్యాయం వరకు-ఉత్తమ అధ్యాపకులు ఎలా ఆలోచిస్తారు, ఎలా ప్రవర్తిస్తారు, ఎలా అనుభూతి చెందుతారు అనే అంశాలను విశదంగా విశ్లేషించి పరిశీలనలను మన ముందుంచాయి. ఆ పరిశీలనల నుండి మనం ఆలోచించదగిన గురువుల అనుభవ సారాలు ఇవి.

* మంచి ఉపాధ్యాయులకు తమ స్వంత విద్యా విషయ రంగంలోని మూల సూత్రాలపై పట్టు, వాటిని నడిపించే వ్యవస్థల అంతర్లీన అంశాలను అవగాహన చేసుకునే ప్రజ్ఞ.
* ఉత్తమ ఉపాధ్యాయులకు అభ్యాసన ప్రక్రియపై సహజ సిద్ధమైన అవగాహన, అభివృద్ధి దశలకు అనుగుణమైన అభ్యాసనా పద్ధతులతో విద్యార్థుల జ్ఞానార్జనను ప్రభావితం చేసే సామర్థ్యం కలిగి వుండడం.
* బోధన అంటే కేవలం జ్ఞానాన్ని బదిలీ చేసే ప్రక్రియగా కాకుండా 'జ్ఞానాన్ని పెంపొందించే ప్రక్రియ'గా చూడగలగడం, ఆచరించడం – ఒక గంభీరమైన, మేధోపర కార్యాచరణ.
* బోధన కేంద్ర బిందువు – 'ఉపాధ్యాయుడు ఏమి చేస్తున్నాడు' అనే ప్రశ్న నుండి 'విద్యార్థి ఏమి నేర్చుకోవాలి' అనే ప్రశ్న వైపు మళ్ళడం.
* ప్రతి విద్యార్థి సామర్థ్యం పై ఉపాధ్యాయులకు విశ్వాసం ఉండాలి. అంతేకాక ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంటుంది అనే సత్యాన్ని వారు అర్థం చేసుకోవాలి.
* బోధన ఫలితంగా విద్యార్థులలో విమర్శనాత్మక ఆలోచన వికసించాలి. అంటే తార్కికంగా ఆలోచించే సామర్థ్యంతో పాటు, అందుకు దోహదపడే అలవాట్లను కూడా పెంపొందించాలి.
* ఉపాధ్యాయులు తమ జీవితానుభవాలను పంచుకోవడం, తరగతి గది వెలుపల కూడా విద్యార్థులు నేర్చుకునేలా ప్రోత్సహించడం ద్వారా పరస్పర విశ్వాసాన్ని నిర్మించాలి.
* విద్యార్థుల మూల్యాంకనం-కేవలం పరీక్షలలో వారి జవాబులు మాత్రమే కాకుండా, వారి లోతైన ఆలోచన, అభ్యాస అనుభవాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి.
* ఉపాధ్యాయులు తమ బోధనా సామర్థ్యాన్ని అంచనా వేసేటపుడు, విద్యార్థులు ఎలా ఆలోచిస్తున్నారు, ఎలా ప్రవర్తిస్తున్నారు, ఎలాంటి అనుభూతి చెందుతున్నారు అనే అంశాల్లో తాము ఎలాంటి మార్పు సృష్టించ గలిగాము అనే విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

* ఉపాధ్యాయులు మేధో పర జీవితాన్ని గడుపుతూ, విద్యావ్యవస్థ పట్ల తమ నిబద్ధతను ఆచరణలో చూపిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలి.

**ఆదర్శాల పరిమితులు-సందర్భ ఔచిత్యం :** కెన్ బెయిన్ ఆదర్శవంతమైన సూచనలలోని పరిమితులను కూడా స్పష్టంగా గుర్తించారు. ప్రతి ఉపాధ్యాయుడు, ప్రతిసారి తన ఉత్తమ పద్ధతులనే అనుసరించగలడని చెప్పలేం. అవి వ్యక్తి స్వభావం, సామర్థ్యం, పరిస్థితి, సందర్భం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఈ అధ్యయనానికి ప్రధాన నేపథ్యం పాశ్చాత్య విద్యావ్యవస్థ. అదువల్ల అక్కడ అనుభవాలను యథాతథంగా ప్రతి విద్యావ్యవస్థకు అన్వయించడం సముచితం కాదు.

**భారతీయ విద్యా నేపథ్యం :** భారతీయ సమాజంలో ఉపాధ్యయ-విద్యార్థి సంబంధం, 'ప్రశించే స్ఫూర్తి', 'సంభాషణా సంప్రదాయం' కంటె ఎక్కువగా 'గురు భక్తి భావం', 'ఉపన్యాస సంప్రదాయం'లో అధికంగా ఉంటుంది. అందువల్ల భారతీయ అనుభవంలో 'ఉత్తమ ఉపాధ్యాయుల ప్రపంచం', ఆధునిక పాశ్చాత్య విద్యా పద్ధతుల కంటె భిన్నంగా ఉంటుంది. ఇది పాశ్చాత్య పద్ధతులలో ఉండే వ్యక్తి కేంద్రిత, ప్రజాస్వామ్య దృక్పథానికి భిన్నంగా మరింత సమాజ కేంద్రితంగా, సంరక్షక స్వభావంతో కూడిన దృక్పథాన్ని కలిగి వుండడం మనం గుర్తించవచ్చు. అమర్త్యసేన్ తన 'ఆర్గుమెంటేటివ్ ఇండియన్' అనే గ్రంథంలో భారతీయ సంస్కృతి, చరిత్రలోని ప్రశ్నించే, తర్కించే సంప్రదాయాలను విశ్లేషించారు. దురదృష్టవశాత్తు, ఆ ప్రశ్నించే, తర్కించే పద్ధతులు మన భారతీయ విద్యా సంస్కృతిలోని ఆశించినంతగా చొప్పించబడలేదు.

**విద్యామార్కెటీకరణ-ఒక కొత్త సవాలు :** భారత దేశంలో విద్యను మార్కెట్ వస్తువుగా మార్చే ధోరణి పెరుగుతోంది. విద్యార్థులను వినియోగదారులుగా, ఉత్తమ ఉపాధ్యాయులను ఉత్తమ వినియోగదారులను తయారు చేసే ఉత్పత్తి దారులుగా, విద్యా ఉత్పత్తులను విక్రయించే విక్రయ ప్రతినిధులుగా చూడడం ప్రారంభమైంది. అదే సమయంలో సాంకేతిక పరిజ్ఞానంలో చోటుచేసుకున్న పరిణామాలు కూడా ఉత్తమ ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధికంగా ప్రభావితం చేస్తూ, యాంత్రికతను విస్తృతంగా చొప్పిస్తున్నాయి. అందువల్ల మనకు అవసరమైంది ఒకే సంప్రదాయాన్ని, పద్ధతిని అనుకరించడం కాదు. విభిన్న బోధన-అభ్యాస సంప్రదాయాలనుండి నేర్చుకోవడం. వివిధ సంప్రదాయాల్లోని ఉత్తమ అంశాలను, పద్ధతులను సేకరించి, వాటి సారాన్ని సమన్వయపరిచే ఒక సమగ్ర బోధనా పద్ధతిని అనుసరించడం ఉపయోగకరం.

ఈ పుస్తకం అందించే జ్ఞాన కిరణాలు మన విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రస్తుత బోధన-అభ్యాసన సంక్షోభాన్ని పరిష్కరించడంలో కొంత మార్గదర్శకత్వాన్ని అందిస్తాయనడంలో సందేహం లేదు. మన ప్రయాణం 'విశ్వగురు' అనే ఆత్మ ప్రకటనల నుండి 'విశ్వమానవుడు' అనే మానవతా సంప్రదాయాలవైపు సాగాలి.

**పుస్తక ప్రధాన సందేశం :** కెన్ బెయిన్ మాటల్లో చెప్పాలంటే... "ఉత్తమ ఉపాధ్యాయులు నిరంతర ఆత్మ పరిశీలన, స్వీయ మూల్యాంకనం, మార్పును స్వీకరించే సుముఖత ద్వారా తమ సామర్థ్యాలను నిరంతరం మెరుగుపరచుకుంటారు". ఈ ఒక్క వాక్యంలోనే ఉత్తమ ఉపాధ్యాయుని అంతరంగ వికాసానికి సంబంధించిన ఒక మహత్తర సత్యం నిక్షిప్తమైవుంది. బోధన అనేది స్థిరమైన నైపుణ్యం కాదు, అది నిరంతరం పరిణమించే ఆత్మశోధన.

**ఈ పుస్తకం నుండి మనం గ్రహించాల్సిన రెండు ప్రధాన సారాంశాలు :**

**మొదటిది :** ఉత్తమ ఉపాధ్యాయుడు చీకటిలో ఆశాకిరణం. (విద్యార్థి అయోమయంలో ఉన్నప్పుడు దారిచూపే దీపం, సందేహాలు ఉన్నప్పుడు ధైర్యాన్ని నింపే స్వరం, వైఫల్యంలో ఉన్నప్పుడు మళ్ళీ ప్రయత్నించే విశ్వాసం – అదే ఉత్తమ ఉపాధ్యాయుని అసలు మహిమ)

**రెండవది :** ప్రతి ఒక్కరూ ఉత్తమ ఉపాధ్యాయులుగా మారగలరు. (ఉత్తమ ఉపాధ్యాయత్వం కొద్ది మందికే దక్కే సహజ వరం కాదు. నిరంతర ఆత్మ పరిశీలన, నేర్చుకునే తపన, మార్పును స్వీకరించే ధైర్యం, విద్యార్థిపై విశ్వాసం, జ్ఞానంపై నిబద్ధత ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు తనను తాను ఉత్తమ ఉపాధ్యాయుడుగా తీర్చిదిద్దుకోగలడు.

చివరగా, ఉత్తమ బోధన అనేది జ్ఞానాన్ని విద్యార్థికి అదించడం మాత్రమే కాదు. విద్యార్థి అంతరంగంలో, ఆలోచనకు దీపం వెలిగించడం, ఉత్తమ ఉపాధ్యాయుడు పాఠాన్ని ముగించే వాడు కాదు. విద్యార్థి జీవితంలో ప్రశ్నను, అన్వేషణను, ఆశను నిరంతరం కొనసాగించడానికి అవసరమైన జ్ఞానజ్యోతులను వెలిగించేవాడు.

**ఆచార్య వి.యస్. ప్రసాద్**
పూర్వ డైరెక్టర్, జాతీయ మూల్యాంకన గుర్తింపు మండలి
(ఎన్.ఎ.ఎ.సి), బెంగుళూరు, సెల్ : 789 319 2146

# మిసిమి

మాసపత్రిక

మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి.

ప్రతినెలా ముప్పయి తారీఖున పత్రిక పోస్టు ద్వారా పంపబడుతుంది. ఏ కారణం చేతనైనా పత్రిక చేరకపోతే మళ్లీ పంపటానికి పోస్టల్ డిపార్ట్‌మెంట్ వెసులుబాటు కల్పించడంలేదు. కేవలం స్పీడు పోస్ట్ ద్వారానే పంపాలి. దయచేసి చందాదారులు గమనించగలరు.

HDFC Current Account No. 50200091136242
A/C : **Misimi A Unit of Kalajyothi Process Pvt. Ltd.,**
**IFC Code : HDFC0000472**
Account Branch : RTC X Roads

**చందా వివరాలు:**

₹720/- (సంవత్సర చందా),
₹1440/- (రెండు సంవత్సరాలకు),
₹2,160/- (మూడు సంవత్సరాలకు),

**Misimi** A Unit of Kalajyothi Process Pvt. Ltd.,

## మిసిమి ప్రచురణలు


ఉపనిషత్ ఉద్యానవనమ్


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


దూరతీరాలలో...


బహుముఖ బనారస్


ఐరోపా శిల్ప - చిత్ర కళావైభవం


సప్తపర్ణి


వ్యాస మంజూష


ప్రవాస సాహిత్యం


చార్లీ చాప్లిన్


రజ్జు సర్ప భ్రాంతి


బైరన్


యాత్రా కథనాలు


షెల్లీ జీవిత కథ


కొత్త కెరటాలు


నృత్యభారతి


పారిజాతం


సిద్ధార్థ

**ప్రతులకు:** ***మిసిమి*** కార్యాలయాన్ని సంప్రదించండి. **ఫోన్: 994 951 6567.**
**ప్లాట్ నెం. 196, రోడ్ నెం. 13, జూబిలీ హిల్స్, హైదరాబాద్-500 033.**

Printed & Published by **BAPANNA ALAPATI**
Printed at **Kala Jyothi Process Pvt. Ltd.,** Plot No. CFC-1&2, Survey No. 18, E-City, SEZ, General Industrial Park, Raviryal and Srinagar, Maheswaram, Ranga Reddy District, **Telangana - 501 359.**